ఆంధ్రజ్యోతి

ఆదివారం | 7-1-2018 | పేజీలు: 20 + 20 | వెల: రూ. 6.00 | సంపుటి: 58 సంచిక: 263 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి సా. 4.04 వరకు తదుపరి సప్తమి; నక్షత్రం: ఉత్తర రా. 1.10 వరకు తదుపరి హస్త; వర్జ్యం: ఉ. 8.29-10.04; దుర్ముహూర్తం: సా. 4.24-5.08; అమృతఘడియలు: సా. 6.02-7.37; రాహుకాలం: సా. 4.30-6.00 వరకు; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.52 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



లాలూకు మూడున్నరేళ్ల జైలు

రూ. 10 లక్షల జరిమానా.. చెల్లించకుంటే మరో 6 నెలలు జైల్లోనే

మరో దాణా కేసులో సీబీఐ కోర్టు తీర్పు.. హైకోర్టులో అప్పీలు చేస్తాం: తేజస్వి

18

ఇంటర్ అర్హతతో

బీఈడీ!

డిగ్రీతో పాటే టీచర్ శిక్షణ కూడా

నాలుగేళ్ల కోర్సు నిర్వహణకు సన్నాహాలు 8

ఆంధ్రజ్యోతి

పాఠకులకు గమనిక



నేటి సంచికతో పాటు ఆదివారం అనుబంధానికి బదులుగా 2018 పంచాంగం క్యాలండర్ ఉచితంగా అందుకోండి

- మేనేజింగ్ డైరెక్టర్

Dwaraka

మైదాన్
MYDAN

విజయవాడ • ఆదివారం 7 జనవరి 2018

భారత క్రికెట్‌కు దేశవాళీ క్రికెట్ వెన్నెముక లాంటిది. అందునా.. రంజీ ట్రోఫీది కీలక పాత్ర. ఎంతో ఘన చరిత్ర ఉన్న రంజీల్లో ఆడి దేశం .. ఆ మాట కొస్తే క్రికెట్ ప్రపంచం గర్వించేస్థాయికి మన ఆటగాళ్లు ఎదిగారు. కాసుల వర్షం కురిపించే ఐపీఎల్‌లో చోటుకు రంజీ ప్రదర్శనలే కీలకం అవుతున్నాయి. ప్రతీ ఏడూ ప్రతిభావంతులెందరో తమ సత్తా చాటుకొని కెరీర్‌కు గట్టి పునాదులు వేసుకుంటున్నారు. ఆ లీగ్‌లో సీనియర్లు.. టీమిండియా ఆటగాళ్లు బరిలోకి దిగినా.. ఎంతో కఠిన పోటీ ఉన్నా.. బంతితో మాయ చేసి.. బ్యాటుతో మెరుపులు మెరిపిస్తుంటారు కొంతమంది యువకులు. ఈ సీజన్ రంజీ ట్రోఫీలో అలా రంజింపజేసి... తమ ఆటతీరుతో అందరినీ ఆకట్టుకొని.. భవిష్యత్‌లో భారత జట్టులో అడుగుపెట్టే సత్తా ఉన్న యువ ఆటగాళ్లపై ఓ లుక్కేద్దామా..!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

రంజింపజేశారు!





గుర్బానీ

పృథ్వీ షా

దాదాపు ఏడాది కాలంగా భారత జూనియర్ క్రికెట్‌లో మార్మోగుతున్న పేరు పృథ్వీషా. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన తొలి ఏడాదే ఈ ముంబై బ్యాట్స్‌మన్ తనదైన ముద్ర వేశాడు. ఒక రకంగా 2017 ఏడాదంతా ఈ 18 ఏళ్ల కుర్రాడిదే అనొచ్చు. గతేడాది జనవరిలో రంజీ ట్రోఫీ సెమీస్‌లో తమిళనాడుపై సెంచరీతో అరంగేట్రం లోనే సంచలనం సృష్టించిన పృథ్వీ ముంబైని ఫైనల్‌కు చేర్చాడు. అలాగే, ఫైనల్లో 71, 44 స్కోర్లతో ఆకట్టుకున్నాడు. తుదిపోరులో గుజరాత్ చేతిలో ముంబై ఓడిపోయినా.. భారత క్రికెట్‌కు ఓ అత్యద్భుత ప్రతిభావంతుడు దొరికికాడన్న సంతోషం లభించింది. ఈ దేశవాళీ సీజన్‌ను కూడా అతను అద్భుతరీతిలో ప్రారంభించాడు. దులీప్ ట్రోఫీలో ఇండియా రెడ్ తరఫున బరిలోకి దిగిన అతను.. 154 పరుగులతో భారీ సెంచరీ బాది తన జట్టును గెలిపించాడు. ఆ జోరును కొనసాగిస్తూ తమిళనాడుపై మరో సెంచరీ కొట్టిన షా.. తర్వాతి మ్యాచ్‌లో ఇంకో శతకం సాధించాడు. అలాగే, ఆంధ్ర జట్టుపై కీలక సెంచరీతో ముంబై నాకౌట్ ఆశలు సజీవంగా నిలిచేలా చేశాడు. ముంబై ఈ సారి ఫైనల్ చేరకపోయినా.. పృథ్వీ మాత్రం ఆకట్టుకున్నా డు. ఆరు మ్యాచ్‌ల్లో 48.81 సగటుతో 537 పరుగులు చేశాడతను. అందులో మూడు సెంచరీలు, రెండు అర్ధ శతకాలున్నాయి. పృథ్వీ ఇప్పుడు న్యూజిలాండ్‌లో జరగనున్న అండర్-19 వరల్డ్ కప్‌లో యువ భారత్‌కు నాయకత్వం వహిస్తున్నాడు. అతను అదే జోరును కొనసాగించి మెగా టోర్నీలో జట్టును విజేతగా నిలపడంతో పాటు.. త్వరలోనే టీమిండియా గడప తొక్కుతాడని చాలా మంది ఆశిస్తున్నారు.

రజనీష్ గుర్బానీ

ఈ సీజన్‌లో విదర్భ జట్టు అత్యద్భుతంగా రాణించి తొలిసారి రంజీ ట్రోఫీ నెగ్గి చరిత్ర సృష్టించిందంటే దానిలో గుర్బానీదే కీలక పాత్ర. మొత్తం ఆరు మ్యాచ్‌ల్లో 17.12 సగటుతో 39 వికెట్లు తీసిన అతను ఈ సీజన్ అత్యధిక వికెట్ల వీరుల్లో రెండో స్థానంలో నిలిచాడు. అందులో 70 శాతం వికెట్లు నాకౌట్ దశలోనే పడగొట్టడం చూస్తే విదర్భ విజయయాత్రలో అతని భూమిక ఎలాంటిదో చెప్పొచ్చు. కెరీర్‌లో రెండో ఫస్ట్‌క్లాస్ సీజన్‌లో బరిలోకి దిగినప్పుడు 24 ఏళ్ల గుర్బానీ అనామకు డు. కానీ, గ్రూప్ దశలో హిమాచల్‌ప్రదేశ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసి వెలుగులోకి వచ్చాడు. కెరీర్‌లో అతనికదే తొలి ఐదు వికెట్ల ప్రదర్శన. ఆ తర్వాత గుర్బానీకి ఎదురే లేకుండా పోయింది. 3 నాకౌట్ మ్యాచ్‌ల్లో నాలుగు సార్లు ఐదేసి వికెట్లు పడగొట్టి ప్రత్యర్థులకు సింహ స్వప్నమయ్యాడు. కర్ణాటకపై (12/162) చెలరేగిన గుర్బానీ.. 5 పరుగుల తేడాతో జట్టుకు విజయం అందించాడు. ఇక, ఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు దిశగా సాగుతున్న ఢిల్లీని అద్భుతంగా అడ్డుకున్నాడు. హ్యాట్రిక్ సహా 6 వికెట్లు తీసి విదర్భకు ఆధిక్యం అందించాడు. తర్వాత బ్యాట్స్‌మన్‌గా కూడా రాణించడంతో విదర్భ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది.

చింతన్ గజా

తన కెరీర్‌లో రెండో రంజీ సీజన్ ఆడిన 23 ఏళ్ల పేస్ బౌలర్ చింతన్ గజా గుజరాత్ తరఫున గుర్తుండిపోయే ప్రదర్శన కనబరిచాడు. 7 మ్యాచ్‌ల్లో 19.46 సగటుతో 26 వికెట్లు పడగొట్టాడు. అందులో రాజస్థాన్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఎనిమిది వికెట్లు పడగొట్టి ఈ సీజన్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాడిగా నిలిచాడు. గుజరాత్ ఎక్కువగా స్లో బౌలర్లకు అనుకూలించే పిచ్‌లపై ఆడినా కూడా గజా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఆరంభంలోనే వికెట్లు తీస్తూ తమ స్పిన్నర్ల పని సులభమయ్యేలా చేశాడు.



అభిషేక్ రామన్

రంజీ ట్రోఫీలో రెండోసారి బరిలోకి దిగిన లెఫ్టార్మ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ రామన్ ఈసారి బెంగాల్ తరఫున అత్యధిక పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. హిమాచల్‌తో మ్యాచ్‌లో ఆరంభంలోనే వికెట్లు కోల్పోయి బెంగాల్ కష్టాల్లో నిలిచిన దశలో 24 ఏళ్ల రామన్ కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్ (176)తో జట్టును ఆదుకొని మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. అలాగే పంజాబ్‌పై (155) కీలక సెంచరీతో బెంగాల్ ఇన్నింగ్స్ విజయం సాధించేలా చేశాడు. ఈ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ మొత్తం 8 మ్యాచ్‌ల్లో 44.50 సగటుతో 623 పరుగులు చేశాడు.



అన్‌మోల్‌ప్రీత్ సింగ్

ఈ రంజీ సీజన్‌లో నాలుగో టాప్ స్కోరర్ అన్‌మోల్‌ప్రీత్ సింగ్. పంజాబ్ తరఫున తన మొదటి ఫస్ట్‌క్లాస్ సీజన్‌లోనే మెరుపులు మెరిపించాడు. 19 ఏళ్ల ఈ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ హిమాచల్‌పై తొలి పోరులోనే హాఫ్ సెంచరీ చేసినా.. అదే మ్యాచ్‌లో ప్రశాంత్ చోప్రా (338) ట్రిపుల్ సెంచరీ చేయడంతో మొత్తం క్రెడిట్ అతనికే దక్కింది. అయితే, గోవాపై సెంచరీ (113) చేసి వెలుగులోకి వచ్చిన అన్‌మోల్.. ఆ వెంటనే చత్తీస్‌గఢ్‌పై డబుల్ సెంచరీ (267) సాధించి తన ప్రతిభ ఏపాటిదో చాటి చెప్పాడు. ఇక, సర్వీసెస్‌పై అజేయంగా మరో డబుల్ సెంచరీ (252 నాటౌట్) చేయడంతో అతను ఒక్కసారిగా స్టార్ అయిపోయాడు. పంజాబ్ నాకౌట్‌కు చేరుకోలేకపోయినా.. అన్‌మోల్ మాత్రం 5 మ్యాచ్‌ల్లోనే 125.50 సగటుతో 753 పరుగులు చేసి అరంగేట్రం సీజన్‌ను మరపురానిదిగా మార్చుకున్నాడు.

అక్షయ్ వాడ్కర్

విదర్భ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ అక్షయ్ వాడ్కర్ తన తొలి ఫస్ట్‌క్లాస్ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లాడి 308 పరుగులు చేశాడు. తన జట్టులో.. టోర్నీలో ఇంతకంటే ఎక్కువ పరుగులు చేసిన వాళ్లు చాలా మంది ఉన్నా 23 ఏళ్ల అక్షయ్ తనకంటూ ప్రత్యేకతను ఏర్పరుచుకున్నాడు. క్లిష్ట సమయాల్లో జట్టుకు ఆపద్బాంధవుడై ఆకట్టుకున్నాడు. గ్రూప్ దశలో కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే ఆడినా.. కేరళతో క్వార్టర్‌ఫైనల్లో, ఢిల్లీతో ఫైనల్లో కీలక ఇన్నింగ్స్‌లతో తన సత్తాను చాటుకున్నాడు. కేరళతో పోరులో జట్టు 96/6తో పీకల్లోతు కష్టాల్లో పడ్డప్పుడు వాడ్కర్ పట్టుదలతో పోరాడాడు. 147 బంతుల్లో 53 పరుగులు చేసి జట్టుకు 246 పరుగుల స్కోరందించాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అజేయంగా 67 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక, ఫైనల్లో ఢిల్లీ తొలి ఇన్నింగ్స్ స్కోరు 295కు సమాధానంగా విదర్భ 246/6తో కష్టాల్లో ఉన్నప్పుడు మరోసారి తనలోని పోరాటపటిమను చాటాడు. టెయిలెండర్ల సహకారంతో అద్భుతంగా ఆడిన అతను 262 బంతుల్లో 133 పరుగులతో ఢిల్లీ నుంచి విజయాన్ని లాగేశాడు.

సిద్దార్థ్ దేశాయ్

కేవలం 17 ఏళ్ల వయసులో తొలిసారి రంజీ ట్రోఫీలో బరిలోకి దిగిన గుజరాత్ లెఫ్టార్మ్ స్పిన్నర్ సిద్దార్థ్ దేశాయ్.. ఎంతో మంది అనుభవజ్ఞులైన బ్యాట్స్‌మెన్‌ను గడగడలాడించాడు. ఐదు మ్యాచ్‌ల్లోనే 29 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అందులో మూడుసార్లు ఐదేసి వికెట్లు తీశాడు. గుజరాత్ ప్రధాన స్పిన్నర్, టీమిండియా ఆటగాడు పియూష్ చావ్లా 32 వికెట్లతో సత్తా చాటగా.. అతనికి దేశాయ్ అద్భుత సహకారం అందించాడు. దాంతో, గత సీజన్ విజేత గుజరాత్.. ఈసారి గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శన కనబరిచింది.

హనుమ విహారి



విహారి

మెరుగైన అవకాశాల కోసం గత సీజన్‌లో హైదరాబాద్‌ను వీడిన హనుమ విహారి తన సొంత రాష్ట్రం ఆంధ్రకు తరలివెళ్లాడు. అతని సామర్థ్యం తెలిసి ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సారథ్య బాధ్యతలతో స్వాగతించింది. దానికి పూర్తి న్యాయం చేశాడీ తెలుగు ఆటగాడు. గతేడాది 688 పరుగులు చేసిన విహారి.. ఈసారి ఆరు మ్యాచ్‌ల్లోనే 94 సగటుతో 752 పరుగులతో ఐదో స్థానంలో నిలిచాడు. ఆంధ్ర తరఫున అత్యధిక పరుగులు ఇతనివే. ఈ సీజన్‌కు ముందు భారత అండర్-23 జట్టు తరఫున అఫ్ఘానిస్థాన్ యువ జట్టుతో వన్డేలో అజేయంగా 59 పరుగులు చేసి ఆకట్టుకున్న విహారి.. దులీప్ ట్రోఫీలో ఇండియా బ్లూ తరఫున సెంచరీ కొట్టి తన సామర్థ్యం తెలిసేలా చేశాడు. ఇక, ఈ సీజన్ రంజీ రెండో మ్యాచ్‌లోనే వెటరన్ బౌలర్ ఇర్ఫాన్ పఠాన్, ఫామ్‌లో ఉన్న స్వప్నిల్ సింగ్‌లను అలవోకగా ఎదుర్కొని బరోడాపై 150 పరుగులు సాధించాడు. ఆ తర్వాతి మ్యాచ్‌లోనే ఒడిశాపై అజేయంగా 302 రన్స్‌తో ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో తొలి ట్రిపుల్ సెంచరీని నమోదుచేశాడు. ఆంధ్ర గ్రూప్ దశలోనే నిష్క్రమించగా.. విహారి 2 శతకాలు, 3 అర్ధ శతకాలతో రాణించాడు.

ఇషాన్ పొరెల్

అరంగేట్ర ఫస్ట్‌క్లాస్ సీజన్‌లో కేవలం 3 మ్యాచ్‌లే ఆడే అవకాశం లభించినా 19 ఏళ్ల బెంగాల్ సీమర్ ఇషాన్ పొరెల్ తన ప్రతిభను చాటుకున్నాడు. విదర్భతో మ్యాచ్‌లో 4 వికెట్లు తీసిన అతను.. పంజాబ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇక గుజరాత్‌తో క్వార్టర్‌ఫైనల్లో 3/64తో మెరిసి ఆ జట్టుకు సెమీస్ అవకాశాన్ని దూరం చేశాడు.

కేసీ అక్షయ్, సిజోమన్ జోసెఫ్

కేరళకు చెందిన ఈ లెఫ్టార్మ్ స్పిన్ ద్వయం టోర్నీలో మెరుగైన ప్రదర్శనలో కీలక పాత్ర పోషించారు. 21 ఏళ్ల కేసీ అక్షయ్ కేవలం మూడు మ్యాచ్‌ల్లో 22 వికెట్లు తీసి ఆశ్చర్యపరిచాడు. అందులో రెండు 5 వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. ఇక, 20 ఏళ్ల జోసెఫ్ నాలుగు మ్యాచ్‌ల్లో 19 వికెట్లు పడగొట్టాడు.


స్టిక్కర్లతో సిరులు





కాదేదీ సంపాదనకు అనర్హం.. అన్నది క్రీడాకారులకు 'అతికిన'ట్టు సరిపోతుంది ! ఒక్కసారి అంతర్జాతీయ స్థాయిలో మెరుపులు మెరిపిస్తే లభించే కీర్తిప్రతిష్ఠలతోపాటు ఎండార్స్‌మెంట్ల రూపేణా సమకూరే మొత్తం కళ్లు చెదిరే స్థాయిలో ఉంటుంది. ఇక ఆ ఫామ్‌ను నిలకడగా కొనసాగిస్తే ఆ ప్లేయర్‌కు ఎండార్స్‌మెంట్ల పండగే. క్రికెటర్లు వ్యక్తిగతంగా ఆయా బ్రాండ్లకు ప్రచారం చేయడం ద్వారా భారీగా సంపాదిస్తుండడమేకాదు..తాము ఉపయోగించే బ్యాట్లతోనూ ఊహించని మొత్తాలు ఆర్జిస్తున్నారు. ఎలాగంటే..ఆయా కంపెనీల పేర్ల స్టిక్కర్లను తమ బ్యాట్లపై అతికించుకోవడం ద్వారా. ఈ ప్రచారంతో క్రికెట్ అభిమానులకు సుపరిచితమైన బ్రాండ్ ఎంఆర్ఎఫ్. గతంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ బ్యాట్‌మీద ఈ స్టిక్కర్ ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో వ్యాపార అనుబంధాన్ని కొనసాగిస్తోంది ఆ సంస్థ. ఎనిమిదేళ్లపాటు కేవలం తన బ్యాట్‌పై ఎంఆర్ఎఫ్ స్టిక్కర్‌ను ప్రదర్శించేందుకు కోహ్లీతో రూ. 100 కోట్లకు ఒప్పందం చేసుకుంది. అంటే ఏడాదికి రూ. 12 కోట్ల పైనే అన్నమాట. దాంతో కోహ్లీ రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి క్రికెటరయ్యాడు. ఇక మహేంద్రసింగ్ ధోనీ బ్యాట్‌పై ఆస్ట్రేలియాకు చెందిన క్రీడా ఉత్పత్తుల సంస్థ 'స్పార్టన్' స్టిక్కర్ ఉంటుంది. అందుకు ఆ కంపెనీ ధోనీకి ఏడాదికి రూ. 6 కోట్లు అందజేస్తోంది. అలాగే టీ-20 స్పెషలిస్ట్ క్రిస్ గేల్‌కు స్పార్టన్ సంవత్సరానికి రూ. 3 కోట్లు ముట్టజెపుతోంది. భారత వైస్‌కెప్టెన్ రోహిత్ శర్మ తన బ్యాట్‌పై సియెట్ స్టిక్కర్‌ను ప్రదర్శించేందుకు ఏడాదికి రూ. 3 కోట్లు తీసుకుంటున్నాడు. ఇంకా.. ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ న్యూబాలెన్స్ సంస్థతో ఏడాదికి రూ. 1.7 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు.

మీకు తెలుసా?



చెస్ బాక్సింగ్

రెండూ వేరు ఆటలనుకుంటున్నారు కదూ. కానేకాదు.. రెండింటినీ మేళవించిన గేమ్ చెస్ బాక్సింగ్. ఇది రూపుదిద్దుకున్నది ఫిన్లాండ్‌లో. ప్లేయర్లిద్దరూ చేతులకు గ్లోవ్స్ తొడుక్కొని చెస్ ఆడతారు. ఆపై బాక్సింగ్‌లో తలపడతారు. ఓ రౌండ్ అది. మరో రౌండ్ ఇది. అలా 11 రౌండ్లపాటు సాగుతుందీ ఆట. అన్నట్టు చెస్ బాక్సింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ కూడా నిర్వహిస్తారండోయ్.



ఐస్‌లాండ్ జట్టు ఈ ఏడాది రష్యాలో జరుగనున్న పోటీలతో సాకర్ వరల్డ్ కప్‌లో అరంగేట్రం చేయబోతోంది. వరల్డ్‌కప్ చరిత్రలో యూరప్ తరఫున బరిలోకి దిగనున్న 34వ దేశంగా ఐస్‌లాండ్ ఘనత వహించనుంది.



మేమిద్దరం మాకు నలుగురు

సాకర్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఫుట్‌బాలంటే ప్రాణం.. ఇక ఆట లేదంటే అతనికి కుటుంబమే లోకం. రికార్డు స్థాయిలో ఐదోసారి 'బాలన్ డీ ఓర్' అవార్డు గెలుచుకున్న ఈ పోర్చుగల్ కింగ్ ఆ మధ్య ఇన్‌స్టాగ్రామ్‌లో ఉంచిన ఓ ఫొటో చేసిన హల్‌చల్ అంతా ఇంతాకాదు. ఈ చిత్రానికి 70లక్షలకు పైగా లైక్‌లు రావడం విశేషం. ఇంతకీ ఆ ఫొటో ఎవరిదో తెలుసా? రొనాల్డో ఫ్యామిలీది. క్రిస్టియానో, అతడి గాళ్‌ఫ్రెండ్ జార్జినా రోడ్రిగ్స్, ఏడేళ్ల కుమారుడు జూనియర్ రొనాల్డో, గత ఏడాది జూన్‌లో సరోగసీ ద్వారా జన్మించిన కవలలు ఇవా, మాటొతో పాటు గత నవంబరు 17న జార్జినా జన్మనిచ్చిన అలానా మార్టినా ఆ చిత్రంలో ఉన్నారు. రష్యన్ మోడల్ ఇరీనా షాక్‌తో డేటింగ్ ఫలితంగా జన్మించిన జూనియర్ రొనాల్డోను క్రిస్టియానో ఫుట్‌బాల్ వారసుడిగా అతడి అభిమానులు భావిస్తుంటారు. ఈ ఫొటో చూస్తే అర్థమవుతోంది కదూ రొనాల్డోకు ఫ్యామిలీ అంటే ఎంతిష్టమో!


Dwaraka

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ఆదివారం 7-1-2018

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



సండే స్పెషల్

ఇల్లే మధుశాల!

మందుకొట్టు.. గుర్రు పెట్టు.. రోడ్డున పడేకంటే ఇదే నయం

తప్పనిసరి పరిస్థితుల్లో అనుమతిస్తున్న ఇల్లాళ్లు.. ప్రమాదాల బెడద ఉండదు

అదుపులో ఉంటారనే నమ్మకం.. కొందరికి స్టేటస్‌గా 'తాగుడు'

మారుతున్న పరిస్థితులు.. విపరీణామాలూ ఉన్నాయంటున్న నిపుణులు

'కళ్ల ముందే తాగుతాడు. కళ్లముందే తింటాడు. చప్పుడు చేయకుండా పడుకుంటాడు. బారుకంటే ఇల్లే పదిలం!'... ఇది ఈతరం ఇల్లాలి మాట! 'తాగొద్దు మొగుడా' అంటే ఎలాగూ వినడు! 'అదేదో ఇంట్లోనే తాగు' అని పర్మిషన్ ఇచ్చేస్తే.. కాసింతైనా కంట్రోల్‌లో ఉంటాడు! 'లిమిట్' దాటడు. మంచింగూ, క్రంచింగూ పేరిట నానా గడ్డి తినకుండా... ఇంట్లో చేసిన పదార్థాలే నమిలేస్తాడు. ఖర్చులూ కలిసొస్తాయి. ఆరోగ్యానికి ఆరోగ్యం! ఇదో లాజిక్! 6



అలాంటోడు.. ఇలా..

ఫ్యాట్.. ఫిట్

డైట్ ప్లాన్‌తో బరువు తగ్గిన అనంత్ అంబానీ

జూనియర్ స్మార్ట్ టిప్స్ 18

కదిలిన పాక్

జమాత్ సహా 72 సంస్థలపై వేటు 18

ఉగ్రసంస్థలకు విరాళాలు ఇస్తే జైలు, జరిమానా

ట్రంప్ హెచ్చరికల ఫలితం

నా క్లినిక్ కాదని.. జీజీహెచ్‌కు వస్తావా?

ఆపరేషన్ ఎలా జరుగుతుందో చూస్తా!

ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగికి సర్కారీ డాక్టర్ వార్నింగ్

ఆర్ఎంవో జోక్యంతో శస్త్రచికిత్స 8

ఈవో ఔట్

దుర్గగుడి బాధ్యతల నుంచి సూర్యకుమారి తొలగింపు



సూర్యకుమారి

జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశం

ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ కమిషనర్

తప్పు జరిగింది వాస్తవం.. అర్ధరాత్రి పూజలు నిజం

తాంత్రికమని చెప్పలేం.. విచారణ కమిటీల నివేదిక

సీఎంను కలిసిన దేవాదాయ మంత్రి, కమిషనర్, సీపీ

ఘటనపై బాబు సీరియస్.. తక్షణ చర్యలకు ఆదేశం

అర్ధరాత్రి పూజలను వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి' 15

దుర్గమ్మ సన్నిధిలో అర్ధరాత్రి పూజలు నిజమని నిర్ధారణ అయింది. దుర్గ గుడి ఈవో సూర్యకుమారిపై బదిలీ వేటు పడింది. దేవాదాయ శాఖ నియమించిన నిజనిర్ధారణ కమిటీతోపాటు ఏపీ ఆగమ సలహా మండలి చైర్మన్ నేతృత్వంలోని కమిటీ కూడా ఆలయంలో అర్ధరాత్రి పూజలు జరిగినట్లు సీఎంకి నివేదించాయి. పోలీసుల దర్యాప్తు నివేదిక కూడా అదే అంశాన్ని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు సీరియస్‌గా స్పందించారు. తక్షణ చర్యలకు ఆదేశించారు. దీంతో ఆగమేఘాలపై ఈవో బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ కమిషనర్ అనూరాధను నియమించారు.

హైకోర్టు విభజనపై కమిటీలు 13

ఒక్కో దానిలో ఐదుగురు న్యాయమూర్తులు.. మాకు స్థానమేదీ?.. న్యాయవాదుల అసంతృప్తి



గవర్నర్ గారి కథ

చేతికి మట్టి అంటకుండా, నోటికి పనిచెప్పకుండా ఎవరితో ఎప్పుడు ఏమి చేయించాలో తెలంగాణ ముఖ్యమంత్రికి బాగా తెలుసు! ఈ జాణతనం ఫలితమే శుక్రవారంనాడు రాజ్‌భవన్‌లో కాంగ్రెస్ నాయకులు- గవర్నర్‌కు మధ్య జరిగిన సంవాదం.

ఎవరిని ఎలా బుట్టలో వేసుకోవాలో కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య! ఇవ్వాళ ఢిల్లీలో కేసీఆర్ ప్రభుత్వం గురించి నలుగురూ మంచిగా చెప్పుకొంటున్నారంటే అందుకు నరసింహన్‌లాంటి వారు కూడా కారణం! ఒక్క మాటలో చెప్పాలంటే ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం తరఫున బ్రాండ్ అంబాసిడర్‌గా మన గవర్నర్ వ్యవహరిస్తున్నారు.

కొత్త పలుకు

-ఆర్కే విశ్లేషణ 4వ పేజీలో

భేటీకి ఓకే

12 లేదా 17న మోదీ-బాబు సమావేశం!

దాదాపు ఏడాది తర్వాత కలుస్తున్న నేతలు

వినతులపై ఉన్నతాధికారుల కసరత్తు

పోలవరం అంచనాలు సవరించాలి

రాష్ట్రం పెట్టిన ఖర్చు తిరిగివ్వాలి

20 వేల కోట్ల ఈఏపీలు ఆమోదించాలి

రెవెన్యూ లోటు భర్తీ చేయాలి

విశాఖలో రైల్వే జోన్ పెట్టాలి

ప్రధానికి వినతుల చిట్టా ఇవ్వనున్న సీఎం



వదులుకుంటే నష్టం!

గుజరాత్ ఫలితాలతో కమలనాథుల్లో అంతర్మథనం

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీకి రంగం సిద్ధమైంది. రాష్ట్రానికి నిధులు, పనుల విషయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఎం నేరుగా ప్రధానిని కోరనున్నారు. టీడీపీ ఎంపీలు శుక్రవారం తనను కలిసినప్పుడు చంద్రబాబును కొద్దిరోజుల్లో కలుస్తానని మోదీ చెప్పిన నేపథ్యంలో తేదీల ఖరారుపై అటు ప్రధాని కార్యాలయం (పీఎంవో), ఇటు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) పరస్పరం సంప్రదించుకుంటున్నాయి. ఈ నెల 12న అపాయింట్‌మెంట్ ఖరారుచేయాలని సీఎం లేఖ రాయగా.. సంక్రాంతి తర్వాత 17వ తేదీన రావాలని పీఎంవో సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు తేదీల్లో ఒకటి ఖరారు కావడమైతే ఖాయం. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన ఏయే హామీలను ప్రధాని వద్ద ప్రస్తావించాలో కసరత్తు చేయాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం

మిగతా 15వ పేజీలో...



నెల్లూరు జన్మభూమిలో ఓ చిన్నారితో సీఎం చంద్రబాబు

పేదల కష్టాలు తీరుస్తా!

సమస్యల పరిష్కారానికే జన్మభూమి: సీఎం 15



■ ఆర్కే RK


కొత్తపలుకు

గవర్నర్ గారి కథ!

తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ చేతుల్లో కాకుండా మరొకరి చేతుల్లోకి వెళ్లి ఉంటే ఏమై ఉండేదా..? అని అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీర్తించినా, కేసీఆర్ ప్రభుత్వంపై ఈగ వాలకుండా గవర్నర్ నరసింహన్ కాపాడుతున్నా ఆ ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకే దక్కుతుంది. జనసేన పార్టీ తెలంగాణలో కూడా పోటీ చేస్తుందని ప్రకటించిన పవన్ కల్యాణ్‌తోనే 'వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఓ అద్భుతం' అని పొగిడించుకున్న కేసీఆర్‌ను అభినందించకుండా ఎలా ఉండగలం? తటస్థంగా ఉంటూ ప్రతిపక్షాలు ఇచ్చే వినతిపత్రాలను పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పవలసిన గవర్నరే ప్రభుత్వాన్ని తప్పుపట్టేవారిపై మండిపడేలా వ్యవహరిస్తున్నారంటే, అందులో కేసీఆర్ రాజకీయ చాణక్యం లేదని ఎవరైనా ఎలా అనగలరు? ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాయకుడిగా శభాష్ అనిపించుకున్న కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా కూడా 'ఆహా ఓహో' అనిపించుకుంటున్నారంటే ఆయనలోని రాజకీయ జాణతనం తెలియడం లేదా! ప్రత్యర్థుల అంచనాలకు, ఊహలకు అందని విధంగా అనూహ్య వ్యూహాలతో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తెలంగాణలో తనకు తిరుగులేదని కేసీఆర్ ఎప్పటికప్పుడు రుజువు చేసుకుంటున్నారు. రాజకీయపరమైన వ్యూహాలతోనే కాకుండా పాలనాపరంగా కూడా అవసరమైనప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తాను ఏమిటన్నది కేసీఆర్ నిరూపించుకుంటున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న మంద కృష్ణమాదిగను జైలులో పెట్టించిందికూడా కేసీఆర్‌కే దక్కుతుంది. చేతికి మట్టి అంటకుండా, నోటికి పనిచెప్పకుండా ఎవరితో ఎప్పుడు ఏమి చేయించాలో తెలంగాణ ముఖ్యమంత్రికి బాగా తెలుసు! ఈ జాణతనం ఫలితమే శుక్రవారంనాడు రాజ్‌భవన్‌లో కాంగ్రెస్ నాయకులు– గవర్నర్‌కు మధ్య జరిగిన సంవాదం. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా గవర్నర్ వ్యవస్థ వ్యవహరిస్తూ ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా కేంద్రానికి నివేదికలు పంపేది గవర్నర్‌లే! నరసింహన్ లాంటి గవర్నర్ ఇలాంటి విషయాలలో మరీ చురుకుగా వ్యవహరిస్తూ ఉంటారు. ఈ విషయం తెలుసు కనుకే ముఖ్యమంత్రి కేసీఆర్.. గవర్నర్ నరసింహన్ ద్వారా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం చేయించుకోగలుగుతున్నారు. 'గవర్నర్‌తో సుదీర్ఘంగా సమావేశమైన ముఖ్యమంత్రి కేసీఆర్' అని తరచుగా

నిజానికి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గవర్నర్ నరసింహన్‌ను మార్చమంటారా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఢిల్లీ పెద్దలు అడిగారు. అప్పట్లో సుజనా చౌదరి సలహాతో మార్పు అవసరం లేదని చంద్రబాబు చెప్పారు. తన కొనసాగింపునకు చంద్రబాబు సహకారమే కారణమని తెలిసి కూడా నరసింహన్ మొదటి నుంచీ ఆయన విషయంలో పెడసరంగానే వ్యవహరిస్తున్నారని విమర్శలు వచ్చాయి.

వార్తలు వస్తుంటాయి. గతంలో ఏ ముఖ్యమంత్రీ ఒక గవర్నర్‌ను ఇన్ని పర్యాయాలు కలుసుకోలేదు. కేసీఆర్ మాత్రం తరచుగా రాజ్‌భవన్‌కు వెళుతుంటారు. వెళ్లినప్పుడు ఖాళీ చేతులతో కాకుండా పట్టు పంచెలు, పట్టు చీరలు తీసుకు వెళుతుంటారు. పుష్పగుచ్ఛం అదనం! అప్పుడప్పుడు పాదాభివందనం చేస్తారు. మన గవర్నర్ నరసింహన్‌ది రాజకీయ నేపథ్యం కాదు. ఆయన ఒక పోలీసు అధికారిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఇంటెలిజెన్స్ బ్యూరో అధిపతిగా పనిచేశారు. కేంద్రంలో కీలక స్థానాలలో ఉన్న అధికారులతో చక్కటి సంబంధాలు ఉన్నాయి. ఇవన్నీ తెలుసు కనుకే ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్‌తో సత్సంబంధాలు పెట్టుకున్నారు. ఎవరిని ఎలా బుట్టలో వేసుకోవాలో కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య! ఇవ్వాళ ఢిల్లీలో కేసీఆర్ ప్రభుత్వం గురించి నలుగురూ మంచిగా చెప్పుకొంటున్నారంటే అందుకు నరసింహన్‌లాంటివారు కూడా కారణం! ఒక్క మాటలో చెప్పాలంటే ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున బ్రాండ్ అంబాసిడర్‌గా మన గవర్నర్ వ్యవహరిస్తున్నారు. నరసింహన్ రెండు తెలుగు రాష్ట్రాలకూ గవర్నర్ అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వాన్ని మాత్రమే భుజానికెత్తుకుని మోయడానికి కేసీఆర్ అనుసరిస్తున్న ఎత్తుగడే కారణం! శుక్రవారంనాడు రాజ్‌భవన్‌లో కాంగ్రెస్ నాయకులు– గవర్నర్ పరస్పరం నిందించుకున్నారంటే నరసింహన్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభావం ఎంత బలంగా ఉందో తెలియడంలేదా? ప్రశ్నించడమే తన విధానమని ప్రకటించుకున్న జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ కూడా కేసీఆర్ ప్రభుత్వాన్ని అదే పనిగా ప్రశంసించడం కూడా చిన్న విషయం కాదు. అజ్ఞాతవాసి సినిమా ప్రీమియర్ షోలకు అనుమతి కోసం పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రిని కలిశారని గిట్టనివారు ప్రచారం చేశారు కానీ అది నిజం కాదు. ఆంధ్రప్రదేశ్‌లో సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబును అప్పుడప్పుడు కలిసే పవన్ కల్యాణ్, తెలంగాణ ముఖ్యమంత్రిని మాత్రం యథాలాపంగా కలిశారు. భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. ప్రభుత్వాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. ఒకప్పుడు కేసీఆర్– పవన్ కల్యాణ్ తిట్టుకున్నవారే! శత్రువుతో కూడా పొగిడించుకోగల నేర్పరితనం కేసీఆర్ సొంతం. కాంగ్రెస్ నాయకులతో సంవాదానికి దిగడం ద్వారా గవర్నర్ నరసింహన్, ప్రభుత్వాన్ని పొగడటం ద్వారా పవన్ కల్యాణ్ వివాదాస్పదం అయ్యారే గానీ కేసీఆర్ కాదు కదా! ఈ రెండు సందర్భాలలోనూ కేసీఆర్ నిమిత్తమాత్రుడే! తనను పొగడాలని కానీ, తన తరఫున వకాల్తా పుచ్చుకుని వాదించాలని గానీ ఆ ఇద్దరినీ ఆయన కోరలేదు. అయినా ఆ ఇద్దరూ వారికి వారే చొరవ తీసుకున్నారు. అందులోనే కేసీఆర్ గొప్పతనం ఉంది. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరఫరా నిర్ణయమే తీసుకుందాం. పరిస్థితులను ఆకళింపు చేసుకుని రాజకీయంగా తగు నిర్ణయాలు తీసుకోవడంలో కేసీఆర్ దిట్ట! దేశంలో ఎక్కడా లేనిది తెలంగాణలో మాత్రమే వ్యవసాయానికి 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయడం ఎలా సాధ్యమవుతుంది? అన్న సందేహం ఎవరికైనా కలుగుతుంది. పవన్ కల్యాణ్‌కు కూడా అలాంటి సందేహమే వచ్చి ఉంటుంది. పాలనా అనుభవం ఉన్న కాంగ్రెస్ నాయకులకు కూడా ఇందులోని సూక్ష్మం తెలియక అడ్డదిడ్డంగా మాట్లాడి అభాసుపాలయ్యారు. పరిస్థితులలో వచ్చిన మార్పు తెలుసు కనుకే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. నాలుగైదు ఏళ్ల క్రితం దేశంలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉండేది. ఒక్క యూనిట్ విద్యుత్‌ను పన్నెండు రూపాయలకు పైగా పెట్టి కొనుగోలు చేసిన రోజులు ఉన్నాయి. డబ్బు పెట్టినా అవసరమైనంత విద్యుత్ దొరికేది కాదు. ఇప్పుడు అలా కాదు. కావలసినంత విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. కొనుగోలు చేసేవారు లేక ప్రైవేటు థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తిని నిలిపివేశాయి. దీంతో పోటీ పెరిగి విద్యుత్ ధరలు తగ్గిపోయాయి. ఇప్పుడు విద్యుత్ ధర యూనిట్‌కు గరిష్ఠంగా అయిదున్నర రూపాయలే పలుకుతోంది. అది కూడా డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు! ప్రస్తుతం విద్యుత్ ధర సగటున మూడున్నర రూపాయలు దాటడం లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసినా బోర్ల నుంచి నీళ్లు అయిదారు గంటలకు మించిరావు. వ్యవసాయానికి ఎనిమిది గంటలపాటు విద్యుత్తు సరఫరా చేసినా, 24 గంటల పాటు సరఫరా చేసినా వినియోగించే విద్యుత్‌లో తేడా ఏమీ ఉండదు. కాకపోతే పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చుకోవాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసింది ఇదే! వినియోగం పెరిగినా గ్రిడ్ సరఫరా దెబ్బతినకుండా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయించారు. గతంతో పోల్చితే విద్యుత్ ధరలు తగ్గినందున ఎంత విద్యుత్ కొనుగోలు చేసినా పెద్దగా భారం ఉండటం లేదు. బహిరంగ మార్కెట్‌లో ఒక్క యూనిట్‌ను పన్నెండు రూపాయల వరకు వెచ్చించి కొనుగోలు చేసినప్పుడు వినియోగదారుల నుంచి ఒక్క యూనిట్‌కు ఆరు రూపాయలకు పైగా వసూలు చేశారు. ఇప్పుడు కొనుగోలు ధర భారీగా పడిపోయినా వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న చార్జీలను తగ్గించ లేదు. తెలంగాణలో ప్రస్తుతం సగటున 63 మిలియన్ యూనిట్లను కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఇంత విద్యుత్ కొనుగోలు చేయాలంటే తడిసి మోపెడయ్యేది. ఇప్పుడు కొనుగోళ్ల భారం బాగా తగ్గినందున ప్రభుత్వాలకు ఉపశమనం లభిస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ గ్రహించిన ముఖ్యమంత్రి కేసీఆర్, తన బుర్రకు పదునుపెట్టి నిరంతర విద్యుత్ సరఫరా నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ రంగంలో వచ్చిన పెనుమార్పుల గురించి తెలియనివారు కేసీఆర్ నిర్ణయాన్ని విమర్శించడానికి అడ్డదారులు వెతుక్కున్నారు. పవన్ కల్యాణ్ వంటివారు పొగిడారు. అంతే!



■ గవర్నర్.. నాడలా–నేడిలా?

ఇప్పుడు మళ్లీ గవర్నర్ నరసింహన్ విషయానికి వద్దాం. ఆయన తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా, ఏపీ ప్రభుత్వ విషయంలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని చాలా కాలంగా రాజకీయ వర్గాలలో వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ విషయంలో గవర్నర్ పక్షపాతం ప్రదర్శిస్తున్నారనీ, నాలా బిల్లును ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టడం ఏమిటనీ ఏపీకి చెందిన భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష నాయకుడు విష్ణుకుమార్ రాజు నాలుగు రోజుల క్రితమే విమర్శించారు. గవర్నర్ చెబుతున్న చాడీల వల్లనే ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మధ్య చెడిందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆంతరంగిక సంభాషణలలో విమర్శిస్తూ ఉంటారు. నిజానికి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గవర్నర్ నరసింహన్‌ను మార్చమంటారా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఢిల్లీ పెద్దలు అడిగారు. అప్పట్లో సుజనా చౌదరి సలహాతో మార్పు అవసరం లేదని చంద్రబాబు చెప్పారు. తన కొనసాగింపునకు చంద్రబాబు సహకారమే కారణమని తెలిసి కూడా నరసింహన్ మొదటి నుంచీ ఆయన విషయంలో పెడసరంగానే వ్యవహరిస్తున్నారని విమర్శలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ప్రముఖులు తనను కలిసిన సందర్భాలలో చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను గవర్నర్ విమర్శించిన దాఖలాలు ఉన్నాయి. 'రాజధాని కోసం 30 వేల ఎకరాలు ఎందుకు?' అని కూడా ఒక సందర్భంలో నరసింహన్ ప్రశ్నించారట! 'శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డికి, వైసీపీకి తగిన అవకాశం ఇవ్వరెందుకు?' అని మరో సందర్భంలో ఆక్షేపించారట! 'నిధుల కొరత ఉన్నా శాసనసభ, సచివాలయం వంటి భవనాలను అద్భుతంగా కట్టాలనుకోవడం ఏమిటి? అంత అవసరమా?' అని మరికొందరి దగ్గర ప్రశ్నించారట! ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో ఉదంతాలు ఉన్నాయి. రాష్ట్రం విడిపోయిన కొత్తలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి చులకనగా మాట్లాడేవారట! కేసీఆర్ చైనా పర్యటనకు వెళ్లినప్పుడు తనను కలవడానికి వచ్చిన పోలీసు అధికారులతో మాట్లాడుతూ 'గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను చూసొచ్చిన తర్వాత రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో అలాంటి గోడనే కడతానని కేసీఆర్ ప్రకటించినా ప్రకటిస్తారు' అని గవర్నర్ వ్యాఖ్యానించారు. అలాంటిది ఆ తర్వాత కాలంలో కేసీఆర్‌కు అత్యంత సన్నిహితం అవ్వడమే కాకుండా ఆయనకు అనుకూలంగా ఢిల్లీలో లాబీయింగ్ కూడా నడుపుతున్నారని చెబుతారు. చంద్రబాబు ప్రభుత్వం హైదరాబాద్‌లోని సచివాలయాన్ని ఖాళీ చేసి అమరావతికి తరలివెళ్లిన తర్వాత ఆ భవనాలను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించవలసిందిగా ఏపీ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఒక దశలో అయితే మీ అంతట మీరు అప్పగించకపోతే గవర్నర్‌గా నా అధికారాలను వినియోగించవలసి వస్తుందని హెచ్చరించారు. దీనిపై ఆగ్రహం చెందిన చంద్రబాబు ప్రభుత్వం, అంతే తీవ్రంగా స్పందించడంతో వెనక్కు తగ్గారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తనను గౌరవించినట్టుగా ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబు తనను గౌరవించడం లేదని తనను కలసిన కొంతమంది వద్ద గవర్నర్ వ్యాఖ్యానించారట! పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే విషయంలో కూడా తెలంగాణ విషయంలో ఒకలా, ఆంధ్రా విషయంలో మరోలా వ్యవహరించారని చెబుతారు. తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌తో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించిన నరసింహన్, ఆంధ్రాకు సంబంధించి వైసీపీ నుంచి ఫిరాయించినవారితో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించడానికి తొలుత అభ్యంతర పెట్టారట! శ్రీనివాసయాదవ్ విషయంలో లేని అభ్యంతరం మా విషయంలో ఎందుకని ప్రశ్నించడంతో చివరకు అంగీకరించారు. ఏపీ ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డికి ఎప్పుడు పడితే అప్పుడు అపాయింట్‌మెంట్ ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించిన తెలుగుదేశం నాయకులపై ఒక సందర్భంలో గవర్నర్ మండిపడ్డారు. 'ఆయన ప్రతిపక్ష నాయకుడు. అడిగితే అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ఎలా ఉంటాను' అని ప్రశ్నించారట! ఇరుపక్షాల మధ్య ఇలాంటి అంతరాలు ఎన్నో! ఇప్పుడు తెలంగాణ విషయానికి వద్దాం. కేసీఆర్ ప్రభుత్వానికి తొత్తుగా గవర్నర్ వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి కూడా గవర్నర్ తీరును తప్పుబట్టారు. తాజాగా కాంగ్రెస్ నాయకులతో పెద్ద సంవాదమే నడిచింది. శుక్రవారంనాడు రాజ్‌భవన్‌లో చోటుచేసుకున్న వాద–ప్రతివాదాలు అభ్యంతరకరంగా ఉన్నాయి. కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి నరసింహన్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయంగా ఉన్నాయి. 'ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా, ఆయన కుమారుడు కేటీఆర్‌పైనా విమర్శలు చేయడం ఏమిటి? ఇసుక మాఫియా ఇంతకు ముందు లేదా? అయినా మీకు అక్కడ ఏమి పని?' అని కాంగ్రెస్ నాయకులను నిలదీయడం గవర్నర్ వ్యవస్థకు తగని పని. సహనం కోల్పోయిన కాంగ్రెస్ నాయకులు కూడా ఢిల్లీ పెద్దల కాళ్లు మొక్కి పదవిలో కొనసాగుతున్నావని ముఖం మీదనే తిట్టారంటే పరిస్థితి ఎంత దూరం వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి రావడానికి నరసింహనే కారణమని చెప్పవచ్చు. ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు చేసే ఫిర్యాదుల్లో వాస్తవం ఉండవచ్చు– లేకపోవచ్చు. వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వారితో 'చూస్తాను– పరిశీలిస్తాను' అని చెప్పి ఉంటే ఏ గొడవా ఉండేది కాదు. నరసింహన్ అందరిలాంటి గవర్నర్ కాదు. ముఖ్యమంత్రులు తనను నెత్తిన పెట్టుకోవాలని కోరుకుంటారు. 'కుడుమిస్తే పండగ' అని భావించే వాళ్లు కొందరు ఉంటారు. నరసింహన్ ఈ కోవలోకే వస్తారు. ఇది తెలుసు కనుకే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్‌ను తన దారిలోకి తెచ్చుకున్నారు. నిజానికి యూపీఏ హయాంలో నరసింహన్‌ను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమించారు. అప్పుడు ఉమ్మడి రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న ఎన్.డి.తివారీ రాజ్‌భవన్‌లో అమ్మాయిలతో సరససల్లాపాలు చేసిన వీడియోను ఏబీఎన్ చానెల్ ప్రసారం చేయడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనతో రాజీనామా చేయించి, నరసింహన్‌ను ఏపీకి బదిలీ చేసింది. రాష్ట్ర విభజనకు ముందు కొంతకాలం పాటు తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా వ్యవహరించిన గవర్నర్ నరసింహన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో విభజనకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్న తర్వాత వైఖరి మార్చుకున్నారు. యూపీఏ హయాంలో గవర్నర్‌గా ఉండి కూడా ప్రభుత్వంలో ఏ హోదా లేని సోనియాగాంధీని తరచుగా కలుసుకుని నివేదికలు అందించేవారు. ఇదీ నరసింహన్ నేపథ్యం. నిజానికి నరసింహన్ పదవీకాలం ఎప్పుడో ముగిసింది. కారణాలు తెలియదు గానీ ఢిల్లీ పెద్దలు ఆయనను ఇంకా కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆంతరంగిక భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల కారణంగానే నరసింహన్ ఇంకా పదవిలో కొనసాగుతున్నారని చెబుతుంటారు. ఏదిఏమైనా ఇప్పుడు మన గవర్నర్ వివాదాస్పదులయ్యారు. గవర్నర్‌లు వివాదాస్పదం కావడం ఇంతకు ముందు కూడా జరిగింది. కుముద్‌బెన్ జోషి ఉమ్మడి రాష్ట్రంలో గవర్నర్‌గా ఉన్నప్పుడు వివాదాస్పదమయ్యారు. అప్పుడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుతో ఆమెకు పొసిగేది కాదు. గవర్నర్‌గా ఉన్నా ఆమె కాంగ్రెస్ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారనీ, రాజ్‌భవన్‌ను గాంధీభవన్‌లా మార్చారనీ అప్పట్లో తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించేవారు. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది కనుక కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా గవర్నర్లు వ్యవహరించడం ఎప్పటి నుంచో ఉంది. కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్లు వివాదాస్పదం అవుతుంటారు. ఎన్టీఆర్ హయాంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండేది. ఆ కారణంగా ఎన్టీఆర్ ప్రభుత్వానికి నాటి గవర్నర్లు చికాకులు కలిగించేవారు. ఆ పరిస్థితిని భరించలేని ఎన్టీఆర్, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని ఉద్యమమే చేశారు. ఇప్పుడు తెలంగాణలో గవర్నర్ నరసింహన్‌ది కొత్త పోకడ అనే చెప్పాలి. ఆయనను గవర్నర్‌గా నియమించింది కాంగ్రెస్ పార్టీ. ఆయనను కొనసాగించాలని మూడున్నరేళ్ల క్రితం కోరింది తెలుగుదేశం పార్టీ. పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ఆయన గవర్నర్‌గా కొనసాగడానికి భారతీయ జనతా పార్టీ కారణం. ఇప్పుడు ఈ మూడు పార్టీలు కూడా నరసింహన్ వ్యవహారశైలిపై ఆగ్రహంగా ఉన్నాయి. పదవిలో కొనసాగడానికి కారణమైన తమ విషయంలో పక్షపాతంతో వ్యవహరిస్తూ, ఏ మాత్రం ఉపయోగపడని కేసీఆర్ ప్రభుత్వాన్ని భుజానికెత్తుకోవడం ఏమిటని ఈ మూడు పార్టీల నాయకులు ఇప్పుడు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. తాను గవర్నర్‌గా కొనసాగడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన పార్టీలకు స్థానికంగా ఆగ్రహం రప్పిస్తూ కూడా నరసింహన్ ఆ పదవిలో కొనసాగుతున్నారంటే ఆయనకు ఢిల్లీలో ఉన్న పలుకుబడి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ నాయకులతో జరిగిన సంవాదంపై చానెళ్లలో వార్తలు ప్రసారం అయిన తర్వాత రాజ్‌భవన్ వివరణ ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గవర్నర్ వ్యవస్థ తటస్థంగా ఉండాలన్న సూత్రానికి భంగం కలగకుండానే గవర్నర్ వ్యవహరించారని రాజ్‌భవన్ వివరణ ఇచ్చినప్పటికీ జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోయింది. గవర్నర్ నరసింహన్ తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనీ, ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనీ రెండు రాష్ట్రాలలో ప్రజలు కూడా నమ్ముతున్నారు. ప్రభుత్వంలో ఉన్నవారిపై ప్రతిపక్షాలు సహజంగానే ఆరోపణలు చేస్తుంటాయి. అలా చేయకూడదని చెప్పే హక్కు గవర్నర్‌కు లేదు. మామూలుగా గవర్నర్‌కు పెద్దగా పని వత్తిడి ఏమీ ఉండదు. ఇలాంటప్పుడు తన దగ్గరకు వచ్చే విపక్ష నేతలకు టీయో, కాఫీయో ఇచ్చి కులాసాగా కాసేపు కబుర్లు చెప్పుకొంటే కాలక్షేపమైనా అవుతుంది. అది వదిలేసి అనీ, అనిపించుకోవడం వలన ప్రయోజనం ఏమి ఉంది? తమపై వచ్చే ఆరోపణలకు ప్రభుత్వంలో ఉన్నవారు సమాధానం చెప్పుకొంటారు. ముఖ్యమంత్రుల తరఫున వకాల్తా పుచ్చుకోవలసిన అవసరం గవర్నర్‌కు లేదు. రాజ్‌భవన్‌పై అవుతున్న ఖర్చును ఇరు రాష్ట్రాలూ భరిస్తున్నాయి. విడిపోయిన రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరిష్కారం కాని ఎన్నో వివాదాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ వివాదాల పరిష్కారంలో చేతులు ఎత్తేసింది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తాజాగా లోక్‌సభలో మాట్లాడుతూ, ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలను ఇరువురు ముఖ్యమంత్రులూ కూర్చొని పరిష్కరించుకోవాలనీ, కేంద్రం జోక్యం చేసుకోబోదనీ చెప్పి చేతులు కడిగేసుకున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలు ఏర్పడటానికి కారణమైన కేంద్ర ప్రభుత్వమే బాధ్యతల నుంచి తప్పుకోవడం దారుణమనే చెప్పాలి. రెండు రాష్ట్రాల మధ్య వివాదాల కుంపట్లు రగిలించింది ఎవరు? కేంద్రం కాదా? అంటే ఆనాడు రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్– భారతీయ జనతా పార్టీలే కదా! అన్ని సమస్యలకూ నాటి బిల్లులోనే పరిష్కారాలు చూపించి ఉంటే ప్రస్తుత పరిస్థితి వచ్చేది కాదు కదా! అధికారం ఉంది కదా అని రాష్ట్రాన్ని విభజించినవాళ్లు బాధ్యతల నుంచి తప్పించుకోవడం ఏమిటి? ఇలా అయితే కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రాలకు నమ్మకం పోదా? ఇలాంటి పరిస్థితులలో గవర్నర్ నరసింహన్ అయినా తటస్థంగా ఉండి ఉంటే కొన్ని సమస్యలైనా పరిష్కారం అయ్యేవి. గవర్నర్ తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అనుమానిస్తున్న ఏపీ ప్రభుత్వం, ఆయన మధ్యవర్తిత్వం పట్ల విముఖంగా ఉంటోంది. ఈ అవకాశం కూడా కోల్పోవడం తెలుగు ప్రజల దురదృష్టం.

శుక్రవారంనాడు రాజ్‌భవన్‌లో చోటుచేసుకున్న వాద– ప్రతివాదాలు అభ్యంతరకరంగా ఉన్నాయి. కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి నరసింహన్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయంగా ఉన్నాయి. 'ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా, ఆయన కుమారుడు కేటీఆర్‌పైనా విమర్శలు చేయడం ఏమిటి? ఇసుక మాఫియా ఇంతకు ముందు లేదా? అయినా మీకు అక్కడ ఏమి పని?' అని కాంగ్రెస్ నాయకులను నిలదీయడం గవర్నర్ వ్యవస్థకు తగని పని. సహనం కోల్పోయిన కాంగ్రెస్ నాయకులు కూడా ఢిల్లీ పెద్దల కాళ్లు మొక్కి పదవిలో కొనసాగుతున్నావని ముఖం మీదనే తిట్టారంటే పరిస్థితి ఎంత దూరం వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి రావడానికి నరసింహనే కారణమని చెప్పవచ్చు.

నరసింహన్‌ను గవర్నర్‌గా నియమించింది కాంగ్రెస్ పార్టీ. ఆయనను కొనసాగించాలని మూడున్నరేళ్ల క్రితం కోరింది తెలుగుదేశం పార్టీ. పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ఆయన గవర్నర్‌గా కొనసాగడానికి భారతీయ జనతా పార్టీ కారణం. ఇప్పుడు ఈ మూడు పార్టీలు కూడా నరసింహన్ వ్యవహారశైలిపై ఆగ్రహంగా ఉన్నాయి. పదవిలో కొనసాగడానికి కారణమైన తమ విషయంలో పక్షపాతంతో వ్యవహరిస్తూ, ఏ మాత్రం ఉపయోగపడని కేసీఆర్ ప్రభుత్వాన్ని భుజానికెత్తుకోవడం ఏమిటని ఈ మూడు పార్టీల నాయకులు ఇప్పుడు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. గవర్నర్ నరసింహన్ తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనీ, ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనీ రెండు రాష్ట్రాలలో ప్రజలు కూడా నమ్ముతున్నారు.

అదేమిటోగానీ సమాజంలో భక్తితత్వం ఎంతగా పెరుగుతుందో నేరాలు కూడా అంతే పెరుగుతున్నాయి. దేవుడిని నమ్మేవారిలో పాప పుణ్యాల విచక్షణ ఉండాలి కదా? అంటే మనలో చాలామందిది దొంగభక్తి అన్న మాట! సమాజంలో చోటుచేసుకుంటున్న పెడ ధోరణులకు అడ్డుకట్ట వేయడం ఎలా అని ఆలోచించవలసిన తరుణం ఆసన్నమయ్యింది.

■ మంటగలుస్తున్న మానవత్వం!

ఈ విషయం అలా ఉంచితే, మానవత్వానికి, మానవ సంబంధాలకు మచ్చ తెచ్చే సంఘటనలు ఇటీవలి కాలంలో తరచుగా జరగడం ఆందోళన కలిగిస్తున్నాయి. వివాహేతర సంబంధాలకు అలవాటుపడిన వారు ప్రియులను ప్రేరేపించి భాగస్వాములను చంపించిన సంఘటనలు తెలుగు రాష్ట్రాలలో చోటుచేసుకోవడం కలవరం కలిగిస్తున్నాయి. గుజరాత్‌లో పక్షవాతంతో బాధపడుతున్న తల్లిని కన్నకొడుకే అయిదంతస్తుల భవనం పైనుంచి పడేసి చంపడం ఏ మానవత్వానికి ప్రతీక? ఖమ్మం జిల్లాలో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఒక భర్త సొంత భార్యనే కిడ్నాప్ చేసి హత్య చేయడమేమిటి? కన్న కుమారులే ఆస్తి కోసం తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని కృష్ణా జిల్లాలో ఒక వృద్ధ జంట ఫిర్యాదు చేసింది. ఇటీవలి కాలంలో ఇలాంటి అమానవీయ సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. 'మానవత్వాన్ని మంటగలుపుతున్న ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? మనుషుల్లో అంతటి క్రూరత్వం ఏర్పడటానికి కారణం ఏమిటి? విచక్షణతో మెలగవలసిన వాళ్లు విచక్షణారహితంగా ప్రవర్తించడానికి కారణం ఏమిటి?' మొదలైన అంశాలపై మానసిక శాస్త్రవేత్తలు అధ్యయనం చేయడం అవసరమనిపిస్తోంది. విశాల దృక్పథంతో వ్యవహరించవలసిన వారు సంకుచితంగా ఆలోచిస్తున్నారు. వందల ఏళ్లనాడు జరిగాయని చెప్పుకొంటున్న సంఘటనలు ఇప్పుడు వివాదం అవ్వడం ఏమిటో అర్థం కావడం లేదు. అనుక్షణం వంచనతో బతకడానికి అలవాటు పడుతున్నాం కదా! ఈ కారణంగానే హేతుబద్ధంగా ఆలోచించి అడుగు వేయవలసిన మనం ఉన్మాదంతో నిర్ణయాలు తీసుకుంటూ అడుగులేస్తున్నాం. లేని సమస్యలను సృష్టించుకుంటున్నాం. పెడర్థాలు, విపరీత అర్థాలు, ఆవేశాలు, ఆగ్రహాలు మనల్ని కమ్మేస్తున్నాయి. 'అందమైన లోకమనీ.. రంగురంగులుంటాయనీ.. అందరూ అంటుంటారు..' అని ఒక సినిమాలో ఆత్రేయ రాశారు. మనిషి మాత్రమే ఆస్వాదించగల, అనుభవించగల ఇంత అందమైన లోకాన్ని క్షణికావేశాలతో నాశనం చేసుకోవడం మూర్ఖత్వం కాదా? వివాహేతర సంబంధాలకు అలవాటుపడినవాళ్లు భర్తలను లేదా భార్యలను చంపి లేదా చంపించి జైళ్లకు వెళుతున్నారు. తల్లిదండ్రులలో ఒకరు చనిపోయి మరొకరు జైలుకెళితే వారి పిల్లల పరిస్థితి ఏమిటి? ఆ పిల్లలు ఎలా జీవించాలి? తల్లిదండ్రులు చేసిన తప్పు వారిని జీవితాంతం వెంటాడదా? తోటివారు హేళన చేస్తుంటే ఆ పసిహృదయాలు తట్టుకోగలవా? అదేమిటోగానీ సమాజంలో భక్తితత్వం ఎంతగా పెరుగుతుందో నేరాలు కూడా అంతే పెరుగుతున్నాయి. దేవుడిని నమ్మేవారిలో పాప పుణ్యాల విచక్షణ ఉండాలి కదా? అంటే మనలో చాలామందిది దొంగభక్తి అన్న మాట! సమాజంలో చోటుచేసుకుంటున్న పెడధోరణులకు అడ్డుకట్ట వేయడం ఎలా అని ఆలోచించవలసిన తరుణం ఆసన్నమయ్యింది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

'కోరేగాం' నిజానిజాలు

రెండు

వందల ఏళ్ల క్రితం (1818) పూణేకి సమీపంలో భీమా నదీ తీరాన కోరేగాం గ్రామం వద్ద చివరి ఆంగ్లో–మరాఠా యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో సాధించిన విజయంతో భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్య పునాదులు సుదృఢమయ్యాయి. పోరాడుతూ మరణించిన సైనికులకు నివాళిగా బ్రిటిష్ వారు కోరేగాంలో ఒక స్మృతి చిహ్నాన్ని నిర్మించారు.ఆ స్మారక కట్టడంపై లిఖించిన 49 పేర్లలో 22 పేర్లు ('నాక్' అనే ప్రత్యయాన్ని బట్టి) మహర్లవిగా గుర్తించారు. ఆ సమర విజయం మహర్ సైనికుల శౌర్యసాహసాలకు నిదర్శనంగా ప్రసిద్ధి చెందింది. అయితే, 1857లో 'సిపాయిల తిరుగుబాటు' ఫలితంగా 1893లో మహర్లను బ్రిటిష్ సైన్యంలోకి చేర్చుకోవడాన్ని నిలిపివేశారు. ఇది సమంజసం కాదని, మహర్లను చేర్చుకోవడాన్ని పునరుద్ధరించాలని తొలితరం మహర్ నాయకులు గోపాల్ బాబా వాలన్గేకర్, శివరామ్ జాంబ కాంబ్లే, రామ్‌జీ అంబేడ్కర్ (బాబాసాహెబ్ అంబేడ్కర్ తండ్రి) బ్రిటిష్ పాలకులను అభ్యర్థించినప్పుడు తమ విజ్ఞప్తికి మద్దతుగా కోరేగాం యుద్ధంలో మహర్ల వీరోచిత పోరాటాన్ని ఉపయోగించుకున్నారు.

పీష్వాల పాలనలో కులపరమైన అణచివేతకు వ్యతిరేకంగా మహర్ సైనికులు చేసిన పోరాటమే భీమా కోరేగాం సమరం అని అభివర్ణించడం ద్వారా డాక్టర్ అంబేడ్కర్ ఆ యుద్ధాన్ని గురించి ఒక పూర్తి కల్పిత కథను సృష్టించారు. ఉద్యమాలను నిర్మించడానికి కల్పిత గాథలు అవసరం గనుక కోరేగాం విషయంలో అటువంటి కథనం అవసరమని బాబాసాహెబ్ భావించివుంటారు. ఇది 1927 నాటి విషయం. తొమ్మిది దశాబ్దాల అనంతరం ఆ కల్పిత కథ దాదాపు చరిత్రగా నిలిచి పోయింది. నేటి దళితులు ఆ యుద్ధాన్ని పీష్వాల కులతత్వ పాలనపై మహర్ సైనికుల పోరాటమేనని విశ్వసిస్తున్నారు. ఈ కారణంగానే, హిందూత్వ శక్తుల బ్రాహ్మణిక్ పాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు భీమా కోరేగాం యుద్ధాన్ని దళితులు స్ఫూర్తిగా తీసుకొంటున్నారు. ఇటీవల పలు దళిత సంఘాలు ఒక సంయుక్త ఫ్రంట్ నేర్పాటుచేసుకొని కోరేగాం యుద్ధ 200 వార్షికోత్సవాన్ని జరిపారు. హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలన్న సంకల్పం ప్రశంసనీయమే అయినా ఆ లక్ష్యానికి ఉపయోగించుకొంటున్న కల్పిత కథ వల్ల ప్రతికూల ఫలితాలు మాత్రమే సిద్ధించవచ్చు. చరిత్రను పరిశీలిస్తే, భారత్‌లోని వివిధ రాజ్యాలను కబళించేందుకు ఈస్టిండియా కంపెనీ పూనుకున్నప్పుడు తన సైన్యంలోకి దళితులను పెద్ద ఎత్తున చేర్చుకున్నదని అర్థమవుతుంది. విధేయులుగా ఉంటారనీ, తక్కువ జీత భత్యాలకు అందుబాటులో ఉండడం వల్ల కూడా దళితులను కంపెనీ సైన్యంలో చేర్చుకున్నది. తత్ఫలితంగానే బెంగాల్‌లో నామశూద్రులు, మద్రాసులో పరయాలు, మహారాష్ట్రలో మహర్‌లు కంపెనీ సర్కారు సైన్యంలో అత్యధికంగా ఉండడం జరిగింది. భారతదేశంలో బ్రిటిష్ రాజ్ స్థాపనలో తమ తోడ్పాటు చాలా ప్రముఖమైనదని దళితులు వాదిస్తే అది అసత్యమేమీకాదు. అయితే వారి సైనికవృత్తికి ప్రేరణ లక్ష్యం కులపరమైన అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడమే అని ఎవరైనా అంటే అది సత్యదూరమూ, అచారిత్రకమూ అవుతుంది.

ఈస్టిండియా కంపెనీ 1757లో ప్లాసీ యుద్ధం, 1818లో కోరేగాం యుద్ధం మధ్య ఇంకా అనేక యుద్ధాలు చేసింది. అవన్నీ పీష్వాలకు వ్యతిరేకంగా చేసినవి కావు. వాటిలో అధిక భాగం హిందువులకు వ్యతిరేకంగా చేసినవి కూడా కాదు. రెండు పాలక శక్తుల మధ్య జరిగిన యుద్ధాలవి. ఆ యుద్ధాలలో పాల్గొనడం ద్వారా వారి వారి సైనికులు తమ విధిని నిర్వర్తించారు. అయితే ఆ యుద్ధాలను కుల అణచివేత, మతాధిపత్యానికి వ్యతిరేకంగా చేసినవని ఎవరైనా అంటే కచ్చితంగా అది వాస్తవ విరుద్ధమే అవుతుంది. అంతేకాదు కులవ్యవస్థ చారిత్రక పాత్రను తప్పుగా అర్థం చేసుకోవడమే. 19 వ శతాబ్ది వరకు ప్రజలకు కులమే– వృత్తులు, ఆచారాలు, కట్టుబాట్లు – సర్వ ప్రపంచం. కులాన్ని ఒక జీవధర్మంగా, సహజ వ్యవస్థగా భావించేవారు. అణగారిన జాతులవారు అది తాము అనుభవించక తప్పని 'కర్మ' అని అనుకునేవారు. ఈ దృష్ట్యా, అణచివేస్తున్న వారిపై యుద్ధానికి దిగడం కాదు కదా, కులవ్యవస్థను ప్రతిఘటించడమనే ప్రశ్నేలేదు. అణచివేత, ఆధిపత్య ధోరణులపై దళితులు హింసాత్మకంగా ప్రతిఘటించారనేందుకు నిదర్శనాలే లేవు.

భీమా కోరేగాం సమరాన్ని పీష్వాల కుల అణచివేతకు వ్యతిరేకంగా మహర్ సైనికులు చేసిన పోరాటంగా అభివర్ణించడం ద్వారా డాక్టర్ అంబేడ్కర్ ఒక కల్పిత కథను సృష్టించారు. కోరేగాం యుద్ధంలో పీష్వాల తరఫున పోరాడి అధికసంఖ్యలో మరణించిన అరబ్బులు, బ్రిటిష్ సైన్యంలోని దళిత సైనికులు తమ సైనిక ధర్మాన్ని మాత్రమే పాటించారు. పీష్వాలపై మహర్‌లు ప్రతీకారం తీర్చుకున్నారనడం సరైన వాదన కాదు.



సరే, పరస్పరం తలపడిన సైన్యాలేవీ పూర్తిగా మత ప్రాతిపదికన ఏర్పడినవి కావు. బ్రిటిష్ సైన్యంలో దళితులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ ముస్లిం లేదా మరాఠా సైన్యాలలో వారు అసలే లేరని చెప్పడానికి వీలులేదు. కోరేగాం యుద్ధంలో పాల్గొన్న పీష్వా సైన్యంలోని పదాతిదళం మూడు విభాగాలలో ఒకటి అరబ్‌లది. ఆ అరబ్‌లు వీరోచితంగా పోరాడారు. పీష్వా సైన్యంలో మరణించిన వారిలో అరబ్ సైనికులే అత్యధికం. మరి వారు పీష్వాల పాలన సుస్థిరంగా ఉండాలని కోరుకున్నారా? ఆ అరబ్‌లు తమ సైనిక ధర్మాన్ని పాటించారంతే. అలాగే బ్రిటిష్ సైన్యంలోని దళిత సైనికులు కూడా తమ సైనిక ధర్మాన్ని పాటించారంతే. పీష్వా అరబ్ సైనికులకు గానీ, కంపెనీ దళిత సైనికులకు గానీ ఏవో ఉత్కృష్ట లక్ష్యాలున్నాయనుకోవడం పూర్తి తప్పు.

కోరేగాం యుద్ధానికి పూర్వం జరిగిన మొదటి రెండు ఆంగ్లో–మరాఠా యుద్ధాల వల్ల పీష్వాలు బాగా బలహీనపడ్డారు. పీష్వా రెండో బాజీరావు అయితే పూణే నుంచి పరారయ్యాడు. పీష్వా సైన్యంలో 20 వేల మందితో అశ్విక దళం, ఎనిమిదివేల మందితో పదాతిదళం ఉన్నది. ఈ దళాలనుంచి 2000 మందితో మూడు పదాతిదళాల నేర్పాటు చేశారు. ప్రతి దళంలోను అరబ్‌లే అత్యధికం. ఇక కంపెనీ సర్కార్ సైన్యంలో, మహర్‌లు అత్యధికంగా ఉన్న బాంబే నేటివ్ ఇన్‌ఫ్యాంట్రీ మొదటి రెజిమెంట్‌లోని చెందిన రెండవ బెటాలియన్‌కు చెందిన 500 మంది సైనికులతోసహా 834 మంది సైనికులు ఉన్నారు. కోరేగాం యుద్ధంలో కంపెనీ సర్కార్ తరఫున ఎంతమంది పాల్గొన్నారో ఖచ్చితమైన లెక్కలు లేవు గానీ అందరూ మహర్‌లు కారనేది స్పష్టం. మరణించిన వారి సంఖ్యను బట్టి చూసినా అత్యధికులు మహర్‌లు కానివారే (మరణించిన 49మందిలో 27మంది మహర్‌లు కారు) జనరల్ జోసెఫ్ స్మిత్ నేతృత్వంలో మరింత పెద్ద బ్రిటిష్ సైన్యం రానున్నదనే భయంతో పీష్వా సైన్యం త్వరితగతిన ఉపసంహరించుకొంది. ఈ వాస్తవాల దృష్ట్యా కోరేగాం యుద్ధంలో పీష్వాల పాలనపై మహర్‌లు ప్రతీకారం తీర్చుకున్నారనడం తప్పు దోవ పట్టించడమే అవుతుంది.

కోరేగాం విజయమనంతరం బ్రిటిష్‌వారు మహర్ సైనికుల పట్ల కృతజ్ఞతా భావం చూపలేదు పైగా వారిని సైన్యంలో చేర్చుకోవడాన్ని నిలిపివేశారు. మహర్ నాయకుల అభ్యర్థనలను మొదటి ప్రపంచ యుద్ధం వరకు పెడచెవిన పెడుతూ వచ్చారు. ఆ మహా యుద్ధంలో సైనికులు పెద్ద సంఖ్య లో అవసరం కావడంతోనే ఎట్టకేలకు అంగీకరించారు. బ్రిటిష్ వలసపాలన దళితులకు అనేక ప్రయోజనాలు సమకూర్చిందనడంలో సందేహం గానీ, వివాదంగానీ లేదు. అదే సమయంలో ఆ వలసపాలనతో దళితులకు సమకూరిన లబ్ధి అనుద్దేశపూర్వకమైనదని, ప్రాథమికంగా వలసపాలనా తర్కం నిర్దేశించిన విధంగానే ఆ మేలు జరిగిందనే విషయాన్ని అర్థం చేసుకొని తీరాలి. ఈ వాస్తవాన్ని దళితులు కళ్ళకు కట్టుకున్న అస్తిత్వ గంతల మూలంగా చూడలేకపోవడం దురదృష్టకరం. హిందూత్వ శక్తులు పునఃసృష్టించిన కొత్త పీష్వా పాలనకు వ్యతిరేకంగా దళితులు పోరాడవలసిన అవసరం ఉన్నది. అందుకు, కాల్పనిక గతంలోకి ఉష్ట్ర పక్షిలా చూస్తూ గొప్పదనాన్ని ఊహించుకోవడం గాకుండా కళ్ళు తెరిచి చారిత్రక ఘటనలను వాస్తవిక దృష్టితో చూడాలి.

■ ఆనంద్ తెల్తుంబ్డే
సీనియర్ ప్రొఫెసర్, గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్
(ద వైర్)



లక్ష్యం కోసం త్యాగం తప్పదు

- కరణం మల్లేశ్వరి
- వైభవంగా ముగిసిన విజ్ఞాన్ మహోత్సవ్

గుంటూరు(విద్య), జనవరి 6 : యువత ఒక స్పష్టమైన లక్ష్యంతో కృషిచేస్తే దాన్ని సాధించడం ఏమంత కష్టమైన విషయం కాదని ఒలింపిక్ పతక విజేత, ప్రముఖ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న విజ్ఞాన్ మహోత్సవాలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లేశ్వరి మాట్లాడుతూ లక్ష్యాన్ని చేరుకునే సమయంలో ఎన్నోత్యాగాలు చేయాల్సి వస్తుందని చెప్పారు. 'నా జీవితంలో ఇంతవరకు థియేటర్‌కు వెళ్లి ఒక్క సినిమా చూడలేదు.. సరదాగా కూడా రెస్టారెంట్‌కు వెళ్లలేదు..నా లక్ష్యం కోసం ఇటువంటివి ఎన్నోత్యాగాలు చేయాల్సి వచ్చింది' అన్నారు.

వ్యవసాయ శాస్త్రాన్నే తప్పుపడతారా?



- పాలేకర్ చౌకబారు విమర్శలు మానుకోవాలి
- వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకుల సంఘం ఖండన
- వ్యవసాయ అభివృద్ధి కనిపించడం లేదా?: వర్సిటీ శాస్త్రవేత్తల ఆగ్రహం
- ఆ వ్యాఖ్యలు సరికావు: స్పీకర్



విలేకరులతో మాట్లాడుతున్న లాం వర్సిటీ శాస్త్రవేత్తలు

అమరావతి, గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, వ్యవసాయ పరిశోధనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యేటా లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. వాటి వల్ల రైతులకు నయా పైసా ప్రయోజనం ఉండటం లేదు. ఎందుకూ ఉపయోగంలేని వ్యవసాయ వర్సిటీలను, కళాశాలను మూసివేస్తే, ప్రభుత్వాలకు లక్షల కోట్లు మిగులుతుంది.' అంటూ ప్రకృతి సేద్యం సృష్టికర్త.. పెట్టుబడి లేని సేద్యం పితామహుడు సుభాష్ పాలేకర్ చేసిన వ్యాఖ్యలు ప్రకంపనలు రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలపై లాం వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకుల సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వ్యవసాయ శాస్త్రాన్ని, శాస్త్రవేత్తలను, విశ్వవిద్యాలయాలను, ప్రభుత్వాన్ని విమర్శిస్తే, తన పరిజ్ఞానం రైతుల్లో ప్రాచుర్యం పొందుతుందని ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదు' అని హెచ్చరించారు. పాలేకర్ వ్యాఖ్యల నేపథ్యంలో సంఘం సభ్యులు లాం ఫాంలో శనివారం సమావేశమై నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది శాస్త్రవేత్తలు పాలేకర్ వ్యాఖ్యలను స్పీకర్ కోడెల శివప్రసాదరావు దృష్టికి తీసుకువచ్చారు. మరోవైపు ఈ వివాదంపై ముఖ్యమంత్రి కార్యాలయం కూడా స్పందించింది. సీఎంవో అదనపు కార్యదర్శి రాజమౌళి అటు పాలేకర్‌తోను, ఇటు వర్సిటీ వీసీతోను మాట్లాడారు. సంయమనంతో ఉండాలని సూచించారు. కాగా, పాలేకర్ వ్యాఖ్యలపై లాం వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తల అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ప్రకృతి సేద్యం పేరుతో సుభాష్ పాలేకర్ చేస్తున్న కృషి అభినందనీయమే. దానిని రైతుల్లోకి తీసుకెళ్లడం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయాలను, శాస్త్రవేత్తలను నిందించడం సమంజసం కాదు' అని పేర్కొన్నారు. కాగా, పాలేకర్ వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ టీ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ జీ రామచంద్రరావు, ఇతర సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఆయన ప్రకటనపై వ్యవసాయ శాస్త్రవేత్తలు తీవ్ర దిగ్భ్రాంతి, అసహనానికి గురవుతున్నారన్నారని చెప్పారు. రైతులకు మార్గదర్శకంగా ఉన్న వ్యవసాయశాస్త్రాన్నే తప్పుపట్టడం సమంజసం కాదని అన్నారు. వ్యవసాయ ఆధారిత భారత్‌లో 70శాతం ప్రజలు వ్యవసాయ అనుబంధ రంగాలపై జీవిస్తూ, ఒడుదుగుకులు ఎదుర్కొని పంటలు సాగు చేస్తుంటే, ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల ముంగిటకు తీసుకువెళ్లి, లాభసాటి వ్యవసాయానికి కృషి చేస్తుంటే వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనలు అవసరం లేదన్నట్లు మాట్లాడడం సరి కాదన్నారు. గత 50ఏళ్లలో అనేక పరిశోధనలు చేసి, కొత్త వంగడాలు తయారుచేసి, వాటి ఫలితంగా ఆహార ఉత్పత్తి పెరిగిన విషయాన్ని మరిచి పరిశోధనలు, విశ్వవిద్యాలయం అవసరం లేదనే ఆయన వైఖరి తగదని అన్నారు. 1940-50 దశకంలో తిండి గింజలను దిగుమతి చేసుకున్న ఈ దేశం స్వయం సమృద్ధి సాధించి, ఎగుమతి చేసే స్థాయికి వచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ వివాదంపై స్పీకర్ గుంటూరులో మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయాలను మూసేయాలని పాలేకర్ వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. ప్రపంచం మొత్తం పాటిస్తున్న సేంద్రియ వ్యవసాయ విధానంపై వ్యతిరేక ప్రచారం చేయడం తగదన్నారు. 'ప్రకృతి వ్యవసాయం రైతాంగానికి ఉపయోగకరమే. దీని కోసం గోవులు పెద్ద సంఖ్యలో అవసరం. కొన్ని గ్రామాల్లో గోసంతతి అసలు లేదు. ఈ పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయ విధానం వైపు అందరూ మొగ్గు చూపలేరు. పాలేకర్ ప్రకృతి వ్యవసాయం గురించి ఎంతైనా ప్రచారం చేసుకోవచ్చు. అయితే విమర్శలు తగవు. దీనివల్ల వైరుధ్యాలు, ఘర్షణలు వచ్చే అవకాశం ఉంది.' అని స్పీకర్ అన్నారు.

పరస్పరం విమర్శలు వద్దు: సీఎం

ఈ విషయమై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. 'చేసేది మంచి పనే, అలా అని మిగతావన్నీ పనికిరానివని అంటే ఎలా?' అని అభిప్రాయపడినట్లు సమాచారం. ప్రకృతి సేద్యానికి శాస్త్రీయత లేదని వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ అనడం తప్పన్నారు. రైతాంగం కోసం, సమాజ అభివృద్ధి కోసం ఎవరి మార్గాల్లో వారు పనిచేస్తున్నారని, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం అర్థరహితమని వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

వరిలో ఎకరాకు 120 క్వింటాళ్లు : పాలేకర్

గుంటూరు (ఆంధ్రజ్యోతి), జనవరి 6: భూమిలో సేంద్రీయ కర్బన్ 2.5 శాతం ఉంటే వరిలో ఎకరానికి 120 క్వింటాళ్లు, బత్తాయి 40 మెట్రిక్ టన్నులు, చెరుకు 240 మెట్రిక్ టన్నులను పండించవచ్చని ప్రకృతిసేద్యం, పెట్టుబడిలేని వ్యవసాయం సృష్టికర్త సుభాష్ పాలేకర్ అన్నారు. ప్రస్తుతం మన భూముల్లో సేంద్రీయ కర్బన్ శాతం 0.2 శాతం ఉందన్నారు. గుంటూరులో శనివారం ఏడో రోజు శిక్షణ తరగతుల్లో మాట్లాడుతూ.. నేలలో సేంద్రీయ కర్బన్ 2.5 శాతం, కర్బన్ పది శాతం, నత్రజని ఒక శాతం ఉండాలని చెప్పారు.

సగం సంక్షేమానికే

- నెలాఖరుకు ముసాయిదా బడ్జెట్
- మార్చిలో బడ్జెట్ సమావేశాలు
- ఇవ్వని హామీలూ అమలు చేస్తున్నాం
- విపక్షాలది పసలేని వాదన: యనమల

మచిలీపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరుకు ముసాయిదా బడ్జెట్ తయారవుతుందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. 2018-19 బడ్జెట్‌లో 50 శాతం కేటాయింపులు సంక్షేమ రంగానికేనని తేల్చిచెప్పారు. 'యువ కెరటాలు' ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు శనివారం మచిలీపట్నం వచ్చిన యనమల విలేకరులతో మాట్లాడారు. 2017-18 బడ్జెట్ రూ.1.56 లక్షల కోట్లు కాగా.. ఇందులో 40శాతం నిధులు సంక్షేమానికి కేటాయించామన్నారు. ఈసారి 50 శాతానికి పెంచనున్నట్లు తెలిపారు. కేంద్రం తరహాలో రాష్ట్ర బడ్జెట్‌నూ ముందస్తుగానే ప్రవేశపెట్టదలిచామని, మార్చి మొదటివారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. సంక్షేమం తర్వాత ప్రజాసమస్యలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. పేదరికం, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, దానికి దోహదపడే విధంగా ఈసారి బడ్జెట్ ఉంటుందని తెలిపారు. 'ప్రజల్లో సంతోషాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా ముందుకెళ్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఎన్నికల హామీలతో పాటు మేనిఫెస్టోలో లేని హామీలను సైతం అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉంది. ప్రతిపక్షాలు పసలేని వాదన చేస్తున్నాయి. లోటు బడ్జెట్‌లో సైతం రాష్ట్రంలో ఏ తరహా అభివృద్ధి జరుగుతోందో ప్రజలు గుర్తిస్తున్నారు. వైసీపీ, కాంగ్రెస్‌లకు మాత్రం అది బోధపడడం లేదు' అని ఎద్దేవాచేశారు.

నాన్న స్పీడు అందుకోలేకపోతున్నా

- మంత్రి నారా లోకేష్

కాకినాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు గారికి అరవై ఏడేళ్లు...నాకు 34 ఏళ్లే. అయినా ఆయన స్పీడును నేను అందుకోలేకపోతున్నా. నిరంతరం రాష్ట్రం కోసం కష్టపడుతున్న నాయకుడు చంద్రబాబు. మన కోసం కష్టపడుతున్న ఆయనకు 2019లో మళ్లీ ఓట్లేసి గెలిపించి సీఎంని చేద్దాం' అని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడులో శనివారం జరిగిన 'జన్మభూమి-మా ఊరు' గ్రామసభలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలకు త్వరలో స్టార్ రేటింగ్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు.



ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పుదుచ్చేరి సీఎం, మల్లాడి కృష్ణారావు

యానాం.. త్రిభాషా సమ్మేళనం

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్

యానాం, జనవరి 6: "తూర్పుగోదావరి జిల్లాలో అంతఃభూభాగంగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం యానాం. ఇది త్రిభాషా (తెలుగు, తమిళం, ఫ్రెంచ్) సమ్మేళనం. అలాగే, మూడు దేశాల (బ్రిటిష్, ఫ్రాన్స్, భారత్) పరిపాలనా సామ్రాజ్యం. ఇటువంటి ప్రత్యేకత కలిగి ఉన్న ప్రాంతం ఇప్పుడు సాహితీ సంబరాలు, ఉత్సవాలకు నిలయమయింది. అలాంటి వేదికపై సన్మానం అందుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్ అన్నారు. యానాంలో శనివారం జరిగిన 16వ వార్షిక ప్రజా ఉత్సవాల్లో భాగంగా ఆయనను పుదుచ్చేరి ముఖ్యమంత్రి వీ నారాయణ స్వామి ఘనంగా సత్కరించారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మేజర్ లక్ష్మీవీరనరేశ్, ఐఆర్ఎస్ అధికారి శ్రీరామవినయ్, నున్న రామకృష్ణ, పెసల గంగయ్య తదితరులను కూడా ఈ వేదికపై సన్మానించారు. స్థానిక ప్రజలు తమ ఉనికిని కాపాడుకునేందుకు చేసే ప్రయత్నాలు సఫలీకృతం కావాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఐదు వేల ఏళ్ల చరిత్ర పుటల్లో నిలిచిన యానాం నిర్మాతలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు.

గొట్టిపాడులో శాంతి మంత్రం

- రెండు వర్గాల మధ్య కుదిరిన రాజీ

ప్రత్తిపాడు, జనవరి 6: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామంలో భగ్గుమన్న కక్షలకు తెరపడింది. ఆరు రోజులుగా ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళనతో ఉన్న గ్రామం ఇప్పుడు తేలికపడింది. పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చొరవతో, జిల్లా ఎస్పీ విజయారావు గొట్టిపాడు వివాదంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో గ్రామానికి చెందిన నాగార్జునసాగర్ కుడి కాల్వ కమిటీ చైర్మన్ గుంటుపల్లి వీరభుజంగ రాయల్ పాత్ర కీలకమైనది. గత మూడు రోజులుగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు ఇరువర్గాలతో విడతల వారీగా చర్చలు జరిపారు. శనివారం ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ విజయారావు, ఎమ్మెల్యే కిషోర్‌బాబు సమావేశమై ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి ఇరు వర్గాలకు చెందిన వారితో శాంతి కమిటీని ఏర్పాటుచేశారు.

రేపటి నుంచి సీపీఐ జాతీయ సమావేశాలు

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సమావేశాలు ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. శనివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశాలకు సీపీఐ అగ్రనేతలు సురవరం సుధాకరెడ్డి, డి.రాజా, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులతో పాటు 29 రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర పార్టీ కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. చివరి రోజు గాంధీనగర్ జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగ సభను నిర్వహిస్తామని రామకృష్ణ వెల్లడించారు.

గుప్త నిధులకోసం తవ్వకాలు.. 8 మంది అరెస్టు

మాచవరం, జనవరి 6: గుప్త నిధుల అన్వేషణ కోసం కోటలో తవ్వకాలు జరుపుతున్న ఎనిమిది మందిని గుంటూరు జిల్లా మాచవరం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ కాలేషావలి కథనం ప్రకారం.. కర్నూలుకు చెందిన సిద్ధాంతికి బెంగళూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సంజీవరెడ్డి మారుతి, కారంపూడికి చెందిన బత్తాకాయల వ్యాపారి సత్యనారాయణలతో పరిచయం ఉంది. అదే విధంగా కర్నూలుకు చెందిన సోమశేఖర్... సంజీవరెడ్డి మారుతికి స్నేహితుడు. రాజుపాలెం మండలం కొండమోడుకు చెందిన మల్లెల ఏసోబు, బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన బండారు వీరబ్రహ్మయ్య, కందూరి శ్రీనివాసరెడ్డి, పిడుగురాళ్ల పట్టణంలోని రద్దుల్‌పేటకు చెందిన బాలమూరి కిషోర్, రెంటాల లక్ష్మయ్య అనే ఐదుగురు సత్యనారాయణ, సోమశేఖర్‌లకు స్నేహితులు. వీరందరూ సంజీవరెడ్డి మారుతి ఆధ్వర్యంలో సుమారు 15 అడుగుల సొరంగం మార్గం తవ్వారు. కోటలోని అమ్మవారి విగ్రహం వద్దకు సొరంగం తవ్వుకుంటూ వచ్చిన తరువాత తనకు కబురు చేయాలని సిద్ధాంతి వారితో చెప్పి తవ్వకాలకు పురమాయించాడు. సమాచారం తెలుసుకున్న పిడుగురాళ్ల రూరల్ సీఐ సుబ్బారావు, మాచవరం ఎస్ఐ జగదీష్ తమ సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి చేరుకుని 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన నారాయణ పారిపోయాడని డీఎస్పీ తెలిపారు.



నృసింహావతారం



దశావతారాలలో అత్యంత మధురమైన ప్రాధాన్యం పొందింది నృసింహావతారం. యజ్ఞ వరాహావతారం హిరణ్యాక్షుడిని సంహరించింది. హిరణ్యాక్షుడు మరణించాడని తెలుసుకున్నాడు హిరణ్య కశిపుడు. సంహరించిన విష్ణుభగవానుని మీద 'చంపాడు' అని కోపం పెట్టుకుంటాడు తప్ప చంపడానికి కారణమేమిటో తెలుసుకోకపోవడమే రాక్షసత్వం. హిరణ్యకశిపుని వృత్తాంతంలో అదే పెద్ద సమస్య అయింది. ఆయన మంత్రులను, పరివారాన్ని పిలిచి.. విష్ణువు నా సోదరుణ్ని నిర్జించాడు. నాకు విష్ణువును నిర్జించాలని కోరిక అన్నాడు. విష్ణువును నిర్జించడం సాధ్యం కాదు. ఆయనకు అచ్యుతుడు అని పేరు. చ్యుత్ అంటే తీసివేయడం. అచ్యుత్ అంటే తీసివేయడానికి వీలు లేదు. ఆయనను తీసేయడం ఎవరికీ సాధ్యం కాదు. భాగవతంలో ఒక మాట ఉన్నది. హిరణ్యకశిపుడు అన్ని లోకాలలోనూ విష్ణువు కోసం వెతికాడు. ఆయన 'వాడు నా కోసం వెతికాడు. నేను వాడి గుండెలలోనే ఉన్నాన'ని చెప్పాడు. ఇక హిరణ్యకశిపుడికి బ్రహ్మదేవుడి వరం ఉంది. అదేంటంటే.. పంచభూతాలలో గాలిలో, భూమి మీద, అగ్నిలో, నీటిలో చచ్చిపోడు. వాయువు వలన చనిపోడు. జంతువుల వలన, పాముల వలన, నరుల వలన, మృగాల వలన చనిపోడు. ఇంట్లో, బయట, పగలు, రాత్రి, ఏ దిక్కుల యందూ చనిపోడు. ఇంక చచ్చిపోవడానికి ఏముంటుంది? కానీ, సర్వజ్ఞుడైన పరమేశ్వరుడికి వీటికి మినహాంపు తీసుకుని రావడం తెలుసు. అందుకే తన భక్తుడైన ప్రహ్లాదుని మాట వమ్ము చేయకుండా వచ్చాడు. అలాగని.. శంఖ, చక్ర, గదాపద్మాలు పట్టుకున్న ఎమన్నారాయణుడుగా వచ్చి హిరణ్యకశిపుని సంహారం చేయడానికి బ్రహ్మగారు ఇచ్చిన వరం ప్రతిబంధకం. ఆయన ఎన్నివరాలిచ్చాడో అన్ని వరాలకు మినహాయింపుగా రావాలి. అలాగే వచ్చాడు. ఒక స్తంభం లోంచి. పెళపెళా శబ్దాలు చేస్తూ ఆ స్తంభం బద్దలై, అందులో నుంచి విస్ఫులింగాలు పైకి వచ్చి పెద్ద కాంతిమండలం కనపడి కన్నులతో చూడలేనంత భయంకరమైన తేజస్సు ఒకటి బయటకు వచ్చింది. అందులోనుంచి పట్టుపుట్టం కట్టుకుని నృసింహావతారంలో స్వామి నిలబడ్డారు. అడుగు తీసి అడుగు వేస్తూ పెద్ద గర్జన చేస్తూ అపారమైన కోపంతో.. తన పరమ భక్తుడైన ప్రహ్లాదుని హిరణ్యకశిపుడు నిగ్రహించడాన్న కోపాన్ని ఆపుకోలేక పెద్ద గర్జన చేస్తూ వెళ్లి హిరణ్యకశిపుని డొక్కల దగ్గర పట్టుకుని పైకి ఎత్తి గడప దగ్గరకు తీసుకుని వచ్చి ప్రదోష వేళ, గడప మీద తన తొడలపైన పెట్టుకుని.. గోళ్లను అతడి కడుపులోకి దింపి చీల్చి నిర్జించాడు.

అహో వీర్యం అహో శౌర్యమ్ అహో బాహుబలం బలమ్
నారాయణ పరం తేజమ్ అహోబలం అహోబలం

- చాగంటి కోటేశ్వరరావు శర్మ

Paramjyothi
పరంజ్యోతి

ఇల్లే మధుశాల!

మందుకొట్టు.. గుర్రు పెట్టు.. రోడ్డున పడేకంటే ఇదే నయం

రాజ్ రెండేళ్ల క్రితం 'మందు పార్టీ'కి వెళ్లి వస్తుండగా.. ప్రమాదం జరిగింది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పటి నుంచి.. 'బయటికి వెళ్లొద్దు. అదేదో ఇంట్లోనే తాగు' అని వాళ్లావిడ తేల్చి చెప్పింది. అయినా.. అప్పుడప్పుడు బార్‌కు వెళ్తుంటాడు. ఆ రోజు.. ఇంట్లో యుద్ధమే!

రామ్ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. తన కంపెనీలోనే పనిచేసే యువతిని పెళ్లి చేసుకున్నాడు. అప్పుడప్పుడు మద్యం తాగినా తప్పులేదని ఆమె భావిస్తుంది. కానీ.. అది కూడా ఇంట్లోనే అని తేల్చి చెబుతుంది.

'కళ్ల ముందే తాగుతాడు. కళ్లముందే తింటాడు. చప్పుడు చేయకుండా పడుకుంటాడు. బారుకంటే ఇల్లే పదిలం!'... ఇది ఈతరం ఇల్లాలి మాట! 'తాగొద్దు మొగుడా' అంటే ఎలాగూ వినడు! 'అదేదో ఇంట్లోనే తాగు' అని పర్మిషన్ ఇచ్చేస్తే.. కాసింతైనా కంట్రోల్‌లో ఉంటాడు! 'లిమిట్' దాటడు. మంచింగూ, క్రంచింగూ పేరిట నానా గడ్డి తినకుండా... ఇంట్లో చేసిన పదార్థాలే నమిలేస్తాడు. ఖర్చులూ కలిసొస్తాయి. ఆరోగ్యానికి ఆరోగ్యం! ఇదో లాజిక్!

ఇలా ఆఫీసు నుంచి వచ్చి, ఓ గంట ఇంట్లో ఉండి... ఫ్రెండు పిలుస్తున్నాడనో, మరేదైనా పని ఉందనో బయటికి వెళ్లి బార్‌లో మందు కొట్టే మగాళ్లు ఎందరో! దీనివల్ల ఆరోగ్యం చెడుతుంది. జేబు ఖాళీ అవుతుంది. తాగి నడుపుతూ ప్రమాదానికి గురికావడం మరో 'ప్రమాదం'! ఇక... దొంగచాటుగా వెళ్లి, దొంగచాటుగా వచ్చి, పడగ్గదిలో ఓ మూలకు మూడంకెవేసి పడుకోవాల్సిన దుస్థితి! పైగా, ఆయన బయటికి వెళ్లినప్పటి నుంచి తిరిగి వచ్చేదాకా ఆవిడకు టెన్షన్. ఇన్ని తిప్పలు ఎందుకు చెప్పండి! అదేదో ఇంట్లోని తాగి 'ఏడవండి' అని మహిళామణులు అయిష్టంగానే అనుమతి ఇస్తున్నారు. "వ్యసనపరుల్ని మార్చడం చాలా కష్టం. వారి దారిలోనే వెళితే కాస్తయినా నియంత్రణలో ఉంటారని ఇష్టం లేకపోయినా ఇంటిలో మద్యం సేవించడానికి అనుమతిస్తున్నాం" అని చెబుతున్నారు. అన్ని పట్టణాల్లో ఈ ధోరణి కనిపిస్తోందనుకుంటే పొరపాటు. కాస్మోపాలిటన్ కల్చర్ వచ్చేసిన హైదరాబాద్‌లో మాత్రం బాగా ఉంది. నవ్యాంధ్రలో ఇలాంటి హంగులున్న విశాఖకూ ఇది విస్తరిస్తోంది. విజయవాడలో ప్రత్యేక సందర్భాల్లో విందూ వినోదాలకు వెళ్లినప్పుడు మాత్రమే ఫ్యామిలీ ముందు 'డ్రింక్స్'కు ఓకే అంటున్నారు. సీసాలను ఇంటికి తీసుకొస్తే మాత్రం కుదరదని మహిళలు చెబుతున్నారు.



జుజుజుజుజుజు

విస్తరిస్తున్న ధోరణి

'మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం' అని చిన్నగా కనిపించీ కనిపించని అక్షరాలు ఎవ్వరికీ పట్టడం లేదు. టీవీలు, సినిమాల ప్రభావం నేపథ్యంలో... 'మందు తాగడం తప్పేమీ కాదు' అనే భావన పెరిగిపోయిందని నిపుణులు చెబుతున్నారు. విదేశాల్లో చదువులు, ఉద్యోగాలు చేయడం, వారి కోసం తల్లిదండ్రులు కూడా పాశ్చాత్య సంస్కృతిని దగ్గరగా గమనించడం తదితర కారణాల వల్ల మందు పార్టీలకు ఆమోదం లభిస్తోంది. గతంలో సంపన్న వర్గాలకే పరిమితమైన ఈ ధోరణి ఇటీవల ఎగువ, మధ్యతరగతి వర్గాలకు కూడా విస్తరిస్తోంది.

మారుతున్న వైఖరి...

మన దేశంలో 15-29 ఏళ్ల వయస్కుల్లో 3 లక్షల మంది మద్యం వల్ల జరిగే ప్రమాదాల్లో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. అకాల మరణాల సంఖ్య పెరగడానికి మద్యం సేవించడం మూడో అతి పెద్ద కారణమని ఆ నివేదిక తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 30 శాతం భారతీయులు రెగ్యులర్‌గా ఆల్కహాల్ తీసుకుంటున్నారు. లిక్కర్ ఎక్కడ పడితే అక్కడ లభిస్తుండటం, సహచరుల ఒత్తిడి (పీర్ ప్రెజర్), ఆసక్తి (క్యూరియాసిటీ)... వంటి కారణాలతో మందువైపు అడుగులేస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. 'ఒంటరి కుటుంబాలు' ఎక్కువ కావడంతో... 'ఇంట్లో ఏమిటిరా ఈ పాడు పనులు' అని మందలించే పెద్దలు ఉండటంలేదు. పిల్లలు చదువుల కోసం దూరప్రాంతాలు, విదేశాలకు వెళ్లడంతో భార్యాభర్తలు మాత్రమే ఇంట్లో ఉండటంతో తరచూ ఇంట్లో పార్టీల సంస్కృతి పెరుగుతోందని సామాజిక నిపుణులు పేర్కొంటున్నారు.

- హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, స్పెషల్ డెస్క్; ఆంధ్రజ్యోతి

పిల్లలు చెడిపోయే ప్రమాదం!

మద్యం ఎక్కడ తీసుకున్నా తప్పే! ఇక ఇంట్లోనే సిట్టింగ్ పెడితే పిల్లలను చేతులారా చెడగొట్టినట్లేనని సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారు.

మానేసే అవకాశం...

సోషల్ డ్రింకర్స్‌ను ఇంటిలో ఉంచి మద్యం తీసుకోమనడం వల్ల వారు మొత్తానికి మద్యం మానే అవకాశాలున్నాయి. కాకపోతే ఇది ఆ వ్యక్తి మానసిక స్థితిపై ఆధారపడి ఉంటుంది. ఎడిక్షన్‌లో ఉన్నవారు ఇంట్లోనే మద్యం సేవిస్తుంటారు. వాళ్లను మార్చడం కాస్త కష్టమే. వీరు ఎవరినీ పట్టించుకోరు. తమ ధోరణిలో తాముంటారు. ఇలాంటి వారిని రీహాబిలిటేషన్ సెంటర్‌లలో ఉంచి మార్చవలసిందే!

- షణ్ముఖ, సైకాలజిస్ట్, కిమ్స్ హాస్పిటల్

బార్ బార్ దేఖో...

- జూబ్లీహిల్స్‌లోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన ఇంటి టెర్రస్‌పై ప్రత్యేకంగా బార్ సెటప్ ఏర్పాటు చేసుకున్నారు. ఆయన మందు తాగరు. కానీ... తాగేవాళ్లను దగ్గరుండి ప్రోత్సహిస్తారు. ఇలా పార్టీలు ఇవ్వడం వల్ల పరిచయాలు పెరిగాయని, ఆయన వ్యాపారం విస్తృతమైందని చెబుతారు.
- విశాఖ నగర పాలక సంస్థలో పనిచేస్తున్న అధికారి ఒకరికి రాత్రి నిద్రపోయే ముందు రెండు పెగ్గులు తీసుకునే అలవాటు ఉంది. కొన్నాళ్ల క్రితం ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. అప్పటికి ఏదోలా పోలీసుల నుంచి తప్పించుకున్న సదరు అధికారి తర్వాత నుంచి స్నేహితులతో మందుకొట్టడం మానేసి ఇంటి వద్దే రెండు పెగ్గులు వేసుకుని నిద్రపోతున్నారు.
- విశాఖలో ఓ చిరుద్యోగికి రాత్రి ఇంటికి వెళ్లే ముందు కొద్దిగా మందు తాగడం అలవాటు. బైక్‌పై నియంత్రణ కోల్పోయి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో భార్య తాగేదేదో ఇంటికి తెచ్చుకుని తాగితే సమస్య ఉండదని సలహా ఇచ్చింది. దీంతో అప్పటి నుంచి ఇల్లే అతనికి బార్‌గా మారింది.

లేడీస్ అండ్ జెంటిల్మెన్

దేశంలో 40 శాతానికి పైగా ప్రజలు పట్టణాల్లో నివసిస్తున్నారు. గ్రామాల నుంచి వలసలు పెరిగాయి. ఈ నేపథ్యంలో మద్యం సేవించే మహిళల సంఖ్య బాగా పెరిగిందని 'డబ్ల్యూహెచ్‌వో' తెలిపింది. 13-19 సంవత్సరాల మధ్య వయసున్న బాలికల్లో 20 శాతం మంది వారాంతాల్లో పబ్‌లకు వెళుతున్నట్లు మెట్రో నగరాల్లో జరిపిన సర్వేలో తేలింది.

ఫ్యాషనైపోయింది!

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆల్కహాల్ తీసుకోవడాన్ని కుటుంబం అంగీకరించే పరిస్థితి వచ్చింది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లు, రోడ్డు ప్రమాదాలు పెరిగిపోవడంతో ఇష్టం లేక పోయినా ఇంట్లోనే మగవారు మద్యం సేవించేందుకు మహిళలు ఓకే చెబుతున్నారు.

- ప్రొఫెసర్ గణేశ్, సోషియాలజీ అధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

నవతరం మాట ఇది..

"ఇప్పుడు చిన్న ఫంక్షన్లలో కూడా మద్యం తీసుకుంటున్నారు. ఆల్కహాల్ కామన్ అయింది. కాకపోతే ఏదైనా పరిమితంగానే ఉండాలి. లిమిట్ దాటితే ఎవరికైనా ఇబ్బందే. నాకు కాబోయే వాడు కూడా అలాగే ఉండాలని కోరుకుంటాను" అని హైదరాబాద్‌లో బీకాం చదువుతున్న ఒక యువతి పేర్కొంది.

ఇదేమి సమాజం...

"మద్యం తీసుకోవడానికి ఇప్పుడెన్నో కారణాలున్నాయి. కానీ... అలవాటును మానుకోవడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. సమాజంలో మద్యపానాన్ని ఆమోదిస్తున్న వారూ ఉన్నారు. అసహ్యంగా, చులకనభావంతో చూస్తున్న వారూ ఉన్నారు. ఇంటిలోనే మద్యం తీసుకోమని కోరుతున్నది ఈ సమాజానికి భయపడే! ఖర్చు తక్కువ. కంట్రోల్‌లో ఉంటాం. అన్నింటికీ మించి... మన వల్ల ఇంకొకరికి ప్రమాదం జరుగదు."

- ఆల్కహాలిక్స్ ఎనోనిమస్ (ఏఏ) సభ్యుడొకరు.

కుటుంబ సభ్యులకూ కౌన్సెలింగ్

మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినవారికి.. తాగినప్పుడు మనిషి స్థితి ఎలా ఉంటుందనే అంశాలతోపాటు గతంలో జరిగిన ఘోర ప్రమాదాల క్లిప్పింగ్‌లు చూపిస్తున్నాం. తాగి వాహనం నడపకుండా అడ్డుకుంటారనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులను కూడా కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నాం.

- డాక్టర్ రవీంద్ర, జాయింట్ కమిషనర్ ట్రాఫిక్, హైదరాబాద్

లోకం తీరు



మీరు కనిపించకపోయే సరికి ఏమీ తినడం లేదు, ఎవరిమాటా వినడం లేదు.. అందుకే తీసుకొచ్చానండీ!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
గుంటూరు	13.0	30.0
హైదరాబాద్	13.1	29.6
శ్రీకాకుళం	14.0	24.0
విశాఖపట్నం	14.4	29.2
విజయవాడ	17.0	29.7

బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం దానికి ఆనుకుని దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడింది. అయితే ఇది బలపడుతుందా? తూర్పుతీరంపై ప్రభావం వుంటుందా అనేదానిపై వాతావరణ శాఖ ఎటువంటి ప్రకటన చేయలేదు. కాగా రెండు రాష్ట్రాల్లో పొడి వాతావరణమే కొనసాగింది. వచ్చే రెండు రోజుల్లో వాతావరణంలో పెద్దగా మార్పులు వుండవని వాతావరణ శాఖ తెలిపింది. ఇక రెండు రాష్ట్రాల్లో మంచు కురుస్తోంది. ఉదయం పది గంటల వరకు మంచు కొనసాగుతోంది. మంచుకు తోడుగా చలి తీవ్రంగా వుంది. వచ్చే రెండురోజుల్లో తెలంగాణలో చలిగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదిలాబాద్‌లో ఏడు డిగ్రీలు నమోదైంది.

వ్యక్తిత్వంలో ఓడించలేక కులం, వర్గం గురించి మాట్లాడతారు



వ్యక్తిత్వంలో నిన్ను ఓడించడం చేతకానివాళ్లు.. నీ కులం, ధనం, వర్గం గురించి మాట్లాడతారు. ఈ వ్యాఖ్యలు ఎవరు చేశారో తెలియదు కానీ గౌరవనీయుడైన ఓ జర్నలిస్టు నాకు శుభోదయం చెబుతూ పంపిన ఈ సందేశం నాకెంతో నచ్చింది. కులాల మధ్య చిచ్చు, కులాల ఓటు రాజకీయం, పవర్ పాలిటిక్స్ ఆందోళనకరమైన అంశాలు. ఇవి ఆర్థిక ప్రగతిని దెబ్బతీస్తాయి.


- పవన్ కల్యాణ్ ట్వీట్

అరవై ఏళ్లయినా వారిద్దరేనా?



రాష్ట్రంలో ఇప్పటివరకు రెండు సామాజిక వర్గాలే 60 ఏళ్లపాటు సీఎం పదవిని అనుభవించాయి. దీంతో దళితులు, వెనుకబడిన వర్గాలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయి. ప్రస్తుతం సీఎం పదవిలో ఉన్న వ్యక్తి పోలవరాన్ని పూర్తిచేసేందుకు మరో ఐదేళ్లు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. తనకు 30 ఏళ్లపాటు సీఎం పదవి ఇవ్వాలని మరో సామాజిక వర్గానికి చెందిన నాయకుడు పాదయాత్ర చేస్తున్నారు. పదవులు అనుభవించని వర్గాలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. ఆయా వర్గాలు పదవుల్లో ఉంటేనే సామాజిక న్యాయం జరుగుతుంది.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి



ఆవిరి స్నానంతో ఆరోగ్యం!

లండన్, జనవరి 6: ఆవిరి స్నానంతో రక్తపోటు అదుపులో ఉంటుంది. నాళ సంబంధ సమస్యలు దూరం అయ్యి, గుండె కొట్టుకునే వేగం ఒడిదొడుకులు లేకుండా సాగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. 30 నిమిషాల పాటు చేసే ఆవిరి స్నానం సాధారణ తీవ్రతతో చేసే వ్యాయామంతో సమానమట. కరోటిడ్, ఫెమొరాల్ ధమనుల్లో రక్త సరఫరా సరిగా జరిగేందుకు ఆవిరి స్నానం దోహదం చేసినట్లు తమ పరిశోధనల్లో తేలిందని ఫిన్లాండ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ ఈస్టర్న్ ఫిన్లాండ్ శాస్త్రవేత్తలు తెలిపారు.

కోలిన్ ఫుడ్‌తో పిల్లల మెదడు చురుకు

న్యూయార్క్, జనవరి 6: గర్భిణులు కోలిన్ పోషకం ఎక్కువగా ఉండే గుడ్డులోని పచ్చ సొన, మాంసం, చేప, పప్పుదినుసులు, గింజలు తింటే పుట్టబోయే పిల్లల మెదడు చురుగ్గా ఉంటుందని అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. పిల్లల్లో మెదడు పనితీరు బాగుండాలంటే గర్భిణులు రోజుకు కచ్చితంగా 450 మిల్లీగ్రాముల కోలిన్ పోషకాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. 26 మంది గర్భిణులను పరీక్షించగా కోలిన్ పోషకాన్ని ఎక్కువగా తీసుకున్నవారి పిల్లల్లో ఐక్యూ ఆమోఘంగా వృద్ధి చెందినట్లు తేలిందని పేర్కొన్నారు.



రోజుకు 7 ఆటలు

- 'అజ్ఞాతవాసి'కి అదనపు అనుమతులు
- 24 గంటలూ థియేటర్లలో సందడే
- పవన్ అభిమానుల హర్షాతిరేకాలు

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'అజ్ఞాతవాసి' సినిమా అదనపు షోల ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో పవర్‌స్టార్ హీరోగా నటించిన ఈ సినిమా ఈ నెల 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. పవన్ అభిమానులకు మూడు రోజుల మందే సంక్రాంతి పండుగను తీసుకురాబోతున్న ఈ సినిమా రోజూ ఏడు ఆటల ప్రదర్శనకు నిర్మాతలు ఏపీ ప్రభుత్వాన్ని అనుమతి కోరారు. ప్రతి రోజూ ఉదయం పది నుంచి రాత్రి 12 గంటల వరకూ నాలుగు ఆటలు ప్రదర్శించే అనుమతి థియేటర్లకు ఉంది. అయితే ఈ సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న ఆత్రుతను దృష్టిలో పెట్టుకుని రాత్రి ఒంటి గంట నుంచి ఉదయం పదింటి వరకూ మరో మూడు అదనపు షోలకు అనుమతివ్వాలని అజ్ఞాతవాసి నిర్మాతలు చేసిన వినతిపై ఏపీ ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఫైలుపై సీఎం చంద్రబాబు సంతకం చేయడంతో ప్రతి రోజూ మూడు అదనపు ఆటల ప్రదర్శనకు రాష్ట్ర హోంశాఖ అనుమతి ఇచ్చింది. సాధారణంగా ఆడించే నాలుగు ఆటలతో ఈ మూడు ఆటలు కలిపితే మొత్తం ఏడు ఆటల చొప్పున ఎనిమిది రోజులపాటు ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రిలీజైన అన్ని థియేటర్లలోనూ 24 గంటలూ సినిమా ప్రదర్శించేందుకు మార్గం సుగమమైంది. ఏపీ ప్రభుత్వ నిర్ణయం పట్ల పవన్ కల్యాణ్ అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే థియేటర్ల వద్ద అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసుశాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సంసారాల్లో ఖాజీ చిచ్చు

- భార్యకు తెలియకుండా భర్తకు...
- భర్తకు తెలియకుండా భార్యకు విడాకులు
- అధికారులకు బాధితుల ఫిర్యాదు

పిడుగురాళ్ల టౌన్, జనవరి 6: విడాకుల పేరుతో కుటుంబాలను విడగొట్టి సంసారాలను వీధి పాలు చేశాడో ఖాజీ. ఒకరు కాదు, ఇద్దరు కాదు... ముగ్గురు బాధితులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన గుంటూరు జిల్లాలో కలకలం రేపుతోంది. బాధితుల కథనం ప్రకారం...తనకు తెలియకుండానే భర్త ద్వారా విడాకులు ఇప్పించాడనీ, తద్వారా అతడి రెండో పెళ్లికి కారకుడైన ఖాజీపై చర్యలు తీసుకోవాలని దూదేకుల రజియా తన ఫిర్యాదులో కోరింది. అలాగే, తన భార్య విడాకులు ఇవ్వడానికి అంగీకరించిందని చెప్పి తనను కూడా విడాకులకు అంగీకరింపజేసి ఖాజీ మోసగించాడని గంగిరెడ్డిపాలేనికి చెందిన షేక్ నాగుల్‌మీరా ఫిర్యాదు చేశాడు. ఖాజీ ఇచ్చిన విడాకుల పత్రం చూసి తాను మోసపోయాననీ, భార్య తరపు బంధువులు కోర్టులో కేసు వేయగా, రెండు నెలలు జైలులో ఉండి వచ్చానని అతడు వాపోయాడు. మరో ఘటనలో...తనకు తెలియకుండానే భర్త నుంచి విడాకులు ఇప్పించారనీ, దీంతో భర్త మరో పెళ్లి చేసుకున్నాడనీ, న్యాయం చేయాలని మహబూబ్ బీ అనే మహిళ ఆర్డీవోకు మొరపెట్టుకుంది. ఖాజీ మోసం చేసిన ఇలాంటి కేసులు పది వరకు అధికారుల దృష్టికి వచ్చాయని సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు ఆ ఖాజీపై విచారణ చేపట్టాలని రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు అందాయి. పిడుగురాళ్ల ఆర్డీవో మురళి బాధితులను పిలిపించి వారి వివరాలు తెలుసుకున్నారు.



మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో మురళి

విశాఖ కలెక్టర్‌పై అట్రాసిటీ కేసు



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

- పరిహారం అందజేయడంలో...
- నిర్లక్ష్యంగా వ్యవహరించారని అభియోగం
- ఏ1గా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ
- జాప్యం లేదన్న ప్రవీణ్‌కుమార్
- గత ఏడాది 3.5 లక్షలు జమైందని వెల్లడి

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అత్యాచారానికి గురైన ఒక గిరిజన యువతికి తక్షణ పరిహారం అందజేయడంలో నిర్లక్ష్యం వహించారనే అభియోగంపై విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణమూర్తిపై ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. దీనికి సంబంధించి బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాలిలా వున్నాయి. 22 ఏళ్ల గిరిజన యువతి తన కుటుంబంతో కలిసి మద్దిలపాలెంలోని మంగాపురం కాలనీలో నివాసముంటుంది. 2014లో ఆకుల శివనారాయణమూర్తి అనే వ్యక్తి ఆమెను ప్రేమ పేరుతో లోబరుచుకున్నాడు. కొన్నాళ్లపాటు సహజీవనం చేసి తర్వాత పెళ్లి చేసుకోకుండా ముఖం చాటేశాడు. దీనిపై ఆమె 2016 ఆగస్టులో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయగా సెక్షన్ 417, 420, 376 రెడ్‌విత్ 34 ఐపీసీతోపాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన తర్వాత అట్రాసిటీ చట్టం ప్రకారం తక్షణ పరిహారం కింద తనకు చెల్లించాల్సిన మొత్తం కోసం బాధితురాలు అదే నెల 26న సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. ఆయన ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి మూడు రోజుల్లోగా బాధితురాలికి పరిహారం అందజేయాలి. అయితే సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమణమూర్తి బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు నమోదుచేసిన సెక్షన్లు కాకుండా సెక్షన్ 354 (బి), 323 ఐపీసీ, అట్రాసిటీ సెక్షన్లతో బాధితురాలికి తక్షణ పరిహారం మంజూరు చేయాలంటూ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు 2016 సెప్టెంబరులో ఫైలును పంపించారు. ఆ ఫైలును సరిగా చూడకుండానే బాధితురాలికి తక్షణ పరిహారం కింద రూ.25 వేలు మంజూరుచేస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న మూడు రోజులకు రావాల్సిన పరిహారం 3 నెలల వరకూ రాకపోవడానికి ఎఫ్ఐఆర్‌లో నమోదుచేసిన సెక్షన్లను తారుమారు చేసి వేరొక సెక్షన్లను కలిపారని బాధితురాలు ఆరోపించింది. ఈ వ్యవహారంలో డీడీ రమణమూర్తితోపాటు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని కోరూతూ గత ఏడాది మే నెలలో బాధితురాలు కోర్టులో ప్రైవేటు కేసు వేసింది. డీడీ రమణమూర్తిని ఏ1గానూ, జిల్లా కలెక్టర్‌ను ఏ2గా పేర్కొంటూ క్రిమినల్ కేసు నమోదుచేయాలని ఎంవీపీ పోలీసులను గత నెల 29న కోర్టు ఆదేశించింది. దీనిపై స్పందించిన పోలీసులు ఈ నెల మూడున ఎస్సీ, ఎస్టీ యాక్ట్ సెక్షన్ 4 కింద డీడీ రమణమూర్తి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లపై కేసు నమోదు చేశారు.



సాంఘిక సంక్షేమశాఖ డీడీ రమణమూర్తి

జాప్యం జరగలేదు: కలెక్టర్

బాధితురాలికి పరిహారం అందించడంలో ఎలాంటి జాప్యం జరగలేదని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఇదే అంశంపై 37552/2016 నెంబరుతో హైకోర్టులో రిట్ పెండింగ్‌లో వుందన్నారు. 2016 సెప్టెంబరు 23న రూ.25 వేలు మంజూరు చేశామని, ఆ మొత్తం సరిపోదని బాధితురాలు తిరిగి దరఖాస్తు చేసుకోవడంతో 2016 డిసెంబరు 10న రూ.3.5 లక్షలు మంజూరు చేశామని, ఆ మొత్తం గత ఏడాది జనవరి ఏడున బాధితురాలి బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందని కలెక్టర్ తెలిపారు.



యు..ద్ధం

సాగు కష్టం రైతన్నకే తెలుసు. దుక్కులు పూర్తయ్యాక కొయ్య నాగలితో దమ్ము పట్టడం ఓ పద్ధతి అయితే.. ఇప్పుడు యంత్రాలతో సాగు ఓ యుద్ధమే అవుతోంది. పెద్ద పెద్ద టైర్లతో ట్రాక్టర్లు.. ఇరుసులు పొలంలో దిగబడిపోతుండడంతో.. వేగం పెంచినప్పుడు ఇదిగో.. ఇలా పైకి లేచిపోయేలా విన్యాసాలు చేయాల్సి వస్తోంది. విజయవాడ శివారులో గురువారం దమ్ము మడిలో ఇరుక్కుపోయిన ట్రాక్టర్లను బయటకి తీయడానికి తంటాలు పడుతున్న దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంట చిక్కాయి.

-విజయవాడ

ఆ ఊర్లో వేపచెట్లు ఎండిపోతున్నాయ్!



(తొండుపల్లిలో ఎండిపోయిన వేప చెట్లు)

- గతంలో ఎప్పుడూ జరగని వింత
- వాతావరణం వల్లేనా.. కాలుష్య పరిశ్రమలు కారణమా?
- ఎటూ తేల్చని అటవీ అధికారులు..
- అరిష్టం కావచ్చు : తొండుపల్లి గ్రామస్థులు

శంషాబాద్ రూరల్, జనవరి 6: అది రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం తొండుపల్లి. గ్రామమంతా పచ్చదనంతో అలరారుతోంది. ఒక చోట ఒక వేప చెట్టు, ఒక రావి చెట్టు ఉంది. ఏం జరిగిందో ఏమో ఒక్కసారిగా ఆ వేపచెట్టు ఎండిపోవడం ప్రారంభించింది. పక్కనే ఉన్న రావి చెట్టు మాత్రం పచ్చదనంతో కళకళలాడుతుంది. ఆ ఒక్క వేపచెట్టే కాదు.. ఆ ఊర్లో ఉన్న అన్ని వేపచెట్ల పరిస్థితి ఇదే! ఏదో వింత జరిగినట్లు అరవై ఏళ్ల వయసున్న వేపచెట్టుతో పాటు ఈ మధ్య హరితహారంలో నాటిన చెట్లు కూడా ఒక్కసారిగా ఎండిపోతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఊరిలో ఉన్న దాదాపు 400 చెట్లు ఎండిపోతున్నాయని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, తమ ఊరికి అరిష్టం పట్టుకుందని భయపడుతున్నారు. దీనికి కాలుష్య పరిశ్రమలు కారణమా? లేక వాతావరణం వల్ల జరుగుతోందా? అని గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఊరిలోని చెట్లను పరిశీలించిన అధికారులు.. చెట్ల వేర్లకు నీరందకపోవడం, బండరాయి రావడం వంటి కారణాలు కావొచ్చని, అది కూడా ఖచ్చితంగా చెప్పలేమని అంటున్నారు. శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తే తప్ప కారణాలు తేల్చలేమని స్పష్టం చేస్తున్నారు. తమ గ్రామంలోనే వందలాది వేప చెట్లు ఎండిపోవడం వెనుక ఏదో బలమైన కారణం ఉండే ఉంటుందని, త్వరలోనే గ్రామ దేవతకు బోనాలు సమర్పిస్తామని స్థానికులు చెబుతున్నారు.

పరిశీలిస్తున్నాం

వేప చెట్లు ఎండిపోవడం మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వేర్లకు నీరు అందకపోవడం లేదా బండరాయి అడ్డురావడం లేక సీసీ రోడ్లు వేయడం వల్ల అక్కడక్కడా ఎండిపోతుంటాయి. కాని ఒకేసారి వందలాది వేప చెట్లు ఎండిపోవడం వెనుక బలమైన కారణాలు ఉంటాయి. దానికోసం శాస్త్రవేత్తలు పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా వేపచెట్లు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

- నాగేంద్ర, అటవీశాఖ సెక్షన్ అధికారి

ఇలాంటి వింత ఎప్పుడూ జరగలేదు

నాకు దాదాపు 80 ఏళ్లు ఉంటాయి. నా జీవితంలో ఎప్పుడూ ఇలాంటి వింతను చూడలేదు. వర్షాకాలంలో, మేకలు, గొర్రెలు ఏక కాలంలో ఎక్కువ మొత్తంలో చనిపోవడం చూశాం కానీ, వేప చెట్లు ఎండిపోవడం ఇప్పుడే చూస్తున్నాం. మంచు కారణంగా ఎండిపోయి ఉంటాయని నా అభిప్రాయం. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలి.

- విఠలయ్యగౌడ్ తొండుపల్లి వాసి



ప్రజలకు దండం పెడుతున్న ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి

మీకో దండం..పరిశుభ్రంగా ఉంచండి

- తాడిపత్రి ప్రజలకు జేసీ ప్రభాకర్‌రెడ్డి వినతి

తాడిపత్రి, జనవరి 6: 'మీకు దండం పెడతా.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి.. అపరిశుభ్రంగా ఉంటే రోగాలు ముసురుకుంటాయి.. కాలువలను ఆక్రమించి అరుగులు, మెట్లు నిర్మించుకున్నారు.. ఇదేమి న్యాయం.. మేమంతా అహర్నిశలు కష్టపడి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంటే మీరేమో అపరిశుభ్రతకు తోడు ఆక్రమణలకు పాల్పడతారా.. వారం రోజుల్లో మీ పద్ధతి మార్చుకొని పరిసరాలను, ఇంటి ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోండి. కాలువలు, రోడ్లను ఆక్రమించి నిర్మించిన అరుగులు, మెట్లను తొలగించండి. లేదంటే వాటిని పొక్లయినర్‌తో నిర్దాక్షిణ్యంగా తొలగిస్తా' అంటూ అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తాడిపత్రి పట్టణంలోని టైలర్స్‌కాలనీలో శనివారం ఆయన పర్యటించారు. ఆక్రమణలు, అపరిశుభ్రత గురించి స్థానికులపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'మీకు పింఛన్లు కావాల, రేషన్లు కావాల, కానీ పట్టణం పరిశుభ్రంగా ఉండాలని ఆలోచించరు. ఎప్పుడూ మీ స్వార్థం కోసం ఆలోచిస్తున్నారే తప్ప దానివల్ల కలిగే అనర్థాల గురించి పట్టించుకోలేదు. ఇలా అయితే దేవుడు కూడా మిమ్మల్ని మార్చలేడు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వార్డు కౌన్సిలర్ పద్మావతిని పిలిచి ఆయన మాట్లాడారు. 'మీరేం చేస్తారో తెలీదు. వీటన్నింటినీ వెంటనే తొలగించాలి' అని ఆదేశించారు.

నాలా ఫైల్ పెండింగ్‌తో ఆగిన ప్రాజెక్టులు

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భూ వినియోగ మార్పిడి ఫీజు(నాలా)ను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గవర్నర్ ఆమోద ముద్ర వేయకుండా ఫైల్‌ను తన దగ్గర అట్టిపెట్టుకోవడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాజెక్టులు ఆగిపోయాయని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, క్రెడాయ్ సంస్థల ప్రతినిధులు ఆరోపించారు. విశాఖపట్నంలో శనివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు జి.సాంబశివరావు మాట్లాడుతూ, పరిశ్రమలు స్థాపించాలని ముందుకు వచ్చేవారికి నాలా పెద్ద ఆర్థిక భారంగా మారిందని, తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరితే, ఆయన అంగీకరించి, దానికి సంబంధించిన ఫైల్‌ను ఆమోదం కోసం గవర్నర్ నరసింహన్‌కు పంపితే ఆయన దానిని నెల రోజులు దాటినా క్లియర్ చేయకపోవడం వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. రెండేళ్లుగా ఈ నాలా తగ్గింపు కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎదురు చూస్తున్నారని, ఆ ఫైల్ ఓకే అయితే అనేక ప్రాజెక్టులు వస్తాయని రుషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఓ.నరేశ్‌కుమార్ పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణా ఈ నాలాను 2016లో తగ్గించిందని, దాంతో పారిశ్రామికవేత్తలు అటు వైపు మొగ్గు చూపుతున్నారని, పోటీ అధికమైన ప్రస్తుత తరుణంలో కీలకమైన నిర్ణయాలు సరైన సమయంలో తీసుకోవడంతో పాటు వాటిని తక్షణమే అమలు చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. క్రెడాయ్ విశాఖ చాప్టర్ అధ్యక్షులు కోటేశ్వరరావు మాట్లాడుతూ, భవనాల నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఇవ్వాలని 25 ఏళ్ల క్రితం క్రెడాయ్ కోరిందని, దాన్ని ఇప్పుడు అమల్లోకి తీసుకువచ్చారని, అయినా దాని వల్ల ఫలితం లేదని, కింద స్థాయిలో సిబ్బంది దాన్ని సరిగ్గా అమలు చేయడం లేదని ఆరోపించారు. భారీ భవన నిర్మాణాలకు చ.అ.కు ఇంపాక్ట్ ఫీజు పేరుతో వేయి రూపాయల చొప్పున వసూలుచేస్తున్నారని, దీనిని వాయిదాల్లో చెల్లించేందుకు అనుమతించాలని కోరారు. క్రెడాయ్ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ, మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రభుత్వ సంస్థలు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

తిరుమలలో తగ్గిన వగపడి ప్రసాద విక్రయాలు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో వగపడి ప్రసాదాల విక్రయాలు తగ్గాయి. లడ్డూ, వడ ధరలు పెరగడమే దీనికి కారణమని భావిస్తున్నారు. తిరుమల ఆలయ వగపడిలో కేవలం సిఫారసు ఉత్తరాలపై మాత్రమే చిన్న, పెద్ద లడ్డూలు, వడలను విక్రయిస్తారు. గత నెలలో వడ ధర రూ.25 నుంచి రూ.100కు, పెద్ద లడ్డూ 100 నుంచి రూ.200, చిన్నలడ్డూ 25 నుంచి రూ.50 వరకు పెంచారు. పాత ధరలున్నప్పుడు నిత్యం దాదాపు రెండు వేల పెద్దలడ్డూలు, 1,500 వడలు, పదివేల చిన్న లడ్డూలు విక్రయించేవారు. ధరలు పెరిగాక క్రమంగా విక్రయాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన ఉన్నతాధికారులు.. పెద్ద లడ్డూలు, వడలను తగ్గించి చిన్నలడ్డూల తయారీ పెంచాలని పోటు విభాగాన్ని ఆదేశించారు. ఐదు రోజులుగా దాదాపు 2,500 పెద్ద లడ్డూలు, రెండు వేల వడలను మాత్రమే తయారు చేస్తున్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట: ఆనందబాబు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 6 : విద్యార్థుల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వసతులు, భోజన సదుపాయం, పరిసరాల పరిశుభ్రత అంశాలపై తనిఖీ చేశారు. డైనింగ్ హాలు,తరగతి గదులు, డార్మెటరీ సరిగ్గా లేకపోవడంతో వాటి ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు.

ఏపీజీబీ మేనేజర్ సజీవ దహనం

బనగానపల్లె, జనవరి 6: కారులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సజీవ దహనమైన ఘటన కర్నూలు జిల్లా బనగానపల్లె మండలంలో శనివారం జరిగింది. ప్యాపిలి మండలం గార్లదిన్నె ఏపీజీబీ మేనేజర్‌గా పని చేస్తున్న ఎస్.రాజేష్ (32) నంద్యాలలో నివాసం ఉంటున్నారు. వారంలో రెండు రోజులు ఇంటికి వెళ్లి వచ్చే ఆయన శుక్రవారం రాత్రి నంద్యాల వెళ్లారు. శనివారం విధులకు హాజరయ్యేందుకు సొంత కారులో గార్లదిన్నె వస్తుండగా దద్దనాల ప్రాజెక్టు సమీపంలోకి రాగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు ఎగిసిపడటంతో రాజేష్ కారులో నుంచి బయటకురాలేక సీటులోనే దహనం అయ్యారు. బనగానపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బనగానపల్లె సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాకేష్ ఘటనాస్థలానికి చేరుకుని.. కారు నెంబరు ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బూట్లలో బంగారం బిస్కెట్లు

శంషాబాద్ రూరల్, జనవరి 6: బూట్లలో బంగారం బిస్కెట్లను అక్రమంగా తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. మస్కట్ నుంచి ఉదయం ఐదు గంటలకు ఒమన్ ఎయిర్‌లైన్స్ విమానం వచ్చింది. దాని నుంచి దిగిన ప్రయాణికులను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి కాలి సాక్స్ లోపల దాచిన బంగారు బిస్కట్ల గుట్టు రట్టయింది. 349.5 గ్రాముల బరువున్న వీటి విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాయింట్ బ్లాంక్ పెళ్లి

- తలకు తుపాకీ గురిపెట్టి తాళి కట్టించారు!
- పెళ్లిపీటలపై వరుడి ఏడుపులు

పట్నా, జనవరి 6: బ్యాండు లేదు..బాజాలు లేవు..బరాత్ అంతకంటే లేదు! ఆ పెళ్లిలో ఉన్నది ఒక్కటే..ఏడుపులు పెడబొబ్బలు!! అప్పగింతలో పెళ్లి కూతురు ఏడ్చిందనుకుంటే పొరబాటే! పెళ్లి పీటల మీద వరుడే వెక్కివెక్కి ఏడ్చాడు. 'నాకు ఈ పెళ్లి వద్దు బాబోయ్..వదిలేయండి' అంటూ రోదించాడు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. కేకలు వేస్తే పీక నొక్కు తామని బెదిరించారు. 'ఏడ్చి ఉపయోగం లేదు తాళి కట్టు' అని భయపెట్టారు. పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి పెళ్లి తంతు నిర్వహించారు. దీంతో వరుడు ఇంకా బెదిరిపోయాడు. కనీసం వధువును చూడనైనా చూడకుండానే ఏడుస్తూ మూడు ముళ్లు వేశాడు. బిహార్‌లో జరిగిన ఈ పెళ్లి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. యువకుడిని కిడ్నాప్ చేసి బలవంతంగా చేసిన పెళ్లిపై చర్చ జరుగుతోంది. వరుడు వినోద్ కుమార్ (29) విద్యావంతుడు. బొకారో స్టీల్ ప్లాంట్‌లో జూనియర్ మేనేజరుగా పనిచేస్తున్న వినోద్..డిసెంబరు 3న తన స్నేహితుడి పెళ్లి వేడుకకు బయలుదేరాడు. బొకారో నుంచి హతియా-పట్నా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా.. పూర్వ పరిచయం ఉన్న సురేంద్ర యాదవ్ అనే వ్యక్తి అటకాయించాడు. మోక్మా వెళ్దామని చెప్పి..వినోద్‌ను కిడ్నాప్ చేసి పండరక్ అనే గ్రామానికి తీసుకెళ్లాడు. అక్కడే పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి.. తన సోదరి మెడలో తాళి కట్టించాడని వినోద్ సోదరుడు సంజయ్ మీడియాకు వెల్లడించాడు. పెళ్లిపీటల మీద ఏడుస్తున్న వినోద్‌ను.. ఒక మహిళ వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. అతని కన్నీళ్లు తుడిచి 'నిన్నేమీ ఉరి తీయడం లేదు. నీకు పెళ్లి చేస్తున్నాం..అంతే! పెళ్లి చేస్తుంటే ఏడుస్తావేం?' అని అనడం ఆ వీడియోలో కనిపించింది. హిందూ సంప్రదాయంలో ఎనిమిది రకాల పెళ్లిళ్లు ఉన్నాయి. అందులో ఒకటి రాక్షస వివాహం. వధువును బలవంతంగా ఎత్తుకెళ్లి పెళ్లి చేసుకోవడం ఆనాటి రుక్మిణీ కల్యాణం నుంచి నేటి తరం వరకూ చాలాచోట్ల చూశాం! కానీ వరుడిని ఎత్తుకెళ్లి మూడుముళ్లు వేయించిన ఉదంతాలు ప్రచారంలో లేవు. కానీ, బిహార్‌లో వరుడిని కిడ్నాప్ చేయడమే కాకుండా..తలపై తుపాకీ గురిపెట్టి మరీ.. వధువు మెడలో తాళి కట్టించడం సంచలనంగా మారింది. ఈ ఘటనపై పోలీసులు దృష్టి పెట్టారు. తొలుత కేసు నమోదు చేయడానికి స్థానిక పోలీసులు ముందుకు రాలేదని వినోద్ సోదరుడు ఆరోపించారు. చివరకు జిల్లా ఎస్పీని కలవడంతో పోలీసులు వెళ్లి వినోద్‌ను విడిపించుకుని వచ్చారని తెలిపాడు. విచిత్రం ఏమిటంటే వరుడిని కిడ్నాప్ చేసి పెళ్లి జరిపించడం బిహార్‌లో మామూలే! 2016లో ఇలాంటి 3 వేల కేసులు నమోదైనట్లు అక్కడి లెక్కలు తెలియజేస్తున్నాయి.



పెళ్లి మంటపంలో ఏడుస్తున్న వరుడు

అయినా 'స్థానం' మారలేదు!

- బదిలీ అయినా కదలని అధికారులు
- రాష్ట్ర దేవాదాయ శాఖలో ఇష్టారాజ్యం

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అయినా, ఐపీఎస్ అయినా ఒకచోట నుంచి బదిలీ అయితే వెంటనే కొత్త ప్రదేశానికి, చాంబర్‌కు వెళ్లిపోతారు. దేవాదాయశాఖ అధికారులు మాత్రం తాము ఎక్కడ ఉంటే అక్కడికే మొత్తం వ్యవస్థ మారాలన్నట్టు వ్యవహరిస్తున్నారు. చాంబర్లు బాగున్నాయని, వాటిని వదిలి వెళ్లలేమని వితండవాదం చేస్తున్నారు. సుమారు 20 రోజుల కిందట దేవాదాయశాఖ కమిషనరేట్‌లో అంతర్గత బదిలీలు చేశారు. సుదీర్ఘకాలం ఒకేస్థానంలో పాతుకుపోయిన గెజిటెడ్ సూపరింటెండెంట్లు, సూపరింటెండెంట్లపై తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కమిషనరేట్‌లోనే సెక్షన్లు మార్చారు. కానీ, 20రోజులైనా ఇప్పటికీ కొందరు అధికారులు పాత చాంబర్లలోనే కొనసాగుతున్నారు. దేవాదాయశాఖ ఏడాది కిందట గొల్లపూడికి వచ్చినప్పటినుంచీ అధికారులు కొత్తగా కట్టిన భవనంలోని చాంబర్లలో పనిచేస్తున్నారు. అయితే అవి తమ సొంత చాంబర్లు అన్నట్టుగా భావిస్తున్నవారికి, ఈ బదిలీలు మింగుడుపడలేదు. దీంతో అక్కడేఉండి కొత్త విధులు చేస్తామని బదిలీలకు వింత భాష్యం చెబుతున్నారు. ఈ విషయాన్ని కమిషనర్ కూడా పట్టించుకోకపోవడంతో కమిషనరేట్‌లో పని విధానం గందరగోళంగా మారింది. ఎవరు ఎక్కడ ఉంటున్నారు, ఎవరి విధులు ఎవరు నిర్వర్తిస్తున్నారు అనేది అర్థం కానివిధంగా మారింది. పాత చాంబర్లలో కొనసాగడమే కాకుండా పాత విధుల్లోనూ బదిలీ అయిన అధికారులు జోక్యం చేసుకుంటున్నారు. చాలా ఫైళ్లను ఇంకా వారే డీల్ చేస్తున్నట్లు దేవాదాయ వర్గాలు అంటున్నాయి. దీనివల్ల ఆయా అధికారుల కింద పని చేసే ఉద్యోగులు కూడా ఎక్కడ ఉండాలో అర్థంకాని గందరగోళ పరిస్థితి ఏర్పడింది. బదిలీలపైనా ఉద్యోగులు, అధికారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అవినీతి ఆరోపణలున్నవారికే బదిలీల తర్వాతా కీలక బాధ్యతలు అప్పగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో 'బ్రాహ్మణ సంక్షేమం'

- వెబ్‌సైట్‌లో దరఖాస్తుల సమగ్ర సమాచారం
- యూనిట్లకు జియో ట్యాగింగ్ ప్రారంభం
- పారదర్శకంగా పథకాల అమలుకు సన్నాహాలు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గాడితప్పిన బ్రాహ్మణ సంక్షేమాన్ని తిరిగి దారిలో పెట్టేందుకు చర్యలు మొదలయ్యాయి. అవినీతి, సిఫారసులకు తావులేకుండా పారదర్శకంగా పథకాలను అమలు చేయడానికి బ్రాహ్మణ కార్పొరేషన్ నూతన విధానాలు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా లబ్ధిదారుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకూ దరఖాస్తుకు సంబంధించిన సమాచారం కోసం జిల్లాల నుంచి లబ్ధిదారులు విజయవాడ వచ్చేవారు. లేదంటే కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసేవారు. అయితే కాల్‌సెంటర్ సరిగా పనిచేయడం లేదని ఫిర్యాదులు రావడంతోపాటు తిరస్కరణకు గురవుతున్న దరఖాస్తులపై చాలామందిలో అనుమానాలు నెలకొంటున్నాయి. వీటన్నిటినీ నివృత్తి చేసేందుకు కార్పొరేషన్ సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చింది. ప్రతి పథకంలో ఆమోదించిన దరఖాస్తులు, పరిశీలించినవి, తిరస్కరించనవి వేర్వేరుగా అందుబాటులో ఉంచింది. తిరస్కరించడానికిగల కారణాలను కూడా అందులో పొందుపరుస్తున్నారు. దీంతో అనుమానాలకు తావుండదని కార్పొరేషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాల అమలు తీరుపై ఇటీవల విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యేలు, నాయకుల సిఫారసు లేఖలు కోరుతున్నారని, దరఖాస్తులు ఏ దశలో ఉన్నా మీకు మేం ఉన్నామంటూ కొందరు నాయకులు, వారి అనుచరులు లబ్ధిదారుల నుంచి మామూళ్లు వసూలు చేసినట్లు ఆరోపణలొచ్చాయి. దరఖాస్తుదారులు పదేపదే నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వీటన్నిటినీ నివారించడంలో భాగంగా సమాచారమంతా బహిర్గతం చేస్తున్నారు. తమ దరఖాస్తున్న ఆమోదించారా, లేదా, ఒకవేళ తిరస్కరిస్తే కారణాలేంటనేది లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో చూసుకుంటే సరిపోతుంది.

బ్యాంకు రుణాలపై ప్రత్యేక శ్రద్ధ

కార్పొరేషన్ రాయితీతో ఏర్పాటు చేసుకునే యూనిట్లకు జియో ట్యాగింగ్ ప్రారంభించారు. దీనివల్ల వాస్తవంగా లబ్ధిదారునికి రాయితీ మేలు జరిగిందా. లేదా అనేది తెలుసుకోవచ్చు. ఇంతకాలం నిధులు ఇస్తున్నా వాటిని లబ్ధిదారులు ఎలా వినియోగించుకుంటున్నారనే దానిపై కూడా సరైన పర్యవేక్షణ లేదు. ఎక్కువ శాతం యూనిట్లు అసలు గ్రౌండింగ్ కావడం లేదనే విమర్శలున్నాయి. దీంతో రాయితీల వినియోగంపై తనిఖీలకు బ్రాహ్మణ కార్పొరేషన్ చర్యలు తీసుకుంటోంది. ఇక కార్పొరేషన్ రాయితీ ఇచ్చినా నిధుల విడుదల, రుణాలు మంజూరులో బ్యాంకులు ఆలస్యం చేస్తుంటాయి. దీన్ని నివారించేందుకు కార్పొరేషన్ వర్గాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. రాయితీ ఇచ్చిన బ్యాంకులతో మాట్లాడి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. దీనివల్ల వివిధ పథకాల్లో లబ్ధిదారులకు వేగంగా రాయితీ, రుణాలు చేతికందుతున్నాయని చెబుతున్నారు. రుణాల మంజూరులో ఆలస్యం.., రాయితీలు సకాలంలో ఇవ్వని పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సంపదనిచ్చే చెత్త!

- పారిశుధ్యం కోసం ఊబరైజేషన్
- గ్రామాల్లో రైతుల నుంచి పేడ సేకరణ
- వర్మి కంపోస్టు తయారీ.. రైతులకు పంపిణీ
- సంపద తయారీకి ప్రభుత్వం ప్రయత్నం

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి కూడా సంపద సృష్టించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. అందుకోసం 'ఊబరైజేషన్ ఆఫ్ డంప్' పేరిట గ్రామాల్లో రైతుల నుంచి సేకరించిన చెత్త, పేడతో వర్మికంపోస్టు తయారు చేసి దాన్ని మళ్లీ రైతులకు అప్పగించే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. తద్వారా గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం కూడా మెరుగుకానుంది. పేడను సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు, కమ్యూనిటీ మొబలైజర్లను ఏర్పాటు చేశారు. పైలట్ ప్రాజెక్టుగా పశ్చిమగోదావరి జిల్లాలో 4.75 లక్షల ఇళ్ల నుంచి ఊబరైజేషన్ ద్వారా పేడను సేకరిస్తున్నారు. ఇదే తరహాలో చిత్తూరు జిల్లాలో 166, కృష్ణా జిల్లాలో 307 ఇళ్ల నుంచి పేడ, చెత్తను సేకరిస్తున్నారు. చెత్త సేకరణ కోసం 120 ట్రాక్టర్లు, 36 ఆటోలు, 1476 ట్రైసైకిళ్లను వినియోగిస్తున్నారు.సుమారు 12,795 మంది రైతులు పేడను ఊబరైజేషన్‌కు అందిస్తున్నారు. దాని నిర్వహణ కోసం 3966 మంది గ్రీన్ అంబాసిడర్లను నియంచారు. ప్రతి రోజు ఆయా గ్రామాల్లో రైతుల ఇంటి ముందుకు ట్రాక్టర్లు నిర్దిష్ట సమయంలో వచ్చి తడిచెత్త, పొడి చెత్తను సేకరిస్తాయి. మూడు నెలల తర్వాత తయారైన వర్మి కంపోస్టు అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం కోసం పని చేస్తున్న వారికి ఉపాధి వేతనాలు కూడా అందుతాయి. రైతుల్లో వర్మి కంపోస్టు వాడకాన్ని ప్రోత్సహించడం, పంటపొలాలను సారవంతం చేయడం, సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన ఆహార పదార్థాలను పండించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. పశువులు కలిగిన రైతు గ్రామపంచాయతీ నియమించిన గ్రీన్ అంబాసిడర్‌కు పేడను ఇచ్చి తద్వారా వర్మి కంపోస్టును తీసుకోవచ్చు.





చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, పేడ సేకరణ

ఆపరేషన్ జీరో వేస్ట్

పంచాయతీల్లో జీరో వేస్ట్ ప్రాజెక్టును పంచాయతీరాజ్‌శాఖ ప్రతిష్ఠాత్మకంగా భావించింది. ఊబరైజేషన్ ఆఫ్ డంప్ నిర్వహణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావును ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆపరేషన్ జీరో వేస్ట్ కింద గ్రామంలోని వీధుల్లో, కాలువల్లో, చెరువుగట్లపైన, వివిధ ప్రదేశాల్లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను వేరుచేసి ఘనవ్యర్థాల షెడ్‌కు తరలిస్తున్నారు. పేపర్, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్స్, చెత్త చెదారం రోడ్లమీద కనిపించకుండా చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు ఉత్పత్తయ్యే తడిచెత్త, పశువుల పేడను 60 రోజులపాటు నిల్వ ఉంచేందుకు కంపోస్టు తొట్టెలను నిర్మించారు.

కంపోస్ట్ డంప్ యార్డ్



95 టన్నుల వర్మి తయారీ

ఊబరైజేషన్ ద్వారా ఇప్పటికే 58965 టన్నుల పేడను సేకరించారు. ప్రస్తుతం 650 నాడెప్ పిట్లు అందుబాటులో ఉన్నాయి. 1703 టన్నుల పేడను కంపోస్టు పిట్‌ల్లో ఉంచి ఇప్పటికే సుమారు 95 టన్నుల వర్మికంపోస్ట్‌ని తయారుచేశారు. వాటిని కేజీ, 2 కేజీలు ఇలా ప్యాకెట్లలో ఉంచి రైతులకు అందజేయడానికి సిద్ధంచేశారు. ఇదే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం ద్వారా పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతోపాటు చెత్త నుంచి సంపద తయారు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు తయారుచేసింది.

పంచాయతీల్లో అవినీతికి చెక్

- ఎల్ఈడీతో గ్రామాలకు వెలుగులు
- యంత్రాలతో వాటర్ ట్యాంకులు, మురుగుకాల్వల శుద్ధి

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీల్లో జరిగే అవకతవకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో జరిగే అవినీతిని అరికట్టేందుకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేశ్ సూచనలతో అధికారులు పకడ్బందీ ప్రణాళికలు తయారు చేశారు. గ్రామ పంచాయతీల్లో ప్రధానంగా అవినీతి జరుగుతున్న విభాగాలను గుర్తించి వాటిని సంస్కరిస్తున్నారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, గ్రామంలోని ఆదాయ వనరుల నుంచి లభిస్తున్న నిధుల వ్యయం తీరుపై విమర్శలొస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 14వ ఆర్థిక సంఘం నిధులు కూడా సద్వినియోగం చేయడంలో కొన్ని పంచాయతీలు వెనుకబడ్డాయి. ఈ పరిస్థితిని పరిశీలించిన అధికారులు సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికలు తయారుచేసి.. పంచాయతీలు చేయాల్సిన కార్యక్రమాలను ప్రభుత్వమే చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని భావించారు. ఈ క్రమంలోనే... రాష్ట్రవ్యాప్తంగా 12,918 గ్రామ పంచాయతీల్లో ఎల్ఈడీ వీధిదీపాలను ఏర్పాటు చేసి కారు చీకటిని పారదోలడమే కాకుండా వీధిలైట్లు నెపంతో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామ పంచాయతీలు వీధిలైట్లు కోసం ఇప్పటివరకూ ప్రతి నెలా చెల్లించే విద్యుత్‌చార్జీల్లో 75 శాతం చెల్లించడం ద్వారా మన్నిక కలిగిన ఎల్ఈడీ వీధిదీపాలను పదేళ్ల గ్యారెంటీతో ఈఎస్ఎస్ఎల్, నెడ్‌క్యాప్ సంస్థల ద్వారా ఏర్పాటుచేస్తున్నారు. ఈ వీధిలైట్ల ఆన్/ఆఫ్ మాన్యువల్ కాకుండా ఆటోమేటిక్ సిస్టంలో టైం ఫిక్స్ చేయడం ద్వారా ఏ సమయంలో వెలగాలంటే ఆ సమయంలో వెలిగేలా చర్యలు తీసుకున్నారు. అక్రమాలకు చెక్ పెట్టేందుకు పంచాయతీరాజ్‌శాఖ సైడ్ డ్రైన్లను యంత్రాల ద్వారా క్లీన్‌చేసే ప్రక్రియను చేపట్టింది. ఇక తాగునీటి ట్యాంకులను ఆరు నెలలకోసారి క్లీన్ చేసేలా చర్యలు తీసుకుని టెండర్లు పిలుస్తున్నారు. పంచాయతీలకొస్తున్న 14వ ఆర్థిక సంఘం నిధులను లాభాపేక్షతో కొందరు సర్పంచులు అంతర్గత మట్టిరోడ్లను నిర్మించి వృథా చేయడాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆయా పంచాయతీలకొచ్చిన నిధులతో పాటు ఉపాధి నిధులను అనుసంధానించి సిమెంట్‌రోడ్లు ప్రారంభించారు. దీంతోపాటు ఇంటి పన్నులకు సంబంధించి పారదర్శక ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావడం ద్వారా పంచాయతీరాజ్‌శాఖ పంచాయతీల్లో అవినీతిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంది.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శైలజ

నా క్లినిక్ కాదని..
జీజీహెచ్‌కు వస్తావా?

- **ఆపరేషన్ ఎలా జరుగుతుందో చూస్తా!**
- **ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగికి డాక్టర్ వార్నింగ్**
- **డబ్బు జబ్బుతో ప్రభుత్వాసుపత్రిలో వీరంగం**
- **ఆర్‌ఎంవో జోక్యంతో శస్త్రచికిత్స చేసిన మరో డాక్టర్**

గుంటూరు(సంగిడిగుంట), జనవరి 6: ప్రభుత్వ వైద్యుల డబ్బు పిచ్చికి ఇది పరాకాష్ట! తన ప్రైవేట్ క్లినిక్‌లో శస్త్రచికిత్స చేయించుకోలేదని..ఒక పేదరాలికి ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్ జరగకుండా అడ్డుకున్నాడో ప్రభుత్వ వైద్యుడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆ బాధితురాలికి మరో ప్రభుత్వ వైద్యుడు అండగా నిలిచాడు. జీజీహెచ్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. దాచేపల్లి మండలం కేశనపల్లికి చెందిన హనుమంతరావు భార్య శైలజ ఏడాది క్రితం గర్భసంచికి సంబంధించిన వ్యాధితో ఊరిలోని ఆర్‌ఎంపీని సంప్రదించింది. అతను గుంటూరులోని ఇసుకవాగు వీధిలో ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రికి పంపించాడు. ఏడాదిగా మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో డిసెంబరులో మరోసారి ఆస్పత్రికి వెళ్లగా...వెంటనే గర్భసంచికి శస్త్రచికిత్స చేయాలని, రూ.50 వేలు ఖర్చు అవుతుందని డాక్టర్ చెప్పారు. అంత మొత్తం భరించే శక్తి లేకపోవడంతో భార్యను డిసెంబరు 14న జీజీహెచ్‌కు తీసుకొచ్చాడు హన్మంతరావు. ఓపీ విభాగంలోని ఒక అసిస్టెంట్ ప్రొఫెసరు మూడ్రోజులపాటు శస్త్రచికిత్సకు సంబంధించిన పరీక్షలు నిర్వహించింది. చివరగా ఆ ఫైల్‌ను ఆపరేషన్ కోసం గైనకాలజీ ప్రొఫెసరు దగ్గర పంపించారు. ఆ ప్రొఫెసరు గదిలోకి హన్మంతరావు వెళ్లగానే..అంతకుమందు ఆపరేషన్‌కు రూ.50 వేలు ఖర్చు అవుతుందని చెప్పిన డాక్టర్ ఆ సీటులో కనిపించడంతో కంగుతిన్నాడు. తన ఆర్థిక పరిస్థితి వివరించి ఆపరేషన్ చేయాలని ప్రాథేయపడ్డాడు. అయితే ఆపరేషన్ ఇప్పుడు కుదరదని, ఇంకొంత కాలం ఆగాలని డాక్టర్ బదులివ్వడంతో హన్మంతరావు గట్టిగా నిలదీశాడు. దాంతో ఆగ్రహించిన ఆ డాక్టర్ తన దగ్గర ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, పీజీలకు ఆపరేషన్ చేయొద్దని ఆదేశించి...హన్మంతరావును, బాధితురాలు శైలజను, ఆమె కుమార్తెను ఆస్పత్రి నుంచి గెంటేశారు. చేసేది లేక తనకు తెలిసివారితో వెళ్లి స్థానిక ఎమ్మెల్యే పీఏను కలిశాడు హన్మంతరావు. అతను ఆర్‌ఎంవో రమేశ్‌కు ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు. సదరు వైద్యుడిని పిలిచి ఆపరేషన్ చేయాలని ఆర్‌ఎంవో కోరినా అతను వినలేదు. అప్పటికే శైలజ పరిస్థితి విషమిస్తుండటంతో అదే విభాగానికి చెందిన డాక్టర్ ప్రభావతికి ఆర్‌ఎంవో రమేశ్ విషయం చెప్పి కిందటి నెల 26న ఆపరేషన్ చేయించారు. అలా శైలజ ప్రస్తుతం జీజీహెచ్‌లోని 112వ వార్డులో కోలుకుంటోంది. తన లాంటి ఇబ్బంది మరొకరికి ఎదురు కాకూడదని హన్మంతరావు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

జీజీహెచ్‌లో ఉండేది గంటే!

శస్త్రచికిత్స చేయబోనన్న వైద్యునిపై గతంలో కూడా అనేక ఆరోపణలు ఉన్నాయి. రోజూ కారులో ఆస్పత్రికి వచ్చి..కారు అక్కడే వదిలేసి గంటలోనే ఆటో ఎక్కి తన ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లిపోతారని చెబుతున్నారు. గతంలో ఈ డాక్టర్ పర్యవేక్షణలోని ఒక చిన్నారి మృతి విషయంలోనూ వివాదం రేగింది. ఆ నెపం వేరేవారిపై నెట్టేసేందుకు ప్రయత్నించడంతో ఒక అసిస్టెంట్ ప్రొఫెసరు 'ముందు నువ్వు ఒక గంటైనా ఆస్పత్రిలో ఉండి...ఆపై నీతులు చెప్పు' అని వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల ఆస్పత్రి సూపరింటెండెంట్ ఈయన చాంబర్‌లో సీసీ కెమెరా కూడా ఏర్పాటు చేశారు. అయినా ఆయనగారు మాత్రం ప్రైవేటు సేవలోనే తరిస్తున్నట్లు చెబుతున్నారు.

ఇంటర్ అర్హతతో
బీఈడీ!

- **డిగ్రీతో పాటే ఉపాధ్యాయ శిక్షణ**
- **నాలుగేళ్ల కోర్సు నిర్వహణకు సన్నాహాలు**
- **ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు**
- **వచ్చే విద్యా సంవత్సరంలో అమలు**
- **సిలబస్, విధివిధానాలపై కమిటీ ఏర్పాటు**

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలనుకునే ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు అందించనుంది. ఇంటర్ పూర్తిచేసిన తర్వాత నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్సీబీఈడీ, బీఏబీఈడీ కోర్సుల్లో చేరే అవకాశం కల్పించడానికి సన్నాహాలు చేస్తోంది. డిగ్రీతో పాటే విద్యార్థులకు ఉపాధ్యాయ శిక్షణ కూడా అందించేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. ఇంటర్‌లో మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులు చదివినవారు బీఎస్సీబీఈడీ కోర్సు, హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులు చదివినవారు బీఏబీఈడీ కోర్సులో చేరేందుకు అర్హులు. వీటిని నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లుగా వ్యవహరిస్తారు. 2018-19 విద్యా సంవత్సరం నుంచి ఈ కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. బీఎస్సీ, బీఏ యూజీ కోర్సులను అందిస్తోన్న డిగ్రీ కాలేజీలకే వీటిని కూడా నిర్వహించే అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం ఉన్న బీఈడీ, డీఈడీ కాలేజీలకు మాత్రం ఈ అవకాశం లేదు. ఈ విధమైన కోర్సుల నిర్వహణకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) 2015-16 విద్యా సంవత్సరం నుంచే అనుమతులు ఇస్తోంది. దేశంలోని నాలుగు రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ)లలో ఈ కోర్సులు ఇప్పటికే నడుస్తున్నాయి. డిగ్రీ, బీఈడీ సిలబస్‌లను సమీకృతం చేసి ఈ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఉన్నత విద్యామండలికి రాష్ట్రానికి చెందిన కొన్ని విద్యాసంస్థలు ప్రతిపాదనలు సమర్పించాయి. ఉపాధ్యాయ విద్యకు సంబంధించి పలువురు విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకున్న అనంతరం ఉన్నత విద్యా మండలి ఈ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ల నిర్వహణపై సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు, సిలబస్ రూపకల్పనపై ఓ కమిటీని నియమించింది. ఇందులో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు కన్వీనర్‌గా, ప్రొఫెసర్ బి.ఎస్.పాండా, ప్రొఫెసర్ వి.సుధాకర్, ప్రొఫెసర్ జి.భువనేశ్వర లక్ష్మి, ప్రొఫెసర్ స్వరూపరాణి, ఉన్నత విద్యా మండలి అకడమిక్ సెల్ లెక్చరర్ బి.ఎస్.సెలీనా సభ్యులుగా ఉంటారు. శనివారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సమావేశమైన ఈ కమిటీ... కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసింది. ప్రవేశ పరీక్షను రెండు విభాగాలుగా నిర్వహించనున్నారు. పార్ట్-1లో జనరల్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జి, టీచింగ్ ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎన్విరాన్‌మెంటల్ అవేర్‌నెస్ ఉంటాయి. పార్ట్-2లో సంబంధిత కంటెంట్(సబ్జెక్టు)పై ప్రశ్నలు ఇస్తారు. సిలబస్ తయారీపై త్వరలోనే మరోసారి సమావేశం కానున్న ఈ కమిటీ తన నివేదికను వచ్చే నెలలో ఉన్నత విద్యా మండలికి సమర్పించనుంది.

కొరియా కల్చర్

అనంతలో 'కియ' కార్ల మహిమ.. కొరియా భాషలో కనిపిస్తున్న బోర్డులు


ఏమిటీ... చైనా భాష! ఇంతకీ మనం ఎక్కడున్నాం? పొరపాటున బోర్డర్ దాటి చైనాలో గానీ అడుగుపెట్టలేదు కదా!... అని ఆశ్చర్యపోకండి! ముందుగా చెప్పొచ్చేదేమిటంటే... ఇది కొరియా భాష! ఇది... అచ్చంగా ఆంధ్ర ప్రదేశే. అందునా... అనంతపురం జిల్లా! అనంతపురంతోపాటు జిల్లాలోని పెనుకొండ, హిందూపురం తదితర ప్రాంతాల్లో ఇలా కొరియా భాషలో స్వాగతం పలికే బోర్డులు ఇప్పుడు అనేకం కనిపిస్తాయి.

ఇదంతా... 'కియ' కార్ల కంపెనీ మహిమ! ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మేలిమలుపైన 'కియ' రాకతో అనంతపురంలో సరికొత్త సందడి మొదలైంది. మరీ ముఖ్యంగా ఈ కార్ల ప్లాంటు ఏర్పాటవుతున్న పెనుకొండ ప్రాంతంలో కొరియా సంస్కృతి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కియ పరిశ్రమ ప్రాంగణంలో నాలుగు కంపెనీలు పనులు చేస్తున్నాయి. వాటిలో 50 మంది దాకా కొరియన్లు పని చేస్తున్నారు. హ్యుండయ్ కార్ల పరిశ్రమకు చెందిన మరో 50 మందికిపైగా ఉన్నతస్థాయి అధికారులు కూడా ఉన్నారు. పని చేసే చోటు నుంచి బెంగళూరు ఎయిర్ పోర్టుకు గంట వ్యవధిలో, తమ నివాసానికి 20 నిమిషాల్లో చేరుకునేందుకు వీరు ప్రాధాన్యమిస్తున్నారు.

కియ కోసం వచ్చిన కొరియన్లతోపాటు ఇక్కడ పనులు చేస్తున్న స్థానిక కాంట్రాక్టర్లు, ఇంజనీర్ల రాకతో ఇక్కడ ఇళ్లకోసం డిమాండ్ భారీగా పెరిగింది. కియ ప్లాంటుకు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుకొండ పట్టణంలో డబుల్ బెడ్‌రూం అద్దె నెలకు రూ.40 వేలకు చేరుకుంది. పెనుకొండతోపాటు... 44వ నెంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పట్టణాల్లో నివాసం ఉండడానికి కొరియన్ సిబ్బంది మొగ్గు చూపుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న కొన్ని అపార్ట్‌మెంట్లలోనూ, వ్యక్తిగత ఇళ్లముందూ కొరియా భాషలో ఫ్లెక్సీలు వెలిశాయి.

బోల్తాపడిన చిరు కాంట్రాక్టర్..

కియ పరిశ్రమకు సమీపంలో పేరేసంద్రం అనే గ్రామం ఉంది. అక్కడ ఒక చిన్నసైజు కాంట్రాక్టర్ కియ ఉద్యోగికి దగ్గరయ్యాడు. తమ కోసం 90 అద్దె గదులు ఏర్పాటు చేయాలంటూ ఆ ఉద్యోగి రూ.30 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాడు. 'మంచి చాన్స్' దొరికిందనుకుంటూ ఆ కాంట్రాక్టరు సుమారు రూ.4 కోట్లకుపైగా పెట్టుబడి పెట్టి అపార్ట్‌మెంట్ నిర్మించాడు. అందులోని ఓ ఇంటిలో కొరియా ఉద్యోగి చేరాడు. కానీ... అద్దె ఎక్కువగా ఉందంటూ తాను ఖాళీ చేయడమే కాకుండా, తాను అడిగిన 90 గదులూ వద్దని స్పష్టం చేశాడు. దీంతో ఆ చిరు కాంట్రాక్టర్ బోరుమంటున్నాడు.



కియ కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన బోర్డు



హిందూపురంలో కియ ఉద్యోగుల కోసం సిద్ధమవుతున్న ఫ్లాట్లు

స్పానిష్ టు కొరియన్

స్పెయిన్‌కు చెందిన మ్యాంచూ ఫెర్రర్ అనంతపురం కేంద్రంగా 'ఆర్డీటీ' స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్నారు. సంస్థ అవసరాల రీత్యా చాలామందికి స్పానిష్ నేర్పిస్తున్నారు. ఆర్డీటీ సంస్థలోనే స్పెయిన్ భాష నేర్పే ప్రొఫెషనల్ స్కూల్ ఉంది. దీనికి ఎస్కే యూనివర్సిటీ గుర్తింపునిచ్చింది. దీని ద్వారా ఇప్పటివరకూ నాలుగువేల మంది స్పెయిన్ భాష నేర్చుకున్నట్టు తెలుస్తోంది. భవిష్యత్తులో కియ ప్రభావంతో కొరియన్ భాష నేర్పించే సంస్థలూ ఆవిర్భవించే అవకాశముందని స్థానిక విద్యావేత్తలు చెబుతున్నారు.

కమీషన్లతో కళకళ

పెనుకొండ, అనంతపురం ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం అద్దె మహా అంటే రూ. 6 వేల నుంచి రూ. 10 వేల వరకూ ఉంటుంది. అదే ధరతో హైవేకు ఆనుకుని ఉన్న ఇండిపెండెంట్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లపై మధ్యవర్తులు దృష్టి సారించారు. వారి నుంచి ఇళ్లు అద్దెకు తీసుకుని మూడు నుంచి ఐదేళ్ల కాల పరిమితితో అగ్రిమెంటు రాసుకుంటున్నారు. అదే ఇళ్లను కొరియన్లకు రూ.30వేల నుంచి 40 వేలతో అద్దెకు ఇస్తున్నారు. కొరియన్లతో మాట్లాడేందుకు తమకు భాష రాకపోవడంతో... ఇందుకు అనువాదకుల సేవకులు ఉపయోగించుకుంటున్నారు. కొందరు బెంగళూరు నుంచి కూడా వచ్చి మరీ 'అనువాద' పనులు చేస్తున్నారు. కొరియన్లకు అద్దె ఇంటిని కుదిర్చితే... మధ్యవర్తులే వీరికి రూ.20వేల దాకా కమీషన్ చెల్లిస్తున్నారు.



నేటి నుంచే పక్షుల పండుగ

- **సూళ్లూరుపేటలో మూడు రోజులు నిర్వహణ**
- **3 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

సూళ్లూరుపేట, జనవరి 6: పక్షుల పేరుతో దేశంలో జరిగే ఏకైక పండుగ 'ఫ్లెమింగో ఫెస్టివల్'. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట కేంద్రంగా ఆదివారం ఈ పండుగ ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు జరగనున్న ఈ పండుగ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసింది. ఆదివారం ఉదయం 9 గంటలకు సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో మంత్రులు అఖిలప్రియ, అమర్‌నాథ్‌రెడ్డి, నారాయణ, చంద్రమోహన్‌రెడ్డి ఈ పండుగను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ప్రభుత్వశాఖల ప్రదర్శనశాలలు, భారీ వేదిక ఏర్పాటుచేశారు. అలాగే దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, షార్ రోడ్డులోని పులికాట్ తీరాన ఉన్న అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రం, తడ మండలం భీములవారిపాళెం వద్ద పడవలరేవులో పండుగను నిర్వహిస్తున్నారు. పులికాట్‌లో సందర్శకులు పడవలో విహరించేందుకు ఏర్పాట్లుచేశారు. కాగా, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల కేంద్రంలో విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి.



2 నెలలు.. 18 వేల దొడ్లు

చెంబును చంపిన చిత్తూరు పోలీసులు

- **ఎస్పీచొరవతో 65 పంచాయతీల దత్తత**
- **100గంటల్లో 100దొడ్లు..పేరిట పిలుపు**
- **సామాజిక సేవకు వినూత్న నిర్వచనం**

చిత్తూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కొంతమంది పోలీసులు ఆ ఇంటికి వెళ్లారు. ఇంట్లో వారిని పలకరించారు. కొద్దిసేపటి తరువాత ఏదో విషయం వారి వద్ద పోలీసులు ప్రస్తావించారు. దానికి ఆ ఇంటివారు అయిష్టంగా తల అడ్డంగా ఊపారు. పోలీసులు ఏదో చెప్పబోవడం, 'లేదు.. లేదు..' అన్నట్టు వారు చేతులు ఊపడం కనిపించింది. ఇలా చాలాసేపు సాగిన తరువాత, పోలీసులు బయటకొచ్చారు. మరునాడు, ఆ పైనాడు కూడా అదే ఇంటికి పోలీసులు వెళ్లారు. అదే సీన్ చివరిదాకా కొనసాగి..ఎట్టకేలకు పోలీసులు సంతృప్తితో బయటకొచ్చారు. వ్యక్తిగత మరుగుదొడ్డి కట్టించుకోవాలని ఆ ఇంటి వారిని ఒప్పించగలగడమే ఆ పోలీసుల ముఖాల్లోని ఆనందానికి కారణం. ఇలా ఒకరినో, ఇద్దరినో కాదు.. వేల మంది గ్రామస్థులను, ఆడపడుచులను చిత్తూరు జిల్లా పోలీసులు ఒప్పించారు. ఆ జిల్లాలో 'స్వచ్ఛ నవ్యాంధ్ర' పిలుపును ముందుండి విజయవంతం చేశారు. కలెక్టర్ ప్రద్యుమ్న ప్రోత్సాహం, ఎస్పీ రాజశేఖరబాబు చొరవతో గత అక్టోబరు 17న ప్రారంభం అయిన ఈ కార్యక్రమం 58 పోలీసు స్టేషన్ల పరిధిలోని 65 పంచాయతీల్లో సాగింది. గత డిసెంబరు చివరి నాటికి 17,884 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది.

చిత్తూరు జిల్లాలో 1,363 గ్రామ పంచాయతీలు, ఆరు లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 5.08 లక్షల కుటుంబాలకు రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం 'స్వచ్ఛ నవ్యాంధ్ర' ప్రారంభించేదాకా మరుగుదొడ్డి వసతి లేదు. 'మహిళల ఆత్మగౌరవం నిలుపుదాం' అనే నినాదం ఈ జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ నుంచే బలంగా వినిపించడం మొదలయింది. అప్పుడు కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న పీఎస్ ప్రద్యుమ్న.. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. తమ జిల్లాకు 3.06 లక్షల మరుగుదొడ్లను మంజూరు చేయించుకొన్నారు. జిల్లా యంత్రాంగాన్ని గ్రామాల బాట పట్టించి, మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. అన్ని విభాగాలకూ లక్ష్యాలు నిర్దేశించారు. ఈ క్రమంలో జిల్లా పోలీసులు స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారు. ఎస్పీ రాజశేఖర బాబు 65 పంచాయతీలను దత్తత తీసుకున్నారు. ఆ పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ బాధ్యతను జిల్లా పోలీసులు తీసుకొన్నారు. ఒకవైపు మరుగుదొడ్ల అవసరాన్ని గ్రామస్థులకు, మహిళలకు చెప్పి వారి సహకారం తీసుకోవడం, మరోవైపు వేగంగా మరుగుదొడ్లను పూర్తిచేయించడంఅనే రెండు అంచెల్లో దూసుకెళ్లారు.



గోవిందపల్లెలో పోలీసుల ఆధ్వర్యంలో కట్టిన మరుగుదొడ్డి

ఆమె ఒక్కరే..

పలమనేరు డీఎస్పీ చౌడేశ్వరి తన సబ్ డివిజన్ పరిధిలో చురుగ్గా పనిచేశారు. కింది స్థాయి సిబ్బందితో కలసి లక్ష్యంలో 70 శాతం ఫలితాలను ఆమె ఒక్కరే సాధించారు. 'వంద గంటల్లో వంద మరుగుదొడ్లు' అనే కార్యక్రమం కుప్పం సర్కిల్ పరిధిలో మంచి ఫలితం ఇచ్చింది. ఎస్పీ రాజశేఖర బాబు ఆ పనులను ప్రారంభించగా, వంద కాదు ఏకంగా ఐదు వందల మరుగుదొడ్లు సిద్ధమయ్యాయి. ఒక్క పలమనేరు స్టేషన్ పరిధిలోనే 871 మరుగుదొడ్లు నిర్మించారు. "ఎస్పీ ఆదేశాలను మా సబ్‌డివిజన్‌లో వందశాతం అమలుచేశాం. ప్రజలను కలుసుకొనే క్రమంలో మరుగుదొడ్ల నిర్మాణం అవసరాన్ని అర్థం చేసుకొన్నాం. దానినొక సామాజిక బాధ్యతగా చేపట్టాం. పనులు పూర్తయ్యేవరకు పల్లెల్లోనే మకాం వేశాం. మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి, ఒకటికి పదిసార్లు ఆ ఇంటివాళ్లతో మాట్లాడి ఒప్పించాం" అని చౌడేశ్వరి తెలిపారు.

వందశాతం ఓడీఎఫ్ గ్రామం

పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీలో 213 మరుగుదొడ్లను జిల్లా యంత్రాంగం మంజూరు చేసింది. ఆ పంచాయతీ పరిధిలో బిల్లేరు ఓ చిన్న కుగ్రామం. 45 కుటుంబాలున్న ఆ పల్లెలో ఏ ఇంటికీ ఇటీవలిదాకా మరుగుదొడ్డి లేదు. ఈ పంచాయతీని పుంగనూరు సీఐ రవీంద్ర, ఎస్ఐ శ్రీనివాసులు దత్తత తీసుకొన్నారు. వారం రోజుల పాటు బిల్లేరులో మకాం వేసి, గ్రామస్తులను ఒప్పించారు. బిల్లేరులో ఇపుడు ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి కనిపిస్తోంది.

మహిళలపై దాడులు తగ్గాలనే..

"గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన వంటి అనాగరిక అలవాట్లు ఇంకా కొనసాగడం బాధాకరం. దీనివల్ల అనేక సందర్భాల్లో మహిళలు వేధింపులకు, అత్యాచారాలకు గురవుతున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో అలాంటి నేరాలు తగ్గుతాయని భావించాం. కలెక్టర్ ప్రద్యుమ్న మాకిచ్చిన ప్రోత్సాహంతో స్వచ్ఛ నవ్యాంధ్ర కార్యక్రమంలో మా పోలీసులు చురుగ్గా పాలుపంచుకొన్నారు. మహిళలను కలుసుకొనే క్రమంలో వారికి మరుగుదొడ్డి అవసరంతోపాటు, వారి రక్షణకు ఉద్దేశించిన చట్టాల గురించి కూడా వివరించి, చైతన్య పరిచేందుకు ప్రయత్నించాం"

- చిత్తూరు జిల్లా ఎస్పీ రాజశేఖరబాబు



కేజీహెచ్‌లో 20 కిలోల కణితి తొలగింపు

విశాఖపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విశాఖ కేజీహెచ్ ప్రసూతి, స్త్రీల విభాగంలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. నగరంలోని సీతంపేటకు చెందిన 65 ఏళ్ల మహిళ ఏడేళ్లుగా అండాశయంలో కణితుల సమస్యతో బాధపడుతోంది. ఆమెకు గుండె సంబంధిత సమస్యలు కూడా ఉండడంతో కణితులను తొలగించినప్పుడు ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదముందని శస్త్ర చికిత్స వాయిదా వేస్తూవస్తున్నారు. కణితుల సమస్య తీవ్రమై కడుపు ఉబ్బిపోవడంతో అత్యంత ఇబ్బందికర పరిస్థితుల్లో కేజీహెచ్‌లో చేరింది. దీంతో శనివారం నలుగురు వైద్యుల బృందం శస్త్ర చికిత్స నిర్వహించి 20 కిలోల బరువైన నీటి బుడగలతో కూడిన అండాశయ కణితులను తొలగించింది.

చలి చంపేస్తోంది!

- **ఇన్ని రోజులు చలి ఉండటం.. గత 30ఏళ్లలో ఇదే తొలిసారి**

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలను చలి వణికిస్తోంది. సాయంత్రం నుంచే మొదలవుతున్న చలి... అర్ధరాత్రి దాటిన తరువాత మరింత తీవ్రరూపం దాల్చుతోంది. గత మూడు రోజులుగా ఈ తీవ్రత మరింత పెరిగింది. ఉత్తరాది నుంచి పొడిగాలులు మధ్యభారతం మీదుగా తెలుగు రాష్ట్రాలపైకి వీస్తున్నాయి. వీటి ప్రభావంతో తెలంగాణలో అన్ని ప్రాంతాలు, కోస్తాలో పలుచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వెస్ట్రన్ డిస్ట్రబెన్సెస్ ప్రభావం తక్కువగా ఉండటం ఈ ఏడాది చలి తీవ్రత పెరగడానికి ఒక కారణమని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అలాగే ఈశాన్య రుతుపవనాలు పూర్తిగా విఫలం కావడంతో ఉత్తరాది నుంచి పొడిగాలుల తీవ్రత పెరిగింది. ఇది కొనసాగినంత కాలం తెలుగు రాష్ట్రాల్లో చలి ప్రభావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కాగా, గడచిన నెల రోజుల నుంచి చలి తీవ్రతకు ఉత్తరాది గాలులే కారణమని వాతావరణ నిపుణుడు ఆర్.మురళీకృష్ణ తెలిపారు. సంక్రాంతి వరకు ఈ తీవ్రత ఉంటుందన్నారు. అయితే ఇన్ని రోజుల పాటు చలి తీవ్రంగా కొనసాగడం గత 30ఏళ్లలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

రేపు బీసీ విద్యుత్ ఉద్యోగుల మహాసభ

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని సవరించి పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న విజయవాడలో 10 వేల మందితో బీసీ విద్యుత్ ఉద్యోగుల 12వ మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల ఉద్యోగుల ఐక్యవేదిక ఏర్పాటు

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వ గురుకుల సొసైటీలైన ఏపీఆర్ఈఐఎస్, ఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీటిడబ్ల్యూఆర్ఈఐఎస్‌లలోని 10 ఉద్యోగ సంఘాలు కలిసి 'ప్రభుత్వ గురుకుల ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక(గ్రిఫ్)'గా ఆవిర్భవించాయి. శనివారం గుంటూరులోని అసోసియేషన్ హాలులో ఆ సంఘాలన్నీ సమావేశమయ్యాయి. గ్రిఫ్ చైర్మన్‌గా బి.మధుసూదనరావు(ఏపీఆర్ఈఐఎస్), కోచైర్మన్లుగా డాక్టర్ లక్ష్మణరావు(ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), డాక్టర్ లక్ష్మీనారాయణ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), డిప్యూటీ సెక్రెటరీ జనరల్‌గా దాసరి ప్రభాకర్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) లను ఎన్నుకున్నారు.

9 నుంచి సీపీఎస్‌పై ఆందోళనలు: అశోక్‌బాబు

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు పి.అశోక్‌బాబు చెప్పారు. శనివారం ఏపీ ఎన్జీవో రాష్ట్ర కార్యాలయలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న అన్ని మండల కార్యాలయాల వద్ద, 10న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసన తెలపాలని నిర్ణయించామన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఏపీ ఎన్జీవో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో 1.70 లక్షల మంది ఉద్యోగులు సీపీఎస్ విధానంతో నష్టపోతున్నారన్నారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగుల నుంచి వసూలు చేస్తున్న వాటాలో 40 శాతం కార్పొరేట్ డెబిట్ సెక్యూరిటీస్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల ఆ డబ్బుకు భద్రత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రూ.98 వేల కోట్ల పెన్షన్ నిధుల పట్ల ఉద్యోగుల్లో అయోమయం ఉందన్నారు. జూలై 2018 నుంచి అమల్లోకి రావాల్సిన 11వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 10వ పీఆర్సీకి సంబంధించిన 10 నెలల బకాయిలను వీలైనంత త్వరగా ఉద్యోగులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బకాయిలున్న రెండు విడతల డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో జేఏసీ నేతలు పి.బాబు రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.సాంబశివంరావు, ఏవీ సాగర్, జి.రామకృష్ణారెడ్డి, సి.సుబ్బారెడ్డి, వై.ప్రసాద్, సీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య 9
కుటుంబ కదంబం
ఆదివారం • 7 జనవరి 2018

సండే సెలబ్రిటీ

కె.ఎస్. రవికుమార్...
తమిళనాట పేరున్న అగ్ర దర్శకుడు.
రజనీకాంత్, కమలహాసన్,
శరత్ కుమార్...
అందరూ కావాలనుకొనే
కమర్షియల్ డైరెక్టర్.
రజనీ... ముత్తు, నరసింహ, లింగ...
కమల్... దశావతారం,
పంచతంత్రం, మన్మథబాణం...
అప్పట్లో... చిరంజీవి స్నేహం కోసం,
నాగార్జున బావ నచ్చాడు,
ఇప్పుడు బాలకృష్ణ... జై సింహా...
అన్నీ... కామెడీ, యాక్షన్,
సెంటిమెంట్ల కలబోతే!
అందుకే... రవికుమార్ మనోడే!
అచ్చం మనింటివాడే!
చాన్నాళ్ళకు తెలుగింటికొచ్చిన
కె.ఎస్.తో కాసేపు...



ఆ కష్టం నాకు ఇష్టం

❖ చాన్నాళ్ల తర్వాత తెలుగు ప్రాజెక్ట్ చేశారు..

అవునండీ. బాలయ్యబాబుతో ఓ సినిమా చేద్దామని సి.కల్యాణ్‌గారు నన్ను అప్రోచ్ అయ్యారు. ఆయనతో చేయాలని నాక్కూడా ఎప్పటి నుంచో ఉంది. అజిత్‌తో తమిళంలో నేను తెరకెక్కించిన 'వరలారు' సినిమా బాలయ్యకు బాగా సూటవుతుందనిపించింది. అందుకే ఎనిమిదేళ్ల క్రితమే బాలకృష్ణగారిని మీటయ్యాను. కానీ ఆ ప్రాజెక్ట్ మెటీరియలైజ్ కాలేదు. ఆ తర్వాత బెల్లంకొండ సురేశ్‌గారు ఓ సినిమా చేద్దామంటే వచ్చి బాలయ్యను కలిశాను. అప్పుడు కూడా చేద్దామనే అనుకున్నాం కానీ కుదరలేదు. ముచ్చటగా మూడో సారి అన్నట్టు, ఈ సారి సెట్ అయింది.

❖ మీ కథ కాకుండా ఎం.రత్నం కథతో సినిమా చేయడానికి కారణాలు?

నా టీమ్‌తో బాలయ్య కోసం పలు కథలు సిద్ధం చేయించా. వాటిని వినడానికి ఎం.రత్నం కూడా వచ్చేవారు. విని 'నేను రేపు ఓ కథ చెప్తాను సార్' అని వెళ్లారు. అన్నట్టుగానే మరుసటి రోజు పది నిమిషాలు లైన్ చెప్పారు. అది వినగానే మాకు చాలా బాగా నచ్చింది. దాన్నే డెవలప్ చేసుకున్నాం. బాలకృష్ణగారికి వినిపించాం. ఆయనకు కూడా కథ నచ్చింది. సరేనని వెంటనే సెట్స్ మీదకు వెళ్లాం. ఇప్పుడు రిలీజ్‌కి కూడా వచ్చేశాం.

❖ 'జై సింహా' స్టోరీ లైన్ ఏంటండీ?

లైన్ చెప్పలేను. ఎందుకంటే లైన్‌లో చెప్తే కథ మొత్తం తెలిసిపోతుంది. ఇందులో లవ్, సెంటిమెంట్, ఫ్యామిలీ సెంటిమెంట్... ఇలా చాలా విషయాలుంటాయి. వాటితో పాటు యాక్షన్, ఎమోషన్ డ్రామా, కామెడీ.. ఇలా నా సినిమాల్లో ఎప్పుడూ ఉంటే అంశాలన్నిటినీ ఇందులోనూ చూడొచ్చు.

❖ బాలకృష్ణతో నయనతార మూడో సినిమా ఇది. క్రేజ్ కోసమే?

లేదండీ. ఇందులో ముగ్గురు హీరోయిన్లున్నారు. వాళ్ల ముగ్గురూ కథలో పక్కాగా ఫిట్ అయ్యారు. నయనతార ఇందులో మెయిన్ హీరోయిన్. హరిప్రియ ఫ్లాష్‌బ్యాక్‌లో వస్తుంది. నటాషా ఫారిన్‌లో చదువుకుని వచ్చే పాత్రలో కనిపిస్తుంది. కథ అనుకున్నప్పుడే క్రేజ్ ఉన్న నాయికల్నే తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. నేనే నయన్‌ని కలిసి, కథ చెప్పాను. వినగానే 'ఓకే చేస్తాను' అన్నారు. వాళ్లకు ఇది హ్యాట్రిక్ అవుతుందనే నమ్మకం ఉంది.

❖ నెంబర్ గేమ్స్‌ని, వాటి తాలూకు టెన్షన్స్‌ని మీరు క్యారీ చేస్తారా?

నా పదో సినిమా 'నాట్టామై' నుంచి అందరూ పెద్ద ఆర్టిస్టులనే డైరెక్ట్ చేస్తున్నా. పది చిత్రాల వరకు చిన్న ఆర్టిస్ట్‌లతోనే సినిమాలు చేసేవాడిని. 'నాట్టామై' తర్వాత పెద్ద ఆర్టిస్టులు నన్ను అప్రోచ్ కాసాగారు. అందువల్ల స్టార్ చిత్రాల నెంబర్లని నేనెప్పుడూ పట్టించుకోలేదు. ఇప్పుడు బాలయ్య 102వ సినిమా అనే టెన్షన్ నాకు లేదు. సినిమా విడుదలయ్యాక వచ్చే కలెక్షన్స్‌ని బట్టి చిన్న, పెద్ద చిత్రాలుగా విభజిస్తాం. అంతేగానీ సినిమా కోసం చేసే పనుల్లో ఆ తేడా ఉండదు. ఎంత బడ్జెట్‌తో తీసినా సినిమాకు పడాల్సిన కష్టం ఒకటే. ఆ కష్టాన్ని నేను ఇష్టంగా పడుతుంటాను.

❖ కొత్తవాళ్లతో , స్టార్ హీరోలతో పనిచేయడానికీ మధ్య తేడా?

చాలా డిఫరెన్స్ ఉంటుంది. చిన్న ఆర్టిస్టులని నేను కంట్రోల్ చేస్తాను. వాళ్ల నుంచి పెర్ఫార్మెన్స్ తీసుకుంటాను. అదే ఇమేజ్ ఉన్న ఆర్టిస్టులైతే వాళ్ల అంతకు ముందే మౌల్డ్ అయి ఉంటారు. మామూలుగా అయితే ఇది బెనిఫిట్. కానీ నా విషయానికి వస్తే... ఆర్టిస్ట్ చిన్నయినా, పెద్దయినా, ఆడయినా, మగయినా.. ప్రతి షాట్‌నీ నేను నటించి చూపిస్తాను. 'ఇదిగోండి నా బాడీ లాంగ్వేజ్ ఇది. దీన్నే మీ బాడీ లాంగ్వేజ్‌కి తగ్గట్టు మీరు మార్చుకుని యాక్ట్ చేసి చూపించండి' అని చెప్పి చేయించుకుంటా. ఈ సినిమాలోనూ మీరు గమనిస్తే బాలకృష్ణ డిఫరెంట్‌గా కనిపిస్తారు. నేను ఆయన గత సినిమాలన్నీ చూశాను. వాటన్నిటికన్నా డిఫరెంట్‌గా చేయాలనే ఇలా చేశాను.

❖ మీ సొంతూరు తిరుత్తణి కావడం వల్లే మీకు తెలుగు బాగా వచ్చిందా?

మా నాన్నగారిది చెన్నై. మా అమ్మగారిది తిరుత్తణి పక్కన వంగనూరు అనే గ్రామం. అది ఆంధ్రా-తమిళనాడు బోర్డర్. మా అమ్మవైపు అందరూ తెలుగు మాట్లాడుతుండేవారు. నేను పుట్టి పెరిగిందంతా చెన్నై. కానీ, సహాయ దర్శకుడిగా తెలుగు దర్శకుల వద్ద చేశా. అప్పుడు కూడా తెలుగు చదవడం, రాయడం రాలేదు. అందువల్ల మళ్లీ చెన్నై వెళ్లిపోయా. దర్శకుడైన తర్వాత చిరంజీవితో 'స్నేహం కోసం', నాగార్జునతో 'బావ నచ్చాడు' చేశా.

❖ 'స్నేహం కోసం' తెలుగులో తొలి సినిమా. అప్పట్లో లాంగ్వేజ్ ప్రాబ్లమ్స్?

లేదండీ! సహాయ దర్శకుడిగా ఉన్నపుడు కొంచెం కొంచెం తెలుగు నేర్చుకున్నా. నిర్మాత శానం నాగ అశోక్‌కుమార్ నా స్కూల్‌మేట్, చాలా మంచి ఫ్రెండ్. ఆయన తన ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్నప్పుడు విని కొంత తెలుగు నేర్చుకున్నా. అలా అలా వచ్చింది. మీలాగా మాట్లాడకపోవచ్చు కానీ, ఆర్టిస్టులు డైలాగులు తప్పుగా చెబుతున్నారా? లేదా? అనేది తెలుసుకోగలను.

❖ తెలుగులో వరుసగా సినిమాలు చేయరా? ఎందుకు గ్యాప్?

నాకు సినిమా అవకాశం ఇవ్వమని నేనెప్పుడూ ఎవరినీ అప్రోచ్ కాలేదు. ఎవరైనా నన్ను అప్రోచ్ అయితే వాళ్లని గౌరవించి సినిమా చేస్తా. ఇన్ని సినిమాలు చేశాక అవకాశాల కోసం వెళ్లి అడగాల్సిన అవసరం లేదు. ఏదో ఒకటి చేస్తాను. ఏమీ లేకపోయినా ఖాళీగా ఉంటా. అదీ కాకుంటే నటించడానికి బోలెడన్ని అవకాశాలు వస్తున్నాయి. నటిస్తాను.

❖ నటించమని మిమ్మల్ని తెలుగులో ఎవరూ అప్రోచ్ కాలేదా?

లేదండీ.

❖ 'పురుష లక్షణం' వంటి మహిళా ప్రధాన చిత్రాలు.. ఎదురు చూడొచ్చా?

తప్పకుండా. ఖుష్బూకి ఆ సినిమాకు ముందు అప్పుడు దాదాపు 12-13 ఫ్లాప్‌లున్నాయి. 'పురుష లక్షణం'తో ఆమెకు హిట్ వచ్చింది. అప్పుడు జయరామ్ కూడా పెద్ద హీరో ఏమీ కాదు. ఆ సినిమా వాళ్లని స్టార్స్‌ని చేసింది.

❖ స్టార్స్‌తో చేస్తూ, మధ్యలో చిన్న వాళ్లతో చేయడం సాహసమేనా?

ఇప్పుడు నేను మళ్లీ చిన్న సినిమాలు చేస్తే ఏమవుతుందంటే... నా దగ్గరున్న యూనిట్ మొత్తానికి నేను ప్రమోషన్ ఇచ్చేశాను. ఒకప్పటిలాగా వేలల్లో కాకుండా లక్షల్లో డబ్బులిస్తున్నా. ఇప్పుడు నేను చిన్న సినిమా చేస్తే, మరలా వాళ్లకు మళ్లీ వేలు ఇవ్వాలి. అలా నేను ఇవ్వలేను. వాళ్ల అసిస్టెంట్స్‌తో తీయాలి. ఒకవైపు నా కోసం పెద్ద హీరోలు వెయిట్ చేస్తున్నప్పుడు ఇలాంటి ప్రయోగాలు అవసరమా? అనిపిస్తుంది. అందుకే కంఫర్టబుల్‌గా కొనసాగుతున్నా.

● డా. చల్లా భాగ్యలక్ష్మి

బాలయ్యకు తండ్రే ప్రపంచం!

ఆయన చాలా కో ఆపరేటివ్. ఒక ఇమేజ్ ఉన్న ఆర్టిస్ట్ అనగానే కాస్త గొప్పలు పోతుండటం సహజం. దర్శకుడికీ, హీరోకీ మధ్య ఇగో క్లాషెస్ వస్తాయనీ అంటారు. కానీ నాకు ఏ హీరోతోనూ అలాంటివి రాలేదు. ఎందుకంటే నేను ముందు వాళ్లని స్టడీ చేస్తా. రజనీకాంత్ అయినా, కమల్‌హాసన్ అయినా ఎవరైనా నేను స్టడీ చేస్తా. చిరంజీవి అయినా అంతే. దాన్ని బట్టే కేరక్టర్ చేస్తా. బాలయ్య చాలా ఓపెన్ మైండెడ్. ఏ షాట్‌లోనూ 'ఇవి ఎందుకు తీస్తున్నారు' అని అడగలేదు. ఎన్ని టేక్‌లు అడిగినా, వన్ మోర్ అని అడిగినా, ఛేంజస్ చెప్పినా ముఖం తిప్పుకునేవారు కాదు. ముఖం చిట్లించడం ఆయనకు అసలు తెలియదు.' బాలయ్యకు కోపం ఎక్కువ' అని చాలా మంది అంటారు. కానీ నా జర్నీలో ఆయన



'జై సింహా' సెట్స్‌లో...

ఒక్కసారి కూడా కోప్పడలేదు. ఒక సెకను కూడా మూడ్ అవుట్ అయి నేను చూడలేదు. అంత బాగా ఉండేవారు. ఆయన ఓపెన్ మైండెడ్. ఓపెన్ హార్టెడ్. అసలు భయం ఉండదు. ఓపెన్‌గా ఉన్నవాళ్లకి ఎప్పుడూ భయం ఉండదు. అలాంటి భయం లేని తత్వాన్ని నేను ఆయనలో చూశాను. ఆయన మాట్లాడేటప్పుడు మాటల్లోనే కాదు, బాడీ లాంగ్వేజ్‌లోనూ ఎనర్జీ ఉంటుంది. మనం చాలా మామూలు విషయం మాట్లాడుతున్నప్పటికీ ఆయన చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు. అందువల్ల ఆయన పక్కనున్న వాళ్లందరికకీ ఎనర్జీ జనరేట్ అవుతుంది. ఆయన సెట్‌లో ఉన్నప్పుడు నాతోనూ, కో ఆర్టిస్టులతోనూ, ఫ్రెండ్స్‌తోనూ ఎప్పుడూ ఎన్టీఆర్ గురించి చెప్పేవారు. ఎన్టీఆర్ సినిమాలే చూసేవారు. ఆయన పాటలన్నీ వినేవారు. తండ్రి మీద అంత ప్రేమ ఉన్న కొడుకుని నేను తొలిసారి చూశాను. తినేటప్పుడు, షూటింగ్ టైమ్‌లోనూ... ఎక్కడైనా సరే వాళ్ల నాన్నగారు చెప్పిన డైలాగులను కో-ఆర్టిస్టులకు చెప్పి చూపిస్తారు. ఎన్టీఆర్ అంటే ఆయనకు ప్రాణం.

చిరుసార్ అలా ఫీలవ్వరు!

చిరంజీవి, రజనీకాంత్, కమల్ హాసన్... ఎవరైనా ప్లస్ పాయింట్స్ మెండుగా ఉండటం వల్లనే అంత పెద్ద హీరోలయ్యారు. చిరంజీవి గారు మెగాస్టార్ అనే విషయాన్ని బయటి వాళ్లు మాట్లాడాల్సిందే. ఆయనతో కలిసి మనం మాట్లాడుతున్నప్పుడు తనని తాను 'ఆర్డినరీ స్టార్' అనే చెప్పుకుంటారు. ఏ రోజూ గొప్పలు చెప్పుకోరు. అనవసరంగా మాట్లాడరు. అలాగని ఏమీ మాట్లాడకుండా ఓ పక్కన కూర్చోరు. చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. చాలా బాగా డాన్స్‌లు, ఫైట్లు చేసేవారు. ఆయన




'స్నేహంకోసం' డబ్బింగ్‌లో చిరుతో

సినిమాలన్నీ చూశాను. వాటిని దృష్టిలో పెట్టుకుని డైలాగులు రాశాను. చిరంజీవి ముఖ కవళికల్లో ఎమోషన్ చాలా బాగా పలుకుతుంది. ఆయన ఏం చెప్పినా అవతలి వారిని కన్విన్స్ చేసేలాగా చెప్తారు. ఫైట్లు కూడా ఎమోషనల్‌గా ఉంటాయి. ఎక్కడా ఆర్టిఫిషియల్‌గా అనిపించదు. ఎదుటివారిని నిజంగా కొడుతున్నట్టే కొడతారు. ఆయనలో కామిక్ టచ్ కూడా చాలా ఉంటుంది. ఇటీవల 'ఖైదీ నంబర్ 150' చూసి ఆశ్చర్యపోయాను. 'స్నేహం కోసం' చేసేటప్పుడు ఎలాంటి బాడీ లాంగ్వేజ్ ఉందో, బాడీలో ఎలాంటి మూవ్‌మెంట్స్ ఉన్నాయో, డ్యాన్సలు, ఫైట్లు ఉన్నాయో... ఇప్పుడు కూడా అన్నీ అలానే ఉన్నాయి. 20 ఏళ్ల క్రితం చేసినట్టే ఇప్పుడు చేయడం చాలా గ్రేట్. చిరు సార్ స్పెషాలిటీ అదే.

యూత్‌ఫుల్ నాగ్

నాగ్ సర్‌ని కలిసి చాన్నాళ్లయింది. ఆయన పేరు చెప్పగానే నాకు 'శివ' చిత్రంలో సైకిల్ చెయిన్ లాగడమే గుర్తుకొస్తుంది. అంత ఎనర్జీగా, అంత రియల్‌గా ఉంటుంది ఆ పిక్చర్. ఆయన అప్పుడే కాదు.. ఎప్పుడూ యూత్. యూత్‌ని ఆకట్టుకునే విషయాలు ఆయనలో చాలా ఎక్కువ. బాడీలాంగ్వేజ్, మాటలూ, నవ్వు అన్నీ యూత్‌ఫుల్‌గా ఉంటాయి. 'బావ నచ్చాడు' సమయానికి, ఇప్పటికీ ఆయన కిలో కూడా పెరిగినట్టు లేరు. రోజురోజుకీ ఇంకా యంగ్‌గా కనిపిస్తున్నారు.



'బావ నచ్చాడు' చిత్రంలో రీమాసేన్, నాగార్జున, సిమ్రాన్

ఒకరు క్లాస్... ఇంకొకరు మ..మ.. మాస్

కమల్ సర్ క్లాస్. రజనీకాంత్ సర్ మాస్. నేను వాళ్లిద్దరితో వెంట వెంటనే సినిమాలు చేశాను. సెట్లో కమల్ సార్‌కి ఒక సీన్ చెప్పానుకోండి. ఆయన వెంటనే "ఇవన్నీ మీరు ఆ స్కూల్‌లో చెప్పాలి. ఇక్కడ మనకు అంత మాస్ పనికిరాదండీ' అనేవారు. రజనీ సార్ సెట్లో ఓ సీన్ చెప్తే.. "అయ్యో ఇవన్నీ మనకు చేతకావండీ. ఇంత గొప్పగా చేయడం ఆయనకే చెల్లుతుంది" అంటారు. కమల్ సార్‌కి షార్ట్‌డైలాగులు చెప్పగానే "రజనీసార్ సినిమా కంప్లీట్ చేసొచ్చారు కదా! అందుకే ఆ హ్యాంగ్ ఓవర్ నుంచి బయటకు రాలేకపోతున్నారు.



'లింగ' సెట్స్‌లో రజనీకాంత్‌తో...



'దశావతారం' విడుదల సందర్భంగా దాసరి, కమల్‌తో...

ఆయనలాగానే మాట్లాడుతున్నారు" అని అనేవారు. వారిద్దరికీ ఒకరంటే ఒకరికి ఉన్న గౌరవం అలాంటిది. వాళ్లిద్దరినీ చూసి నాకు వాళ్ల మీద ఉన్న గౌరవం రెట్టింపు అయింది. కమల్‌హాసన్‌తో 'దశావతారం' చేయడం లైఫ్‌టైం ఎక్స్‌పీరియెన్స్. అబ్బబ్బో... ఆ సినిమాని ఇంకోసారి చేయమని నన్నే అడిగినా నేను చేయను. ఆ ఒక్క సినిమా చేయడానికి నేను చేసిన హార్డ్‌వర్క్ అంతా ఇంతా కాదు. ఒక్కో గెటప్‌ని తీర్చిదిద్దేటప్పుడు ఒక్కో సినిమా చేసినట్టు అనిపించింది. కమల్ సార్ నటించిన చిత్రాల్లో నాకు 'నాయగన్' చాలా ఇష్టం. రజనీ సార్ చిత్రాల్లో 'పడయప్పా' చాలా ఇష్టం.

రజనీ- కమల్.. ఓ రాజకీయం!

వాళ్లిద్దరూ రాజకీయాల్లోకి రావడం చాలా సంతోషం. సినిమావాళ్లు పాలిటిక్స్‌లోకి రావడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే వాళ్లు మా ఫ్యామిలీ వాళ్లు కదా! ముఖ్యంగా రజనీకాంత్, కమల్‌హాసన్.. ఇద్దరికీ పబ్లిక్ కి మంచి చేయాలనే ఆకాంక్ష తప్పకుండా ఉంది. అందువల్ల వారు రావటం నాకు హ్యాపీ. ఎవరు గద్దె ఎక్కినా మంచిది.



మోచేతులు మెరవాలంటే...

మోచేతులు, మోకాళ్ల దగ్గర చాలామందికి చర్మం నల్లగా ఉంటుంది. ఈ నలుపును కొన్ని వంటింటి చిట్కాలతో పోగొట్టవచ్చు. అవి..

నిమ్మకాయతో...

వాడిన నిమ్మకాయ చెక్కల్లో అరచెంచా ఉప్పు, అర



చెంచా చక్కెర వేసి మోచేతులు, మోకాళ్ల దగ్గరున్న చర్మంపై బాగా రుద్ది తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. నిమ్మకాయలోని విటమిన్-సి, సిట్రిక్ యాసిడ్లు చర్మాన్ని మెరిసేట్టు చేస్తాయి. నిమ్మకాయ చెక్కలో చక్కెర, ఉప్పును వాడడం వల్ల శరీరంపై ఉన్న మృత చర్మం ఊడిపోతుంది.

బొప్పాయి పేస్టు...

బొప్పాయి పండులో చర్మాన్ని శుభ్రంచేసే పపైన్ అనే ఎంజైము, విటమిన్-ఎ, విటమిన్-సిలు ఉన్నాయి. బొప్పాయి ముక్కను తీసుకుని అందులో కాస్త పెరుగు వేసి పేస్టులా చేసి దాన్ని చర్మానికి రాసుకోవాలి. ఈ పేస్టును రోజూ రాసుకోవడం వల్ల మోచేతులపై ఉన్న నల్లదనం పోయి కాంతులీనుతుంది.

నూనెలు...

ఆలివ్ ఆయిల్‌లో యాంటాక్సిడెంట్లు బాగా ఉంటాయి. ఇవి నల్లగా ఉన్న చర్మాన్ని మెరిసేలా చేస్తాయి.

నవ్య ఆంధ్రజ్యోతి దృశ్యం
10 ఆదివారం • 7 జనవరి 2018 11



సూర్య వర్సెస్ విక్రమ్

...ఇది తమిళ పొంగల్

అగ్రహీరోల సినిమాలు విడుదలవుతున్నాయంటే అభిమానులకు పండగే. అదీ పండుగ రోజే విడుదలవుతుంటే..! థియేటర్ల దగ్గర అభిమానుల సందడి మామూలుగా ఉండదు. వారి ఆనందానికి అవధులు వెతకడం కష్టమే. తమిళ సినిమాకి సంబంధించినంత వరకు పొంగల్, దీపావళి సీజన్లు చాలా ప్రధానం. 1980, 90ల్లో దాదాపు డజను సినిమాలు పొంగల్‌కి థియేటర్లలో సందడి చేసేవి. కానీ, ఇప్పుడు వాటి సంఖ్య మూడు లేదా నాలుగుకే పరిమితమవుతోంది. గత దశాబ్దంగా కోలీవుడ్‌లో పొంగల్ సినిమాల సంఖ్య ఇదే. అయితే 2018 పొంగల్‌కి ఐదు సినిమాలు బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాయి. ఈ పొంగల్‌కి సెలవు రోజులు కూడా ఎక్కువ కావడంతో బాక్సాఫీస్ కళకళలాడడం ఖాయంగా కనిపిస్తోంది.

తమిళ అగ్రహీరోలకి అచ్చిరాని పొంగల్..!

టాలీవుడ్‌లో సంక్రాంతి హీరో అనగానే బాలకృష్ణ పేరు వినిపిస్తుంది. కానీ, కోలీవుడ్‌లో పొంగల్ హీరోలు ప్రత్యేకంగా ఎవరూ లేరనే చెప్పాలి. 2009 నుండి ఒక్క విజయ్ మాత్రమే నాలుగు సార్లు 'విల్లు' (2009), 'కావలన్' (2011), 'జిల్లా' (2014), 'భైరవ' (2017) చిత్రాలతో పొంగల్ బరిలో దిగాడు. వాటిలో 'కావలన్' ఒక్కటే హిట్టు. గత దశాబ్దంలో పొంగల్ పండుగకి రజనీ, కమల్ ఒక్కసారి కూడా తెరపైకి రాలేదు. అజిత్ 'వీరం'తో ఒక్కసారి సందడి చేశాడు. విక్రమ్ 2015లో 'ఐ'తో వచ్చినా ఫలితం దక్కలేదు. మిగతా సినిమాలన్నీ యువ హీరోలు నటించినవే. 2017 పొంగల్‌కి 'భైరవ', పార్తిబన్ దర్శకత్వం వహించిన 'కోడిట్ట ఇడంగళై నిరప్పుగ' రెండు చిత్రాలు విడుదలయ్యాయి. ఆ రెండూ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమయ్యాయి.

నిజానికి, 2018 పొంగల్ బరిలో దిగేందుకు ఎనిమిది సినిమాలు సిద్ధమవగా, థియేటర్ల సమస్యతో ముందుగానే మూడు వెనక్కి తగ్గాయి. సూర్య 'తానా సేర్న్‌ద కూట్టం', విక్రమ్ 'స్కెచ్', ప్రభుదేవా 'గులేబకావళి', విజయకాంత్ తనయుడి 'మదురవీరన్', యువనటుడు విమల్ 'మన్నర్ వగైరా' పొంగల్ రేసులో ఉన్నాయి. అరవింద్‌స్వామి 'భాస్కర్ ఒరు రాస్కెల్', జీవా 'కలగలప్పు2', విశాల్ 'ఇరుంబుతిరై' జనవరి చివరి వారానికి విడుదల వాయిదా వేసుకున్నాయి. ఇప్పటికి ఐదు సినిమాలు బరిలో ఉన్నా, పొంగల్ నాటికి ఏయే సినిమాలు బరిలోకి దిగుతాయన్నది సస్పెన్స్‌గానే ఉంది. ఇటీవలే సెన్సార్ అధికారులను కేంద్రం మార్చడంతో, నూతన అధికారులు బాధ్యత చేపట్టే ప్రక్రియలో పొంగల్ సినిమాల సెన్సార్‌లో జాప్యం జరిగింది. దీంతో చివరి నిమిషం వరకు నిర్మాతలకి టెన్షన్ తప్పలేదు. అయిదు సినిమాల్లో ఒకట్రెండు పొంగల్ బరి నుండి తప్పుకునే అవకాశమూ ఉంది. తమిళనాడులో సుమారు 1000 థియేటర్లు ఉండగా, రెండు భారీ సినిమాలు సహా అయిదు సినిమాలు విడుదల చేయడం ఇబ్బందికరమైన అంశమే. 2000 ముందు వరకు అగ్రహీరోల సినిమాలైనా అధిక సంఖ్యలో థియేటర్లలో విడుదలయ్యేవి కావు. ఇప్పుడు ఓపెనింగ్స్ కోసం అత్యధిక థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఫలితంగా చిన్న సినిమాలకు థియేటర్లు లభించడం లేదు.

ఆ రెండింటి మధ్య ప్రధాన పోటీ...

2018 పొంగల్‌కి ఆరు సినిమాలు బరిలో ఉన్నా... ప్రధాన పోటీ మాత్రం సూర్య 'తానా సేర్న్‌ద కూట్టం', విక్రమ్ 'స్కెచ్'ల మధ్యే. రెండు చిత్రాలనీ యువ దర్శకులే తెరకెక్కించారు. రెండు సినిమాల అనుభవం కలిగిన విఘ్నేశ్ శివన్‌పై సూర్య నమ్మకం ఉంచితే, ఒకే ఒక్క సినిమాతో విక్రమ్‌ని డైరెక్ట్ చేసే ఛాన్స్ కొట్టేశాడు 'వాలు' ఫేమ్ విజయ చందర్. రెండూ మాస్ ఎంటర్‌టైనర్‌లే.



రెండేళ్లుగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్యకి ఈ పొంగల్ చాలా ప్రధానం. 'తానా సేర్న్‌ద కూట్టం'తో పెద్ద గ్యాంగ్‌ని వెంటేసుకుని పొంగల్‌కి ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంపై సూర్య భారీ ఆశలే పెట్టుకున్నారు. జనవరి 12న తమిళం, తెలుగు (గ్యాంగ్) భాషల్లో ఒకేరోజు విడుదల కానుంది. అక్షయ్ కుమార్ నటించిన హిందీ చిత్రం 'స్పెషల్ ఛబ్బీస్' ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకి జోడీ కీర్తి సురేష్.



విక్రమ్ కల నెరవేరేనా?

విక్రమ్, తమన్నా జంటగా విజయ్ చందర్ దర్శకత్వంలో 'కబాలి' నిర్మాత కలైపులి ఎస్.థాను భారీ బడ్జెట్‌తో 'స్కెచ్' నిర్మించారు. 'ఇరుముగన్' తరువాత విక్రమ్ నటిస్తున్న ఈ చిత్రంపై కూడా అంచనాలు భారీగానే ఉన్నాయి. పూర్తిగా కమర్షియల్ సినిమాతో మెప్పించాలని విక్రమ్ చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాడు. అయితే ఆ కోవలో వచ్చిన 'రాజబాట్టై', '10 ఎణ్రడత్తుకుళ్ల' చిత్రాలు విక్రమ్ ఆశలపై నీళ్లు చల్లాయి. ఈ నేపథ్యంలో 'స్కెచ్'తో తన కోరిక నెరవేరుస్తుందని సియాన్ ఆశాభావంతో ఉన్నాడు.

'గులేబకావళి'...

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తొలి చిత్రమిది. 2011లో హన్సికను తమిళ సినిమాకి ప్రభుదేవానే పరిచయం చేశారు. ప్రస్తుతం ఆమెకు మార్కెట్ తగ్గిపోవడంతో మళ్లీ ఆయనే హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారు. 'గులేబకావళి'లో వారిద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయినట్లు తెలుస్తోంది. యువ దర్శకుడు కల్యాణ్ తెరకెక్కించిన ఈ చిత్రంపై పెద్దగా అంచనాలు లేకపోయినా, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలన్నీ ఉండడం కలిసొచ్చే అంశం.



'మదురవీరన్'...

పొంగల్ అంటే తమిళనాట వినిపించే తొలిమాట జల్లికట్టు. మదురై బ్యాక్‌డ్రాప్‌లో జల్లికట్టు కథతో రూపొందిన సినిమా 'మదురవీరన్'. విజయకాంత్ తనయుడు షణ్ముగపాండ్యన్ హీరోగా నటించిన మూడో చిత్రమిది. కొత్తమ్మాయి మీనాక్షి హీరోయిన్. పీజీ ముత్తయ్య తెరకెక్కించిన ఈ చిత్రంలో షణ్ముగపాండ్యన్ జల్లికట్టు వీరుడిగా కనిపిస్తాడు. తమిళనాడు సంప్రదాయం ప్రకారం చూస్తే... ఈ పొంగల్‌కి సిసలైన సినిమా ఇదే. ఈ నాలుగింటితో పాటు యువనటుడు విమల్, ఆనంది జంటగా సీనియర్ దర్శకుడు భూపతి పాండ్యన్ 'మన్నర్ వగైరా' కూడా పొంగల్‌కి విడుదల కానుంది. పండుగ సినిమాల్లో పూర్తిగా కుటుంబ కథా చిత్రం ఇదొక్కటే!



కీర్తికి డబుల్ పొంగల్...



దక్షిణాదిలో ఫేవరెట్ హీరోయిన్‌గా క్రేజ్ తెచ్చుకున్న మలయాళ తార కీర్తిసురేష్‌కి ఈ పొంగల్ డబుల్ ధమాకానే. అటు తమిళంలో, ఇటు తెలుగులో పొంగల్ క్రేజీ సినిమాలు 'అజ్ఞాతవాసి', 'గ్యాంగ్' రెండింటి లోనూ హీరోయిన్ కీర్తీనే. పొంగల్ బరిలో ఉన్న వాటిలో అత్యంత భారీ అంచనాలు కలిగిన సినిమాలు కూడా ఇవే. ఈ రెండూ విజయం సాధిస్తే కీర్తి ఇక వెనక్కి చూసుకోవాల్సిన అవసరం ఉండదు. పైగా ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న 'మహానటి', 'సామి2', 'సండై కోళి2', విజయ్ 62వ సినిమాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ నాలుగూ 2018లోనే తెరపైకి రాబోతున్నాయి. బహుశా... 2018 టాప్ హీరోయిన్ ఆమెనేనని రూఢీ చేసే యవచ్చేమో! యువ సంగీత దర్శకుడు అనిరుధ్‌కి కూడా 2018 పొంగల్ మర్చిపోలేని పండుగే. 'అజ్ఞాతవాసి', 'గ్యాంగ్' చిత్రాలకు అనిరుధే స్వరాలు సమకూర్చాడు.

మొత్తం మీద 2018 తమిళ చిత్రసీమకు మరపురాని ఏడాదిగా నిలువనుంది. గతేడాది తెరపై కనిపించని రజనీ, కమల్ సహా అగ్రహీరోలందరూ ఈ ఏడాది తెరపై సందడి చేయబోతున్నారు. ఇండియాలోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న '2.0', కమల్ అభిమానులు నాలుగేళ్లగా ఎదురుచూస్తున్న 'విశ్వరూపం-2' ఈ ఏడాది తెరపైకి రాబోతున్నాయి. 'తుపాకి', కత్తి' బ్లాక్‌బస్టర్లను అందించిన విజయ్ - మురుగదాస్ కాంబినేషన్‌లోని హ్యాట్రిక్ సినిమా, అజిత్ 'విశ్వాసం'లను దీపావళికి విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. పైగా, ఈ ఏడాది రజనీకాంత్, సూర్య, విక్రమ్ రెండేసి సినిమాలతో సందడి చేయబోతుండడం విశేషం.

• గనిరెడ్డి అరుణ్‌కుమార్, ఆంధ్రజ్యోతి, చెన్నై



'అజ్ఞాతవాసి'లో కీర్తి సురేష్

డైలీ సుడోకు - 71

7	3					6		5
						4	2	
				1				9
		7		5				4
		3	1		2	8		
8				7		2		
1				6				
	8	2						
9		5					7	8

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 70 సమాధానం

సందర్భం

"ఊరు ఊరంతా బాలనటుడు విశ్వంని చూడడానికి మూగింది. నేను కూడా విశ్వంలా సినిమాల్లోకి వెళ్లాలని అనుకున్నా." - ప్రముఖ జానపద హీరోగా వెలిగిన నటుడు టి.ఎల్. కాంతారావు తన ఆత్మకథ 'అనగనగా ఒక రాకుమారుడు'లో రాసిన చిన్ననాటి జ్ఞాపకం అది.

★★★

"నేను మాస్టర్ విశ్వం ఫ్యాన్‌ని!"- నటుడు పద్మనాభం ఆత్మకథలో అన్న మాట అది.

★★★

"నా చిన్నప్పుడు మాస్టర్ విశ్వమ్‌ని అనుకరించాను"- నటుడురావి కొండలరావు చెప్పిన మాట ఇది.

ఇంతకీ- ఎవరీ మాస్టర్ విశ్వం? ఆయన చేసిన సినిమాలేమిటి? పెద్దయ్యాక ఏమయ్యారు?

పాటలో... నటనలో... మాస్టర్

నటుడు మాస్టర్ విశ్వం జయంతి నేడు

తెలుగు సినిమా తెరపై టాకీలు వచ్చిన తొలి దశకంలో వెలిగిన ఓ అపురూప బాలనటుడు మాస్టర్ విశ్వం. ఆ రోజుల్లో బాలనటుడిగా క్రేజు, స్టార్ ఇమేజు సంపాదించుకున్న అదృష్టవంతుడు. తెలుగు వారి తొలి మూకీ చిత్రం (భీష్మ ప్రతిజ్ఞ - 1921) నిర్మాణంతో తెలుగు సినీ పితామహుడిగా పేరు తెచ్చుకున్న రఘుపతి వెంకయ్య నాయుడు గారి అబ్బాయి (ఆర్.ఎస్. ప్రకాశ్‌గా ప్రసిద్ధుడైన రఘుపతి సూర్యప్రకాశ్) చేతుల మీదుగా తెరకు పరిచయమైన ఘనుడు. మూకీల కాలంలోనే విదేశాలకు వెళ్ళి చిత్ర నిర్మాణం చదివొచ్చి, సినిమాల్లోకి ప్రవేశించిన తొలి తెలుగువాడైన ఆర్.ఎస్. ప్రకాశ్ టాకీలొచ్చాక తెలుగులో తీసిన తొలి చిత్రం 'చండిక' (భవానీ పిక్చర్స్). ఆ నాటి ప్రసిద్ధ నటి కన్నాంబ టైటిల్ రోల్ వేసిన ఆ చిత్రంలో బాలనటుడిగా మాస్టర్ విశ్వం వెండితెరకు పరిచయమయ్యారు.



'బాలనాగమ్మ' లో బాలవర్ధిరాజుగా


ఛాన్స్ తెచ్చిన సంగీత ప్రతిభ!

గమ్మత్తేమిటంటే, విశ్వం పుట్టింది సరిగ్గా తెలుగులో తొలి పూర్తి టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' రిలీజైన ఏడాదే. ఆ సినిమా రిలీజు (1932 ఫిబ్రవరి 6)కు సరిగ్గా 30 రోజుల ముందు ఈ బాల నటుడు జన్మించాడు. 1932, జనవరి 7న కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో పుట్టిన విశ్వం ఆ తరువాత స్కూలు వయసు నుంచి పెరిగింది నల్గొండలో! ఆయన తండ్రి ఉప్పల పుల్లయ్య, తల్లి కనకరత్నం. నల్గొండలో హోటల్ నడిపేవారు. తండ్రికి సంగీతం మీద ఉన్న వల్లమాలిన ప్రేమ, గురువు మందపాటి వెంకటరాజు శిక్షణతో చిన్నప్పుడే విశ్వం సంగీతం బాట పట్టారు. కర్ణాటక, హిందుస్థానీ సంగీతాలు రెండూ నేర్చుకోవడమే కాక హార్మోనియమ్ వాయించడంలోనూ విశ్వం చిన్నపుడే నేర్పు సంపాదించారు. సరిగ్గా ఆ సమయంలో 'చండిక' చిత్రం దర్శక, నిర్మాతలు ఆ సినిమాలోని చిన్నపిల్లాడి పాత్రకు తగినవాళ్ళ కోసం వెతుకుతూ, 'బాలనటుడు కావలెను' అని పత్రికల్లో ప్రకటన ఇచ్చారు. నేపథ్య గానం ఇంకా రాని రోజులవి. ఎవరి పాటలు వారే పాడుకోవాలి. దాంతో, అందంతో పాటు మంచి గాత్రం కూడా ఉన్న విశ్వం రక్కున ఆ పాత్రకు ఎంపికయ్యారు. అందులో "రాచపుట్టువునకు రణమందు మృతి కన్న భాగ్యమేమి?" అన్న పద్యం పాడుతూ, విజయేంద్రుడి పాత్రలో మాస్టర్ విశ్వం తెరపై మెరిశారు. నిజానికి, విశ్వం అసలు పేరు విశ్వనాథం. కానీ, 'చండిక' దర్శక నిర్మాతలు దాన్ని కుదించి, ఆయనకు 'విశ్వం' అనే వెండితెర పేరు పెట్టారు.



బాల నటుడిగా క్రేజ్

ప్లేబ్యాక్ లేని ఆ రోజుల్లో, కెమేరా ముందే నటిస్తూ పాడడానికి వీలుగా శాస్త్రీయ సంగీతం తెలిసి, గిరజాల జుట్టు, కోల ముఖంతో ఫోటోజెనిక్ ఫేస్ ఉన్న మాస్టర్ విశ్వంకి ఇక అక్కడ నుంచి అన్నీ అవకాశాలే అయ్యాయి. 'చండిక' తరువాత వరుసగా 'భూకైలాస్' (ఏ.వి.ఎం. వారి మొదటి చిత్రం), 'జీవన్ముక్తి' (జెమిని వారి మొదటి చిత్రం), 'బాలనాగమ్మ' (జెమిని) చిత్రాలలో నటించి, చైల్డ్ ఆర్టిస్ట్‌గా క్రేజ్ సంపాదించాడు. 1940 నుండి 1942 మధ్య రిలీజ్ అయిన ఈ నాలుగు సినిమాలతో మాస్టర్ విశ్వానికి బోలెడంత పేరొచ్చింది. శివుడి ఆత్మలింగాన్ని లంకకు తీసుకువెళుతున్న రావణాసురుణ్ణి బురిడీ కొట్టించి, ఆ లింగాన్ని సముద్రపుటొడ్డున పెట్టించే బాల గణపతిగా వటువైన గణేశభట్టు పాత్రలో ప్రశంసలు పొందాడు. ఆ పాత్రలో విశ్వం ఆవుల్ని తోలుతూ "నడువరె ఆవుల్లార పొద్దూకిపోయింది పోరె" అన్నపాట, అలాగే "దరి యేదో చూచుకోరా" అన్న పాటా పాడారు. గ్రామ్‌ఫోన్ రికార్డుల్లో కూడా ఆ బాల నటుడితోనే పాడించారు.




'భూకైలాస్'లో

అప్పట్లో ఒకే కథను పోటీ పడి ఇద్దరు, ముగ్గురు నిర్మించేవారు. అలా బాలనాగమ్మ కథను బాలనాగమ్మగా జెమినీ వాసన్, శాంతా వారి బాలనాగమ్మగా ఎస్వీ రామారావు 1942లో నిర్మించారు. శాంత 'బాలనాగమ్మ'లో ఎస్. రాజేశ్వరరావు (తరువాతి కాలంలో సుప్రసిద్ధ సంగీత దర్శకుడు) సాలూరి రాజేశ్వర రావు బాలవర్ధి రాజు పాత్రధారి. 'జెమిని' బాలనాగమ్మలోనేమో మాస్టర్ విశ్వం బాలవర్ధిరాజు. బాలనాగమ్మగా స్టార్ హీరోయిన్ కాంచనమాల, కార్యవర్ధిరాజుగా బందా కనకలింగేశ్వరరావు నటించిన 'జెమినీ' వారి చిత్రం కాసులు కురిపించింది. విశ్వం నటన, సన్నివేశాలు ఆకట్టుకొని, బాగా క్రేజ్ తెచ్చాయి.

అక్కినేని కన్నా ముందు...

చాలామందికి తెలియని విషయం ఏమిటంటే, అక్కినేని నాగేశ్వరరావు హీరోగా పరిచయమైన 'శ్రీసీతారామ జననము' (1944)లో రాముడి పాత్రకు ముందుగా అనుకున్నదీ, మేకప్ టెస్ట్ జరిగిందీ కూడా నటుడు మాస్టర్ విశ్వంకే! కానీ ఇంతలో 'సినిమాల్లో ఉంటే, నీ పిల్లవాడు నీకు కాకుండా పోతాడు' అన్న ఇరుగు పొరుగు మాటలు విశ్వం తండ్రి మనసు మార్చాయి. ఆ మాటలను ఆయన తలకెక్కించుకోవడంతో, కుటుంబం నల్గొండకు మకాం మార్చింది. 13 ఏళ్ల ప్రాయంలోనే మాస్టర్ విశ్వం సినిమాల నుంచి సాధారణజీవితానికి వచ్చేశాడు. తరువాత కూడా 'మాయలోకం'('45), 'ముగ్గురు మరాఠీలు' ('46) చిత్రాల్లోనూ విశ్వంకి అవకాశాలు వచ్చాయి. కానీ, ఇంతలో తండ్రి చనిపోవడంతో తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళ బాధ్యత అంతా పెద్దవాడైన విశ్వం మీదే పడింది. ఆ రోజుల్లో విశ్వం చక్కని ఆయిల్ పెయింటింగ్స్ వేస్తూ, వాటిని అమ్మి కుటుంబం గడిపేవారు. ఇలాంటి కుటుంబ పరిస్థితుల రీత్యా సినిమాలకు దూరంగా జీవితం గడిపేశారు. ఒకపక్క సంగీతం ట్యూషన్లు చెబుతూనే, ప్రైవేట్‌గా హిందీ, తెలుగు, ఇంగ్లీషు మూడింటిలో ఎమ్.ఎ. చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేశారు. హీరో కాంతారావు సతీమణి హైమవతి కూడా విశ్వం దగ్గర సంగీతం ట్యూషన్లు చెప్పించుకున్నారు.



యుక్తవయసులో.. మాస్టర్ విశ్వం

అప్పటికప్పుడే... పద్యం!

అయితే, మాస్టర్ విశ్వం చిన్నప్పటి ఆ సినిమా సంగతులను సన్నిహితులతో తరచూ పంచుకొంటూ ఉండేవారు. చెప్పులు కుట్టుకొనే భక్తుడి కథగా అంటరానితనం నేపథ్యంలో నడిచే సినిమా పి. సూరిబాబు, బెజవాడ రాజరత్నం తదితరులు నటించిన 'జీవన్ముక్తి'. అందులో వాళ్ళ కుమారుడైన చిన్నపిల్లాడు భావుడు పాత్రలో బాల విశ్వం నటించారు. ఆ సినిమాలో ఒక సన్నివేశం కోసం పుష్పవర్షం కురిపించాల్సి వచ్చిందట. దానికోసం ఏకంగా గంపలు, గంపలుగా గులాబీ పూలు తెప్పించి, వాడారట. అలాగే, తెలుగు సినీప్రియుల్లో 1952 నాటి 'మల్లీశ్వరి' చిత్రంలోని "పరుగులు తీయాలి గిత్తలు ఉరకలు వేయాలి" అనే బండి పాట పాపులర్. కానీ అంతకు పదేళ్ళ ముందే, 1942లోనే అలాంటి బండి పాట ఆర్కెస్ట్రయిజేషన్‌ను సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు 'జీవన్ముక్తి' చిత్రంలో వాడారని విశ్వం చెబుతుండేవారు. అప్పట్లో రాజేశ్వరరావు జెమినీ సంస్థలో నెలవారీ జీతంపై సంగీత దర్శకుడిగా కాంట్రాక్టులో ఉండేవారు.



'జీవన్ముక్తి' లో

జెమినీ 'బాలనాగమ్మ' గురించి చెబుతూ, ఆ సినిమాలో మాయల మరాఠీ (నటుడు గోవిందరాజు సుబ్బారావు) తన గుహలోకి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు వింత వింత, భయానక శబ్దాలు వినిపిస్తాయి. గోడకి రంధ్రం పెట్టి, దాని నుంచి ఊదడం ద్వారా, సాగతీసిన బల్లి చర్మం ద్వారా ఆ చిత్రమైన ఎఫెక్ట్‌ను సృష్టించారట ఎస్. రాజేశ్వరరావు. ఆ సినిమా తీసే సమయానికి విశ్వం వయసు పట్టుమని పదేళ్ళే! ఆ బాలనటుణ్ణి చూసి, 'బాబూ! నువ్వు గుర్రం ఎక్కినప్పుడు ఇలా, యువకుడిలా ఇలా, రాజకుమారుడిలా ఇలా, మారువేషంలో ఇలా ఉంటావ్' అని స్కెచ్‌లు వెంట వెంటనే వేసి, చూపించేవారట ఆ చిత్రానికి పనిచేసిన ప్రతిభావంతులైన టెక్నీషియన్లు ఏ.కె. శేఖర్ (ఆర్ట్ డైరెక్టర్), కె. రామ్‌నాథ్ (సినిమాటోగ్రాఫర్).



'బాలనాగమ్మ'లో

ఒకరోజున సముద్రం ఒడ్డున బాలనాగమ్మ సినిమా షూటింగ్ జరుగుతోంది. ప్రొడ్యూసర్ జెమినీ వాసన్ అప్పుడే అటుగా వచ్చారు. బాలవర్ధిరాజు సప్త సముద్రాలు దాటే ప్రయత్నంలో దేవుడి సహాయం అర్థించే సీన్ చిత్రీకరణ నడుస్తోంది. ఇక్కడ నాకో పద్యం కావాలని వాసన్ పట్టుబట్టారు. ప్రముఖ రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంత కవి పద్యం వ్రాయడం, ఎస్. రాజేశ్వరరావు బాణీ కట్టడం అప్పటికప్పుడు జరిగాయి. మరోపక్క చీకటి పడిపోతోంది. అప్పటికప్పుడు పద్యం కంఠతా పట్టడం ఇబ్బంది అని, బ్లాక్‌బోర్డు పై రాసి, మాస్టర్ విశ్వం ఎదురుగా పెట్టారు అప్పటికి ఆ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న సి. పుల్లయ్య. బాణీ తెలుసు కనుక వెంటనే "అంబుధి నిషంగ దీన దయాంతరంగ" అంటూ పద్యం పాడేశారు విశ్వం.

చివరి దాకా మాస్టరే!

విశ్వం చిన్నప్పుడు సంగీతంలో చేసిన కృషి సినిమాల్లో అవకాశం ఇప్పించడమే కాదు, తరువాత దక్కన్ రేడియో మొదలు ఆలిండియా రేడియో దాకా లలిత సంగీత గాయకుడిగా కొనసాగేలా చేసింది. 1952లో యువజన వారోత్సవాల సందర్భంగా జరిగిన లలిత సంగీత పోటీల్లో తెలుగుగడ్డ నుండి విశ్వం సెలెక్ట్ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఆలిండియా లెవెల్ పోటీలో ద్వితీయ బహుమతి పొందారు. ప్రధాన మంత్రి నెహ్రూ ముందు తన గాన కళను ప్రదర్శించారు. నటన, సంగీతంతో పాటు చిత్రలేఖనంలో, ఫోటోగ్రఫీలో, హార్మోనీ వాదనలో నేర్పు జీవితాంతం విశ్వాన్ని ప్రత్యేకంగా నిలిపింది. లెక్చరర్‌గా ఉద్యోగం, హార్మోనిస్టుగా సంగీత సాధన చేస్తూ, 'మాస్టర్' విశ్వం అనే పేరునే సార్థకం చేసుకున్నారు. సినిమా వెలుగు జిలుగులు చూసినా, సాధారణ కుటుంబ జీవితంతోనే తృప్తిపడి, 2004 ఏప్రిల్ 8న కన్నుమూశారు. ఇప్పటికీ, ఏ.వి.ఎం. వారి మొదటి 'భూకైలాస్', జెమినీ వారి 'బాలనాగమ్మ' సినిమాలు టీవీలో వస్తున్నప్పుడు చూస్తే, మాస్టర్ విశ్వం అందం, అభినయం ఆహా అనిపిస్తాయి!

• రెంటాల









పి.తులసి
నల్గొండ

21 చుక్కలు
మధ్యచుక్క
11 చుక్కలు వచ్చే వరకు



డి.హారిక
అమలాపురం

21 చుక్కలు
మధ్యచుక్క
11 వచ్చేవరకు



కె.శ్రీలక్ష్మి
కైకలూరు
కృష్ణాజిల్లా

15 చుక్కలు
మధ్య చుక్క
8 వచ్చే వరకు



వి.రిషిత
హైదరాబాద్

35 చుక్కలు
1 వచ్చే వరకు
సూటి చుక్క

గిఫ్ట్ హ్యాంపర్ విజేత


నారం లక్ష్మి
మొద్దులగూడెం,
కొత్తగూడెం భద్రాద్రి



16 చుక్కలు, 2 వరసలు,
2 వచ్చే వరకు, సరి చుక్క

ప్రతిరోజూ విజేతలకు టాటా-జెమినీ టీ వారి నుంచి గిఫ్ట్ హ్యాంపర్ అందుతుంది.

మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.


SMT.MAMATHA PRESENTS
HAARIKA & HASSINE
CREATIONS
JAN
10th
RELEASE
PINK FLOYD THE WALL
అజ్ఞాతవాసి
PRINCE IN EXILE
TRIVIKRAM
S RADHA KRISHNA
(CHINABABU)
ANIRUDH V MANIKANDAN A S PRAKASH
KOTAGIRI VENKATESWARA RAO PDV PRASAD RAVI VARMA
TO CHECK SHOW TIMINGS & BOOK MOVIE TICKETS,
SCAN THIS QR CODE IN YOUR paytm
USE CODE AGNY100 & GET UPTO RS 100* CASHBACK
*T&C APPLY. MIN. 2 TICKETS. 50% CASHBACK. NEW USERS ONLY.
ADITYA MUSIC
U/A

Dwaraka

విభజనకు కమిటీలు

ఒక్కో కమిటీలో ఐదుగురు న్యాయమూర్తులు.. హైకోర్టు తరలింపు ప్రక్రియ వేగవంతం



హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి హైకోర్టు విభజన పనులు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటుకు అనువైన భవనాన్ని పరిశీలించడానికి కమిటీని పంపాలని, ప్రభుత్వం గుర్తించిన భవనాల్లో ఒకదాన్ని ఎంపిక చేయాలని కోరుతూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హైకోర్టు ఏసీజే జస్టిస్ రమేష్ రంగనాథన్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు న్యాయమూర్తులంతా సమావేశమై చర్చలు జరిపారు. ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు, కావాల్సిన మౌలిక సదుపాయాలు, సిబ్బంది విభజన, కేసుల డిజిటలైజేషన్, రాష్ట్రాల వారీగా కేటాయింపులు, తదితర విషయాల పరిష్కారానికి కమిటీలు వేయాలని నిర్ణయించారు. కమిటీల్లో సభ్యులను నియమించే బాధ్యత ఏసీజేకే అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన భవనాల కమిటీ; సిబ్బంది విభజనకు విధివిధానాల రూపకల్పన కోసం కమిటీ; కేసుల(ఫైళ్లు) డిజిటలైజేషన్‌కు, విభజనకు కమిటీలు వేసినట్లు తెలిసింది. భవనాల కమిటీ సంక్రాంతి తర్వాత అమరావతి వెళ్లి ఎంపిక చేసిన భవనాలను పరిశీలించనున్నట్లు సమాచారం. ఒక్కో కమిటీలో ఐదుగురు న్యాయమూర్తులు సభ్యులుగా ఉన్నట్లు తెలిసింది.

తాత్కాలిక భవనంలోకి తరలిస్తే ఇబ్బందులే..

విభజన కమిటీల్లో హైకోర్టు న్యాయవాదుల సంఘానికి స్థానం కల్పించకపోవడంపై న్యాయవాదులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కక్షిదారుల బాగోగులు తెలిసిన తమను భాగస్వాములను చేయకుండా విభజించడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. తాత్కాలిక భవనంలోకి హైకోర్టును తరలించడానికి చేస్తున్న ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని గుర్తించినందున యుద్ధ ప్రాతిపదికన శాశ్వత భవనాన్ని నిర్మించి ఒకేసారి అందులోకి తరలిస్తేనే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. హైకోర్టు ఉద్యోగులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు సిబ్బంది విధులు సచివాలయ ఉద్యోగుల మాదిరిగా ఉండవని, న్యాయమూర్తులు వారాంతాల్లోనే తీర్పులకు సంబంధించి డిక్టేషన్లు ఇస్తూ ఉంటారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు ఒకచోటే స్థిరంగా ఉండాల్సి ఉంటుందని, అలాంటి ఏర్పాట్లు చేసుకోవడానికి కొంత సమయం పడుతుందని చెబుతున్నారు. సిబ్బంది పూర్తి సమయం కేటాయించలేకపోతే తీర్పులు ఆలస్యమవడంతోపాటు పెండింగ్ కేసులు పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని న్యాయమూర్తుల సమావేశంలో వ్యక్తం చేసినట్లు తెలిసింది.

విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు

కమిటీల్లోని న్యాయమూర్తులు

ఉద్యోగుల విభజన కమిటీలో..

జస్టిస్ రమేష్‌రంగనాథన్, జస్టిస్ సురేష్ కుమార్ కెయిత్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ ఎ.శంకరనారాయణ, జస్టిస్ షమీమ్‌అక్తర్‌లు సభ్యులుగా ఉన్నట్లు తెలిసింది.

భవనాల కమిటీలో..

జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ఉన్నారు.

డిజిటలైజేషన్ కమిటీలో..

జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ఉన్నట్లు సమాచారం.

జమ్మలమడుగులో ఉక్కు పరిశ్రమ

» ఏపీఎండీసీ సమీక్షలో మెకాన్ వెల్లడి

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జమ్మలమడుగులో ఉక్కు పరిశ్రమను స్థాపించేందుకు వీలుందని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ మెకాన్ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా తెలుగు రాష్ట్రాల్లో ఉక్కు పరిశ్రమలను స్థాపించడంపై ఈ సంస్థ అధ్యయనంచేపట్టింది. ఇందులో భాగంగా రెండు రోజుల కిందట అనంతపురం జిల్లా డి.హీరేహళ్ మండలంలో ఇనుప ఖనిజ నిక్షేపాలపై అధ్యయనం చేసింది. జమ్మలమడుగు ప్రాంతంలోని 3వేల ఎకరాల ప్రభుత్వ భూముల్లో ఉక్కు పరిశ్రమను స్థాపించేందుకు గల అవకాశా లపైనా సమీక్షించింది. శనివారం హైదరాబా ద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్. వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్, జలవనరులశాఖ, ఇంధనశాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జమ్మలమడుగులో ఉక్కు పరిశ్రమల స్థాపిం చాలంటే 2వేల ఎకరాల్లో ప్లాంటు, వెయ్యి ఎకరాల్లో గ్రీనరీ పెంచాలనే నిబంధనలు ఉన్నాయని మెకాన్ పేర్కొంది. కాగా.. ఈ సంస్థ ఆదివారం తెలంగాణ ప్రాంతంలో పర్యటించి అక్కడ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించనుంది.

అఖిల భారత ఉన్నత విద్య సర్వే



కరెంట్ అఫైర్స్

రాష్ట్రీయం

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్

వ్యవసాయానికి 24 గంటల సేపు విద్యుత్ సరఫరా చేసే కార్యక్రమం జనవరి 1న తెలంగాణలో ప్రారంభమైంది. జనవరి 1 అర్ధరాత్రి 12.01 గంటలకు మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్ మండలంలోని పోతాయపల్లి గ్రామంలో చింతల వెంకట్‌రెడ్డి అనే రైతు పొలంలో ఈ పథకాన్ని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు లాంఛనంగా ప్రారంభించారు.

జన్మభూమి - మా ఊరు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని జనవరి 2న ప్రారంభించింది. ప్రకాశం జిల్లా దర్శిలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. జనవరి 11 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఉత్తమ పోలీసు స్టేషన్‌గా పంజాగుట్ట

దేశంలోని మూడు ఉత్తమ పోలీసు స్టేషన్లలో ఒకటిగా పంజాగుట్ట పోలీసు స్టేషన్ నిలిచింది. కేంద్ర హోంశాఖ అధికారులు దేశ వ్యాప్తంగా ఠాణాలను పరిశీలించి మూడింటిని ఎంపిక చేసింది. వాటిలో పంజాగుట్ట పోలీసుస్టేషన్ ఒకటి. మౌలిక వసతులు, పనితీరు, ప్రజల మన్నన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని దేశంలోనే ఉత్తమంగా నిలిచే పది స్టేషన్‌లను గుర్తించి... వాటిలో మూడింటిని బెస్టాఫ్ త్రీగా ఎంపిక చేస్తారు. దేశంలోని 140 పోలీస్‌స్టేషన్లు పోటీపడగా.. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు ఈ గౌరవం దక్కడం విశేషం. 51వ డీజీపీల సదస్సు 2016లో హైదరాబాద్‌లో జరిగింది. అప్పుడు 'ఉత్తమ పోలీసు స్టేషన్ల' గుర్తించాలని తీర్మానించారు.

తెలంగాణ ఆర్థిక సంఘం ఏర్పాటు

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసింది. అధ్యక్షుడిగా జగిత్యాల జిల్లాకు చెందిన మాజీ మంత్రి గొడిశెల రాజేశం గౌడ్‌ను, సభ్యుడిగా విశ్రాంత జెడ్‌పీ సీఈవో ఎం.చెన్నయ్యను నియమించారు. తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా మహమ్మద్ కమరుద్దీన్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు.

అంతర్జాతీయం

సౌదీ, యూఏఈలో తొలిసారి వ్యాట్

ఇంతవరకూ పన్ను రహిత దేశాలుగా పేరుపొందిన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) గల్ఫ్‌లో తొలిసారి విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చాయి. సౌదీ అరేబియా కొత్త సంవత్సర కానుకగా... పెట్రోల్ ధరల్ని అమాంతం 127 శాతం పెంచింది. ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రపంచ ధరల్లో మాంద్యం కారణంగా ఏర్పడ్డ బడ్జెట్ లోటును పూడ్చుకునేందుకు రెండేళ్లుగా గల్ఫ్‌లోని ముడిచమురు ఉత్పత్తి దేశాలు అనేక చర్యలు కొనసాగిస్తున్నాయి. అందులో భాగంగానే తాజాగా వ్యాట్‌ను అమల్లోకి తెచ్చారు. అధిక శాతం వస్తువులు, సేవలకు వర్తించే ఐదు శాతం అమ్మకం పన్నుతో రెండు ప్రభుత్వాలు 2018లో 21 బిలియన్ డాలర్లు వసూలు చేయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

అతిపెద్ద చమురు ఉత్పత్తి దేశం అమెరికా

2018లో అమెరికా అతిపెద్ద చమురు ఉత్పత్తి దేశంగా గుర్తింపు పొందనుంది. ప్రస్తుత ఉత్పత్తిని 10 శాతం మేర పెంచడం ద్వారా అమెరికా రోజుకు 11 మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేయనుంది. తద్వారా ప్రపంచంలో అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుగా మారనుంది.

ఇండోనేషియాలో సుష్మ పర్యటన



భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఇండోనేషియాలో పర్యటించారు. ఇందులో భాగంగా జనవరి 5న ఆ దేశ విదేశాంగ మంత్రి రెట్నో మార్సుదితో చర్చలు జరిపారు. అంతకుముందు సుష్మ.. ఇండోనేసియా ఉపాధ్యక్షుడు మహ్మద్ జుసుఫ్ కల్లాతో భేటీ అయ్యారు.

పాక్‌లో భారతీయ ఖైదీలు 457 మంది

పాకిస్థాన్ జైళ్లలో అనేక మంది భారతీయులు మగ్గుతున్నారు. దాదాపు 457 మంది తమ దగ్గర బందీలుగా ఉన్నట్లు పాక్ ప్రభుత్వం జనవరి 1న ప్రకటించింది. ఇరు దేశాల మధ్య ఉన్న కాన్సులర్ యాక్సెస్ అగ్రిమెంట్ (2008 మే 21న రెండు దేశాలు సంతకాలు చేశాయి.) ప్రకారం ఈ జాబితాను విడుదల చేసింది. దీని ప్రకారం పాకిస్థాన్, ఇండియాలలోని జైళ్లలో ఉన్న ఖైదీల సమాచారాన్ని సంవత్సరానికి రెండు సార్లు (జనవరి 1, జులై 1) తెలపాల్సి ఉంటుంది. దాని ప్రకారం జనవరి 1న పాకిస్థాన్ ప్రభుత్వం ఖైదీల సంఖ్యను విడుదల చేసింది.

పాక్‌కు సాయం నిలిపివేసిన అమెరికా

ఉగ్రవాద నిర్మూలన కోసం అమెరికా పాకిస్థాన్‌కు అందిస్తున్న సైనిక సాయాన్ని పూర్తిగా ఆపివేసింది. అందులో భాగంగా 12,663 కోట్ల రూపాయల విలువ చేసే సైనిక సాయం మొత్తాన్నీ ఒక్కసారిగా నిలిపివేసింది. ఉగ్రవాదంపై పోరులో సహకారం ముసుగులో ఇప్పటిదాకా రూ.2.10 లక్షల కోట్లకు పైగా సాయం కింద తీసుకున్న పాక్.. ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికన్ సైనికులను చంపుతున్న తాలిబాన్, హకానీ నెట్‌వర్క్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జనవరి 1న ప్రకటించారు. దానికి అనుగుణంగా జనవరి 5న అన్ని రకాల సైనిక సాయాలనూ నిలిపేస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది.

క్రీడలు

రంజీ విజేత విదర్భ

విదర్భ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఇండోర్‌లో జనవరి 1న ముగిసిన ఫైనల్లో విదర్భ ఏడుసార్లు ఛాంపియన్ దిల్లీపై ఘనవిజయం సాధించింది. తద్వారా రంజీ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకున్న 18వ జట్టుగా విదర్భ నిలిచింది. ముంబై జట్టు అత్యధికంగా 41 సార్లు రంజీ ట్రోఫీని గెలుచుకుంది.

విజేతలు మహారాష్ట్ర, హిమాచల్



జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ విజేతలుగా నిలిచాయి. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 5న జరిగిన పురుషుల ఫైనల్లో మహారాష్ట్ర డిఫెండింగ్ చాంపియన్ సర్వీసెస్‌ను ఓడించింది. మహిళల ఫైనల్లో హిమాచల్‌ప్రదేశ్ ఇండియన్ రైల్వేస్‌పై గెలుపొందింది.

వార్తల్లో వ్యక్తులు

విదేశాంగ కార్యదర్శిగా విజయ్ గోఖలే



సీనియర్ దౌత్యవేత్త విజయ్ కేశవ్ గోఖలే భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నెల 28న పదవీ విరమణ పొందనున్న ఎస్. జైశంకర్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని నియామక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 1981 ఐఎఫ్ఎస్ బ్యాచ్ అధికారి అయిన గోఖలే.. చైనా వ్యవహారాల్లో నిపుణుడు. గత ఏడాది భారత్ - చైనా నడుమ డోక్లామ్‌లో 73 రోజులపాటు చోటుచేసుకున్న సైనిక ప్రతిష్టంభనను చర్చల ద్వారా పరిష్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 58 ఏళ్ల గోఖలే.. ప్రస్తుతం విదేశాంగ శాఖలో ఆర్థిక సంబంధాల విభాగం కార్యదర్శిగా ఉన్నారు. 2016 జనవరి 20 నుంచి 2017 అక్టోబర్ 21 వరకు చైనాలో భారత రాయబారిగా పనిచేశారు.

డిప్యూటీ ఎన్ఎస్ఏగా రాజీందర్ ఖన్నా

భారత జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారుగా రాజీందర్ ఖన్నాను ప్రభుత్వం జనవరి 2న నియమించింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని సంబంధిత సంఘం ఖన్నా నియామకాన్ని ఆమోదించింది. ఈ మేరకు ఓ అధికారిక ప్రకటన వెలువడింది. 'రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్' (రా) సారథిగా ఆయన గతంలో పనిచేశారు. ఆ తర్వాత నుంచీ ఆయన జాతీయ భద్రతా మండలి సచివాలయంలో ఓఎస్‌డీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

హార్వర్డ్ సదస్సుకు కేటీఆర్, అమరీందర్

ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో హార్వర్డ్ యూనివర్సిటీలో జరగనున్న 15వ భారత వార్షిక సదస్సుకు కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు, పంజాబ్ సీఎం అమరీందర్, సినీ నటుడు కమల్ హాసన్ సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో 'భారత్ - అద్భుత ఆవిష్కరణలు' అనే అంశంపై చర్చ జరగనుంది. సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి తారక రామారావు, బీజేపీ ఎంపీ పూనమ్ మహాజన్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి, నటి దివ్య స్పందన, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఆదిల్ జైనుల్‌బాయ్ తదితరులు హాజరుకానున్నారు.

భారత ఆర్థిక సంఘం నూతన అధ్యక్షుడిగా మహేంద్రదేవ్

భారత ఆర్థిక సంఘం (ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్) నూతన అధ్యక్షుడిగా ప్రముఖ ఆర్థికవేత్త మహేంద్రదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా కుమార్, అరుణ్‌ప్రభ చౌదరి, హనుమంత్ యాదవ్, శరత్ చంద్రన్ గిరిబాబు, ఎన్‌సి ఝా ఎన్నికయ్యారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన భారత ఆర్థిక సంఘం 100వ సదస్సులో ఈ ఎన్నికలను నిర్వహించారు.

జాతీయం

భారతీయ ఆర్మీలోకి ప్రైవేట్ కంపెనీలు

రక్షణ శాఖలోకి ప్రైవేటు కంపెనీల అడుగు పడబోతోంది. భారతీయ ఆర్మీకి చెందిన ఆర్మీ బేస్ వర్క్‌షాపు (ఏబీడబ్ల్యూ)లను నిర్వహించేందుకు ప్రైవేటు కంపెనీలకు రక్షణ శాఖ అనుమతి ఇచ్చింది. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో ఉన్న ఎనిమిది నగరాల్లోని ఏబీడబ్ల్యూలను ప్రైవేటు కంపెనీలు నడపనున్నాయి. 'ప్రభుత్వ ఆస్తిని కాంట్రాక్టర్ నిర్వహించే మోడల్' కింద రక్షణ శాఖ దీన్ని ఆమోదించింది. ఈ మోడల్‌లో ప్రైవేటు కంపెనీలు రక్షణ శాఖలో ఎలాంటి పెట్టుబడులు పెట్టవు. కానీ, కంపెనీలకు కావలసిన భూమి, వస్తువులు, మెషీన్లు తదితర వనరులను ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఎల్లప్పుడూ యుద్ధం కోసం ఆయుధాలను సిద్ధంగా ఉంచేందుకు ఏబీడబ్ల్యూలను రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆరంభించారు. ఢిల్లీ, కోల్‌కతా, పుణె, బెంగుళూరు తదితర కీలక నగరాల్లో ఏబీడబ్ల్యూలు ఉన్నాయి.

ఓడీఎఫ్ రాష్ట్రంగా అరుణాచల్‌ప్రదేశ్

బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) రాష్ట్రంగా అరుణాచల్‌ప్రదేశ్ నిలిచింది. ఈ విషయాన్ని జనవరి 1న అధికారికంగా ప్రకటించారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి సిక్కిం తరవాత ఈ ఘనతను సాధించిన రెండో రాష్ట్రం, దేశం మొత్తం మీద ఐదో రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్. ఇది వరకే హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కేరళ ఓడీఎఫ్ గుర్తింపును పొందాయి.

26 నుంచి ప్రయోగాత్మకంగా 'ప్యానిక్'

మహిళల భద్రత కోసం అత్యవసర పరిస్థితుల్లో మొబైల్ ద్వారా అప్రమత్తం చేసే ప్యానిక్ బటన్ సౌకర్యాన్ని జనవరి 26 నుంచి ఉత్తరప్రదేశ్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్యానిక్ బటన్ సౌకర్యాన్ని 2017 జనవరి నుంచి అమలు చేయాలని కేంద్రం గతంలో నిర్ణయించినప్పటికీ వివిధ కారణాలతో వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం విజయవంతమైతే, దేశవ్యాప్తంగా అమలు చేస్తామని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి మేనకా గాంధీ తెలిపారు.

కోరేగావ్ ర్యాలీతో మహారాష్ట్రలో ఘర్షణలు



భీమ కోరేగావ్ పోరాటానికి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జనవరి 1న నిర్వహించిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. పుణెకు సమీపంలోని గ్రామం కోరేగావ్. 1818 జనవరి 1న ఇక్కడ మరాఠా పాలకుడు బాజీరావ్ పీష్వా-2కు, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి మధ్య యుద్ధం జరిగింది. ఇందులో స్థానిక దళితుల మహర్ రెజిమెంట్ బ్రిటిషర్ల తరపున యుద్ధం చేసింది. ఈ యుద్ధంలో మరణించిన మహర్ రెజిమెంట్ సైనికుల స్మారక స్థూపాన్ని కోరేగావ్‌లో 1851లో నిర్మించారు. డాక్టర్ అంబేద్కర్ 1927లో ఆ స్మారక స్థూపాన్ని సందర్శించారు. దాంతో 1927 నుంచే అధికారికంగా స్మారకోత్సవం ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకు ఏటా జనవరి 1న దేశం నలుమూలల నుంచి దళితులు అక్కడికెళ్లి స్మారకోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

అఖిల భారత ఉన్నత విద్య సర్వే

ప్రతి లక్ష మంది విద్యార్థులు (18 - 23 వయసు)కు అత్యధిక కళాశాలలు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ సగటు కంటే రెట్టింపు సంఖ్యలో ఇక్కడ కళాశాలలు ఉండటం విశేషం. దేశవ్యాప్తంగా ప్రతి లక్ష మంది విద్యార్థులకు సగటున 28 కళాశాలలు ఉండగా తెలంగాణలో మాత్రం 59 ఉన్నాయి. అఖిల భారత ఉన్నత విద్య సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ) 2016 - 17 ఈ అంశాలను పేర్కొంది. దేశవ్యాప్తంగా 2016 డిసెంబరు నుంచి 2017 సెప్టెంబరు వరకు సర్వే చేసిన కేంద్ర మానవ వనరుల శాఖ నివేదికను జనవరి 5న దిల్లీలో విడుదల చేసింది. ఈ సర్వేలో దేశవ్యాప్తంగా 864 విశ్వవిద్యాలయాలు, 40,026 కళాశాలలు, 11,669 ఒకే కోర్సు ఉన్న విద్యాసంస్థలు భాగస్వాములయ్యాయి. గతేడాది సర్వేలో తెలంగాణలో సగటున 60 కళాశాలలు ఉండగా ఈసారి అది 59కి తగ్గింది. అయినా తెలంగాణ అగ్రస్థానంలోనే నిలిచింది. దేశవ్యాప్తంగా అత్యధిక కళాశాలలున్న 50 జిల్లాలను ఎంపిక చేయగా అందులో 1025 కళాశాలలతో బెంగళూరు (కర్ణాటక), 635తో జైపూర్ (రాజస్థాన్), 487 కళాశాలలతో హైదరాబాద్ మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నాయి. నల్లగొండ జిల్లా 289 కళాశాలతో 10వ స్థానంలో నిలవడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు 309 కళాశాలలతో 8వ స్థానంలో ఉంది. అత్యధిక కళాశాలలున్న ఎనిమిది రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్ నిలిచాయి. ఇందులో తెలంగాణాది ఆరో స్థానం. ప్రపంచవ్యాప్తంగా 162 దేశాలకు చెందిన 47,575 మంది విద్యార్థులు భారత్‌లో చదువుతున్నారు. వీరిలో అత్యధికంగా కర్ణాటకలో 13,050 మంది విద్యనభ్యస్తున్నారు. నాలుగోస్థానంలో తెలంగాణ - 3,461, ఆంధ్రప్రదేశ్ - 2,341 మందితో ఏడో స్థానంలో నిలిచాయి.

ఎలక్టోరల్ బాండ్లు

రాజకీయ పార్టీలకిచ్చే విరాళాల్లో పారదర్శకత కోసం ఎలక్టోరల్ బాండ్లను అమల్లోకి తేనున్నారు. ఈ బాండ్ల జారీకి సంబంధించిన విధివిధానాల్ని లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ జనవరి 2న ప్రకటించారు. విరాళాలిచ్చే దాతలు ఎలక్టోరల్ బాండ్లను ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) నుంచి కొనుగోలు చేయాలని, రాజకీయ పార్టీలు ఆ బాండ్లను ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించిన బ్యాంకు ఖాతా ద్వారా సొమ్ము చేసుకోవాలని ఆయన వెల్లడించారు. గత సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 1 శాతం ఓట్లు గెలుచుకున్న రాజకీయ పార్టీలకు మాత్రమే ఈ బాండ్ల సొమ్మును చెల్లిస్తారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలకు దాదాపు అన్ని విరాళాలు నగదు రూపంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి అందుతున్నవే. ఈ నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరి 1న.. 2017-18 బడ్జెట్ ప్రసంగంలో ఎలక్టోరల్ బాండ్ల ఆలోచనను జైట్లీ ప్రకటించారు. రాజకీయ పార్టీలకు అందే విరాళాలు మరింత పారదర్శకంగా ఉండేందుకు ఈ విధానం ఉపకరిస్తుందన్నారు.

అసోంలో పౌరుల నమోదు

రాష్ట్రంలోని 1.9 కోట్లమందిని చట్టబద్ధమైన పౌరులుగా గుర్తిస్తూ అసోం ప్రభుత్వం జనవరి 1 అర్ధరాత్రి జాతీయ పౌర నమోదు (ఎన్ఆర్సీ) తొలి ముసాయిదాను ప్రచురించింది. మొత్తం 3.29 కోట్లమంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 1.9 కోట్లమందిని చట్టబద్ధమైన భారత పౌరులుగా గుర్తించింది. దేశ విభజన అనంతర వలసల నేపథ్యంలో 1951లో జాతీయ పౌర నమోదు జాబితాను తొలిసారి చేపట్టిన రాష్ట్రంగా అసోం గుర్తింపు పొందింది. ఇప్పుడు కూడా అలాంటి జాబితా రూపకల్పనను చేపట్టిన ఏకైక రాష్ట్రంగా అసోం నిలిచింది. పొరుగు దేశాల నుంచి వలసల నేపథ్యంలో అసోంలోని నిజమైన స్థానిక పౌరుల గుర్తింపు కోసం జాతీయ పౌర నమోదును చేపట్టాలన్న డిమాండ్‌పై 2005 నుంచి చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం దీన్ని చేపట్టింది.

టైఫాయిడ్ టీకాకు డబ్ల్యూహెచ్‌వో గుర్తింపు

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ రూపొందించిన టైఫాయిడ్ టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గుర్తింపు దక్కింది. ఈ కంపెనీ ప్రపంచంలోనే తొలి సారిగా టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఈ టీకాను వచ్చే మూడేళ్లలో మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. 2016లో ప్రపంచ వ్యాప్తంగా 1.2 కోట్ల మంది టైఫాయిడ్ బారినపడ్డారు. వీరిలో 1.3 లక్షల మంది మరణించారు.

తలసరి ఆదాయం రూ.1.11 లక్షలు!

ప్రస్తుత ధరల ఆధారంగా చూస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతీయుల తలసరి ఆదాయం 8.3 శాతం పెరిగి రూ.1,11,782కు చేరుకోవచ్చని కేంద్ర గణాంక శాఖ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో తలసరి ఆదాయం 9.7 శాతం వృద్ధి చెంది రూ.1,03,219గా నమోదైంది. 2011-12 ధరల ఆధారంగా చూస్తే.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం 5.3 శాతం ఎగబాకి రూ.86,660కి చేరుకోవచ్చని అంచనా. 2016-17లో మాత్రం 5.7 శాతం వృద్ధి చెంది రూ.82,269గా నమోదైంది. దేశంలో ప్రజల జీవన ప్రమాణాలకు అద్దంపట్టే అంశాల్లో తలసరి ఆదాయమే కీలకం.



రామచంద్రారెడ్డి ఉప్పుల

ప్రవాసభారతీయ దివస్‌ను సూచించిన కమిటీ

భారత రాజ్యాంగ నిర్మాణ దశలో పౌరసత్వానికి సంబంధించిన అంశాలకు అధిక ప్రాముఖ్యం ఇచ్చారు. భారత పౌరులకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించాలని రాజ్యాంగ కర్తలు భావించారు.

భారత రాజ్యాంగం సమాఖ్య స్వభావంతో ఉంటుంది. ఇందులో సాధారణంగా ద్వంద్వ పౌరసత్వం ఉండాలి. కానీ మన దేశంలో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించేందుకు రాజ్యాంగ నిర్మాతలు ఏక పౌరసత్వం అనే భావనను ప్రవేశ పెట్టారు. అంటే భారతదేశంలో ఎక్కడ జన్మించినా పౌరులు ఒకే పౌరసత్వాన్ని పొందుతారు.

ప్రత్యేక రక్షణలు

ఏక పౌరసత్వాన్ని అనుసరిస్తున్నప్పటికీ ద్వంద్వ పౌరసత్వ దేశాల్లో మాదిరిగా కొన్ని రాష్ట్రాల్లో విద్య, ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక రక్షణలు కల్పించారు. ఉదాహరణకు భారత రాజ్యాంగంలోని 370 అధికరణ ద్వారా జమ్మూ - కశ్మీర్ రాష్ట్ర శాసన సభకు ప్రత్యేక పౌరసత్వ చట్టాన్ని రూపొందించే అధికారం ఉంది. అంటే జమ్మూ - కశ్మీర్ ప్రజలకు ద్వంద్వ పౌరసత్వం లభిస్తుంది. తదనుగుణంగా కొన్ని ప్రత్యేక సౌకర్యాలను ఆ రాష్ట్ర ప్రజలకు కల్పిస్తారు. అలాగే 371, 371 (ఎ) - 371 (జె) అధికరణాల ద్వారా కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అధికరణం	ప్రత్యేక సదుపాయం గల రాష్ట్రం
371	మహారాష్ట్ర, గుజరాత్
371 (ఎ)	నాగాలాండ్
371 (బి)	అస్సాం
371 (సి)	మణిపూర్
371 (డి), (ఇ)	అవిభాజ్య ఆంధ్రప్రదేశ్
371 (ఎఫ్)	సిక్కిం
371 (హెచ్)	అరుణాచల్‌ప్రదేశ్
371 (ఐ)	గోవా
371 (జె)	హైదారాబాద్ - కర్ణాటక ప్రాంతం (కర్ణాటక)

భిన్నత్వంలో ఏకత్వమనే విధానంతో వివిధ సంస్కృతుల మేళవింపుతో భారతదేశం పరిఢవిల్లుతోంది. రాజ్యాంగ పీఠికలోని ఆదర్శాలకు అనుగుణంగా దేశ సమగ్రతకు, సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహించేందుకు ఇక్కడి చారిత్రక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక ఏర్పాటు చేశారు.

ద్వంద్వ పౌరసత్వాన్ని కల్పిస్తుందా?

ఎల్ఎం.సింఘ్వీ అధ్యక్షతన నియమించిన ఉన్నత స్థాయి కమిటీ (2000) ప్రవాస భారతీయులకు సంబంధించి కొన్ని సూచనలు చేసింది. భారతదేశ సమగ్రాభివృద్ధిలో ప్రవాస భారతీయులు పాలుపంచుకొనేలా వీటిని రూపొందించింది.

- ప్రపంచ దేశాల్లో భారతీయుల విజయాలను, స్థాయిని గుర్తించడానికి ప్రవాస భారతీయ దివస్‌ను నిర్వహించాలి. ద్వంద్వ పౌరసత్వాన్ని కల్పించాలి
- ఈ కమిటీ సూచనల ప్రకారమే భారత ప్రభుత్వం 2003 నుంచి భారతీయ ప్రవాస దివస్‌ను నిర్వహిస్తోంది. మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చిన జనవరి 9న ఈ దివస్‌ను జరుపుతున్నారు.

ముఖ్య ప్రవాస దివస్‌లు

సంవత్సరం	ప్రదేశం	రాష్ట్రం
2003	న్యూఢిల్లీ	ఢిల్లీ
2006	హైదరాబాద్	తెలంగాణ
2014	న్యూఢిల్లీ	ఢిల్లీ
2015	గాంధీనగర్	గుజరాత్
2017	బెంగళూరు	కర్ణాటక

ప్రయత్నాలు

ప్రస్తుతం ద్వంద్వ పౌరసత్వాన్ని కల్పించక పోయినప్పటికీ నాన్ రెసిడెంట్ ఇండియన్‌కు సమాన అవకాశాలు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే 2003లో పర్సన్స్ ఆఫ్ ఇండియన్ కార్డ్ హోల్డర్, 2005లో ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) వంటి ప్రత్యేక విధానాలు ప్రారంభించారు. అయితే వీటినే ద్వంద్వ పౌరసత్వంగా పొరబాటు పడుతున్నారు. వీరికి ఎటువంటి రాజకీయ హక్కులు ఉండవు. ప్రవాస భారతీయుల డిమాండ్ మేరకు 2015లో పిఐఒ కార్డ్ హోల్డర్స్‌ను ఒసిఐలో విలీనం చేసింది.



పోటీ పరీక్షల ప్రత్యేకం
పాలిటీ

ఓసీఐ ప్రయోజనాలు

- వీసాపరమైన ఇబ్బందులు తొలగిపోతాయి. ఆర్థిక, సాంఘిక, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతీయులతో సమానంగా అవకాశాలు లభిస్తాయి.
- కొన్ని నిబంధనలకు లోబడి ఆస్తులను సంపాదించవచ్చు.
- భారతదేశంలో స్వేచ్ఛగా పెట్టుబడులు పెట్టవచ్చు.



ఎల్. కొండబాబు

జాబ్ కార్నర్

నైవేలీ లిగ్నైట్

నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ - గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **150**
- విభాగాలవారీ ఖాళీలు: మెకానికల్ 50, ఎలక్ట్రికల్ 35, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ 10, సివిల్ 20, కంట్రోల్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ 20, కంప్యూటర్ 5, మైనింగ్ 10
- అర్హత: సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ ఎఎంఐఇ ఉత్తీర్ణులై ఉండాలి. ఆఖరు ఏడాది చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించరాదు
- ఎంపిక: గేట్ 2018 స్కోరు, షార్ట్ లిస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 27
- వెబ్‌సైట్: www.nlcindia.com

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

అనంతపురంలో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ - అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (ఫేజ్ 2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **36**
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 30
- వెబ్‌సైట్: www.jntua.ac.in

మూడున్నరేళ్ల శ్రమ ఫలిస్తోంది: సీఎం

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'జన్మభూమితో ప్రతి ఊరు రూపురేఖలు మారిపోతున్నాయి. రోడ్లు, డ్రైయిన్లు, తాగు నీరు, విద్యుత్, విద్య, వైద్యం అన్ని మౌలిక వసతులు ఏర్పడు తున్నాయి. మనం చేస్తున్న పనుల పట్ల ప్రజల్లో సంతృప్తి ఉంది. మూడున్నరేళ్ల నిరంతర శ్రమకు ఫలితాలు కన్పిస్తున్నాయి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాజధానిలోని తన నివాసం నుంచి శనివారం ఉదయం అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందని, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెరిగిందని ఇది శుభ పరిణామమని సీఎం పేర్కొన్నారు. జన్మభూమి తొలిరోజున 3 లక్షల మంది పాల్గొంటే, 4వ రోజు 6.54 లక్షల మంది పాల్గొన్నారని, మిగిలిన రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తి కనిపించాలని ఆకాంక్షించారు. గత నాలుగు రోజుల్లో 4,68,063 ఫిర్యాదులు వచ్చాయంటూ, వాటిల్లో 1,52,444 ఫిర్యాదులు మాత్రమే అప్‌లోడ్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతపురంలో 85 శాతం ఫిర్యాదులు అప్‌లోడ్ చేశారని, మిగిలిన జిల్లాలు కూడా ఆ స్థాయికి చేరాలన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును రియల్‌టైంలో అప్‌లోడ్ చేయాలని, రియల్‌టైంలో పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవస్థల సామర్థ్యం పెంపు, ప్రజాభాగస్వామ్యం ఈ రెండింటి కలయిక డెడ్లీ కాంబినేషన్ అని సీఎం అన్నారు. ఈ మంచి మనిషికి నీతిలో అంతమందికి న్యాయం చేయాలన్నారు. 'మాకు మంచి జరుగుతుందనే భావన ప్రజల్లో రావడం శుభ పరిణామం. బాధ్యతతో పని చేస్తే ఊహించని ఫలితాలు వస్తాయి. సమర్థంగా పనిచేస్తే అసాధ్యమనేది ఉండదు.' అని సీఎం వ్యాఖ్యానించారు. ఉపాధి నిధులను అనుసంధానం చడం ద్వారా 22 శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించడమే దానికి ఉదాహరణగా పేర్కొన్నారు.



వదులుకుంటే మనకే నష్టం!

- గుజరాత్ ఫలితాలతో కమలనాథుల్లో అంతర్మథనం
- టీడీపీతో కొనసాగనున్న బీజేపీ దోస్తీ

న్యూఢిల్లీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వంతో సానుకూలంగా వ్యవహరించకపోతే మున్ముందు రాజకీయంగా తమకే నష్టమని ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుకున్న మేరకు ఫలితాలు సాధించకపోవడంతో కమలనాథులు ఆత్మరక్షణలో పడ్డారు. ఇప్పటివరకు తాను పక్కనపెట్టేసిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో ఇప్పుడు సంబంధాలు మెరుగుపరుచుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. గుజరాత్‌లో ఆశించిన ఫలితాలు రాకపోవడం, దేశవ్యాప్తంగా మోదీ సర్కారు గ్రాఫ్ పడిపోతోందన్న వార్తల నేపథ్యంలో 2019 ఎన్నికల్లో తమ సీట్లు తగ్గిపోతాయని, అందువల్ల ఉన్న మిత్రపక్షాలను ఎలాగైనా కాపాడుకోవాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రం నుంచి వస్తున్న సంకేతాలు, త్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో తెలుగుదేశం తమ వైఖరికి భిన్నంగా వ్యవహరించడం బీజేపీని ఆత్మపరిశీలనలో పడేసినట్లు కనబడుతోంది. పోలవరం నుంచి ప్రత్యేక ప్యాకేజీ వరకు హామీల అమలు చేయనందుకు.. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమతో తెగతెంపులు చేసుకోవడానికి కూడా టీడీపీ సిద్ధమన్న సంకేతాలు కమలనాథులకు అందుతున్నాయి. దీంతో వారు పునరాలోచనలో పడ్డారు. శుక్రవారం తెలుగుదేశం ఎంపీలు అడిగిన వెంటనే ప్రధాని తన వైఖరికి భిన్నంగా అపాయింట్‌మెంట్ ఇవ్వడం, న్యాయం చేస్తానని భరోసా ఇవ్వడం, సీఎం చంద్రబాబును త్వరలోనే కలుస్తానని చెప్పడం, ఆయనకు అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించడం.. మోదీ మారిన వైఖరిని సూచిస్తున్నాయి. నిన్నమొన్నటిదాకా పోలవరం ప్రాజెక్టుకు రకరకాలుగా అడ్డుతగిలిన కేంద్ర శాఖలు ఇప్పుడు ఆకస్మికంగా రాష్ట్రానికి సానుకూల నిర్ణయాలు ప్రకటించడం గమనార్హం. టెండర్ ప్రక్రియకు ఆమోదం, ఎన్‌హెచ్‌పీసీ నివేదికను తోసిపుచ్చి కాఫర్ డ్యాం నిర్మాణానికి పచ్చజెండా ఊపడం విశేషం. ఈ పరిస్థితుల్లో ఉభయ నేతల సమావేశం సానుకూలంగా జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పోలవరం పరిష్కారమైనట్లేనని, ఈఏపీలు, ఎస్పీవీలు, రైల్వే జోన్, కేంద్ర సంస్థలకు నిధుల విడుదల అంశాలు పరిష్కారం లేనివి కావని అంటున్నారు. మోదీ, చంద్రబాబు మధ్య సుహృద్భావ వైఖరి కొనసాగడానికి, రాష్ట్ర సమస్యలు పరిష్కారమయ్యేందుకు సమావేశం దోహదపడుతుందని చెబుతున్నారు. టీడీపీ పట్ల బీజేపీలో గతంలో, ఇప్పుడూ ఎలాంటి మార్పు లేదని, తెలుగుదేశంతో ఎప్పుడూ స్నేహపూర్వకంగానే వ్యవహరిస్తున్నామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు చెప్పారు. రాష్ట్రానికి సంబంధించిన అన్ని సమస్యలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటోందని.. పోలవరంపై తీసుకున్న నిర్ణయాలే ఇందుకు నిదర్శనమని ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.

పేదల కష్టాలు తీరుస్తా!

- సమస్యల పరిష్కారానికే జన్మభూమి
- 11లోగా సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- నెల్లూరు జన్మభూమిలో సీఎం చంద్రబాబు

నెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'సమాజంలో రెండు వర్గాలు ఉన్నాయి. ఒకరు ధనవంతులు. మరొకరు పేదలు. నేను పేద వర్గానికి చెందిన వాడిని. అందుకే పేదల కష్టాలు తీర్చేందుకు పని చేస్తున్నా. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. వారి మాట వింటే నష్టపోయేది మనమే. అందుకే ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడులో శనివారం జరిగిన 'జన్మభూమి - మా ఊరు' సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే జన్మభూమి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11లోగా అన్ని సమస్యలు పరిష్కరించేలా అధికారులు పని చేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని కుల, మతాల పేరుతో కొందరు రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి స్వార్థ ప్రయోజనాల కోసం అపోహలు సృష్టించి వ్యక్తిగత ప్రయోజనాలు పొందే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు నష్టం లేకుండా కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామని, ఎస్టీలకు నష్టం లేకుండా మత్స్యకారులకు రిజర్వేషన్లు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గతంలో సమైక్య ఏపీలో కూడా జన్మభూమి నిర్వహించి ప్రజలందరిని ఒక వేదిక మీదకు తీసుకురాగలిగామని, ఇందులో ఎన్ఆర్ఐలు వినూత్న రీతిలో భాగస్వామ్యులయ్యారన్నారు. జన్మభూమిలో రోజుకొక కార్యక్రమం చొప్పున తొమ్మిది రోజులపాటు తొమ్మిది కార్యక్రమాలు నిర్వహిస్తూ చివరి రోజు వివిధ రంగాల్లో పని చేసిన వారిని సన్మానిస్తామన్నారు.


డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న సీఎం

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

సంపద సృష్టించాలంటే మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. జల రవాణాతో తక్కువ వ్యయంతో వస్తువులను రవాణా చేసేలా బకింగ్‌హాం కెనాల్ పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు చేపడుతామన్నారు. డ్వాక్రా, మెప్మా ద్వారా రాష్ట్రంలో అతి పెద్ద ఉద్యమాలు జరుగుతున్నాయని, వీటి ద్వారా పేదలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయన్నారు. మానసిక ఆందోళనను దూరం చేస్తూ ఒత్తిడి తగ్గించేలా క్రీడలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదని, ఆడ బిడ్డల జోలికి వచ్చే వారిపై కఠిన చర్యలు తప్పవని మహిళకు పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. 13వ ఆర్థిక సంఘం నుంచి రూ.3,500 కోట్లు, పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేశామని, నరేగా కింద రూ.15 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని పల్లెలకు టెన్ స్టార్ రేటింగ్ ఇస్తున్నట్లు సీఎం వివరించారు. ఇలా ఉత్తమ పల్లెలకు అవార్డులు కూడా ప్రకటిస్తామని, పేదలందరికీ కొత్త టెక్నాలజీతో పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. విద్యుత్తు చార్జీలు పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జర్నలిస్టులందరికి ఇళ్లు ఇచ్చేలా ఆ శాఖ మంత్రితో మాట్లాడుతానని సీఎం ప్రకటించారు.

జగన్ పత్రిక అబద్ధాల పుట్ట

రాష్ట్రంలో ఓ పత్రిక ప్రజలను రెచ్చగొట్టేలా రాతలు రాస్తోందని సీఎం పరోక్షంగా జగన్ పత్రికపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెచ్చగొట్టేవారి విషయంలో అప్రమత్తంగా ఉండండి, చైతన్యంతో వ్యవహరించండని ప్రజలకు సూచించారు. 'ఈ రోజు ఓ పత్రికలో నేను మత్స్యకారులను తిట్టినట్టు ఓ పత్రిక రాసింది. అదంతా అవాస్తవం' అని సీఎం వ్యాఖ్యానించారు.

ఆన్‌లైన్‌లో వినతులు

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జన్మభూమిలో ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఐదో విడత జన్మభూమిపై శనివారం క్యాంపు ఆఫీసులో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. డిజిటల్ లిటరసీ పెద్దఎత్తున ప్రోత్సహించాలని, అందరం ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో సిద్దమవ్వాలని సూచించారు. జన్మభూమి ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలకు భరోసా కలిగిందన్నారు. తీర్థయాత్రలో భాగంగా విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలానికి చెందిన 200 మంది ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు.

విద్యార్థుల కోసమే నా తపన!

- వారి తల్లిదండ్రుల కన్నా ఎక్కువ శ్రమిస్తున్నా
- వీసీల నియామకాల్లో సిఫారసులకు బ్రేక్: సీఎం
- సింహపురి వర్సిటీ నూతన భవనాలు ప్రారంభం

నెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తు కోసం తాను ఎంతో తపనపడుతున్నానని, వారి తల్లిదండ్రులతో సమానంగా కష్టపడుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'సంపద కన్నా జ్ఞానం చాలా విలువైనది. చదువుతోనే జ్ఞానాన్ని సంపాదించుకోగలం. విద్య ద్వారానే పేదరికాన్ని నిర్మూలించగలం. ఒక తరం బాగా చదువుకుంటే ఆ తర్వాతి తరంలో పేదరికం కనిపించదు. విద్యకు అంత శక్తి ఉంది కాబట్టే రాష్ట్రంలో దానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఏపీని ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం. 2019 నాటికి రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధిస్తాం' అని సీఎం స్పష్టం చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద 83 ఎకరాల్లో రూ.23 కోట్లతో నిర్మించిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నూతన భవనాలను శనివారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలోచనలు ఏ ఒక్కరి సొంతం కాదని, విద్యార్థులు వినూత్నంగా ఆలోచించడం మొదలుపెడితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని సూచించారు. విద్యార్థి దశలో తరగతి గదులకే పరిమితం కాకుండా పరిశోధనల వైపు నడిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. వినూత్నంగా ఆలోచించే విద్యార్థులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో రాష్ట్రాన్ని సిలికాన్ వ్యాలీ కన్నా మిన్నగా తయారు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. వర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకాల్లో సిఫారసులకు బ్రేక్ వేశామని, అర్హులైన వారినే నియమించి ఉత్తమ వర్సిటీలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఎక్స్‌పర్ట్ కమిటీని నియమిస్తున్నట్లు వెల్లడించారు. సభలో పాల్గొన్న విద్యార్థులతో సీఎం ముఖాముఖి మాట్లాడారు. యువతకు చంద్రబాబు రోల్ మోడల్ అని విద్యార్థులు కొనియాడారు. ఆయన్ను 'అలెగ్జాండర్ ఆఫ్ ఆంధ్ర' అంటూ అభివర్ణించారు.

దుర్గగుడి ఈవో ఔట్

- ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ కమిషనర్
- అర్ధరాత్రి పూజలు నిజం
- విచారణ కమిటీల నివేదిక
- ఘటనపై బాబు సీరియస్
- వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి

అమరావతి/విజయవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బెజవాడ కనకదుర్గ ఆలయంలో తప్పు జరిగిందని నిర్ధారణ అయింది. ఆలయ నిబంధనలు, ఆగమశాస్త్ర నియమాలకు విరుద్ధంగా అమ్మ సన్నిధిలో అర్ధరాత్రి పూజలు నిర్వహించారని స్పష్టమైంది. ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. దుర్గ గుడి ఈవో సూర్యకుమారిపై బదిలీ వేటు వేశారు. ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయశాఖ కమిషనర్ అనురాధకి బాధ్యతలు అప్పగించారు. గత ఏడాది డిసెంబరు 26వ తేదీ అర్ధరాత్రి అమ్మవారి ఆలయంలో పూజలు జరిగిన మాట వాస్తవమని పోలీసులతోపాటు ప్రభుత్వం నియమించిన రెండు కమిటీలు మధ్యంతర నివేదికలు ఇచ్చాయి. తాంత్రిక పూజలు జరగకున్నా.. ఆలయ నిబంధనలకు విరుద్ధమైన పూజలను దుర్గ గుడితో సంబంధం లేని అర్చకుల పర్యవేక్షణలో నిర్వహించారని, ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు అంతరాలయంలోకి ప్రవేశించకుండా నిరోధించడంలో ఈవో సూర్యకుమారి విఫలమయ్యారని ఈ నివేదికలు స్పష్టం చేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం రాత్రి ఈ నివేదికలను పరిశీలించారు. అర్ధరాత్రి పూజలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు.

సీఎంకి చేరిన మూడు నివేదికలు

దుర్గ గుడిలో గత ఏడాది డిసెంబరు 26వ తేదీ అర్ధరాత్రి జరిగిన పూజల వ్యవహారాన్ని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' గత ఏడాది డిసెంబరు 31న వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన ఈవో సూర్యకుమారి.. ఆలయంలో ఎలాంటి పూజలు జరగలేదని ప్రకటన చేశారు. లక్షలాది భక్తుల మనోభావాలతో ముడిపడిన వ్యవహారం కావడంతో పోలీసులు పూజల తంతుపై కేసు నమోదు చేశారు. మరోవైపు ఈవో సైతం ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. దీనిపైనా విమర్శలు వెల్లువెత్తాయి. ఐఏఎస్ అధికారి అయిన ఈవోపై ఆరోపణలు వస్తే ఆమె కన్నా సీనియర్ అధికారితో విచారణ చేయించకుండా జూనియర్‌తో విచారణ ఎలా చేయిస్తారన్న విమర్శలు వచ్చాయి. దీంతో దేవాదాయ శాఖ రంగంలోకి దిగి నిజనిర్ధారణ కమిటీ వేసింది. పూజల వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎం.. ఏపీ ఆగమ సలహా మండలి చైర్మన్ చిర్రావూరి శ్రీరామశర్మ నేతృత్వంలో మరో విచారణ కమిటీని నియమించారు. పోలీసులు సైతం విచారణ చేపట్టారు. శనివారం ఈ కమిటీలన్నీ తమ నివేదికలను ముఖ్యమంత్రికి అందజేశాయి. దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, ఆ శాఖ కమిషనర్ అనురాధ, విజయవాడ నగర పోలీసు క మిషనర్ గౌతమ్ సవాంగ్ శనివారం రాత్రి ముఖ్యమంత్రిని కలిశారు. వేర్వేరుగా తమ నివేదికలను అందజేశారు. ఈ నివేదికలపై మంత్రి, అధికారులతో సీఎం సవివరంగా చర్చించారు.

విచారణ కొనసాగుతుంది: మాణిక్యాలరావు

దుర్గగుడిలో అర్ధరాత్రి జరిగిన పూజల వ్యవహారంపై విచారణ కొనసాగుతుందని దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు తెలిపారు. శనివారం రాత్రి సీఎంతో భేటీ అయిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యవహారంపై సీఎం సీరియస్‌గా ఉన్నారని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారని తెలిపారు. విజయవాడ పోలీసు కమిషనర్ గౌతం సవాంగ్ మాట్లాడుతూ.. ఆలయంలో పూజల వ్యవహారంపై మరిన్ని విషయాలను రాబట్టేందుకు విచారణను కొనసాగిస్తామని తెలిపారు.

నివేదికల్లో ఏముందంటే..!

విశ్వసనీయవర్గాలు వెల్లడించిన వివరాల మేరకు ఈ నివేదికల్లో ఏముందంటే.. 'దుర్గగుడి ఆలయ అధికారి కోసం, ఆ అధికారి అనుమతితోనే ఆలయంలో డిసెంబరు 26వ తేదీ రాత్రి 10:03 నుంచి 10:55 గంటల వరకు పూజలు చేశారు. ఈ పూజల్లో ఆలయానికి సంబంధం లేని అర్చకులు పాల్గొన్నారు. మూడు రకాల పూలు, కొబ్బరికాయలతో పాటు ఇతర సామాగ్రిని ఆలయంలోకి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయ నిబంధనల ప్రకారం ఆ సమయంలో పూజలు నిర్వహించడం తప్పు. అనధికారిక అర్చకులు, బయటి వ్యక్తులు అంతరాలయంలో అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించడం, వాటికి ఆలయ అధికారులు అనుమతివ్వడం ఇంకా పెద్ద తప్పు. ఈ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది కొందరు దీన్నిచూస్తూ మిన్నకుండిపోయారు.' అని నివేదికలు నిగ్గు తేల్చాయి. పూజల విషయంలో పోలీసు శాఖ ఇచ్చిన నివేదికే కీలకమైంది. దేవాదాయ శాఖ నిజనిర్ధారణ కమిటీ కూడా ఆలయంలో అర్ధరాత్రి పూజలు జరిగిన విషయాన్ని నిర్ధారించింది. నివేదికలన్నీ ఆలయ ఈవో సూర్యకుమారి కేంద్రంగానే తప్పు జరిగిందన్నట్లు పేర్కొన్నాయి.

సీఎం సీరియస్

దుర్గ గుడిలో జరిగిన పూజల వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. శనివారం నివేదికలు అందిన వెంటనే ఆయన ఈవో సూర్యకుమారిని తక్షణం బదిలీ చేయాలని ఆదేశించారు. పూజల వ్యవహారంలో ఈవో తీరు సరిగా లేదని, తనపై ఆరోపణలు వచ్చినప్పుడు తనకంటే జూనియర్ అధికారితో విచారణ జరిపించి ఆలయంలో ఎలాంటి తప్పు జరగలేదని నివేదించిన విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. దేవాదాయశాఖ, ఏపీ ఆగమ సలహా మండలి చైర్మన్ నేతృత్వంలోని కమిటీల నివేదికలకు భిన్నంగా సూర్యకుమారి నియమించిన కమిటీ నివేదిక ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన సీఎం ఆమెను తక్షణం బదిలీ చేయాలని ఆదేశించారు. దీంతో శనివారం రాత్రే ఈవోని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమెను జీఏడీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



వద్దని వారించినా..!

దుర్గ గుడి పూజల వ్యవహారంలో పోలీసులు సీఎంకి ఇచ్చిన నివేదిక కీలకంగా మారింది. పూజలు ఎవరికోసం జరిగాయి.. ఎప్పుడు జరిగాయి.. వంటి అంశాలన్నిటినీ ఈ నివేదికలో సమగ్రంగా పేర్కొన్నారు. పోలీసులు తమ విచారణలో భాగంగా పది మంది సాక్షుల వాంగ్మూలాలను రికార్డు చేశారు. పోలీస్ కమిషనర్ గౌతంసవాంగ్ శనివారం సీఎంకి నివేదిక అందజేశారు. పోలీసులు ఇచ్చిన నివేదిక ప్రకారం.. ఇటీవల కాలంలో తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాలను అధిగమించాలంటే ఏం పూజ చేయాలని దేవస్థానానికి చెందిన ఒక సీనియర్ అర్చకుడిని ఆలయ అధికారి సలహా అడిగారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయాలని ఆయన అధికారికి చెప్పారు. దీంతో పూజలు చేయాలని నిర్ణయానికి వచ్చిన సదరు అధికారి.. ఆలయానికి చెందిన కొందరు సీనియర్ అర్చకులను సంప్రదించారు. వారు ముందుకు రాలేదు. దీంతో మరో సీనియర్ అర్చకుడైన బదరీనాథ్‌బాబును సంప్రదించారు. ఆయన పూజలు చేసేందుకు అంగీకరించారు. డిసెంబరు 26న దేవస్థానం స్టోర్స్ నుంచి పూజా ద్రవ్యాలు కొన్నిటిని తెప్పించారు. గుంటూరు నుంచి వచ్చిన సృజన్ అక్కడి నుంచి చెరుకు గడలు తెచ్చారు. వీటిని పోలీస్ ఔట్ పోస్టులో ఉంచారు. సృజన్, పార్థసారథి పోలీస్ ఔట్ పోస్టులోనే తమ వెంట తెచ్చుకున్న కాషాయ వస్త్రాలను మార్చుకున్నారు. 26వ తేదీ రాత్రి 10.10 గంటల సమయంలో పూజలు ప్రారంభించారు. పూజలు జరుగుతుండగానే ఇంటి వద్ద ఉన్న బదరీనాథ్‌బాబు కొడుకుకు ఒక వ్యక్తి ఫోన్ చేసి.. 'మీ నాన్న గుడిలో సంప్రదాయ విరుద్ధమైన తాంత్రిక పూజలు చేస్తున్నాడు. అందరికి తెలిసిపోతుంది, మీ ఉద్యోగాలు పోతాయి. మీరు అమ్మవారి ఆగ్రహం నుంచి తప్పించుకోలేరు.' అని చెప్పారు. దీంతో కంగారు పడి అతను ఈ విషయాన్ని తండ్రికి తెలియజేశాడు. కుమాడి నుంచి ఫోన్ రావడంతో భయపడిన బదరీనాథ్‌బాబు 11.35 నిమిషాలకు పూజను ముగించేశారు. పూజలు మధ్యలో ఆపినందుకు ఆ మరునాడు సదరు అధికారి, బదరీనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నిటిని పూజల్లో పాల్గొన్న సృజన్, రాజా , ప్రత్యేక కదంబం (నైవేద్యం) తయారు చేసిన దేవస్థాన ఉద్యోగి మాధవ్ పోలీసుల విచారణలో వెల్లడించారు.

మాకేమీ తెలియదు!

- ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గౌరంగబాబు

విజయవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గ గుడిలో అమ్మవారి సన్నిధిలో గత ఏడాది డిసెంబరు 26న ఎటువంటి పూజలు జరిగాయో తనకు తెలియదని దుర్గగుడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ గౌరంగబాబు విచారణ కమిటీకి తెలిపారు. కమిటీ సభ్యులు శుక్రవారం రాత్రి తనను కలిసి సంఘటనపై ఆడిగారని, తనకు తెలిసిన సమాచారాన్ని చెప్పానని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పూజలపై మీడియాలో వచ్చిన సమాచారమే తమ వద్ద ఉందని, అంతకు మించి వేరే వివరాలు లేవని ఆయన కమిటీకి తెలిపినట్లు సమాచారం. 26వ తేదీ రాత్రి 8 - 9 గంటల మధ్యలో తాము గుడి నుంచి వెళ్లిపోయామని, ఆ తర్వాత ఆలయంలో ఏం జరిగిందన్నది తమకు తెలియదని, తమకు ఎటువంటి సమాచారం లేదని ఆయన కమిటీకి వివరించినట్లు తెలుస్తోంది.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి: రఘువీరా

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గ గుడి తాంత్రిక పూజలపై ఏం చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబుని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. ఆగమశాస్త్ర నియమాలకు విరుద్ధంగా ఆలయంలో తాంత్రిక పూజలు జరిగితే ఎందుకు చర్యలు తీసుకోలేదని రఘువీరా ప్రశ్నించారు. ఆలయ ఈవోగా ఐఏఎస్ అధికారి బాధ్యతలు నిర్వహిస్తుంటే ఆమెపై కింది స్థాయి సహాయ కార్యనిర్వాహక అధికారిని విచారణ అధికారిగా ఎలా నియమిస్తారని రఘువీరా ప్రశ్నించారు.

దుర్గగుడిలో తాంత్రిక పూజలు నిజమే!

- స్వరూపానందేంద్ర సరస్వతి

అనంతపురం టౌన్, జనవరి 6: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో తాంత్రిక పూజలు జరిగాయని ఓ పీఠాధిపతిగా తాను విశ్వసిస్తున్నానని విశాఖపట్నం శారదా మఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న ఆయన శనివారం హరిజనవాడలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు లోక కల్యాణం కోసం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ గుడిని స్థాపించి, నిత్యం సాత్విక పూజలే నిర్వహించాలని సూచించారని తెలిపారు. ఇటీవల ఈ ఆలయంలో జరిగిన తాంత్రిక పూజల వల్ల పాలకులు, ప్రజలకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. నిజనిర్ధారణ కోసం సీఎం ప్రత్యేక కమిటీని వేశారని, ప్రభుత్వానికి సంబంధించినవారు మాత్రమే కమిటీలో ఉన్నారని, సిట్టింగ్ జడ్జి కమిటీలో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

భేటీకి ఓకే

(మూడోపేజీ తరువాయి)

ప్రాజెక్టు అంచనాల సవరణ, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించే సమయంలో హామీ ఇచ్చిన విదేశీ రుణసాయం ప్రాజెక్టుల (ఈఏపీలు)కు ఆమోదం వీటిలో ప్రధానమైనవి. రెవెన్యూ లోటు భర్తీ, రైల్వే జోన్ ఏర్పాటుపై మరోసారి అభ్యర్థించనున్నారు. కొన్ని అంశాల్లో పలు సార్లు కేంద్రమంత్రులను కలిసి కొంత సానుకూలత రాబట్టినా.. అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది ప్రధానమంత్రే. దీంతో ముఖ్యమంత్రి ఆయన్ను కలిసేందుకు సమయం అడిగారు. శుక్రవారం తనను కలిసినటీడీపీ ఎంపీలతో త్వరలోనే చంద్రబాబును కలుస్తానని మోదీ చెప్పడం గమనార్హం.

ఆరు ఈఏపీలు..

ప్రత్యేక హోదాను కాదని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిన సమయంలో కేంద్రం కొన్ని హామీలిచ్చింది. ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 90 శాతం నిధులు కేంద్రమే ఇవ్వాలి. హోదా ఇవ్వనందున దాన్ని భర్తీచేసేందుకు 2015-16 నుంచి 2019-20 వరకు రాష్ట్రంలో ఈఏపీల కోసం తీసుకునే రుణాన్ని తిరిగి చెల్లించే బాధ్యతను తానే తీసుకుంటానని కేంద్రం హామీ ఇచ్చింది. దీనిప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 6 ఈఏపీ ప్రాజెక్టుల కోసం రంగం సిద్ధం చేసుకుంది. అవి ఇవీ..

- ఏపీ గ్రామీణ నీటి సరఫరా ప్రాజెక్టు.. దీని అంచనా వ్యయం రూ.4,500 కోట్లు. గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన తాగునీటిని సరఫరా చేయడం దీని ఉద్దేశం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ ప్రాజెక్టును అమలుచేస్తుంది.
- మండలాలు-గ్రామీణ రోడ్ల అనుసంధాన ప్రాజెక్టు. జిల్లాల నుంచి మండలాలకు, మండలాల నుంచి గ్రామాలకు రోడ్ల అనుసంధానం దీని ముఖ్యోద్దేశం. ఇందుకు రూ.3,200 కోట్లు ప్రతిపాదించారు. మండలాలు-గ్రామాల మధ్య ఉన్న ఒకే వరుస రోడ్లను రెండు వరుసల రహదారులుగా మారుస్తారు.
- గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణ ప్రాజెక్టు.. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో వీటి నిర్మాణానికి రూ.3,341 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొన్నారు.
- రోడ్లు, వంతెనల పునర్నిర్మాణ ప్రాజెక్టు.. దీనికింద చిన్న చిన్న వాగులపై వంతెనలు, కాలువలపై బ్రిడ్జిలు నిర్మిస్తారు. దీని అంచనా వ్యయం రూ.3,200 కోట్లు.
- అమరావతి గ్రీన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు.. రాజధానిలో ల్యాండ్‌స్కేప్, మొక్కలు, పార్కులు, గ్రీన్ కవర్ అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.1484 కోట్లు. అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ దీన్ని అమలుచేస్తుంది.
- వెనుకబడిన ప్రాంతాల గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు.. వెనుకబడిన ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కోసం రూ.1000 కోట్లతో ప్రాజెక్టును రూపకల్పన చేశారు.
- ఈ ఆరు ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.16,725కోట్లు. వీటికి అనుమతివ్వాలని ప్రధానిని చంద్రబాబు అడుగనున్నారు. వీటితో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇచ్చే నిధులను పెంచాలని రాష్ట్రం కోరుతోంది.

పోలవరం అంచనాలకు ఆమోదం!

జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి నూరు శాతం ఆర్థిక సాయం అందించే బాధ్యత తమదేనని ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా కేంద్రప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రాష్ట్రప్రభుత్వం సొంత వనరుల నుంచి రూ.3,217 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం రీయింబర్స్ చేయాలి. అదే సమయంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు, కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం కోసం పెరిగిన అంచనాలను ఆమోదించాల్సి ఉంది. 2011 అంచనాల ప్రకారం వీటికి రూ.16,010 కోట్లు అవసరం కాగా.. 2013-14 అంచనాల ప్రకారం రూ.58,319.06 కోట్లు అవుతుందని అంచనా వేశారు. నూతన భూసేకరణ చట్టం మేరకు పరిహారం చెల్లించాల్సి రావడంతో ఈ అంచనాలు భారీగా పెరిగాయి. భూసేకరణ, పునరావాసం ఖర్చు 2010-11లో రూ.2934 కోట్లు కాగా, 2013-14 అంచనాల ప్రకారం ఇది రూ.33,858 కోట్లకు పెరిగింది. దీనివల్లే ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగిందని, నూతన భూసేకరణ చట్టం తెచ్చింది కేంద్రమే కాబట్టి ఆ మేరకు అంచనాలు పెంచాల్సిందేనని చంద్రబాబు ప్రధానిని కోరనున్నారు. ఇటీవల ఈ ప్రాజెక్టు టెండర్ల విషయంలో నడిచిన వ్యవహారాలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్తారని సమాచారం. మరోవైపు.. పెండింగ్‌లో ఉన్న రైల్వేజోన్ అంశాన్ని ప్రధానికి ఇంకోసారి గుర్తుచేస్తారు. విభజన నాటికి ఏపీ రెవెన్యూ లోటు రూ.16 వేల కోట్లు. విభజన చట్టంలోను దీన్ని భర్తీచేస్తామన్న హామీ ఉంది. ఇప్పటివరకు సుమారు రూ.4 వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. మిగతా మొత్తం వెంటనే ఇవ్వాలని సీఎం అడగనున్నారు.

రాష్ట్ర పునర్విభజన చట్టంలో పన్నులకు సంబంధించిన సెక్షన్లు 50, 51, 56లను మార్చాలని ముఖ్యమంత్రి ప్రధానిని కోరే అవకాశాలున్నాయి. ఈ సెక్షన్లను మార్చకుంటే రాష్ట్రానికి రూ.3,200 కోట్ల నష్టం వాటిల్లుతుంది.

23,897 యమహా బైక్‌లు వెనక్కి

న్యూఢిల్లీ : హెడ్ కవర్ బోల్ట్ వదులవుతున్న నేపథ్యంలో వాటిని సరిచేసేందుకు 23,897 బైక్‌లను వెనక్కి (రీకాల్) తీసుకుంటున్నట్టు ఇండియా యమహా మోటార్ తెలిపింది. యమహా ఎఫ్‌జడ్ 25 (21,640), ఫేజర్ 25 (2,257) మోడళ్లలో ఈ సమస్య ఉన్నట్టు కంపెనీ పేర్కొంది. జనవరి 2017 నుంచి తయారు చేసిన మోడళ్లలో ఈ సమస్య ఉన్నట్టు తెలిపింది. ఈ మోటార్‌సైకిళ్లను యమహా ఆథరైజ్డ్ డీలర్ల వద్ద ఉచితంగా రిపేర్ చేయనున్నట్టు కంపెనీ వెల్లడించింది.

బడ్జెట్ బాసట ఎవరికో?

ఓటరా..? కార్పొరేట్లే మ్యాటరా..?

ఆర్థిక వృద్ధి నేలచూపులు చూస్తోంది. ఉత్పత్తి రంగం కుదేలైంది. ధరాఘాత సూచీ కొండెక్కుతోంది. యువతకు తగినన్ని ఉద్యోగావకాశాల్లేవు. ఉద్యోగికి ఆదాయం, రైతుకు వ్యవ'సాయం'పై నైరాశ్యం. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి ఇక్కట్లతో ఉక్కిరి బిక్కిరై అలసి సొలిసిన వ్యాపార వర్గం. ఒక్కొక్కరిదీ ఒక్కో ఆవేదన. భవిష్యత్‌పై కమ్ముకున్న కారుమబ్బులు ఇకనైనా తొలగకపోతాయా అని ఎదురు చూస్తున్నవారంతా బడ్జెట్ తేదీ ఖరారు కావడంతో మళ్లీ ఆశల పల్లకీ ఎక్కేశారు. వచ్చే నెల 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు మోదీ సర్కారు ప్రకటించడంతో అందర్లోనూ అంచనాలు పెరిగాయి. కానీ, అన్ని వర్గాలను సంతృప్తి పర్చడంతోపాటు ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాలకు కట్టుబడి ఉండటం ఆర్థిక మంత్రి జైట్లీకి కత్తిమీద సామే.



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29న ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19) బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2019లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ సర్కారు ఏడాది మొత్తానికి సమర్పించబోయే చివరి చిట్టాపద్దు ఇదే. కానీ, ఈసారి బడ్జెట్‌తో అందర్నీ మెప్పించడంతోపాటు ద్రవ్యలోటు లక్ష్యాలకు కట్టుబడి ఉండటం జైట్లీకి అతిపెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే ఈ మధ్య జరిగిన గుజరాత్ ఎన్నికల్లో బిజెపి తిరిగి అధికారం చేజిక్కించుకోగలిగినప్పటికీ గ్రామీణ ఓటరు మోదీ సర్కారుపై ఏమాత్రం సంతృప్తిగా లేదన్న విషయం తేటతెల్లమైంది. ఈ ఏడాది మరో ఆరు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతమైతే అధికారం చేజారవచ్చని ఎన్‌డిఎకు గుబులు మొదలైంది. గ్రామీణ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం బడ్జెట్ కీలకంగా మారింది. అలాగే వ్యవసాయం, తయారీ రంగాలకు ఊతమివ్వాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. వృద్ధిని పరుగులు పెట్టించడమే కాక పెద్ద ఎత్తున ఉద్యోగాలు సృష్టించడమూ ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులనూ పెంచాల్సి ఉంది. ఈసారి బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించేందుకు అవకాశమున్న అంశాలు..

సెక్షన్ 80సి మినహాయింపు రూ.2 లక్షలకు పెంపు?

వేతన జీవులకు ఊరట కల్పించడంతోపాటు ఆర్థిక పథకాల్లోకి పెట్టుబడులు ఆకర్షించేందుకు వీలుగా ఈ ఏడాది బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి మరిన్ని చర్యలు చేపట్టవచ్చు. ఆదాయ పన్ను చట్టంలో సెక్షన్ 80సి ప్రకారంగా కల్పించే పన్ను మినహాయింపు పరిమితిని రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచే అవకాశం ఉంది. ఇందులోభాగంగా ప్రావిడెంట్ ఫండ్లు, నేషనల్ సేవింగ్ సర్టిఫికేట్స్ (ఎన్ఎస్‌సి), బీమా పథకాలు, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, కొన్ని మ్యూచువల్ ఫండ్లపై పన్ను రిబేటును పెంచే అవకాశాలున్నాయి. జైట్లీ తన తొలి (2014-15) బడ్జెట్‌లో సెక్షన్ 80సి పన్ను రిబేటు పరిమితిని రూ.50 వేల నుంచి లక్షన్నర రూపాయలకు పెంచారు. సెక్షన్ 80సి ప్రకారంగా ప్రావిడెంట్ ఫండ్లు, ఎన్ఎస్‌సిలు, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పిల్లల ట్యూషన్ ఫీజులు, బీమా ప్రీమియం చెల్లింపులు, గృహ రుణంపై చెల్లించే వడ్డీ, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులపైన పన్ను మినహాయింపు లభిస్తుంది.

సామాజిక సంక్షేమ పథకాలు

ఈసారి జైట్లీ ప్రజాకర్షక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకే అవకాశాలెక్కువని విశ్లేషకులంటున్నారు. దళిత వ్యతిరేక ప్రభుత్వం అన్న ఆరోపణలకు సమాధానంగా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసే అవకాశం ఉంది.

సామాజిక భద్రత, కనీస వేతనాలు

ఈ ఏడాది బడ్జెట్‌లో సామాజిక భద్రత పథకాలకు సైతం నిధుల కేటాయింపులు భారీగా పెంచే అవకాశం ఉంది. ప్రస్తుతం పేద వయోజనులకు కేంద్రం నెలకు రూ.200 ఆర్థిక సాయం చేస్తున్నది. కానీ ఈ మొత్తాన్ని కనీస వేతనంలో సగానికి పెంచాలన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది. నెలకు కనీస వేతనాన్ని రూ.9,100 పెంచుతూ 2016లో కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈసారి బడ్జెట్‌లో దీన్ని రెట్టింపు స్థాయి రూ.18,000కు పెంచే అవకాశం ఉంది.

వ్యవసాయం

ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగానే నమోదైనప్పటికీ వ్యవసాయ రంగం తీవ్ర ఒత్తిడిలో ఉంది. దాంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిస్తేజంగా మారింది. గిట్టుబాటు ధర పెంచడం తోపాటు రైతు కోసం ఈసారి బడ్జెట్‌లో పలు చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

వ్యక్తిగత, కార్పొరేట్ పన్నులు

మధ్యతరగతివారికి, వేతన జీవులకు ఊరట కల్పించేలా బడ్జెట్ 2018లో కొన్ని పన్ను ప్రోత్సాహకాలు, మినహాయింపులు కల్పించే అవకాశం ఉంది. అలాగే పారిశ్రామిక వర్గాలకు కార్పొరేట్ పన్నును తగ్గించవచ్చు. కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించనున్నట్లు 2015లో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా జైట్లీ ప్రకటించారు.

ద్రవ్య స్థిరీకరణ

గతంలో నిర్దేశించుకున్న రోడ్‌మ్యాప్‌కు అనుగుణంగా ద్రవ్యలోటును కట్టడి చేయడం జైట్లీ ముందున్న అతిపెద్ద సవాలు. 2017-18కి ద్రవ్యలోటును జిడిపిలో 3.2 శాతానికి నియంత్రించాలని జైట్లీ టార్గెట్ పెట్టుకున్నారు. కానీ సెక్యూరిటీల జారీ ద్వారా రూ.50 వేల కోట్ల అదనపు రుణాల సేకరణతోపాటు బ్యాంకులకు రూ.2 లక్షల కోట్లకుపైగా మూలధన నిధుల కేటాయింపు నేపథ్యంలో 3.5 శాతానికి చేరుకోవచ్చు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా నియంత్రణ లక్ష్యాన్ని 3 శాతం ఎగువనే నిర్దేశించుకోవచ్చు.

తొలి ఎంప్లాయ్‌మెంట్ పాలసీ ప్రకటన

దేశంలో తొలిసారిగా జాతీయ ఎంప్లాయ్‌మెంట్ పాలసీ(ఎన్ఇపి)ని ప్రవేశపెట్టనున్నారు. ఈ ఏడాది ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఇందుకు సంబంధించి జైట్లీ ప్రకటన చేసే అవకాశం ఉంది. సంఘటిత రంగ ఉద్యోగాల వాటా పెంచడమే ఈ పాలసీ ప్రధానోద్దేశం. ఆర్థిక, సామాజిక, కార్మిక విధానాల సంస్కరణ ద్వారా అన్ని రంగాల్లోనూ నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించేందుకు కంపెనీల యాజమాన్యాలు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఓ రోడ్‌మ్యాప్‌ను విడుదల చేయనున్నది కేంద్ర ప్రభుత్వం. ఈ పాలసీలో భాగంగా మరిన్ని ఉద్యోగాలు కల్పించేలా ఎంప్లాయర్స్‌కు ప్రోత్సాహకాలు కల్పించడంతోపాటు బడా సంస్థలను ఆకర్షించేలా సంస్కరణలు చేపట్టనున్నారు. అలాగే ఉద్యోగాలకు నెలవు అయిన ఎస్ఎంఇలకు సాయం ప్రకటించనున్నట్లు సమాచారం.

త్వరలో గల్ఫ్‌కు 'విస్తారా' విమానాలు

న్యూఢిల్లీ : గల్ఫ్, ఆగ్నేయాసియా దేశాలకు విమాన సర్వీసులు ప్రారంభించనున్నట్టు టాటా సన్స్-సింగపూర్ ఎయిర్‌లైన్స్ జాయింట్ వెంచర్ సంస్థ విస్తారా ఎయిర్ లైన్స్ ప్రకటించింది. 'ఏయే నగరాలకు అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించేది ఇంకా నిర్ణయించలేదు. అయితే గల్ఫ్, ఆగ్నేయాసియా దేశాలకు ఈ సర్వీసులు ప్రారంభమవుతాయని సంస్థ సిఇఒ లెస్లీ తింగ్ ధ్రువీకరించారు' అని విస్తారా ఎయిర్‌లైన్స్ శనివారం తెలిపింది. ఈ సంవత్సరం మార్చి-జూన్ మధ్య కాలంలో విస్తారా మరో మూడు విమానాలు సమకూర్చుకుంటోంది. దీంతో జూన్ నాటికి కంపెనీ విమానాల సంఖ్య 22కు చేరుతుంది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, ఏదైనా దేశీయ విమానయాన సంస్థ అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలంటే కనీసం 20 విమానాలు ఉండాలి. మార్చి నాటికి విస్తార ఎయిర్‌లైన్స్‌కు 20 విమానాలు సమకూరతాయి. దీంతో ఇక అంతర్జాతీయ విమాన సర్వీసులపై దృష్టి పెట్టాలని కంపెనీ నిర్ణయించింది. స్వల్పకాలిక దూరాలకు అనువుగా ఉండే ఎయిర్‌బస్ 320 విమానాలనే కంపెనీ ఎక్కువగా సమకూర్చుకుంటోంది.



ఆర్థిక సంస్కరణల ఫలితాలు కనిపిస్తున్నాయ్

- ఇఏసి-పిఎం చైర్మన్ బిబేక్ దేబ్‌రాయ్

న్యూఢిల్లీ: జిడిపి వృద్ధి రేటుపై ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఇఏసి-పిఎం) చైర్మన్ బిబేక్ దేబ్‌రాయ్ అత్యంత ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం నీరసించినా వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) మాత్రం ఏడు శాతానికి మించి పెరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన ఆర్థిక సంస్కరణల ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నట్టు చెప్పారు. జిఎస్‌టి వంటి సంస్కరణలతో తలెత్తిన ఆటంకాలతో ఈ ఆర్థిక సంవత్సరం జిడిపి 6.5 శాతానికి మించకపోవచ్చని కేంద్ర గణాంకాల శాఖ (సిఎస్ఒ) శుక్రవారం తన ముందస్తు నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంతో బిబేక్ దేబ్‌రాయ్ ఈ విషయం చెప్పడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుంచి జిడిపి వృద్ధి రేటు గాడిలో పడిందని దేబ్‌రాయ్ చెప్పారు.

ఎలక్ట్రానిక్ రంగంలో
రెండేళ్లలో 2 లక్షల కొలువులు

- రాష్ట్రంలో త్వరలో మరో మూడు ఫోన్ల కంపెనీలు
- ఐటి మంత్రి నారా లోకేశ్ వెల్లడి

పెద్దాపురం రూరల్: వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్టు ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో అపర్ణ గ్రూప్ నెలకొల్పిన విటెరో టైల్స్ ఫ్యాక్టరీని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 2019నాటికి రాష్ట్ర ఐటి రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు మొబైల్ ఫోన్ల కంపెనీలు తమ ఫోన్లు తయారు చేస్తున్నాయని, 2019నాటికి మరో మూడు కంపెనీలు రాష్ట్రంలో తమ ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించినట్టు చెప్పారు.

దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ కంపెనీని రాయలసీమ జిల్లా అనంతపురానికి తీసుకువచ్చిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర జిడిపి పెంచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని లోకేశ్ చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎపి జిడిపిలో తయారీ రంగం వాటా ప్రస్తుతం చాలా తక్కువగా ఉందన్నారు. దేశ జిడిపిలో తయారీ రంగం వాటా సగటున 16 శాతం ఉంటే ఎపిలో ఇది ఎనిమిది శాతం మాత్రమేనన్నారు. గుజరాత్ జిడిపిలో అయితే తయారీ రంగం వాటా 32 శాతం వరకు ఉందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు లోకేశ్ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

రూ.1,500 కోట్లతో విస్తరణ

రూ.1,500 కోట్లతో తమ టైల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్టు అపర్ణ గ్రూప్ ప్రమోటర్లు తెలిపారు. రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ టైల్స్ ఉత్పత్తి కోసం కొత్తగా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. నిర్మాణ రంగంలో నాణ్యమైన విట్రోఫైడ్ టైల్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ఎస్ అపర్ణ రెడ్డి చెప్పారు. పెద్దాపురం ప్లాంట్ కోసం కంపెనీ రూ.320 కోట్లు ఖర్చు చేసింది.

కొత్త స్మార్ట్‌ఫోన్ కొనేద్దాం..

- చిన్న పట్టణాల్లో భారీగా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు
- కీలక పాత్ర పోషిస్తున్న డేటా

కొత్త స్మార్ట్‌ఫోన్ మార్కెట్లోకి వచ్చిందన్న వార్త రాగానే దాన్ని కొనుగోలుచేసేందుకు అనేక మంది మొబైల్ ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. మెట్రో నగరాలు, ప్రథమ శ్రేణి నగరాల్లోని వారికన్నా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని యువత సరికొత్త స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేసేందుకు ముందుంటోంది. ఫోన్ ధరకన్నా అందులోని ఫీచర్లకు ప్రాధాన్యం ఇస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొబైల్ డేటా ధరలు చాలా తక్కువ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం విరివిగా పెరిగిపోతోంది. డిజిటల్ లావాదేవీలు, సామాజిక మాధ్యమాలు, ఇ-కామర్స్, ఆడియో/వీడియో వినియోగం స్మార్ట్‌ఫోన్లకు గిరాకీ పెంచడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

వృద్ధిలో జోరు

గత ఏడాదిలో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల వృద్ధి 18 శాతంగా ఉన్నట్టు కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ చెబుతోంది. గత ఏడాది జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో ద్వితీయ శ్రేణి నగరాల్లో వృద్ధి 40 శాతం ఉన్నట్టు చెబుతోంది. ఫీచర్ ఫోన్లు, తక్కువ ధర కలిగిన స్మార్ట్‌ఫోన్లను వాడే కస్టమర్లు కొత్త ఫోన్లను కొనుగోలు చేయడం పెరిగిందని, దీని ఫలితంగానే అమ్మకాలు జోరందుకుంటున్నాయని పేర్కొంది. ఇక మొత్తంగా చూస్తే గత ఏడాదిలో గత ఏడాదిలో స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 13 శాతం వృద్ధి చెందింది. అంతకు ముందు సంవత్సరంలో వృద్ధి 18 శాతంగా ఉంది. ఫీచర్ ఫోన్ల మార్కెట్ 3.4 శాతం నుంచి 7 శాతానికి ఎగబాకింది. చిన్న పట్టణాల్లో అమ్ముడయ్యే స్మార్ట్‌ఫోన్లలో మూడువంతుల ఫోన్ల ధర 6,500 రూపాయలకన్నా తక్కువ ఉంటోంది.

ట్రెండ్ రివర్స్

పెద్ద పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్లు ఆన్‌లైన్ ద్వారా ఎక్కువగా జరుగుతున్నాయి. చిన్న పట్టణాల్లోనూ ఆన్‌లైన్ ద్వారా కొనే వారు ఉన్నప్పటికీ దుకాణాల్లోకి నేరుగా వెళ్లి కొనుగోలు చేసే వారే అధికంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మొబైల్ ఫోన్ల కంపెనీలు చిన్న పట్టణాలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. ఇలాంటి కంపెనీల్లో చైనా కంపెనీలు ముందున్నాయి. షామీ, లెనోవో, వివో, ఒప్పో వంటి కంపెనీలు పెద్ద ఎత్తున తమ రిటైల్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నాయి. దీంతో ఈ కంపెనీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. 2017లో చిన్న పట్టణాల్లో అమ్మకాలు పెరిగిన ఫలితంగా మొబైల్ ఫోన్ల మార్కెట్ ట్రెండ్ రివర్స్ అయినట్టు వారు అంటున్నారు. ఈ ఏడాదిలోనూ పరిస్థితి ఇదే విధంగా ఉండవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



అమ్మకాల వృద్ధి ఆఫర్ల దన్ను

స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు పెరిగేందుకు పలు రకాల ఆఫర్లు దోహదపడుతున్నాయి. ఇ-కామర్స్ కంపెనీలు జీరో డౌన్‌పేమెంట్, నోకాస్ట్ ఇఎంఐ, డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లను అందిస్తుండటం వల్ల స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు పెరుగుతున్నాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అంటోంది. భారీ రిటైల్ స్టోర్లు పండగల సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఇస్తుండటం కూడా ఫోన్ల అమ్మకాల వృద్ధికి దోహదపడుతున్నాయి.

చైనా కంపెనీలదే సగం వాటా

దేశీయ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో చైనా కంపెనీల వాటా క్రమంగా పెరుగుతోంది. చిన్న పట్టణాల్లో ఈ కంపెనీల వాటా 43 ఆతంగా ఉందని, మొత్తం దేశీయ మార్కెట్లో వాటా 50 శాతం ఉందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ చెబుతోంది.

జియో కస్టమర్లకు మరో ఆఫర్

న్యూఢిల్లీ: రోజుకు ఒక జిబి 4జి డేటా లభించే నెలవారీ ప్యాక్‌ల టారిఫ్‌ను రూ.50 తగ్గించడంతోపాటు కొన్ని పథకాలపై రోజువారీ డేటా పరిమితిని ఒక జిబి నుంచి 1.5జిబికి పెంచనున్నట్లు జియో ప్రకటించింది. ఈ నెల 9నుంచి ఈ ఆఫర్ అందుబాటులోకి రానుంది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,490	29600	30430	30,380	29,660
క్రితం ముగింపు	30,540	---	---	30,380	29,590
22 క్యారెట్లు	28,230	27500	27900	28,150	28,250
క్రితం ముగింపు	28,280	---	---	28,150	28,180
వెండి (కిలో)	39,950	38500	39800	39,800	42,100
క్రితం ముగింపు	39,900	---	---	39,800	42,000

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 — నెక్ (100 గుడ్లు)


హైదరాబాద్	398.00	చిత్తూరు	398.00
వరంగల్	400.00	చెన్నై	405.00
విజయవాడ	396.00	నమక్కల్	395.00
గోదావరి	396.00	బెంగళూరు	400.00
విశాఖపట్నం	400.00	ముంబై	440.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	86.00	విజయవాడ	86.00
కరీంనగర్	88.00	గుంటూరు	86.00
వరంగల్	86.00	ఒంగోలు	88.00
మహబూబ్‌నగర్	86.00	చిత్తూరు	70.00
కర్నూలు	86.00	నెల్లూరు	79.00
విశాఖపట్నం	82.00	అనంతపురం	79.00
గోదావరి	84.00		

వచ్చే ఏడాది రూ.1,500 కోట్ల టర్నోవర్

ఎన్‌సిఎల్ గ్రూప్ ఎండి కె రవి



గత మూడున్నర దశాబ్దాలుగా సిమెంట్ రంగంలో తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది ఎన్‌సిఎల్ గ్రూప్. నాగార్జున సిమెంట్ పేరుతో తెలుగు రాష్ట్రాల్లో అందిరికీ ఈ బ్రాండ్ సుపరిచితం. కంపెనీ పనితీరు, ఉత్పత్తులు తదితర అంశాలపై ఎన్‌సిఎల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కె రవి రాజు.. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి బెస్ట్ ఇన్ ది బిజినెస్‌తో ముచ్చటించారు. ఆ వివరాలు..

ఎన్‌సిఎల్ గ్రూప్ నేపథ్యం ఏమిటీ ?

మా తండ్రి రామచంద్ర రాజు ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ వ్యవసాయం మీద మక్కువతో విశాఖపట్నం, పార్వతీపురం సమీపంలో వ్యవసాయం చేశారు. వరుసగా కరువు పరిస్థితులు నెలకొనటంతో వ్యవసాయానికి ఫుల్‌స్టాప్ పెట్టేసి ఉద్యోగాన్వేషణలో పడ్డారు. విజయవాడలో సిరీస్ కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా చేరారు. యాజమాన్యంతో భేదాభిప్రాయాలు తలెత్తటంతో రాజీనామా చేశారు. ఫార్మా రంగంలో అనుభవం ఉండటంతో హైదరాబాద్‌లో ఫిగో ఫార్మాతో ఒక కంపెనీ ప్రారంభించారు. తొలి వెంచర్‌కావటంతో ఆరంభంలో కొన్ని సమస్యలు రావటంతో భాగస్వామిని చేర్చుకుని ఆయనకే అప్పగించారు. హైదరాబాద్ మెహదీపట్నంలో మరో ఫార్మాసుటికల్ లాబ్‌తో పాటు ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేశారు. ఇవన్నీ 1974-75 మధ్యకాలంలో జరిగాయి. అప్పుడే న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ నుంచి వేస్ట్ మెటీరియల్ (ఎఫ్లూయెంట్స్) కాంట్రాక్ట్ వచ్చింది. ఈ వేస్ట్ మెటీరియల్‌తో సోడియం నైట్రేట్, అమ్మోనియం నైట్రేట్‌ను ఉత్పత్తి చేయవచ్చని భావించి ఒక చిన్న కెమికల్ ప్లాంట్‌ను నాచారంలో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని రోజులకు 1977లో అప్పటి జనతా ప్రభుత్వం మినీ సిమెంట్ ప్లాంట్లకు అనుమతులు ఇవ్వటంతో సిమెంట్ వ్యాపారంలోకి అడుగుపెట్టాం.

సిమెంట్ ప్లాంట్లు ఎక్కడున్నాయి. ఉత్పత్తి సామర్థ్యం ఎంత?

తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మట్టపల్లి సమీపంలోని సింహపురి వద్ద ఏటా 66 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అప్పట్లో మినీ సిమెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. తర్వాత దానిని విస్తరించాం. అనంతరం ఆంధ్రప్రదేశ్ విజయవాడ సమీపంలోని కొండపల్లి వద్ద 10 లక్షల గ్రైడింగ్ సామర్థ్యంతో రెండో ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం. కార్యకలాపాల విస్తరణతో ప్రస్తుతం కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 27 లక్షల టన్నులకు చేరుకుంది. సిమెంట్ కాకుండా బైసన్ ప్యానల్ పేరుతో సిమెంట్ బాండెడ్ పార్టికల్ బోర్డ్స్ (సిబిపిబి) వ్యాపారంలోకి అడుగుపెట్టాం. ఈ ఉత్పత్తితో తొలిసారిగా జర్మన్ టెక్నాలజీని భారత్‌కు తీసుకువచ్చాం. బైసన్ ప్యానల్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిపోవటంతో హిమాచల్ ప్రదేశ్‌లోని కోంటాసాహెబ్ వద్ద రెండో సిబిపిబి ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం. తాజాగా మూడో ప్లాంట్‌ను సింహపురిలోనే ఏర్పాటు చేశాం.

నిర్మాణ రంగంలో గ్రూప్ ముద్ర?

బైసన్ ప్యానల్ తర్వాత ఇటలీ కంపెనీ భాగస్వామ్యంతో సెక్లార్ విండోస్‌ను దేశీ మార్కెట్లోకి తీసుకువచ్చాం. తొలుత కష్టాలు ఎదురైనప్పటికీ ఇప్పుడు మాత్రం మంచి మార్జిన్లను అందిస్తున్నాయి. సిమెంట్ రంగంలో ఉన్న ఆటుపోట్లు ఈ విభాగంలో లేకపోవటం కలిసి వచ్చింది. ఎన్‌సిఎల్ బ్రిక్స్, ప్రీ ఫ్యాబ్రికేటెడ్, స్వీడన్ భాగస్వామ్యంతో తీసుకువచ్చిన ఆల్‌టెక్ స్ప్రే ప్లాస్టర్స్ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

సిమెంట్ వ్యాపారం కష్టాల్లో పడింది కదా ?

2009లో సిమెంట్ రంగం మంచి బూమ్‌లో ఉంది. అలాంటి సమయంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మరణంతో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవటం, వారు సివిల్ పనులు నిలిపివేయటం, తెలంగాణ ఉద్యమం. సమైక్య ఆంధ్ర ఉద్యమాలు రావటం.. ఒక్కసారిగా సిమెంట్ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపించాయి. దీంతో ఎన్‌సిఎల్ గ్రూప్‌పై కూడా ఈ ప్రభావం పడింది. దీన్నుంచి బయటపడటానికి మాకు దాదాపు రెండేళ్లు పట్టింది. రుణాలు చెల్లించలేక కార్పొరేట్ రుణ పునర్ వ్యవస్థీకరణ (సిడిఆర్)కు వెళ్లాం. అయితే అనంతర కాలంలో పరిస్థితి గాడిలో పడటంతో రుణాల కోసం వెళితే సిడిఆర్‌లో ఉన్నప్పుడు రుణాలు ఇవ్వటం కుదరదని తేల్చిచెప్పారు. అప్పుడు పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.325 కోట్లు సమీకరించి సిడిఆర్ నుంచి బయటపడ్డాం. అనంతరం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకున్నాం. 10 లక్షల టన్నుల క్లింకర్, 7.5 లక్షల టన్నుల సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం, లామినేటెడ్ బోర్డ్ ప్లాంట్, రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. ఇవన్నీ గత రెండేళ్ల కాలంలో పూర్తి చేశాం. ఇప్పుడు సిమెంట్ డిమాండ్ పుంజుకుంటున్నది.

కంపెనీ ఆర్థిక ఫలితాలు ఎలా ఉన్నాయి ?

2015-16 ఆర్థిక సంవత్సరంలో 1,165 కోట్ల రూపాయల రాబడిని సాధించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,300 కోట్ల రూపాయల టర్నోవర్‌ను అంచనా వేస్తున్నాం. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్‌ను 1,500 కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇక శ్రీశైలం, తుంగభద్ర కెనాల్స్‌పై కంపెనీకి ఉన్న రెండు జల విద్యుత్ ప్రాజెక్టులు కూడా ఈ ఏడాది ఆశించిన స్థాయిలోనే పనిచేస్తున్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో ఉండటంతో ఈ ఏడాది 20 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని భావిస్తున్నాం. ఇవి పూర్తిగా డెట్ ఫ్రీ కంపెనీలుగా ఉన్నాయి.

రూ.300 కోట్లు సమీకరించనున్న ఎన్ఎసిఎల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వ్యాపారంలో వృద్ధిని సాధించేందుకుగాను ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 300 కోట్ల రూపాయలు సమీకరించనుంది. ఈమేరకు ఈ నెల 2వ తేదీన జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. కొత్త ఉత్పత్తులు తీసుకురావడం ద్వారా దేశీయ మార్కెట్లోనే కాకుండా ఎగుమతుల్లోనూ వృద్ధిని సాధించాలని కంపెనీ యోచిస్తోంది. ఇంటర్‌మీడియేటరీలు, బయో ఉత్పత్తుల తయారీని విస్తరించాలని కంపెనీ నిర్ణయించింది. ఇదిలా ఉండగా.. 2017 సంవత్సరానికిగాను కంపెనీకి చెందిన శ్రీకాకుళం యూనిట్‌కు నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి ప్రతిష్ఠాత్మక 'సురక్షా పురస్కార్' లభించింది. అత్యుత్తమ భద్రతా పద్ధతులను పాటిస్తున్నందుకుగాను దేశంలోని పంటల సంరక్షణ ఉత్పత్తుల తయారీ కంపెనీల్లో ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్‌కు అగ్రస్థానం లభించినట్టు కంపెనీ పేర్కొంది.

ఇండస్‌ఇండ్‌తో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ జట్టు

న్యూఢిల్లీ: ఖాతాలో నగదు నిల్వ రూ.లక్ష దాటిన కస్టమర్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డి) వసతి కల్పించేందుకోసం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఇండస్‌ఇండ్ బ్యాంక్‌తో జట్టుకట్టింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారులు ఎఫ్‌డి సొమ్మును ఎప్పుడు కావాలంటే అప్పుడు తక్షణమే ఉపసంహరించుకునే వీలుంటుంది. ఎఫ్‌డి ప్రీ-క్లోజర్ లేదా మరే ఇతర చార్జీలు చెల్లించనక్కర్లేదని, డిపాజిట్ సొమ్ముపై 6.85 శాతం వార్షిక వడ్డీ చెల్లించనున్నట్లు బ్యాంక్ స్పష్టం చేసింది. అంతేకాదు, ఎఫ్‌డి కాలపరిమితి తీరకముందే ఖాతాదారుకు 60 ఏళ్లు నిండితే.. డిపాజిట్ ఆటోమెటిక్‌గా సీనియర్ సిటిజన్ స్కీంగా రెన్యువల్ కావడంతోపాటు అధిక వడ్డీ లభించనుందని పేటీఎం పేర్కొంది.

కన్నవారిని గెంటేసి.. ఇంటికి తాళం వేసి..

» ఓ కుమారుడి నిర్వాకం.. పోలీసులను ఆశ్రయించిన వృద్ధులు

» కొడుకుల పేర్లు బయటికి చెప్పొద్దని తండ్రి వేడుకోలు

దమ్మపేట, జనవరి 6: కుమారులు పుట్టగానే.. పున్నామ నరకం నుంచి రక్షిస్తారని ఆ తల్లిదండ్రులు సంబరపడ్డారు. అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేశారు. కుమారులిద్దరికీ ఆస్తి పంచి, తమ అవసరాలకు కొంత భూమి ఉంచుకున్నారు. కానీ, ఆ భూమిపైనా కన్నేసిన చిన్న కొడుకు.. వృద్ధులని కూడా చూడకుండా తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటేశాడు. పైగా ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. పోలీసులను ఆశ్రయించిన ఆ తల్లిదండ్రులు న్యాయం చేయాలని వేడుకున్నారు. అయితే, కన్న తీపితో తన కొడుకు పరువు పోవద్దని అతడి పేరు ఎక్కడా చెప్పవద్దని వేడుకున్నాడు ఆ తండ్రి. ఈ హృదయవిదారక ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మల్కారంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అంకత నాగయ్య, గంగమ్మలకు ఇద్దరు కుమారులు బ్రహ్మయ్య, వెంకటేశ్వరరావు, ఇద్దరు కుమార్తెలు కుమారి, సరోజిని ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. కుమారి భర్త మృతి చెందడంతో నాగయ్య, గంగమ్మ వద్ద ఉంటోంది. కుమారులిద్దరికీ చెరో 13 ఎకరాలు పంచి ఇచ్చిన నాగయ్య తనకు, భార్య, వితంతువైన కూతురి పోషణకు 11 ఎకరాల భూమిని ఉంచుకున్నాడు. ఈ క్రమంలో తనకు ఆసరాగా ఉంటాడని నమ్మి చిన్న కొడుకు వెంకటేశ్వరరావుకు తన వాటాగా ఉంచుకున్న భూమిని వీలునామా రాసిచ్చి తన వద్దే పెట్టుకున్నాడు. ఈ భూములు కాకుండా గంగమ్మ పుట్టింటి నుంచి తెచ్చుకున్న రెండెకరాల భూమిని సొంత ఖర్చుల కోసం ఇటీవల అమ్ముకుంది. నాటి నుంచి తనకు రాసిన వీలునామా అమలు చేయాలని లేదా రద్దు చేయాలని వెంకటేశ్వరరావు తండ్రితో వాగ్వాదానికి దిగాడు. అతడి చేష్టలతో నొచ్చుకుని కోర్టుకెళ్లిన నాగయ్య వీలునామా రద్దు చేసుకున్నాడు. కొంత కాలం క్రితం నాగయ్య మోకాలిలో గడ్డలు ఏర్పడటంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. కాలినొప్పితో బాధపడుతున్న నాగయ్య జిల్లాలోని అశ్వారావుపేట మండలం వినాయకపురంలోని పెద్ద కుమార్తె సరోజిని ఇంటికి వెళ్లి 6 నెలలుగా ఉంటున్నాడు. సంక్రాంతికి సొంత ఇంటిలో గడుపుదామని భార్య, కుమార్తెతో వచ్చాడు. అది చూసిన వెంకటేశ్వరరావు వీరంతా బయట ఉండగానే ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. సమస్య పరిష్కారం కోసం బంధువులు, గ్రామ పెద్దలు చర్చలకు పిలిచినా వెంకటేశ్వరరావు స్పందించలేదు. గత్యంతరం లేక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకున్నారు ఆ తల్లిదండ్రులు. అయితే, కొడుకు పరువు గురించి ఆలోచించిన ఆ తండ్రి తన కుమారుడి పేరు ఎక్కడా చెప్పవద్దని వేడుకోవడం గమనార్హం.



ఇంటికి తాళం వేయడంతో బయటే ఉన్న నాగయ్య, గంగమ్మ, కుమారి

మైనారిటీల అభివృద్ధికి సబ్ ప్లాన్

» ఇమామ్, మౌజన్‌ల జీతాలు పెంచుతాం

» మైనారిటీలతో ఆత్మీయ సమావేశంలో జగన్

కల్లూరు, జనవరి 6: రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధికి సబ్ ప్లాన్ అమలు చేస్తామని వైసీపీ అధ్యక్షుడు జగన్ చెప్పారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శనివారం ఆయన చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో ముస్లిం మైనారిటీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి మైనారిటీల సంక్షేమానికి 4 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని, తాను మరో అడుగు ముందుకువేసి ఎస్సీ, ఎస్టీల తరహాలో మైనారిటీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అప్పట్లో రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు.. మైనారిటీల కోసం వైఎస్ ప్రవేశపెట్టిన అనేక పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. పేద విద్యార్థులకు ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. చంద్రబాబుకు ప్రేమంటే ఏమిటో తెలియదని, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ సందర్భంగా అరకొర కానుకలిచ్చి వారిపై తనకు ఎక్కువ ప్రేమున్నదని చెబుతున్నారని అన్నారు. నిజమైన ప్రేమంటే ఏమిటో అధికారంలోకి రాగానే పేదలకు చూపిస్తానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని అన్ని మసీదుల ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు ఇస్తామన్నారు. జనాన్ని మోసం చేయడంలో చంద్రబాబు రీసెర్చ్ చేశారని, ఎన్నికల సమయంలో 100 పేజీల మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఎంపీలు మిథున్‌రెడ్డి, వరప్రసాద్, విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, అంజద్ బాషా, దేశాయ్ తిప్పారెడ్డి, మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



బీడీలు చుట్టే ముస్లిం మహిళల సమస్యలు తెలుసుకుంటున్న జగన్



వధువు కావలెను



★ **రెడ్డి** / 34 / 2 కోట్లు ఆస్తి గల వరునికి ఎవరైన రెడ్డి, కాపు, కమ్మ ఇల్లరికం తీసుకుపోగల వధువు కావలెను. **9396712727.** మ్యారేజ్ బ్యూరో కాదు. AJH-427114

★ **గౌడ** / B.Sc / Govt. ఆఫీసర్ / అగ్రికల్చర్ Dept. /48,000/– pm, 5'11" ఎత్తు, 29 సం.ల V.Fair వరునికి వధువు కావలెను. **ఫోన్:9618008271** AJH-1444

★ **వడ్డెర** / CA / చార్టర్డ్ అకౌంటెంట్ / 1 LAKH pm, 5'10" ఎత్తు, 29 సం.ల అందమైన వరునికి వధువు కావలెను. **ఫోన్:9618008271** AJH-1444

★ **బ్రాహ్మిణ్**,35 సం. ఎత్తు 5'8" బికామ్, బ్యాంకు ఉద్యోగం, టీమ్ లీడర్, బెంగళూరు, జీతం రూ.9.6 లక్షలు / ఏడాదికి, రెండో పెళ్ళి. సొంత ఇల్లు, పిల్లలు లేరు. బ్రాహ్మణులకు మాత్రమే. నేరుగా సంప్రదించాలి. - **099165 75168, 094825 05997 (వాట్సప్ నెంబరు)** AJQ-559173

★ **రెడ్డి** / 65y / Degree / 5'7"/ హైద్రాబాద్ / వెల్ సెటిల్డ్ వరునికి డిగ్రీ ఆపైన చదివిన రెడ్డి / FC వెల్ సెటిల్డ్ మాత్రమే వధువు కావలెను. **ఫోన్:7337521952** AJH-15936

★ **కమ్మ/ 44/5'9"**/ డైవర్సీ / గుంటూరు, 30,000 PM/ ఆస్తి కల పిల్లలు లేని వరునకు వెల్‌సెటిల్డ్ గల కమ్మ లేక రెడ్డి తోడు వధువు కావలెను. ఒక చైల్డ్ ఉన్నా OK డైరెక్టు నెం: 7097318951. AJG-443366

★ రెడ్డి/38/5.4/1.5Cr/20,000 PM V.Fair వరుడుకు కుల, ఆస్తి, ప్రసక్తిలేని V.Fair వధువు కావలెను. డైరెక్ట్ : 9701529865. AJN-415493

★ చాకలి/ డైవర్సీ/ 46/ఎంసీఏ/ప్లాంట్ మీడియేటర్/ కుల, కట్నం ప్రసక్తి లేదు/ డైరెక్ట్/ సెల్:9573293378 AJM-360

★ రెడ్డి Age:31, ఒక కోటి ఆస్తి గల 1 సం.లో డైవర్స్ అయిన ఏకైక అబ్బాయికి పెళ్ళికాని అందమైన పేద/మధ్య తరగతి అమ్మాయి కావలెను. OC/BC జాబ్: మేనేజర్ జీ: 26 వేలు Wgl whatsapp No. సంప్ర: 9494463016 AJW-440129

★ ఎత్తు 5.4, వయస్సు: 42, క్షత్రియ వరునకు మొదటి, రెండవ మిడిల్ క్లాస్ క్షత్రియ వధువు కావలెను. నో బ్రోకర్స్. సంప్రదించండి: సెల్: 95338 52888 AJB-447559

★ నాయుడు కులం/25 సం./5'10"/ B.Tech / Business / Textiles & Granite Propety 5 Cr. Contact directly. No Brokers. Ph: 96183 06812. AJT-433831

★ కాపు /30/ వరుడికి వధువు కావలెను. 1వ, 2వ, డైవర్సీ, విడో అయినాసరే మనీసపోర్ట్ ఇచ్చువారు కావలెను. ఇల్లరికం OK సంప్ర : 96425 49489 AJK-410738

వరుడు కావలెను



★ **రెడ్డి**/విడో/40/5'3"/M.Com/వరంగల్/ Govt. లెక్చరర్/80,000/–P.M./ (1) పాప వెల్ సెటిల్డ్ ఏ భాదరబందీలేని వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్: 9948070006** AJH-019

★ **కులపట్టింపులేదు** / విడో / 45 / 5'4" / డిగ్రీ / విజయవాడలో 10 ఎ॥ ల్యాండ్ Govt. Job / 40,000/- P.M. / వెల్ సెటిల్డ్ / ఈ మధ్యనే యాక్సిడెంట్‌లో భర్తను కోల్పోయిన వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:9912916046** AJH-019

★ **చౌదరి** / లేట్ మ్యారేజ్ / 42 / 5'4" / B.Sc / సొంత ఊరు తెనాలి / సెటిల్డ్ in Hyd / Own House (Rents) / Pvt. Job / 40,000/- P.M. / వెల్ సెటిల్డ్ / అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:7794888459** AJH-019

★ **వైశ్య** / డైవర్సీ / 53 / 5'4" / Hyd లో స్వంత ఇల్లు (Rents) / 50,000/- P.M. / ఫైనాన్స్ బిజినెస్ / 1L P.M. / ఏ భాదరబందీలేని వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:9912038880** AJH-019

★ **రెడ్డి** / విడో / 54 / 5'3" / Govt. Job / 35,000/- P.M. / బిజినెస్ / 60,000/- P.M. / వెల్ సెటిల్డ్ గల వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. **ఫోన్:8686581653** AJH-019

★ **బ్రాహ్మిణ్** / 50 / విడో / 5'4" / P.G. / Gvot. Job / సొంత స్కూల్ & రెంట్స్ / 2 Lac Income / 18 Cr. ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయ వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:9121868114** AJH-019

★ **వైశ్య** / 45 / Late Match / 5'4" / ఆయుర్వేదిక్ & రెంట్స్ / సొంత ఇల్లు / 80 K P.M. / 15 Cr. ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయ వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:9989394054** AJH-019

★ **బ్రాహ్మణ** / 50y / విడో / 5'3" / Govt. ప్రిన్సిపాల్ (రిటైర్డ్) / 40,000/- P.M. / సొంత ఇల్లు / రైస్ బిజినెస్ / పిల్లలులేని వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:9642399013** AJH-019

★ **గౌడ్స్** / విడో / 31y / 5'5" / ఇండియన్ ఆయిల్ సబ్ డీలర్ / 6 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. **ఫోన్:8978377133** AJH-019

★ **కుల, ఆస్తి ప్రసక్తి లేదు** / విడో / 35y / 5'5" / ఫెయిర్ / క్లాత్స్ బిజినెస్ & షాపింగ్ కాంప్లెక్స్ / 10 కోట్ల ప్రాపర్టీ గల ఏకైక వధువుకు వరుడు కావలెను. **ఫోన్:7893575126** AJH-019

★ **గౌడ** / డైవర్సీ / 35y / 5'4" / డిగ్రీ / Hyd లో Own House (Rents) / 50,000/- P.M. / Counceler Job / 40,000/-P.M. గల అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. లేట్ మ్యారేజ్ / ఎలాంటి బాదరాబందీలేని 2వ వరునికి ప్రాధాన్యత. **ఫోన్:9912753645** AJH-019

★ **పద్మశాలి** / లేట్ మ్యారేజ్ / 29y / 5'4" / హోటల్ మేనేజ్‌మెంట్ / 8 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. **ఫోన్:9515060514** AJH-019

★ **కులపట్టింపులేదు** /2వ పెళ్లి / విడో / 50 / 5'3" / 10th Class / సొంత బిల్డింగ్స్ & ల్యాండ్స్ / సాంప్రదాయ వధువుకు ఆమెను బిజినెస్‌ను చూసుకునే FC/BC వరుడు కావలెను. **ఫోన్:7093717220** AJH-019

★ **కమ్మ** / విడో / 48y / 5'4" / Fair / రైల్వే (VRS) / రెంట్స్ / 80,000/– P.M. / ఆంధ్రాలో పొలాలు, తోటలు గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. **ఫోన్:7330865089** AJH-019

★ CNB / FC / ఉన్నత విద్య / 60 / 5'4" / V.Fair / ఫెన్షనర్ / సొంత ఇల్లు / 1 పాప సెటిల్డ్ / రెంట్స్ / మంచి ఆర్థిక స్తోమత గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. **ఫోన్:7893379440** AJH-019

★ BC / విడో / 2వ పెళ్లి / కులపట్టింపులేదు / House Wife / 5'3" / 48 / డిగ్రీ / ఫ్యామిలీ పెన్షనర్ / 40,000/- P.M. / సొంత ఇల్లు / సాంప్రదాయ ఉన్నత కుటుంబానికి చెందిన వధువుకు వరుడు కావలెను. **ఫోన్:8008063157** AJH-019

★ **కులపట్టింపులేదు** / 2వ పెళ్లి / 50 / 5'3" / 10th Class / ఫ్యామిలీ పెన్షన్ / 28,000/- P.M. / స్వంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. **ఫోన్:8978894173/8790045436** AJH-019

★ **కులపట్టింపులేదు** / 2వ పెళ్లి / 55 / 5'4" / ఇంటర్ / ఓన్ కిరాణ స్టోర్ / 30,000/- P.M. / స్వంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. **ఫోన్:8978894043/8978894173** AJH-019

★ **కమ్మ** / 50 / 5'3" / విడో / M.Sc / Govt. జాబ్ (V.R.S.) / 50,000/- P.M. / Own House / మంచి ప్రాపర్టీ కలిగిన వధువుకు వరుడు కావలెను. **ఫోన్:8977771349** AJH-019

★ **రెడ్డి** / 47 / 5'4" / డైవర్సీ / Govt. Job (అగ్రికల్చర్) / 80,000/- P.M. / 5 Cr. ప్రాపర్టీ కలిగిన వధువుకు వరుడు కావలెను. **ఫోన్:8712344858** AJH-019

★ **రెడ్డి** / విడో / 43y / డిగ్రీ / సొంత షాపింగ్ కాంప్లెక్స్, ఆంధ్రాలో ఇండ్లు Hydలో సొంత ప్రాపర్టీగల వధువుకి కుల ఆస్తి ప్రసక్తి లేని వరుడు తోడు కావలెను (మనీ సపోర్ట్) **ఫోన్:9849435205 / 9177300345** AJH-16158

★ **రజక** 2వ పెళ్ళి/ B.Sc / B.Ed / Govt. టీచర్ / 42,000/– pm, 5'5" ఎత్తు, 27 సం.ల పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. **ఫోన్:9618008271** AJH-1444

★ **వాల్మీకి బోయ** / B.TECH / C.GOVT. క్లర్క్ & క్యాషియర్ / SBI బ్యాంక్ / 32,000/– pm, 5'4" ఎత్తు, 24 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. **ఫోన్:9618008271** AJH-1444

★ **కమ్మ** / 30y / 5'4"/ డైవర్స్, ఒంటరి, ఫెయిర్ / క్లాత్ షోరూం & షాపింగ్ కాంప్లెక్స్ 2.L/pm 4 Cr. ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. సొంత ఇల్లు. **ఫోన్:8686683575** AJH-411614

★ **కాపు** / 33y / 5'5"/ విడో, ఒంటరి, ఫెయిర్ / వాటర్ ప్లాంట్స్ & లేడీస్ హాస్టల్స్ 1L/pm 3 Cr. ప్రాపర్టీ ఏ బాదర బందిలేని అందమైన వధువుకు ఇల్లరికం వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. సొంత ఇల్లు. **ఫోన్:7997913167** AJH-411614

★ **రెడ్డి** / 29y / 5'5"/ లేట్ మ్యారేజ్, ఫెయిర్, గోల్డ్ బిజినెస్ & సూపర్ మార్కెట్. 3L/pm 5 Cr. ప్రాపర్టీ. తండ్రి లేని అందమైన వధువుకు కుల పట్టింపు లేని బిజినెస్ చూసుకునే వరుడు కావలెను. **ఫోన్:9666442604** AJH-411614

★ **గౌడ** / 28y / 5'4"/ Unmarried / ఫెయిర్ / 4L/pm Govt. Job. సొంత అపార్ట్‌మెంట్స్ 3 Cr. ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. **ఫోన్:8790527332** AJH-411614

★ **రాజులు** / విడో /ఒంటరి/38y / డిగ్రీ / ఓన్ ఇండస్ట్రీ 2LPM 7 కోట్ల ఆస్తి కలిగిన వధువుకి బిజినెస్ చూసుకునే వరుడు తోడు కావలెను కులం ఆస్తి ప్రసక్తి లేదు నో బ్రోకర్స్ **ఫోన్:9985035976 / 9703247793** AJH-427115

★ **రెడ్డి** / విడో /ఒంటరి/37y / టెక్స్‌టైల్స్ ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ 3LPM 9 కోట్లు ఆస్తి కలిగిన వధువుకి బిజినెస్ చూసుకునే వరుడు తోడు కావలెను ఫ్యామిలి సపోర్ట్ ఇవ్వబడును నో బ్రోకర్స్ **ఫోన్:9703238657, 8142079654** AJH-427115

★ రెడ్డి 25 Y, 5'.5" Fair, Hyd 12cp ఆస్తికల అందమైన వంటరి వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. (ఇలరికం అయిన OK) సెల్ :7207501527 AJA- 444130

★ రాజపుత్ర (బొందిలి, క్షత్రీయ) MBBS- ఫిజియోతెరఫి, వయస్సు: 28సం॥ హైదరాబాద్ నివాసి Govt Bank Emply పర్లేదు **సెల్: 8919605890, 9100264403** AJM - 393997

★ రెడ్డి/34/35/42/ 49 సం॥ల అందమైన వధువులకు తగిన వరుళ్ళు కావలెను. కుల పట్టింపు లేదు. పెన్షనర్స్ కూడా OK. **సం.ప్ర. 94905 70029, 91549 69331.** AJR-432893

★ రెడ్డి / 24y. / B.Tech / 30 కోట్ల ప్రోపర్టీ కలిగి పెళ్లి ఆగిపోయిన అందమైన ఏకైక వధువుకి అర్జెంటుగా వరుడు కావలెను. (ఆస్థి, కుల, వయసు ప్రసక్తి లేదు) Contact : whatsapp - 9030916673 AJV-440508

★ **హిందూ మాల:** 23Y, B.Tech, SWE, Infosys (Hyd) జాబ్ జీతం : 60వేలు గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ /డాక్టర్ జాబ్ / ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న హిందూ లేక క్రిస్టియన్ వరుడు కావలెను. డైరెక్ట్ : 9121191105. AJG-448085

★ **కుల పట్టింపు లేదు.** చౌదరి విడో, 32సం॥, Fullfair, 5'4", డిగ్రీ, ఫైనాన్స్ బిజినెస్, Hydలో Own హౌస్, 19కోట్ల ఆస్థి గల అందమైన వధువుకి వరుడు కావలెను. Whats app 9441756785 AJG-637

★ **కుల, ఆస్థి ప్రసక్తి లేదు.** చౌదరి, లేట్ మ్యారేజ్, 30సం॥, MBA, full fair సొంత మెడికల్ షాపు, 22కోట్ల ఆస్థి గల అందమైన వధువుకి వరుడు కావలెను. Whats app 9701433958 AJG-638

★ **కుల, ఆస్థి పట్టింపు లేదు.** చౌదరి విడో, 35సం॥, 5'4", Fullfair, M.Tech, Own గోల్డ్ షాపు Hydలో 28కోట్ల ఆస్థి గల అందమైన వధువుకి వరుడు కావలెను. Whats app 7901487892 AJG-639

★ **రెడ్డి** / 49y /Widow / 5'4"/ MBA / Bank Employee / VRS / PM 32,000 / Lands / పొలాలు 10 Cr. ప్రాపర్టీ ఉన్న ఏకైక వధువుకు తనని తన ఆస్థిని చూసుకోవడానికి FC/BC వరుడు తోడు కావలెను. ఇల్లరికం OK. **ఫోన్:7396408887** AJH-54

★ **రాజులు** / 48y /Widow / 5'4"/ PG / Gold Shop / Own House / PM 3 Lks / 12 Cr. ప్రాపర్టీ / ల్యాండ్స్ ఉన్న ఒంటరి వధువుకు తనని తన Business చూసుకోవడానికి FC/BC సహజీవనం వరుడు కావలెను. **ఫోన్:8187873088** AJH-54

★ **చౌదరి** / 48y /Widow / 5'4"/ MA, BEd / Govt Teacher / VRS / PM 32,000 / 10 ఎ. మామిడి తోటలు / 15 Cr. ప్రాపర్టీ/ Own House / ఉన్న వధువుకు FC/BC సహజీవనం వరుడు కావలెను. **ఫోన్:9121954252** AJH-54

★ **పద్మశాలి** / 48y /Widow / 5'4"/ PG / Garment Business / Own House / PM 2 Lks / 12 Cr. ప్రాపర్టీ/ అమ్మ తప్ప పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన ఒంటరి వధువుకు తనని తన ఆస్థిని చూసుకోవడానికి FC/BC వరుడు తోడు కావలెను. ఇల్లరికం OK. **ఫోన్:8187874909** AJH-54


★ వయస్సు 32y / కుల ఆస్తి పట్టింపు లేదు. డైవర్స్ / 5'3"/ MBBS గైనకాలజిస్ట్ / ఆంధ్రాలో బిజినెస్ Own Clinic, Hydలో సొంత ఇల్లు / 3L PM కలిగిన అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:9177149284** AJH-019

★ **కుల పట్టింపు లేదు** / **చౌదరి** /34y / 5'4" / MSc B.Ed, విడో గవర్నమెంట్ లెక్చరర్ గుంటూర్‌లో బిజినెస్ 4 LPM 8 కోట్ల ప్రాపర్టీ గల, ఒక పాప ఉన్న వధువుకు FC/BC వరుడు కావలెను. **ఫోన్:7285984950** AJH-4674

★ **కుల పట్టింపు లేదు** / డైవర్సీ /27y / 5'4" / శారీస్ బిజినెస్ / 1 Lks p/m సొంత ఇల్లు / 2 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. **ఫోన్:8367331565** AJH-4674

స్నేహా మ్యారేజ్ బ్యూరో

(కమ్మవారికి మాత్రమే)



గత 20 సంవత్సరముల నుండి దేశ విదేశాలలో ఉన్న వేలాది కమ్మ జంటలను కలిపిన అత్యుత్తమ కమ్మ వివాహ వేదిక www.snehamarriage.com.
H.O: D.No.11-160, గద్దం రత్తయ్యవీధి, Near Time హాస్పిటల్, అశోక్‌నగర్, VJA-7: 92461 82689, 92465 12689.
B.O: పద్మావతి ప్లాజా, 3rd floor, Shop No. 424, Kphb Main Road, కూకట్‌పల్లి, Hyd: 040-48540511, 9951032647, Rjy : 99121 04761, Vsp : 92985 55658, Khm : 98480 79629, (whatsapp) 83745 39819

వరుడు కావలెను

కమ్మ 31, 5.7, MCH (న్యూరో సర్జరీ), 40Cr ★ 31, 5.6, MCH (న్యూరో సర్జరీ), 10Cr ★ 27, 5.4, MD (రేడియాలజీ), 20Cr ★ 27, 5.6, MD (Gyn), 30Cr ★ 26, 5.5, MD (OBG), 20Cr ★ 98485 79629

కమ్మ 25, 5.6, MS(GS), 10Cr ★ 26, 5.8, MD(GM), 25Cr ★ 26, 5.5, MD (అనెస్తీషియా), 10Cr ★ 27, 5.7, MD (రేడియాలజీ),15Cr ★ 26, 5.0, MD (పీడియాట్రిక్స్), 3Cr ★ 92985 55658

కమ్మ 24, 5.2, MS, $60K, 5Cr ★ 25, 5.10, MS, $70K, 5Cr ★ 26, 5.4, $70K, 2Cr ★ 27, 5.8, MS, $100K, 8Cr ★ 28, 5.7, MS, $120K, 8Cr ★ 98480 79629

కమ్మ 28, 5.8, MS (ఫార్మసీ), $120K, 70Cr ★ 27, 5.7, MS, $100K, 30Cr ★ 29, 5.7, MS, $115K, 10Cr ★ 31, 5.1, MS, $110K, 5Cr ★ 31, 5.6, MS, $110K, 6Cr ★ 98485 79629

కమ్మ 24, 5.4, BE(MBA), 24L/A, 20Cr ★ 24, 5.4, BE(MBA), 10L/A, 10Cr ★ 26, 5.6, BE(MBA), 8L/A, 10Cr ★ 25, 5.6, BE(MBA), 12L/A, 10Cr ★ 26, 5.3, BE(MBA), 9L/A, 4Cr ★ 040-48540511

కమ్మ: 32, 5.8, BE(MBA), 36L/A, 80Cr ★ 31, 5.8, ISB, 27L/A, 50Cr ★ 29, 5.3, ISB, 22L/A, 10Cr ★ 27, 5.5, ISB, 24L/A, 2Cr ★ 26, 5.4, ISB, 21L/A, 8Cr ★ 92985 55658

కమ్మ 23, 5.3, IIT (బాంబే), 8L/A, 10Cr ★ 24, 5.3, IIT (ఢిల్లీ), Ph.D, 15Cr ★ 26, 5.7, IIT (మద్రాస్), 17L/A, 6Cr ★ 27, 5.4, IIT(KOZ), 15L/A, 6Cr ★ 32, 5.6, Bits, IIM, 40L/A, 5Cr ★ 98480 79629

కమ్మ 21, 5.9, BE, 7Cr ★ 22, 5.5, BE, 8L/A, 5Cr ★ 22, 5.3, BE, 5L/A, 5Cr ★ 24, 5.5, BE, 6L/A, 10Cr ★ 24, 5.4, BE, 6L/A, 5Cr ★ 92985 55658

కమ్మ 25, 5.5, BE, 6L/A, 15Cr ★ 25, 5.4, BE, 6L/A, 2Cr ★ 26, 5.4, BE, 7L/A, 5Cr ★ 27, 5.7, BE, 12L/A, 8Cr ★ 31, 5.4, BE, 10L/A, 2Cr ★ 98485 79629

కమ్మ 24, 5.6, CA, 6L/A, 5Cr ★ 24, 5.4, CA(CS), 7L/A, 10Cr ★ 26, 5.1, M.Arch, 10L/A, 10Cr ★ 25, 5.7, M.Arch, 8L/A, 10Cr ★ 34, 5.7, M.Arch, 20L/A, 20Cr ★ 98480 79629

కమ్మ 27, 5.3, MDS, 50Cr ★ 22, 5.7, BDS, 20Cr ★ 24, 5.2, BDS, 6Cr ★ 27, 5.5, M.Pharm, 25Cr ★ 26, 5.4, Pharm-D, 5L/A, 2Cr ★ 92985 55658

కమ్మ(డైవర్సీ): 26, 5.8, M.Tech, 1Cr/A, 150Cr ★ 31, 5.7, MS, 25L/A, 100Cr ఆస్తి కలిగిన అందమైన వధువులకు Well Settled, Business, Educated అందమైన కమ్మ వరులు కావలెను ★ 98485 79629

వధువు కావలెను

కమ్మ 28, 6, IIT(KGP), 2Cr/A, 200Cr ★ 27, 5.10, M.Arch, 1.5Cr/A, 50Cr ★ 27, 6.1, BE(MBA), 25L/A, 50Cr ★ 28, 5.5, MS, 25L/A, 40Cr ★ 30, 5.11, ISB, 1Cr/A, 15Cr ★ 98485 79629

కమ్మ 29, 5.10, MS (ఆర్థో), 100Cr ★ 28, 5.11, MD (GM), 80Cr ★ 30, 5.10, DM (న్యూరాలజీ), 50Cr ★ 31, 5.11, DM (గ్యాస్ట్రో), 50 Cr ★ 31, 5.10, DM (నెఫ్రాలజీ), 60Cr ★ 92985 55658

కమ్మ 26, 5.8, MD (రేడియాలజీ), 70Cr ★ 27, 6, MS(GS), 10Cr ★ 29, 5.7, MCH (న్యూరాలజీ), 10Cr ★ 30, 5.10, MS (ఆర్థో), 15Cr ★ 30, 6, MS(GM), 20Cr ★ 98480 79629

కమ్మ 26, 6, MS (ఆరోకిల్), $120K, 70Cr ★ 24, 5.8, MS, $80K, 15Cr ★ 27, 5.10, MS, $120K, 50Cr ★ 29, 5.8, MS, $130K, 30Cr ★ 29, 6.2, MS, $130K, 50Cr ★ 040-48540511

కమ్మ 31, 5.11, IIT (KGP), IIM(AHM), 1Cr/A, 20Cr ★ 31, 6, IIT(KGP), IIM, 50L/A, 30Cr ★ 29, 5.9, IIT (మద్రాస్), 50L/A, 20Cr ★ 32, 5.9, IIM, 48I/A, 10Cr ★ 98485 79629

కమ్మ: 24, 6, BE, 25L/A, 10Cr ★ 26, 6, BE, 24L/A, 5Cr ★ 27, 5.9, BE, 6L/A, 5Cr ★ 28, 5.11, BE, 9L/A (C.Govt), 2Cr ★ 28, 6, BE, 25L/A, 8Cr ★ 92985 55658

కమ్మ 28, 5.10, BE, $110K, 10Cr ★ 31, 6.2, BE, $90K, 3Cr ★ 32, 5.11, BE, $130K, 4Cr ★ 33, 5.11, BE, $90K, 2Cr ★ 33, 5.9, BE, $144, 4Cr ★ 98480 79629

కమ్మ 28, 5.9, BE(MBA), 12L/A, 10Cr ★ 29, 5.9, BE(MBA), 15L/A, 25Cr ★ 31, 5.9, BE(MBA), 50L/A, 50Cr ★ 31, 6, BE (MBA), 16L/A, 10Cr ★ 35, 6, BE(MBA), 20L/A, 15Cr ★ 98485 79629

కమ్మ 27, 6, MS, $110K, 15Cr ★ 27, 6.3, MS, $145K, 10Cr ★ 28, 5.9, MS, $100K, 10Cr ★ 29, 5.6, MS, $140K, 6Cr ★ 31, 5.11, MS, $130K, 5Cr ★ 92985 79629

కమ్మ 26, 6, M.Tech, 12L/A, 25Cr ★ 26, 5.11, M.Tech, 10L/A, 3Cr ★ 29, 5.7, M.Tech, 8L/A, 8Cr ★ 31, 5.11, M.Tech, 13L/A, 4Cr ★ 34, 5.8, MCA, 12L/A, 3Cr ★ 98480 79629

కమ్మ(డైవర్సీ): 35, 6.2, MD (కార్డియాలజీ), ప్రొఫెసర్ (ఆర్థోపెడిక్స్), $10L/A, 60Cr ★ 34, 5.7, MD (పీడియాట్రిక్స్), 12L/A, 40Cr కలిగిన అందమైన వరులకు డాక్టర్ చదివిన కమ్మ వధువులు మాత్రమే కావలెను. ★ 98485 79629

★ **కమ్మ** / విడో /40y / 5'5" / Organic Estates & Fertilizers Industry 15 కోట్ల ప్రాపర్టీ గల ఏకైక అందమైన వధువుకు కు లపట్టింపు లేని వరుడు కావలెను. **ఫోన్:7680061835** AJH-4674

★ **కుల ఆస్తి పట్టింపు లేదు** / విడో /42y / G. Employee / ఇనుము కంపెనీ / 16 కోట్ల ప్రాపర్టీ గల పెళ్ళయిన 6 నెలలకు భర్తను, తండ్రిని కోల్పోయిన వధువుకు బిజినెస్ చూసుకునే వరుడు కావలెను. **ఫోన్:9032617309** AJH-4674

కళ్యాణ వేదిక

★ **కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో:** 1వ, 2వ, లేట్ మ్యారేజెస్ / అన్ని కులముల వారికి డైవర్సీస్, విడోస్, విడోవర్స్, పెన్షనర్స్‌కు సంబంధములు త్వరగా కుదుర్చబడును. (స్త్రీలకు ఫ్రీ రిజి.) **ఫోన్: 7416303057** AJH-019

★ **Whats app** your photo & Bio-data to 9347262769 we will send suitable Matches www.pellisandadi. com, **9290287458** AJH-019

అన్నపూర్ణ మ్యారేజెస్

● అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు కుదర్చబడును ●

Doctors,NRI,Software,Business,Govt.&Pvt.Jobs,క్లాస్ మరియు మిడిల్ క్లాస్ వారు సంబంధములకై సంప్రదించండి. ఫ్రీగా లాగిన్ అవ్వండి.
www.annapurnamarriages.com
గుంటూరు హెడ్ ఆఫీస్ - 9397979718,
విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ - 83673 55588, ఒంగోలు బ్రాంచ్ ఆఫీస్ - 88869 53666,
తెనాలి బ్రాంచ్ ఆఫీస్ - 93979 79720, నెల్లూరు బ్రాంచ్ ఆఫీస్-93979 79740
ఫొటో ఎందుకు ? - పెళ్ళి చేసుకోవాలి అనుకునేవారికి ఫొటో తప్పనిసరి
ఆధార్ ఎందుకు ? - మీ Age & address Identification కోసం
ఫోన్ వెరిఫికేషన్ ? - మీకు పెళ్ళి సంబంధములు తెలియజేయటం కోసం
పూర్తి వివరములు మరియు ఇవి మూడు ఇచ్చినవారికి మాత్రమే అన్నపూర్ణ మ్యారేజెస్ వారు పెళ్ళి సంబంధములు చూడబడును.

వరుడు కావలెను

★ కమ్మ-(27554); A-24; 5'3"; MS-OBG (Medical); ఆస్థి- 15 Crores; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు MD చదివి doctor గా చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367055599

★ సవర కాపు-(27814); A-27; 5'2"; DGO-Gynacologist; చక్కటి చదువు కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు కులపట్టింపు లేని వెల్‌సెటిల్డ్ doctor వరుడు కావలెను. 8367055599

★ రెడ్డి-డైవర్సి-(27701); A-23; 5'3"; B.Tech; ఆస్థి- 5 Crores; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి వెల్‌సెటిల్డ్ Job/Business చేసే వరుడు కావలెను. 8367055599

★ బలిజ-(28539); A-25; 5'4"; B.Tech, ఆస్థి- Land ; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి Govt.Job చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367055599

★ ఎరుకుల-(13714); A-33; 5'4"; M.Sc, ఆస్థి- House & Land; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన వధువుకు B.Tech చదివి Govt.Job చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367055599

★ కమ్మ-డైవర్సి-(15504); A-38; 5'2"; MIB at Austrilia; Australia Govt. Employee, ఆదాయం- 85 La/Pa, ఆస్థి- 15 Crores; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన వధువుకు Australia లో SWE Job/ doctor వరుడు కావలెను. 8367055599

★ రజక-డైవర్సి-(28182); A-28; 5'3"; B.Sc (Computers); Govt. Job, ఆదాయం- 3.96 La/Pa, ఆస్థి- 3 Lakhs; ప్రాపర్టీ కలిగిన వధువుకు డిగ్రీ చదివి Pvt.Job చేసే వరుడు కావలెను. 8367055599

★ యాదవ-(27444); A-27; 5'2"; డిగ్రీ; ఆస్థి- 3 Lakhs; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన వధువుకు డిగ్రీ చదివి Pvt.Job చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367055599

★ కాపు-Roman Catholic (14590); A-25; 5'5"; B.Tech; SWE, ఆదాయం- 3 La/Pa, ఆస్థి- 50 Lakhs; ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను. 8367055599

వధువు కావలెను

★ కమ్మ-(25530); A-33, 5'11", M.Tech; web developer; ఆదాయం- 16.50La/Pa; ఆస్థి- 7 ఎకరాల పొలం ప్రాపర్టీ ఉన్న వరుడుకి B.Tech చదివిన అందమైన సాంప్రదాయమైన వధువు కావలెను. 7675054666

★ కమ్మ-(19003); A-27, 5'8", B.Com; Pvt. Job; ఆదాయం- 2.40La/Pa; ఆస్థి- 50 Lakhs ప్రాపర్టీ ఉన్న వరుడుకి డిగ్రీ చదివిన అందమైన సాంప్రదాయమైన వధువు కావలెను. 7675054666

★ కాపు-(28638); A-29, 5'5", MCA; Bank Emp. (Govt.); ఆదాయం-7.20 La/Pa; ఆదాయం వున్న వరుడుకి డిగ్రీ చదివిన అందమైన సాంప్రదాయమైన వధువు కావలెను. 7675054666

★ రెడ్డి-(28579); A-26, 5'7", M.S (Engg); చదివి USA లో SWE; ఆదాయం-82.99 La/Pa; ఆస్థి- 25Cr ప్రాపర్టీ వున్న వరుడుకి B.Tech చదివిన అందమైన సాంప్రదాయమైన వధువు కావలెను. 7675054666

★ బ్రాహ్మణ-(28475); A-37, 5'4", MBA; Pvt. Sr.Asst. Exe; ఆదాయం-3 La/Pa; ఆస్థి- House ప్రాపర్టీ ఉన్న వరుడుకి డిగ్రీ చదివిన అందమైన సాంప్రదాయమైన వధువు కావలెను. 7675054666

★ కాపు-(28175); A-32, 5'11", MCA; Sr.SWE; ఆదాయం- 7La/Pa; ఆస్థి- 2Cr ప్రాపర్టీ వున్న వరుడుకి B.Tech చదివిన అందమైన వధువు కావలెను. 7675054666

★ యాదవ-(25900); A-27, 5'10", B.Tech; SWE; ఆదాయం- 8La/Pa; ఆస్థి- 3 ఎకరాల పొలం ప్రాపర్టీ వున్న వరుడుకి B.Tech చదివిన అందమైన వధువు కావలెను. 7675054666

★ హిందూ మాల-(12542); A-30, 5'11", MBA; Hotel Management at Australia; ఆదాయం- 55La/Pa; ఆస్థి- 1 Flat ప్రాపర్టీ ఉన్న వరుడుకి డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 7675054666

★ ముస్లిం-(28575); A-25, 5'10", MS Engg; SWE at USA; ఆదాయం- 36La/Pa; ఆస్థి- 1 Flat ప్రాపర్టీ ఉన్న వరుడుకి SWE/ Doctor వధువు కావలెను. 7675054666

★ **అమ్మ మ్యారేజ్ బ్యూరో:** రెండవ పెండ్లి సంబంధాలు మాత్రమే. వయస్సు నిమిత్తం లేకుండా అన్ని కులాలకు మంచి పేరు సాంప్రదాయం, పద్ధతి, సంపన్న మరియు ఇల్లరికం సంబంధాలు కలవు. (ఫాస్ట్ సెటిల్‌మెంట్స్) **ఫోన్: 9581731331** AJH-019

★ **Radha Marriage Bureau** అన్ని కులాల వారికి సంబంధములు చూడబడును. రెండో వివాహము వారు కూడా సంప్రదించగలరు. **Contact: 9121154653 / 9550834193, radhamarriagebureau2018@gmail.com** AJH-16110

★ **HIV+ve** వారికి ప్రత్యేకంగా గోప్యంగా & Disabled Personsకి మంచి సంబంధములు చూడబడును. ముందు డబ్బు తీసుకోము. సత్యదేవ మ్యారేజెస్. సెల్: **79958 24689** AJB-442421

★ సహజీవనం, తోడుకై, ప్రభుత్వ టీచర్, డాక్టర్లు, నర్సు, ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారం ఒంటరి వారికి స్త్రీలకు మాత్రము ఉచితంగా కుదర్చబడును. సెల్: 80084 25122. AJT-433951

★ B.C. వర్గమునకు చెందిన, 49సం॥ కల్గిన, ఎత్తు : 5.1, Q : B.A., సొంత ఇల్లు కల్గిన, బిజినెస్‌లో నెలకు 39వేలు సంపాదన , ఇద్దరు పిల్లలు కల వరునికి ఏ భాదర బంధలేని 40-50 సంలోపు వయస్సు గల వధువు కావలెను. నేరుగా సంప్ర : 9441893671, 7396775843 AJA- 435021

గమనిక: ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



మీ దగ్గరలోని ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయాలలో సంప్రదించండి

మహబూబ్‌నగర్	:9985411365	రంగారెడ్డి	:9985410909	ఒంగోలు	:9985411483
నిజామాబాద్	:9985411453	మెదక్	:9985410904	గుంటూరు	:9985411217
కరీంనగర్	:9985411273	కర్నూలు	:9985411363	విజయవాడ	:9985411614
ఆదిలాబాద్	:9985411293	అనంతపురం	:9985411165	తణుకు	:9985411543
వరంగల్	:9985411172	కడప	:9985411183	కాకినాడ	:9985411204
ఖమ్మం	:9985401672	తిరుపతి	:9985411423	విశాఖపట్నం	:9985411641
నల్గొండ	:9985410384	నెల్లూరు	:9985411013	శ్రీకాకుళం	:9985411066
				విజయనగరం	:9985411522

ప్రతి 4 లైన్ల ప్రకటనకు రూ.800/- (కంబైన్డ్)
ప్రతి అదనపు లైన్‌కు రూ.130/- (GST అదనం)

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లిహిల్స్, హైదరాబాద్ - 33. ఫోన్: 040-23558233/44/55/66. సెల్: 9985921380.



సప్త వర్ణాల సాలీడు

హరివిల్లును చూసి పరవశించనివారెవరు? అతి చిన్నవైన కొన్ని కీట కాలు కూడా ఇంద్రధనుస్సు రంగులను ఆవిష్కరించగలవని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. సహచరిని ఆకర్షించేందుకు మగ నెమలి పురి విప్పినట్టే.. ఓ రకం సాలీళ్లు సప్తవర్ణాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తాయని పరిశోధ కుల బృందం తొలిసారిగా తేల్చింది. పీకాక్ స్పైడర్‌గా వ్యవహరించే ఆ మగ సాలీడు పొడవు 5 మిల్లీమీటర్లే! పొత్తికడుపులో ఉన్న స్పెషల్‌స్కేల్స్ ద్వారా ఆ రంగులను వెదజ ల్లుతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. లైట్ అండ్ మైక్రోస్కోపీ, హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్, ఇమేజింగ్ స్కాటరోమెట్రీ వంటి అధునాతన సాంకేతిక పద్ధతుల ద్వారా విశ్లేషించి మరీ ఈ విషయాన్ని తేల్చారు.



మా భయమే నిజమైంది

- నాలుగేళ్ల కనిష్ఠానికి వృద్ధిరేటు
- మోదీ సర్కారుపై చిదంబరం

న్యూఢిల్లీ, జనవరి 6: దేశ ఆర్థిక వ్యవస్థ మంద గమనంలో మునుపెన్నడూ లేనంత తీవ్రస్థాయిలో ఉందన్న భయాందోళనలు నిజమయ్యాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చి దంబరం పేర్కొన్నారు. నాలుగేళ్ల కనిష్ఠానికి వృద్ధి రేటు పడిపోవచ్చని కేంద్ర గణాంక శాఖ(సీఎ్‌స్ఎవో) శుక్రవారం విడుదల చేసిన అంచనాలపై ఆయన స్పందించారు. 2015-16, 2016-17లో జీడీపీ వరుసగా 8, 7.1గా ఉండగా, సీఎస్‌వో అంచనాల ప్రకారం 2017-18లో జీడీపీ 6.5గా ఉందని.. ఆర్థిక వృద్ధి మందగించిందనడానికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇబ్బడి ముబ్బడిగా అభివృద్ధి జరుగుతోందని మోదీ ప్రభుత్వం చెప్పిన కబుర్లు ఈ గణాంకాలతో ఆవిరైపోయాయని ఎద్దేవా చేశారు. ఆర్థిక వ్యవస్థపై ముందు నుంచి తాము చేస్తున్న హెచ్చరికలు, భయాలే ఇప్పుడు నిజమయ్యాయని కేంద్రంపై మండిపడ్డారు. కొత్త ప్రాజెక్టులు, పెట్టుబడులు తగ్గిపోయాయని, పెద్ద నోట్ల రద్దు ప్రభావం ఇన్‌ఫార్మల్ సెక్టార్‌పై ఇంకా కొనసాగుతోందని గుర్తు చేశారు. వ్యవసాయ రంగం తీవ్ర కష్టాలను ఎదుర్కొంటుందని, ఉద్యోగ కల్పనలో బీజేపీ ప్రభుత్వం పాతాళానికి పడిపోయిందని ఎద్దేవా చేశారు.

లాలూకు మూడున్నరేళ్ల జైలు

- రూ.10 లక్షల జరిమానా
- మరో దాణా కేసులో సీబీఐ కోర్టు తీర్పు
- హైకోర్టులో అప్పీల్ చేస్తాం: తేజస్వి



రాంచీ, జనవరి 6: దాణా కుంభకోణానికి సంబంధించి రెండో కేసులోనూ దోషిగా నిర్ధారణ అయిన ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్(69)కు ఇక్కడి సీబీఐ ప్రత్యేక కోర్టు శనివారం మూడున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు జైల్లో గడపాల్సి ఉంటుందని న్యాయమూర్తి శివపాల్‌సింగ్ స్పష్టం చేశారు. మరో ఏడు గురికీ ఇవే శిక్షలు వేశారు. లాలూ ప్రస్తుతం రాంచీలోని బిర్సా ముండా సెంట్రల్ జైల్లో ఉన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి తన తీర్పును ఆయనకు తెలియజేశారు. లాలూ బిహార్ ముఖ్యమంత్రిగా ఉండగా 1990-97 మధ్య.. పశుదాణాకు సంబంధించి రూ.970కోట్ల ప్రభుత్వ నిధులను వివిధ ఖజానాల నుంచి అక్రమంగా స్వాహా చేశారన్నది ప్ర ధాన అభియోగం. దీనికి సంబంధించి మొత్తం 5కేసులు ఉండ గా.. చాయిబాసా ఖజానా నుంచి రూ.37.7 కోట్లు అక్రమంగా డ్రా చేసిన మొదటి కేసులో లాలూ, మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా సహా 45 మందికి కోర్టు నాలుగేళ్ల క్రితం ఐదేళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానా విధించింది. రెండు నెలలకుపైగా జైల్లో ఉన్న ఆయనకు సుప్రీంకోర్టు ఆ తర్వాత బెయిలిచ్చింది. ఇప్పుడు దేవ్‌గఢ్ ఖజానా నుంచి రూ.89.27 లక్షలను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారన్న కేసులో శిక్ష పడింది. కాగా.. తీర్పును హైకోర్టులో అప్పీల్ చేస్తామని లాలూ చిన్నకుమారుడు తేజస్వి యాదవ్ పట్నాలో తెలిపారు. మరోవైపు, మనీలాండరింగ్ కేసులో లాలూ కుమార్తె మీసాభారతి, అల్లుడు శైలేశ్‌కుమార్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండో చార్జిషీటు దాఖలుచేసింది.



పట్నాలో విలేకరులతో మాట్లాడి వెళ్తున్న రబ్రీదేవి, తేజస్వి యాదవ్

ట్రంప్‌కు మధ్యంతర సవాల్



నవంబరు ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలవకపోతే నిర్ణయాల అమలు కష్టమే

హెచ్1బీ వీసాల పొడిగింపు నిషేధిస్తే కోర్టు వ్యాజ్యాలు అనివార్యం

హైదరాబాద్, జనవరి 6: హెచ్ 1బీ వీసాల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు, తీసుకుంటున్న అనేకానేక వివాదాస్పద నిర్ణయాలకు ఈ ఏడాది చివరిలో అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయని అమెరికన్ మీడియా విశ్లేషిస్తోంది. ఈ ఏడాది నవంబరు 6న ప్రతినిధుల సభకు, సెనెట్ కు మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి. అందులో గనక డెమొక్రాట్లు గెలిస్తే- ట్రంప్ నిర్ణయాలను ప్రశ్నించవచ్చు, పాతవాటిని తిరగతోడవచ్చు. "నిబంధనల ప్రకారం- అమెరికన్ కాంగ్రెస్ (అంటే సెనెట్ లేదా ప్రతినిధుల సభ) లోని ఏ సభ్యుడైనా ఓ బిల్లును ప్రతిపాదించవచ్చు. దాన్ని చర్చించి ఆ సభ బిల్లును పాస్ చేయవచ్చు. అప్పుడది అధ్యక్షుడి పరిశీలనకు వెళుతుంది. ఆయన దానిని ఆమోదించవచ్చు లేదా తిరస్కరించనూ వచ్చు. భారత్‌లో ఆర్డినెన్స్‌ల మాదిరిగా అమెరికాలో అధ్యక్షుడు కూడా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లను జారీ చేయవచ్చు. దాన్ని అమలు చేసే బాధ్యత పాలనా యంత్రాంగానిది. ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమలు విషయంలో కాంగ్రెస్ జోక్యం చేసుకోవచ్చు. ఆ ఆర్డర్‌ను తాము తిరస్కరిస్తున్నట్లు సెనెట్ గానీ, ప్రతినిధుల సభ గానీ ఓ నిర్ణయం తీసుకోవచ్చు. తన ఆదేశాల్ని తిరస్కరిస్తే అధ్యక్షుడు - కాంగ్రెస్ తీసుకున్న ఆ నిర్ణయాన్ని వీటో చేయవచ్చు. అపుడు కాంగ్రెస్‌కు - అధ్యక్షుడి వీటోను తోసిరాజనే అధికారం కూడా ఉంటుంది. కాబట్టి.. నవంబరులో జరిగే ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే ట్రంప్‌కు గడ్డుకాలమే.. ఆయన ఆర్డర్లు, ఇతర నిర్ణయాలు అంత సులువుగా కాంగ్రెస్‌లో ఆమోదం పొందలేవు" అని వివరించారు అమెరికా ఇమిగ్రేషన్ నిపుణుడు డాక్టర్ శశాంక్ మధురాపంతుల. "అయితే హెచ్1బీ వీసాల అంశం వాటిలో ఉంటుందా లేదా అన్నది ఇపుడే చెప్పలేం. ఎందుకంటే ఇది అమెరికన్ల ఉపాధికి సంబంధించిన అంశం. అమెరికన్లే ప్రథమ ప్రాధాన్యం అన్న నినాదాన్ని ఎవరూ తప్పుపట్టరు కాబట్టి- వీసాల గడువు పెంచకుండా, గ్రీన్‌కార్డులు జారీ చేయకుండా వ్యవహరిస్తే- విదేశీయులు- ముఖ్యంగా భారత్‌కు చెందిన టెకీలు తమంత తాముగా స్వదేశాలకు తిరిగి వెళ్ళిపోతారన్న నిర్ణయానికి ఎక్కువమంది అడ్డుచెప్పరు" అన్నారు కాలిఫోర్నియాలో విప్రోలో పనిచేస్తున్న రాధాకృష్ణ గుమ్మా. ఒబామా హెల్త్‌కేర్, టాక్స్ కట్స్.. మొదలైన వివాదాస్పద అంశాలపైనే అంతా దృష్టి పెడతారు తప్ప- హెచ్1బీ వీసాల పొడిగింపు వ్యవహారం అమెరికన్ ప్రజాప్రతినిధులకు పెద్ద ప్రాధాన్యాంశం కాదని ఆయన అభిప్రాయం. హెచ్1బీ వీసాల వారిని వెనక్కి పంపడం వల్ల భారత్‌కు పరోక్షంగా మేలు జరుగుతుందని వాదించేవారూ ఉన్నారు. "ప్రస్తుతం ఉద్యోగాల్లేక యువత సంక్షోభంలో ఉన్నట్లు కనిపించినా- ఇపుడిపుడే వికసిస్తున్న వ్యాపార, పారిశ్రామిక, తయారీ రంగాలు- మంచి నిపుణుల చేరికతో బలపడతాయి. అందుకే ఆనంద్ మహేంద్ర లాంటి దిగ్గజాలు కూడా 'ఇండియాకు తిరిగొచ్చే టెకీలకు స్వాగతం' అన్నారు" అని వివరించారు న్యూయార్క్‌లో ఉంటున్న జన్యు శాస్త్రవేత్త డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు. ట్రంప్ ప్రభుత్వం గనక తన నిర్ణయాన్ని అమలు చేస్తే న్యాయపరమైన కేసులు ఎదుర్కోక తప్పదని ఇమిగ్రేషన్ నిపుణులు అంటున్నారు. "ఇన్నేళ్ళూ గ్రీన్‌కార్డు మంజూరు చేయకపోవడం ప్రభుత్వ తప్పిదం. ఆ తప్పుకు వీరిని శిక్షిస్తారా?" అని నాస్కాం ఉపాధ్యక్షుడు శివేంద్రసింగ్ ప్రశ్నించారు.

లాబీయింగ్ ద్వారా ఆపొచ్చా?

అమెరికాలో చాలా లాబీ గ్రూపులున్నాయి. గూగుల్, ఐబీఎం లు కూడా చాల పవర్‌ఫుల్ లాబీలను మెయిన్‌టైన్ చేస్తున్నాయి. భారత్-అనుకూల లాబీల సాయం తీసుకొని, భారత ప్రభుత్వం కూడా చొరవ చూపి- అమెరికా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే కొంత మార్పు ఉండవచ్చని, కనీసం భార్యాపిల్లలను పంపేసినా, టెకీలను మాత్రం కంటిన్యూ చేసే వీలుందని ఇమిగ్రేషన్ నిపుణుడు జి.భాస్కర్ వివరించారు.

'హెచ్-1బీ వీసా' చెత్త పాలసీ!

వాషింగ్టన్, జనవరి 6: హెచ్-1బీ వీసాలను పొడిగించకూడదనే నిర్ణయం.. ఓ చెత్త పాలసీ అని అమెరికా వాణిజ్య మండలి అభిప్రాయపడింది. గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్న హెచ్-1బీ వీసాదారులకు వీసా గడువు పొడిగించకూడదనే నిబంధనను అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఇటీవల ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీని వల్ల ప్రతిభావంతులైన లక్షలాది విదేశీయులు అమెరికాను విడిచిపెట్టాల్సి ఉంటుందని తెలిపింది. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుందని అమెరికా వాణిజ్య మండలి ఆందోళన వ్యక్తం చేసింది.

మెక్సికో గోడకు రూ. లక్ష కోట్లు

వాషింగ్టన్, జనవరి 6: అక్రమ వలస దారులను అడ్డుకునేందుకు అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడను నిర్మిస్తానన్న ట్రంప్ ఈ మేరకు బ్లూప్రింట్ విడుదల చేశారు. గోడ నిర్మించేందుకు 18 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.లక్షా 14వేల కోట్లు) కావాలని ట్రంప్ యూఎస్ కాంగ్రెస్‌కు ప్రతిపాదనలు పంపారు. రానున్న పదేళ్లలో మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి భారీ మొత్తం అవసరమవుతుందన్నారు.

ఏమిటీ మధ్యంతరం?

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలం సగం పూర్తయ్యే రోజున ఈ మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి. అంటే ఈ ఏడాది నవంబరు 6న జరుగుతాయి. అమెరికా ప్రతినిధుల సభలోని 435 సీట్లకు, సెనెట్‌లోని 33 సీట్లకు, 39 రాష్ట్రాల గవర్నర్ పదవులకు, మరెన్నో ఇతర పదవులకు ఎన్నికలు జరుగుతాయి. అమెరికాలో మొత్తం రాష్ట్రాల సంఖ్య 50... ప్రతీ రాష్ట్రానికీ రెండేసి సెనెట్ సీట్లుంటాయి.. అంటేసెనెట్‌లో మొత్తం సభ్యుల సంఖ్య 100. మన రాజ్యసభ ఎంపీల మాదిరిగానే సభ్యులకు ఆరేళ్ల పదవీకాలం ఉంటుంది. మూడోవంతు సీట్లకు అలా ఆరేళ్ళకో సారి ఎన్నికలు జరుగుతుంటాయి. ఇపుడు 33 సీట్లకు ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఇందులో 24 స్థానాలు డెమొక్రాట్లవి, 8 సీట్లు రిపబ్లికన్లవి. ఈ 33 మాత్రమే కాక- వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన వాటికి ప్రత్యేక ఎన్నికలూ జరుగుతాయి. 50 రాష్ట్రాల్లోని 435 ప్రతినిధుల సభ సీట్లకూ నవంబరు 6నే ఎన్నికలు. మన లోక్‌సభ మాదిరిగానే జనాభా ఆధారంగా నియోజవర్గాలు (అంటే ప్రతినిధుల సంఖ్య) ఉంటుంది. కాలిఫోర్నియా నుంచి అత్యధికంగా 53 మంది ఎన్నికవుతారు. అలాస్కా, డెలావేర్, మౌంటానా, ఉత్తర డకోటా, దక్షిణ డకోటా, వెర్మాంట్, వ్యోమాంగ్‌ల నుంచి అత్యల్పంగా- కేవలం ఒక్కో ప్రతినిధి మాత్రమే ఉంటారు. ప్రతీ సరి సంవత్సరంలోనూ- అంటే రెండేళ్ళ కోసారి ప్రతినిధులను ఎన్నుకుంటారు.



నాడు

ఎలా ఉండేవాడు..
ఇంతలో ఎలా మారిపోయాడు?
ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ నిజంగానే మ్యాజిక్ చేశాడు. ఏకంగా 108 కిలోల బరువు తగ్గి స్మార్ట్ అయిపోయాడు. భారీ శరీరంతో నడవడానికే ఆయాసపడిన మనిషి.. ఇప్పుడు ఫిట్‌గా కనిస్తున్నాడు. ఇటీవల రిలయన్స్ ఇండస్ట్రీస్ 40వ వార్షికోత్సవ వేడుకల్లో షారూఖ్ వంటి స్టార్లను కూడా ఆశ్చర్యపరిచాడు.
ఇంతకీ చోటా అంబానీ ఏం చేశాడు? ఏం తిన్నాడు? అతని డైట్ ప్లాన్ ఏమిటి?

ఫ్యాట్ టు ఫిట్

జూనియర్ అంబానీ స్మార్ట్ టిప్స్

డైట్ ప్లాన్‌తో బరువు తగ్గిన అనంత్

బరువు తగ్గాలని చాలామందికి ఉంటుంది. అందుకు రకరకాల పద్ధతులు అనుసరిస్తూ ఉంటారు. తీసుకునే ఆహారం, తాగే నీళ్ల, వ్యాయామం, విశ్రాంతి.. ఇలా జాబితా కొనసాగుతూనే ఉంటుంది. కానీ ముందుగా డైట్‌పై దృష్టి పెడితే మిగతావన్నీ సహజంగానే దారిలో పడిపోతాయంటున్నాడు అనంత్ అంబానీ! ఏడాదిన్నరలో ఏకంగా 108 కేజీల బరువు తగ్గిన అనంత్.. ఇప్పుడు స్టయిలిష్‌గా కూడా కనిపిస్తున్నాడు.

క్యాలరీ కంట్రోల్డ్ డైట్

సన్నబడాలనుకునేవారు మొట్టమొదట డైట్‌లో చక్కెర, కార్బోహైడ్రేట్స్ దూరం పెట్టాలంటున్నాడు అనంత్ అంబానీ! కావాల్సిన మోతాదులో ప్రొటీన్, ఫ్యాట్ ఫుడ్ తీసుకోవచ్చని చెబుతున్నాడు. రోజూ 1200 నుంచి 1400 క్యాలరీల ఆహారం తీసుకున్న అనంత్..తన ఫిట్‌నెస్ ట్రైనర్ వినోద్ చనా సూచించిట్లుగా రోజూ వ్యాయామం చేశాడు. డైట్‌ను స్ట్రిక్ట్‌గా ఫాలో అయ్యాడు. రోజూ కూరగాయలు, పనీర్, పప్పుధాన్యాలు, కాయధాన్యాలు తిన్నాడు. ఆహారంలో ఫైబర్, ఫ్యాట్స్, ప్రొటీన్స్, విటమిన్స్, మినరల్స్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాడు. శాశ్వతంగా బరువు తగ్గాలనుకునేవారు పౌష్టికాహారంపై కూడా దృష్టిసారించాలని చెబుతున్నాడు. శరీరంలో హార్మోన్ మార్పులతో అనంత్ అంబానీ ఒకేసారి బాగా బరువు పెరిగాడు. ఈ సమస్య చాలా మంది ఎదుర్కొంటారు. కానీ శరీరంలో మార్పులను అంగీకరిస్తూనే బరువు తగ్గడానికి కష్టపడాలని అంబానీల వారసుడు సూచిస్తున్నాడు.

జంక్ ఫుడ్ వద్దు

అనంత్ అంబానీకి చిరుతిళ్లు అంటే చాలా ఇష్టం. అవి తినకుండా ఒక్క రోజు కూడా ఉండలేకపోయేవాడు. కానీ క్యాలరీ కంట్రోల్డ్ డైట్ మొదలు పెట్టినప్పటి నుంచీ.. జంక్ ఫుడ్‌ను పూర్తిగా వదిలేశాడు. చీటింగ్ చేసి పిజ్జాలు, బర్గర్లు, పానీపూరీలు తింటే మీకేనష్టమంటున్నాడు. బరువు తగ్గడం కోసం అనంత్ అంబానీ రోజూ ఐదారు గంటలపాటు వ్యాయామం చేశాడు. ప్రతిరోజూ 21 కిలోమీటర్లు నడిచాడు. దీంతోబాటు యోగా, వెయిట్ ట్రైనింగ్, ఫంక్షనల్ ట్రైనింగ్, హై ఇంటెన్సిటీ కార్డియో ఎక్సర్‌సైజులు చేశాడు. వ్యాయామాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా చేస్తే ఖచ్చితంగా బరువు తగ్గుతారంటున్నాడు అనంత్ అంబానీ! మొత్తానికి బరువు తగ్గాలనుకునే లక్షలాదిమందికి చోటా అంబానీ స్ఫూర్తినిస్తున్నాడు.

-సెంట్రల్ డెస్క్



నేడు

మరో బ్యాలెట్‌లా వీవీపీఏటీ!

ఈవీఎంల సీయూలు

పనిచేయకపోతే ఓట్ల రసీదుల లెక్కింపు

కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లతో ఎన్నికల నిర్వహణ.. ఫలితాలు లెక్కిస్తుండగా సాంకేతిక ఇబ్బందులతో ఈవీఎంల కంట్రోల్ యూనిట్(సీయూ)లు తెరుచుకోలేదు. అప్పుడేం చేస్తారు.. అప్పటికే లెక్కించిన ఓట్లలో మొదటి ఇద్దరి అభ్యర్థుల మధ్య తేడా కంటే తెరుచుకోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లు తక్కువైతే ఎలాంటి సమస్య ఉండదు. కానీ, ఫలితం దోబూచులాడే పరిస్థితి ఉంటే ఎలా?' ఇప్పటి వరకు ఎదురైన ఈ సమస్యలకు 'రీపోలింగ్'తోనే పరిష్కారం లభించింది. 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి విషయంలో దీన్ని గమనించాం. కానీ, ఇక నుంచి ఈ ఇబ్బంది ఉండదు. ఎందుకంటే, ఇక నుంచి జరిగే ప్రతీ ఎన్నికలో విధిగా వోటర్ వెరిఫికేషన్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీపీఏటీ) అమలు చేస్తారు. అవి ఈవీఎంలకు అనుసంధానం చేసి ఉంటాయి. ఓటరు తన ఓటు వేశాక ఏ గుర్తుకు ఓటు వేసారో స్ర్కీన్‌పై తెలుస్తుంది. ఆ గుర్తుకు ఓటేసిన రసీదు బయటకు వస్తుంది. కానీ, అది ఓటరుకు చేరదు. ఈవీఎంకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన మరో బాక్సులోకి వెళ్లిపోతుంది. ఇకపై సీయూల వల్ల ఫలితాల లెక్కింపులో ఇబ్బందులు తలెత్తితే బాక్సులో పడిన ఓటరు రసీదులను లెక్కిస్తారు. అయితే, సీయూ పనిచేయకపోతేనే వీవీపీఏటీ బాక్సుల్లోని ఓట్లను లెక్కించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. గతంలో బ్యాలెట్ బాక్సులను, బ్యాలెట్ పత్రాలను ఫలితాలు వెల్లడించిన తదుపరి కొంతకాలం భద్రపరిచేవారు. ఇప్పుడూ వీవీపీఏటీ బాక్సులను అలాగే భద్రపరుస్తారు.



ఐఈడీ పేలుడు జరిగిన ప్రాంతం

నలుగురు పోలీసుల మృతి

- కశ్మీర్‌లో ఐఈడీ పేలుడు

శ్రీనగర్/జమ్మూ, జనవరి 6: ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో శనివారం ఉగ్రవాదులు అమర్చిన ఐఈడీ(అత్యంత శక్తిమంతమైన పేలుడు పదార్థం) పేలడంతో నలుగురు పోలీసులు మరణించారు. సోపోర్ పట్టణంలోని ఓ షాపు వద్ద ఉగ్రవాదులు ఐఈడీని అమర్చారని ఒక అధికారి చెప్పారు. వేర్పాటువాదుల ఆందోళనల నేపథ్యంలో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. డిసెంబరు 31న దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామాలో పారామిలటరీ బలగాల క్యాంపుపై ఉగ్రవాదుల ఆత్మాహుతిదాడిలో ఐదుగురు సీఆర్పీఎఫ్ సిబ్బంది మరణించారు. అయితే భద్రతా బలగాల ప్రాణాలు కాపాడటంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. దాడి జరగని రోజంటూ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్‌శర్మ అన్నారు. మరోవైపు సరిహద్దులో పాకిస్థాన్ బలగాలు తరచుగా జరుపుతున్న కాల్పుల నుంచి స్థానిక ప్రజలను కాపాడేందుకు రాజౌరి జిల్లాలో 5,300కుపైగా వ్యక్తిగత, సామాజిక బంకర్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది.

ఆరు మృతదేహాల వెలికితీత

కశ్మీర్‌లో విరిగిపడిన మంచు చరియలు

శ్రీనగర్, జనవరి 6: ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ప్రయాణికుల వాహనంపై భారీ మంచు చరియలు విరిగిపడిన ప్రాంతం నుంచి ఆరు మృతదేహాలను వెలికితీసినట్టు శనివారం డిప్యూటీ కమిషనర్ ఖాలిద్ జహంగీర్ తెలిపారు. కుప్వారా- తంగ్ధర్ రోడ్డుపై ఖూనీ నల్లా ప్రాంతంలో శుక్రవారం ఓ వాహనంపై మంచుచరియలు విరిగిపడ్డాయి. ముగ్గురు వ్యక్తులను సజీవంగానే మంచు నుంచి బయటికి తీసుకురాగలిగామని ఆయన చెప్పారు. శుక్రవారం రాత్రి బీకన్ అధికారి మృతదేహాన్ని, శనివారం ఐదుగురు ప్రయాణికుల మృతదేహాలను వెలికితీశామని తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



జమాత్ ఉద్ దవా సంస్థ లోగో

జమాత్ సహా 72 సంస్థలపై వేటు

- ఉగ్రసంస్థలకు విరాళాలిస్తే జైలు
- ట్రంప్ హెచ్చరికలతో పాక్ చర్యలు

న్యూఢిల్లీ, జనవరి 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలతో పాటు, రూ.12వేల కోట్ల సైనిక సాయాన్ని నిలిపివేయడంతో పాకిస్థాన్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ముంబై పేలుళ్ల సూత్రదారి హాఫీజ్ సయీద్‌కు చెందిన జమాత్ ఉద్ దవా సహ 72 సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ మేరకు పాక్ హోంశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అమెరికా ఆగ్రహాన్ని అనుగ్రహంగా మార్చుకునేందుకు పాక్ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు ఉగ్రవాదులకు ఉదారంగా విరాళాలు ఇవ్వొద్దని పౌరులను కోరుతూ ఆ దేశంలోని పత్రికల్లో ప్రభుత్వం ఓ ప్రకటనను వెలువరించింది. కష్టపడి సంపాదించిన డబ్బును విరాళాల పేరుతో ఉగ్రమూకలతో సంబంధాలున్న సంస్థలకు ఇవ్వడం మానుకోవాలని పాక్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో సూచించింది. నిషేధం విధించిన జమాత్ ఉద్ దవాతో పాటు 72 సంస్థల వివరాలను కూడా ప్రకటించింది. ఆ సంస్థలకు విరాళాలు ఇవ్వడం నేరమని, అటువంటి వారికి 5 నుంచి 10ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.కోటి జరిమానా విధిస్తామని, సదురు వ్యక్తుల ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించింది. మరోవైపు తన పరువుకు భంగం కలిగించారంటూ పాక్ రక్షణ మంత్రికి అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ సయీద్ నోటీసులు పంపించారు. 14రోజుల్లోగా సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



హజ్‌యాత్రకు సంబంధించి ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకం చేసేందుకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ సౌదీ అరేబియా వెళ్లారు. శనివారం మక్కాలో ఆయన ఉమ్రా చేశారు. నక్వీ వెంట భారత రాయబారి అహ్మద్ జావేద్, భారత కాన్సుల్ జనరల్ మహ్మద్ నూర్ రెహ్మాన్ షేక్ ఉన్నారు.

- 'ఆంధ్రజ్యోతి' గల్ఫ్ ప్రతినిధి

మేజర్ యువతి జీవితం ఆమె ఇష్టం: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 6: ఒక బాలిక మేజర్ అయిన తర్వాత ఆమెకు తన ఇష్టప్రకారం జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక కేసు విచారణ సందర్భంగా సీజే జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు వ్యాఖ్యానించింది. 'మెజారిటీ వయసు వచ్చిన తర్వాత వారి ఇష్టానికి సంబంధించిన విషయంలో కోర్టు చట్టబద్ధమైన సంరక్షకురాలిగా వ్యవహరించలేదు. చట్టానికి లోబడి ఆ అమ్మాయి తన స్వేచ్ఛ మేరకు నిర్ణయాలు తీసుకోవచ్చు' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

11మంది సౌదీ రాకుమారుల అరెస్టు

దుబాయి, జనవరి 6: సౌదీ అరేబియాకు చెందిన 11 మంది రాజకుమారులను అరెస్టు చేసినట్లు అక్కడి న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. తమ బంధువుకు సంబంధించి నీటి, విద్యుత్ బిల్లులను చెల్లించడాన్ని రద్దు చేస్తూ ఇటీవల సౌదీ రాజు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 11 మంది రాజకుమారులు రియాద్‌లోని ఓ రాజభవనం ఎదుట ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించినప్పటికీ వినిపించుకోకపోవడంతో వారిని అరెస్టు చేశారు.

పాండ్యా ఒక్కడే..

- హార్దిక్ ఆల్‌రౌండ్ షో
- త్రుటిలో శతకం మిస్.. బౌలింగ్‌లో రెండు వికెట్లు
- భారత్ తొలి ఇన్నింగ్స్ 209
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 65/2

తొలి ఏడు వికెట్లకు భారత్ స్కోరు 92.. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా ఒక్కడు చేసిందే 93 పరుగులు. భారత్ తొలి ఇన్నింగ్స్ ఎలా సాగిందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. మోర్కెల్.. రబాడ.. స్టెయిన్.. ఫిలాండర్ బౌలింగ్ లైనప్‌ను ఎదుర్కొనేందుకు భారత టాప్ బ్యాట్స్‌మెన్ అంతా తెగ ఇబ్బంది పడిన వేళ.. ఈ యువ ఆల్‌రౌండర్ మాత్రం ఎదురొడ్డి నిలిచాడు. అతడి ఆటలో ఎలాంటి టెక్నిక్ కనబడకపోయినా తన సహజశైలినే నమ్ముకుంటూ కీలకమైన ఇన్నింగ్స్‌తో జట్టుకు ఊపిరి పోశాడు. ఏడు పరుగుల దూరంలో కెరీర్‌లో రెండో శతకాన్ని కోల్పోయినా టీమిండియాకు గౌరవ ప్రదమైన స్కోరును అందించగలిగాడు. ఆ తర్వాత 77 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ప్రొటీస్‌ను పాండ్యా తన బౌలింగ్ ప్రతిభతోనూ ఇబ్బంది పెట్టడం విశేషం.



పాండ్యా (93)

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు ఆటలో యువ ఆటగాడు హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. ముందుగా దీనావస్థలో ఉన్న దశలో అద్భుత బ్యాటింగ్ (95 బంతుల్లో 14 ఫోర్లు, ఓ సిక్స్‌తో 93)తో ఆదుకోగా ఆ తర్వాత బౌలింగ్ (2/17)లోనూ చెలరేగాడు. అయితే ఓవరాల్‌గా ఆతిథ్య జట్టు ప్రస్తుతం 142 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ముందుగా సఫారీ పేసర్ల ధాటికి పాండ్యా మినహా అంతా విఫలమయ్యారు. దీంతో భారత జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 73.4 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయ్యింది. పుజారా (26)ది రెండో అత్యధిక స్కోరు కావడం గమనార్హం. ఫిలాండర్, రబాడలకు మూడు, స్టెయిన్.. మోర్కెల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రొటీస్ రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో రెండు వికెట్లకు 65 పరుగులు చేసింది. క్రీజులో ఆమ్లా (4 బ్యాటింగ్), రబాడ (2 బ్యాటింగ్) ఉన్నారు.

తొలి సెషన్‌లో అతి జాగ్రత్త

ఓవర్‌నైట్ స్కోరు 28/3తో రెండోరోజు ఆటను ప్రారంభించిన భారత్ తొలి సెషన్ మొత్తం ఆచితూచి ఆడింది. పిచ్‌ను అర్థం చేసుకుంటూ పుజారా, రోహిత్ క్రీజులో నిలిచేందుకే ప్రాధాన్యత ఇచ్చారు. ఫిలాండర్ తన తొలి ఐదు ఓవర్లలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టడి చేశాడు. ముఖ్యంగా రోహిత్ అతడి బౌలింగ్‌లో తెగ ఇబ్బందిపడ్డాడు. డ్రింక్స్ విరామానికి ముందు పిచ్ నుంచి మోర్కెల్ మరింత బౌన్స్ రాబట్టడంతో పరుగులు చేయడం కష్టమైంది. 27వ ఓవర్‌లో జట్టు 50 పరుగులు దాటింది. తొలి గంట ఆటలో భారత్ చేసింది 17 పరుగులు మాత్రమే.. రబాడ బౌలింగ్‌కు రావడంతో ఈ జోడీ నిదానమైన బ్యాటింగ్‌కు బ్రేక్ పడింది. పరిమిత ఓవర్లలో టన్నుల కొద్దీ పరుగులు సాధించిన రోహిత్ ఇక్కడ కుదురుకునేందుకు ఇబ్బందిపడ్డాడు. రబాడ పేస్, బౌన్స్ బంతులను ఆడడం కష్టం కావడంతో 29వ ఓవర్‌లో అతడు స్పష్టంగా ఎల్బీ అయినా రివ్యూకు వెళ్లి నిరాశపడాల్సి వచ్చింది. పుజారా, రోహిత్ కలిసి నాలుగో వికెట్‌కు 121 బంతుల్లో 30 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఆతిథ్య జట్టు బౌలర్ల ధాటికి భారత్ తొలి సెషన్‌లో 25 ఓవర్లలో 48 పరుగులు మాత్రమే చేయగలిగింది.

పాండ్యా సూపర్ బ్యాటింగ్

రెండో సెషన్‌లో అంతా యువ బ్యాట్స్‌మన్ హార్దిక్ పాండ్యా హవా సాగింది. అతడి దూకుడుకు ఒక్కసారిగా సఫారీ బౌలర్లు చేష్టలుడిగి పోవాల్సి వచ్చింది. పుజారా లంచ్ అనంతరం తొలి బంతికే రెండో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి అవుట్ కాగా తానెదుర్కొన్న తొలి బంతినే పాండ్యా బౌండరీగా మలిచాడు. అయితే మరుసటి ఓవర్‌లో అతడిని అంపైర్ ఎల్బీగా ప్రకటించాడు. రివ్యూకు వెళ్లిన పాండ్యా బతికిపోయాడు. కానీ వెంటవెంటనే అటు అశ్విన్ (31 బంతుల్లో 2 ఫోర్లతో 12)ను ఫిలాండర్.. సాహా (0)ను స్టెయిన్ పెవిలియన్‌కు పంపడంతో భారత్ 92 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి దారుణ స్థితిలో నిలిచింది. కానీ ఈ దశలో పాండ్యాకు భువనేశ్వర్ (86 బంతుల్లో 4 ఫోర్లతో 25)నుంచి అద్భుత సహకారం అందింది. కానీ స్టెయిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు పాండ్యా ఆరంభంలో ఇబ్బందిపడ్డా.. 43వ ఓవర్‌లో ఒక్కసారిగా జూలు విదిల్చి మూడు ఫోర్లతో టచ్‌లోకి వచ్చాడు. ఆ తర్వాత బాదుడునే నమ్ముకుంటూ సఫారీ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. దీంతో 46 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. 55వ ఓవర్‌లో భువనేశ్వర్ వరుసగా రెండు ఫోర్లు బాదాడు. ఆ తర్వాతి ఓవర్‌లో పాండ్యా సిక్స్, ఫోర్ రాబట్టగా పరుగుల వేగం పెరిగింది. టీ బ్రేక్‌కు ముందు ఓవర్‌లో రెండు బంతులు వేసిన స్టెయిన్ కాలి మడమ గాయంతో మైదానం వీడాడు. చివరి సెషన్‌లో భువనేశ్వర్‌ను మోర్కెల్ అవుట్ చేయడంతో ఎనిమిదో వికెట్‌కు అత్యంత కీలకమైన 99 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత రబాడ షార్ట్ పిచ్ బంతులను సరిగా ఎదుర్కోలేకపోయిన పాండ్యా కూడా శతకానికి సమీపంలో డి కాక్‌కు క్యాచ్ ఇచ్చి సూపర్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. బుమ్రాను కూడా తనే అవుట్ చేయడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

బౌలింగ్‌లోనూ అదరగొట్టాడు..

దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. ఓపెనర్ మర్‌క్రామ్ (34) బౌండరీలతో ధాటిని కొనసాగించాడు. భారత పేసర్లను సునాయాసంగా ఎదుర్కొంటూ పరుగులు సాధించాడు. అయితే హార్దిక్ పాండ్యా తన బౌలింగ్ పవర్‌ను కూడా చూపడంతో ప్రొటీస్ రోజు చివర్లో తడబడింది. తన వరుస ఓవర్లలో నిలకడగా ఆడుతున్న ఓపెనర్లు మర్‌క్రామ్, ఎల్గర్ (25)లను పెవిలియన్‌కు పంపి భారత శిబిరంలో ఆనందం నింపాడు.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1; ధవన్ (సి అండ్ బి) స్టెయిన్ 16; పుజారా (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 26; కోహ్లీ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 5; రోహిత్ (ఎల్బీ) రబాడ 11; అశ్విన్ (సి) డి కాక్ (బి) ఫిలాండర్ 12; పాండ్యా (సి) డికాక్ (బి) రబాడ 93; సాహా (ఎల్బీ) స్టెయిన్ 0; భువనేశ్వర్ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 25; షమి నాటౌట్ 4; బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబాడ 2; **ఎక్స్‌ట్రాలు 14; మొత్తం: 73.4 ఓవర్లలో 209 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-16, 2-18, 3-27, 4-57, 5-76, 6-81, 7-92, 8-191, 9-199, 10-209. **బౌలింగ్:** ఫిలాండర్ 14.3-8-33-3; స్టెయిన్ 17.3-6-51-2; మోర్కెల్ 19-6-57-2; రబాడ 16..4-4-34-3; కేశవ్ 6-0-20-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మర్‌క్రామ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్యా 34; ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్యా 25; రబాడ బ్యాటింగ్ 2; ఆమ్లా బ్యాటింగ్ 4; **మొత్తం: 20 ఓవర్లలో 65/2. వికెట్ల పతనం:** 1-52, 2-59. **బౌలింగ్:** భువనేశ్వర్ 6-3-16-0; బుమ్రా 4-0-14-0; షమి 5-1-15-0; పాండ్యా 4-0-17-2; అశ్విన్ 1-0-3-0.

సిరీస్ నుంచి స్టెయిన్ అవుట్



సీనియర్ పేసర్ డేల్ స్టెయిన్ మరోసారి గాయపడ్డాడు. దీంతో భారత్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌కు దూరం కానున్నాడు. శనివారం ఆట టీ విరామానికి ముందు ఓవర్‌లో మూడు బంతులు వేశాక ఎడమ కాలి మడమ.. నొప్పిగా అనిపించడంతో స్టెయిన్ పెవిలియన్‌కు చేరాడు. మడమ కణజాలం దెబ్బతినడంతో నాలుగు నుంచి ఆరు వారాల పాటు విశ్రాంతి అవసర మని జట్టు డాక్టర్ మహ్మద్ మూసాజీ తెలిపాడు. గతంలో భుజానికి శస్త్రచికిత్స కావడంతో ఏడాది అనంతరం బరిలోకి దిగిన స్టెయిన్ రెండు వికెట్లతో రాణించినా ఇప్పుడు మరోసారి గాయపడడం జట్టుకు ఇబ్బందే.

చెన్నై బ్యాటింగ్ కోచ్‌గా హస్సీ



న్యూఢిల్లీ: ఐపీఎల్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) బ్యాటింగ్ కోచ్‌గా ఆస్ట్రేలియా మాజీ బ్యాట్స్‌మన్ మైక్ హస్సీ నియమితుడయ్యాడు. ఏడు సీజన్లపాటు చెన్నై జట్టుకు ఆటగాడిగా ప్రాతినిథ్యం వహించిన హస్సీ.. ఇప్పుడు అదే జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు.

ఇక్కడ లిఫ్టింగ్ అకాడమీ పెడతా



గుంటూరు (విద్య): ఆంధ్రప్రదేశ్‌లో వెయిట్‌లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటుచేసి అత్యుత్తమ క్రీడాకారులను తయారుచేస్తానని ఒలింపిక్ పతక విజేత, భారత మాజీ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి తెలిపింది. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మల్లీశ్వరి మీడియాతో మాట్లాడింది. ఇప్పటికే హరియాణాలో అకాడమీ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయన్న మల్లీశ్వరి.. శ్రీకాకుళం జిల్లాలో కూడా అకాడమీని స్థాపిస్తానంది. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్న ఆమె.. 2024 ఒలింపిక్స్ లక్ష్యంగా లిఫ్టర్లను తయారుచేస్తానంది.

ఇమ్రాన్‌కు మూడో పెళ్లి..?



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ మూడోసారి వివాహం చేసుకున్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. ఆధ్యాత్మిక మార్గదర్శనం కోసం ఇమ్రాన్ ఎప్పుడూ ఓ మహిళా గురువును సందర్శిస్తుంటాడని.. ఆమెను రహస్యంగా నిఖా చేసుకున్నట్టు ఓ పత్రిక ప్రచురించింది. ఈనెల 1వ తేదీన ఇమ్రాన్ పెళ్లి చేసుకున్నట్టు తెలిపింది. అయితే ఈ వార్తలను పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ పార్టీ ఖండించింది. ఇంతకుముందు జెమీమా గోల్డ్‌స్మిత్, రేహమ్ ఖాన్‌ను ఇమ్రాన్ పెళ్లి చేసుకున్నాడు.



ఆస్ట్రేలియాకు భారీ ఆధిక్యం

సిడ్నీ: ఉస్మాన్ ఖవాజా (171) సెంచరీతో కదం తొక్కగా..కెప్టెన్ స్మిత్ (83), సోదరులు షాన్ మార్ష్ (98 బ్యాటింగ్), మిచెల్ మార్ష్ (63 బ్యాటింగ్) పరుగుల వర్షం కురిపించడంతో ఇంగ్లండ్‌తో యాషెస్ చివరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 193/2తో మూడోరోజైన శనివారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్..ఆట ముగిసేసరికి 4వికెట్లకు 479 పరుగులు చేసింది. ఇప్పటికే కంగారూలు 133 పరుగుల ఆధిక్యం కూడగట్టుకోగా ఇంకా ఆరు వికెట్లు ఆ జట్టు చేతిలో ఉన్నాయి. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 346 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

బాక్సింగ్‌లో తెలుగమ్మాయిలకు నిరాశ

రోహ్‌తక్: జాతీయ ఎలైట్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు అమ్మాయిలకు తొలి రోజే చుక్కెదురైంది. తెలంగాణకు చెందిన గొనెళ్ల నాగనిక (82 కిలోలు), మానస మట్టపర్తి (45-48 కి), మౌనిక యాదవ్ (60-64 కి), సారా ఖురేషీ (75-81 కి), ఏపీ అమ్మాయిల్లో మనీషా (60-64 కి), రవి చంద్రిక (82 కి) తొలిరౌండ్‌లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

సిమోన్‌దే టాటా ఓపెన్



పుణె: ఆరంభ టాటా ఓపెన్ మహారాష్ట్ర ట్రోఫీని ఫ్రాన్స్ స్టార్ గిలెస్ సిమోన్ గెలుచుకున్నాడు. టోర్నీ హాట్ ఫేవరెట్, టాప్‌సీడ్ మారిన్ సిలిచ్‌కు సెమీస్‌లో షాకిచ్చిన సిమోన్.. టైటిల్ పోరులోనూ అంతే దీటుగా విజృంభించాడు. శనివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో సిమోన్ 7-6 (4), 6-2తో రెండోసీడ్ కెవిన్ ఆండర్సన్ (దక్షిణాఫ్రికా)ను చిత్తుచేసి చాంపియన్‌గా నిలిచాడు. నెదర్లాండ్స్ జోడీ రాబిన్ హాస్-మిడిల్‌కూప్ 7-6 (5), 7-6(5)తో ఫ్రాన్స్‌కు చెందిన హెర్బట్-సిమోన్ జోడీపై గెలిచి డబుల్స్ టైటిల్‌ను దక్కించుకుంది.

పాక్‌పై కివీస్ విజయం

వెల్లింగ్టన్: పాకిస్థాన్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా జరిగిన మొదటి వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ 61 పరుగుల (డ/లూ పద్ధతిలో) తేడాతో గెలిచింది. తొలుత కివీస్.. కేన్ విలియమ్సన్ (115) శతకానికితోడు మున్రో(58), నికోల్స్(50) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 315 పరుగులు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో భాగంగా పాక్ 30.1 ఓవర్లలో 6 వికెట్లకు 166 రన్స్ చేసింది. ఈదశలో వరుణుడు అడ్డుతగలడంతో మ్యాచ్ సాధ్యం కాలేదు. దీంతో డక్‌వర్త్ పద్ధతి ప్రకారం పాక్ లక్ష్యాన్ని 30.1 ఓవర్లలో 228 రన్స్‌గా ప్రకటించారు. అప్పటికి పాక్ తక్కువ స్కోరుకే పరిమితమవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు.



సింధు అదిరె..చెన్నై గెలిచె

చెన్నై: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సింగిల్స్‌కు తోడు మిక్స్‌డ్‌లో విజృంభించడంతో పీబీఎల్‌లో చెన్నై స్మాషర్స్ 2-1 ఆధిక్యంతో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై గెలుపొందింది. తొలుత మహిళల సింగిల్స్‌లో సింధు 15-11, 10-15, 15-12తో ప్రపంచనంబర్‌వన్ థాయ్ జూ యింగ్‌ను చిత్తుచేసి చెన్నైకి శుభారంభాన్నిచ్చింది. ఆ తర్వాత సుమిత్ రెడ్డి జతగా సింధు మిక్స్‌డ్ మ్యాచ్‌లో 15-14, 15-13తో కమిల్లా- లీ జంటను ఓడించింది. ఇక రెండో పురుషుల సింగిల్స్‌లో సేన్నొబున్సాక్ 15-10, 12-15, 15-14తో హెచ్‌ఎస్ ప్రణయ్‌పై గెలిచి చెన్నై ఆధిక్యాన్నిపెంచాడు. అహ్మదాబాద్ తరపున పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ, పురుషుల డబుల్స్‌లో నందగోపాల్-రెగినాల్డ్ జోడీ గెలుపొందారు.

అంబుడ్స్‌మన్ ముందుకు శేష్, వివేక్

- నేటి ఎస్‌జీఎమ్‌కు శేష్‌కు అనుమతి
- విచారణ 9వ తేదీకి వాయిదా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హెచ్‌సీఏలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. అధ్యక్షుడు జి. వివేకానంద్, సస్పెన్షన్‌కు గురైన శేష్ నారాయణ్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయాలు వేడెక్కాయి. తన సస్పెన్షన్‌పై శేష్ అంబుడ్స్‌మన్ జస్టిస్ నర్సింహారెడ్డిని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఆయన.. శనివారం ఉదయం 10.30 గంటలకు ఉప్పల్ స్టేడియంలోని ప్రధాన కార్యాలయంలో ఇరు వర్గాలతో విడివిడిగా.. ఉమ్మడిగా విచారణ చేపట్టారు. అనంతరం ఆదివారం జరిగే ఎస్‌జీఎమ్‌కు శేష్‌ను అనుమతించారు. అయితే, కార్యదర్శిగా కాకుండా సభ్యుడిగా హాజరు కావాలని చెప్పారు. ఇక, తన సస్పెన్షన్‌పై వివేక్ జనరల్ బాడీ ఆమోదం తీసుకుంటారని శేష్ భయం వ్యక్తం చేయ డంతో అలాంటి నిర్ణయం ఏదీ తీసుకోవద్దని అంబుడ్స్‌మన్ స్పష్టం చేశారు. ఇక, ఈ విషయంపై తన సమాధానం చెప్పేందుకు వివేక్ రెండు రోజుల గడువు కోరడంతో విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసినట్టు ప్రకటించారు. కాగా, పలువురు అంతర్జాతీయ క్రికెటర్లు ఎస్‌జీఎమ్‌కు తొలిసారిగా హాజరు కానున్నారు. అజరుద్దీన్, వెంటకపతిరాజు, నోయెల్ డేవిడ్ తదితరులకు ప్రస్తుత కార్యవర్గం సభ్యత్వం ఇచ్చింది. అయితే, హెచ్‌సీఏ సభ్యుడు కాదంటూ గత ఎన్నికల్లో అజరుద్దీన్ నామినేషన్‌ను తిరస్కరించారు. కానీ, ఇప్పుడు అందరికీ సభ్యత్వం ఇవ్వడంతో.. నాడు అజర్‌ను పోటీ చేయకుండా ఎందుకు అడ్డుకున్నారన్న ప్రశ్నలు వస్తున్నాయి.

మీ ఆవులు మాకొద్దు

ప్రభుత్వానికి వాపస్ చేసిన హరియాణా బాక్సర్లు

రోహ్‌తక్ (హరియాణ): 'బలం కావాలంటే బర్రె పాలు తాగాలి, అదే అందం, మెదడు చురుగ్గా ఉండాలంటే ఆవు పాలు తాగాలి' అని హరియాణాలో చెబుతారు. అందుకే ఆ రాష్ట్ర సర్కారు..క్రీడల్లో రాణించిన హరియాణా ఆటగాళ్లకు నగదు అవార్డులతోపాటు ఒక్కో ఆవును ఇవ్వాలని గత నవంబరులో నిర్ణయించింది. అందుకనుగుణంగా..మహిళా యూత్ వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో పతకాలు గెలిచిన ఆరుగురు రాష్ట్ర బాక్సర్లకు నగదుతో పాటు ఆవులను అందజేసింది. అయితే, ఆవులు పాలు ఇవ్వడం సంగతేమో కానీ.. అవి తమ ప్రాంతంలో ప్రజలను పొడుస్తుండడంతో బాక్సర్లు హడలెత్తారు. దాంతో ముగ్గురు బాక్సర్లు తమకు ప్రభుత్వం అందించిన ఆవులను వాపసు ఇచ్చేశారు.





పాపం.. జయసూర్య

కొలంబో: శ్రీలంక మాజీ కెప్టెన్ సనత్ జయసూర్య (48) తీవ్రమైన మోకాలి గాయంతో ఇబ్బందిపడుతున్నాడు. కర్రల సాయంతో మాత్రమే నడవగలుగుతున్నాడు. దీంతో మోకాలు శస్త్ర చికిత్స కోసం జయసూర్యను ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు తరలించనున్నారు. అక్కడ ఆపరేషన్ నిర్వహించిన అనంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉండనున్నాడు. కర్రల సాయంతో నడుస్తున్న సనత్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 1996లో లంక జట్టు వరల్డ్‌కప్ నెగ్గడంలో జయసూర్య కీలకపాత్ర పోషించాడు. రిటైర్మెంట్ తర్వాత లంక క్రికెట్ సెలెక్షన్ కమిటీ చైర్మెన్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు.

నన్ను ఆదుకోరూ..

కేంద్ర, రాష్ట్రాలకు కరాటే మాస్టర్ జమీల్ విన్నపం



హైదరాబాద్, ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి : జమీల్‌ఖాన్ పఠాన్.. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన ఇతను మాస్టర్ మార్షల్ ఆర్ట్స్ (కరాటే, కుంగ్ ఫు)లో దేశ మేటిగా ఎదిగాడు. 25 ఏళ్లుగా ఈ రంగంలో సత్తా చాటుతూ అంతర్జాతీయ స్థాయి లో 45, జాతీయ స్థాయిలో 37 పతకాలు గెలుచుకున్నాడు. ఇన్ని ఘనతలు సాధించినా అతడికి క్రీడా శాఖ నుంచి తగిన గుర్తింపు లభించలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కూరగాయలు అమ్ముతూ వచ్చిన కొద్దిపాటి మొత్తంతో జీవనం వెళ్లదీస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న తనను ఆదుకోవాలని జమీల్.. కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్‌కు విన్నవించుకున్నాడు. అసోంకు చెందిన లోక్‌సభ సభ్యులు బద్రుద్దీన్ అజ్మల్, రాధేశ్యామ్ బిశ్వాస్, సిరాజుద్దీన్ అజ్మల్ మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్‌ను కలిసి జమీల్ ఖాన్‌ను ఆదుకోవాలని కోరారు. అటు కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా తనకు చేయూత నివ్వాలని జమీల్ ఖాన్ పఠాన్ విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఢిల్లీ కెప్టెన్సీ నుంచి పంత్‌కు ఉద్వాసన



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టు కెప్టెన్సీ నుంచి యువ ఆటగాడు రిషబ్ పంత్‌ను తప్పించారు. ఈస్థానంలో లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రదీప్ సాంగ్వాన్‌ను కొత్త కెప్టెన్‌గా ఢిల్లీ క్రికెట్ సంఘం (డీడీసీఏ) ఎంపిక చేసింది. ఇటీవలి రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భ చేతిలో ఢిల్లీ ఓడిన విషయం తెలిసిందే. అయితే సాంగ్వాన్ తన చివరి మ్యాచ్‌ను గతేడాది మేలో ఐపీఎల్‌లో ఆడాడు. అలాగే నిషేధిత ఉత్ప్రేరకం వాడి పాజిటివ్‌గా తేలిన తొలి క్రికెటర్‌గానూ నిలవడం గమనార్హం. డీడీసీఏలో అంతర్గతంగా నెలకొన్న రాజకీయాల కారణంగా ఈ మార్పులు జరిగాయనే కథనాలు వినిపిస్తున్నాయి.

ముస్లింలు రొయ్యలు తినొద్దు

» జామే నిజామియా ప్రధాన ముఫ్తీ ఫత్వా

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు రొయ్యలు తినకూడదంటూ జామే నిజామియా ప్రధాన ముఫ్తీ మహమ్మద్ అజీముద్దీన్ ఫత్వా జారీ చేశారు. ఇస్లామిక్ ధర్మసూత్రాల ప్రకారం నీటిలో లభ్యమ్యే చేపలు మినహా మరే ఇతర ప్రాణులను ఆహారంగా తీసుకోకూడదని ఆయన స్పష్టం చేశారు.




60 నిమిషాలు.. 60 అంశాలు!

» అనర్గళ ప్రసంగంతో ప్రపంచ రికార్డు



కొండా పల్లవి

విజయవాడ, జనవరి6, (ఆంధ్రజ్యోతి) : పేరు పల్లవి.. వయసు పదేళ్లు.. చదివేది ఐదో తరగతి.. అయితేనేం.. అరవై నిమిషాల్లో.. అరవై సామాజిక అంశాలపై గుక్కతిప్పుకోకుండా అనర్గళంగా ప్రసంగించి ప్రపంచ రికార్డు ఒడిసి పట్టుకుంది. ఆ చిన్నారి ప్రతిభకు విజయవాడ ప్రెస్‌క్లబ్ వేదికైంది. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి చాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు తుర్లపాటి పట్టాభిరామ్ విచ్చేసి చిన్నారి ప్రతిభను కళ్లారా వీక్షించారు. అనంతరం పల్లవికి చాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో ఘనంగా సత్కరించారు. విజయవాడలో జర్నలిస్టుగా పనిచేస్తున్న కొండా రాజేశ్వరరావు, రమణ దంపతుల కుమార్తె అయిన పల్లవి సత్యనారాయణపురం సెయింట్ జాన్స్ స్కూల్లో చదువుకుంటోంది. భ్రూణ హత్యలకు పాల్పడొద్దు, నవ్యాంధ్ర నిర్మాణం ఎలా జరగాలి? ప్రజలను మద్యానికి బానిసలను చేస్తూ.. ప్రభుత్వం ఆదాయం ఎలా పెంచుకుంటోంది?, అమ్మను ఎలా చూసుకోవాలి?, కులమతాలు కాదు.. మానవసేవే ప్రధానం.. తదితర 60 సామాజిక అంశాలపై అనర్గళంగా మాట్లాడింది. సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ విద్యతోనే సర్వం సాధ్యంకాదని, విద్యార్థులకు సామాజిక అంశాలపైనా అవగాహన కల్పించాలని సూచించారు. పట్టాభిరామ్ మాట్లాడుతూ అవార్డులు అందరికీ వస్తాయి కానీ, రికార్డులు కొందరికే వస్తాయని, అలాంటి కోవకు చెందిందే పల్లవి అంటూ ఆశీర్వదించారు. చిన్నారి ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులనూ అభినందించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం మాట్లాడుతూ పల్లవి విజయవాడకు మరిన్ని పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, పదో తరగతి వరకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు, హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు మరీదు రామకృష్ణ, మిథునం సంగీత దర్శకుడు వీణాపాణి పాల్గొన్నారు.



సీమకు పెరిగిన భూగర్భ జలం

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. జల వనరుల శాఖ చేపట్టిన నీటి సంరక్షణ విధానాల కారణంగా నీటి మట్టాల్లో వృద్ధి కనిపిస్తోంది. కాగా రాయల సీమ జిల్లాల్లో 29.29 మీటర్ల నుంచి 11.39 మీటర్ల (10%) వృద్ధి కనిపించింది.













*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.